ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు

# "పురుషోత్తము చౌధరి" గారి

## జీవిత చరిత్ర

గ్రంథకర్త

బాబు జాన్ చౌధరి

**ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు**

**పురుషోత్తము చౌధరి" గారి  జీవిత చరిత్ర**

గ్రంథకర్త

**బాబు జాన్ చౌధరి**

ఆగష్టు - 2015

కాపీలు - 1000

పబ్లిషర్

**జేమ్స్ జయశీల్ చౌధరి**

చర్చి కాంపౌండ్, జొన్నాడ,  APSP (SO)

విజయనగరం - 535 005

సెల్ : 9440 647374

వెల : రూ. 120/-

**కాపీల కొరకు**

టి. భాను ప్రసాద్

గుంటూరు

సెల్ : 8143795121

**జి. కిషోర్**

విజయవాడ

సెల్ : 9948689253

# ఈ ముద్రణ గురించి

స్నేహితులారా,

బాబు జాన్ చౌధరి గారు రచించిన "కవి పురుషోత్తము చౌధరి" గారి జీవిత చరిత్ర 1935 సం॥ లో ముద్రింపబడినది. ఈ రచన యే సాధికారమైనది. తరువాత వెలువడిన ముద్రణలలో పబ్లిషర్స్ అక్కడక్కడ కొన్ని మార్పులు చేసి ముద్రించారు. ఇటువంటి మార్పులు సాంప్రదాయ విరుద్ధము. రచయితకు న్యాయము చేకూర్చనవి.

ఈ ముద్రణ 1935 సం॥ పు ముద్రణకు నకలు మాత్రమే.

కవి పురుషోత్తము చౌధరిగారి రచనలు సేకరించి ఆయన ద్విశత జయంతి సందర్భముగా రెండు సంపుటాలుగా నేను ముద్రించినాను.

1. 2003 సం॥ లో "ఆంధ్ర క్రైస్తవ కవిసార్వభౌముడు పురుషోత్తము చౌధరి రచనలు" సంపుటి - I

2. 2004 సం॥ లో "ఆంధ్ర క్రైస్తవ కవిసార్వభౌముడు పురుషోత్తము చౌధరి సాహితి సౌరభాలు" (రెండవ సంపుటి).

ఎంత ప్రయాసపడినను "ముక్తిమార్గ ప్రదర్శనము" అనే కవి రచన దొరకలేదు. ఈ పుస్తకము హిందూ దేశములో సువార్త ప్రకటనకు తగినది.

రెండవ సంపుటి "సాహితి సౌరభాలు" పుస్తకము అట్టపై రంగులలో కవి చిత్రము ముద్రించే ప్రయత్నము నా అలసత్వము వలన సరిగా కుదరలేదు. క్షంతవ్యున్ని. ఈ పుస్తకము పై కవి రంగుల చిత్రము ముద్రించుటలో నా ప్రయత్నము సఫలీకృతమైందని భావిస్తున్నాను.

చాల ప్రాంతములలో ప్రతి యేట కవి పురుషోత్తము చౌధరిగారి జయంతి ఉత్సవములు జరుపుచున్నారు. ఆ ఉత్సవములలో కవి యొక్క జీవిత చరిత్ర, కీర్తనలు గురించి మాత్రమే కార్యక్రమము జరుపుచున్నారు. కాని ఆయన బహుముఖ ప్రజ్ఞ గురించి అనగా పద్యరచన, గద్యరచన, అనువాదాలు, సువార్తసేవ గురించి ఏవిధమైన ప్రస్థావన లేకుండా కార్యక్రమాలు జరుపుచున్నారు.

ఒక వ్యక్తిని జ్ఞాపకము చేసుకున్నప్పుడు ఆయన మొత్తం జీవిత విశేషాలు, రచనలు గురించి సమగ్రముగ ప్రస్థావించడం భారతీయ సాంప్రదాయం. మతమునకు, సంస్కృతీ సాంప్రదాయాలకు ఎటువంటి సంబంధము ఉండకూడదు. ఈ విషయము గుర్తించి నిర్వాహకులు తగిన విధముగా కార్యక్రమములు రూపొందించగలరని నా విజ్ఞప్తి.

మరియు కవి యొక్క వంశీకులను కూడా గుర్తించి ఆయా సభలకు వారిని ఆహ్వానించడం భారతీయ సాంప్రదాయము.

ఈ పుస్తకము ముద్రణలో 1935 సం॥ పు ముద్రణ, చిత్రముల సేకరణలో నాకు సహకరించిన డాక్టరు సుధాంశు కుమార్ చౌధరిగారు (జయపూరు, ఒరిస్సా), శ్రీ డానియేల్ రాజ్ చౌధరి (తాడేపల్లి గూడెము), పాస్టర్ జి.ఐజయా (క్యూ.యం.బి. చర్చి వైజాగ్), శ్రీ ఎస్. కృపారావు (చిట్టివలస, విశాఖజిల్లా ), పాస్టర్ డి.జె. మోహన్ కుమార్ (తగరపువలస), డాక్టర్ డి.డి. చౌధరి (జొన్నాడ) మరియు నా కుటుంబ సభ్యులకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

మరియు ముఖ్యముగా ఈ పుస్తక ముద్రణలో సమాచార, చిత్రముల సేకరణలో మరియు డి.టి.పి (తెలుగు టైపింగ్) పనిలో, మొదటినుండి సహకరించిన టి. భాను ప్రసాద్, నంబూరు రైల్వే స్టేషన్, పెదకాకాని మండలము, గుంటూరు జిల్లా గారికి నా మన:పూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తక ముద్రణలో సహకరించిన పి.బి మనోహర్‌గారి, తెనాలి మరియు ఈ పుస్తకమును ముద్రించిన

జొన్నాడ,
విజయనగరం
15-08-2015

ఇట్లు
జేమ్సు జయశీల్ చౌధరి

# INTRODUCTION

**By Sree Sree Rajah, M.Bhujangarao Bahadur Garu, F.A.U.**
**ZAMINDAR OF LAKKAVARAM,VELLA, ETC., ESTATES.**

Astavadhani, Author of 100 Telugu works, Obtainer of Royal appreciation and a certificate of merit from Government and a Gold Medal for translating the New Testament into Telugu verse.

I read almost all the works of Rev. Purushottama Chowdhuri. He is a true Christian of the Highest Order. The very fact that almost all the different denominational Churches of the Andhra Desa adopted many of his devotional songs in their worship, is a clear proof of his great merit and non - sectarian Christian spirit. In Telugu he proved himself poet of the classical order. His verses are lucid and run like a natural flow on an ebbing river.He is able to express his thoughts very clearly and no where can we find him blinking to find a suiable word, or phrase to express his inner thoughts. He has done a great service to the Christian community and to the Telugu public at large, and I am sure, his name will last in this country as long as the Andhras exist. It is the duty of every Andhra to join hands in commemorating his name to perpetuity.

The work Mr. John Chowdhuri, his grand son, is going to enlighten the Aristocracy of India with Christian principles, is well known to all the general public, as the Founder and the Honorary Secretary of the Mission to the Aristocracy of India. It is quite fitting that God loving grandson should take up to write and produce the life of so great a grand father whose name is well known to all the Telugu Chirsian public. I sincerely wish that the publication of the work prove a greate success. I also pray, that the Lord would spare Mr. John Chowdhuri for many many years to come to serve the Lord Jesus Christ and his Countrymen.

ELLORE
2-2-1935

(Sd) Rajah M. Bhujanga Rao

## A sketch of the late
# Rev. PURUSHOTHAM CHOWDHURI

The late Rev. Purushottam Chowdhuri, who was a Minister of the Gospel for 54 years both in Andhra Desha and Orissa, was born in 1803 with a silverspoon in his mouth, in Madanapur of Parlakimidi Taluk, Ganjam. His ancestors migrated there from Midnapur District of West Bengal, and some worked as Court Poets, Revenue Officers or Mirasidars of Tembur muta, under the then Rajahs of Parlakimidi. They belonged to the gotra Bharadwaja, Angeerasa and Barhaspatya of Hindu Rishis of the Goudha Brahman sect, known as “Sistas” or orthodox people.

Purushottam Chowdhuri was a poet in Andhra Language and was conversant with Oriya, Bengali, Hindustani. Very early in life he studied Vedanta literature and denounced caste system and desired to become a naked sadhu(Avadhuta). But God wanted him for furtherance of His Kingdom. In 1825 he found a Christian tract probably one from Carey’s Press at Serampore and made a persistent search after that religion. Mrs. Helen Knott of Chicacole Regiment, gave him a copy of the Gospel of St. Luke when he visited her in May 1833. He found Christ more fully thereby and was introduced to Major Brett, the then Commanding Officer at Vizagpatam, the same month. He gave him a copy of the New Testament, which he read with great pleasure, and against the wishes of his relatives, he decided to become a Christian. His wife, Radhamani Devi Chowdhurani gave her consent to follow him after some time. In those early days there were no Missionaries between Madras and Cuttack. On the invitation of Rev. Charles Lacy of Cuttack Orissa Baptist Mission, Purushotham Chowdhuri desired to travel the 300 miles and removed his sacred thread on 10th June 1833 and gave it to Major Brett. He travelled about 20days and reached Cuttack and was baptized by Rev. Charles Lacy on the 6th October 1833, in the big tank called Gonga Mondir in Cuttack. He composed here his first Telugu hymn. After staying there for sometime, he went back to Vizag, preaching the Gospel at Puri and other Oriya centres, along the grand trunk road. He met with bitter persecution while preaching the Gospel and bore patiently. In 1834 he went to Madras, a distance of 500 miles, with Major Brett and preached the Gospel there amid great persecution. He also travelled from there to Bellary a distance of over 400 miles

and was there for some time with Rev. John Reids of L.M.S Toward the end of that year he travelled overland from Bellary to Parlakimidi, a distance of nearly 1000miles, preaching the Gospel in all the towns and villages on the road side, which were not then visited by any Christian Missionary or preacher On his return he was the guest of Captian Richardson for 8months at Vizag and in 1835, when Rev. J.W.Gordon of L M S came there as Missionary, he helped him in preaching the Gospel. His relatives treated him badly, but he was firm in faith. In 1836 his wife and little daugher Santi Kumari Chowdhuri (who afterwards became the wife of the late Ghonoshyam Naik of Cuttack) followed him to Cuttack, where Mrs. Chowdhuri was baptised on 3rd April 1836, by Rev. A. Sutton. Babu Purushottam Chowdhuri was ordained on 24th April 1836, in Cuttack, and was sent to Berhampur to start Missionary work there. In 1836 he was invited by Justice E Story of Chicacole, to start Missionary work there; and while he was accordingly working there Rev. S.S.Day of the American Baptist Mission arrived there, of whom Mr. Purushotham was the first assistant. He had returned to Berhampur in 1837 and worked there for seven years with Rev. Isaac Stubbinson.

He had a grievous temptation there but over came it. He then composed very pathetic hymns and poetry with sincere experience of the contribution of his heart. He was invited back to Andhra country where he lived from 1845 to 1870. His children were employed and married at Cuttack. Rev. Purushotham Chowdhuri travelled thousands of miles in those 27 years up to the end of Godavari District, and preached the Gospel. Many became belivers of Christian faith in those years and he wrote several useful hymns and poetical works in Andhra language by which he had been known as the “Immortal Purushotham Chowdhuri'' and a Memorial Hall was built at Parlakimidi to perpetuate his memory.

He was Pastor of Orissa Baptist Churches both at Berhampur and Cuttack and his sermons in Oriya and Telugu as well as the earliest tracts and the New Testament he was given hundred years ago, have been still preserved. He travelled long distances in Orissa also, as he had several relatives all over there. He was called to rest on the 24th August 1890 at Cuttack. A complete life of the subject of this sketch is being prepared in English also.

16 -12 - 34 NEW ORISSA

# భూమిక

శ్రీమంతుడును కరుణాభరణుడునగు నా పరమజనకుడు తన ఘనసంకల్ప మునందు మా దైన్య చౌధురీ కుటుంబమును నిల్పుకొని 'గతానుగతి కోలోకో:నలోకో:పారమార్ధిక:' యను పూర్వాచారపరాయణతా విశ్వాసముచే మానవ కల్పిత మార్గములద్వారా ఆధ్యాత్మికానందము బొందగోరియుండిన మా పితృలకు యేసుక్రీస్తు ప్రభువు వారి పాపోపశమన ప్రాయశ్చిత్తమునందలివిశ్వాసము ద్వారా 'భ్రమర కీటకన్యాయమున' పాపహైన్యావస్థ నుండి పవిత్ర ధన్యమాన్యస్థితికి నర్హులుగ జేయుటకు అంధకారబంధుర అవిద్యావ్యాప్త కాలములలో నెటుల బ్రసన్నుడై, యక్షయరక్షణాకరమోక్షపదవి నొసంగెనో, యా చరిత్రమిందు క్లుప్తముగ పొందుపరచినాడను.

జాతి, గోత్రము, సూత్రము, ప్రవర, వేదము మున్నగు ఆభిజాత్యములు చెప్పుకొని, అహంకర్తృత్వ విశ్వాసమున దృఢీకృతభావము గలిగియుండిన యొక వ్యక్తి పొందిన దివ్య తేజమతని నెటుల పరమభాగవతోత్తమునిగ జేసెనో ఇందుగాననగు. మా పితామహులగు పురుషోత్తముచౌధరిగారి జీవితచారిత్రము నా బాల్యమున నా ప్రియ జనకుని ద్వారా కొంత తెలిసికొనగలిగి, దాని విపులముగ వ్రాయగోరు చుండగా లండన్ మిషన్ మిషనెరీలగు రెవరెండు ఎడ్వర్ పి. రైస్ దొరగారు బి.ఎ సంక్షిప్తముగ వ్రాసిన క్లుప్త చరిత్రము లభ్యమైనందున మరింత ప్రోత్సాహము కలిగి విపులముగా దానిని వ్రాయ సమకట్టితిని.

1900 సంవత్సరమున నేను కాకినాడకు వచ్చి పురుషోత్తముగారి దౌహిత్రులును కీర్తిశేషులునైన రెవరెండ్ జోనాతానుబర్డరుగారు కటకపురి నుండి తీసికొని వచ్చియుండిన మనకవి సంబంధమైన స్వీయవృత్తాంతములును మరికొంత పరికరమును సంగ్రహించితిని. 1901 సంవత్సరమున నొకవిధమైన చరిత్ర పూర్తిచేసి, దానిని చెన్నపురి మెథడిస్టు మిషన్ వారి ముద్రణాలయమున 3000 ప్రతుల ముద్రింపజేసితిని. కాని కుటుంబములో ముద్దు పేళ్లుగ నుపయోగించిన కొన్ని నామములు అచ్చులో వచ్చుటచేతను, మరికొన్ని పొరపాట్లచేతను కటకపురిలోని బంధువులలో నంతయామోదము కనబడనందున నేను విశేషాంశములు సంపాదించుటకును,

ఆంగ్లభాషలో చరిత్ర వ్రాయుటకును ముమ్మారు కటకపురికిని, బరంపురమునకును, ఒకసారి నెల్లూరునకు, ఇటునటు మొత్తమున మూడువేల మైళ్ళు దూరము నా ప్రయాణములు చేయవలసివచ్చెను. నా కార్య జయమునకై నేననేక పర్యాయములు దైవమును ప్రార్థించుచు వచ్చితిని. కటకపురిలో రెవ.హోవెల్ దొరగారి కాలమున నా బంధువగు బాబు విల్లియం రౌల్ గారి కృతమున మిషన్ వారి పుస్తక భాండాగారమున ముఖ్యపరికరము లభ్యమయ్యెను. అక్కడ పురుషోత్తము చౌధరిగారి రికార్డులన్నియు తిరుగవేసి, యావశ్యక పరికరములు మా మేనత్త మార్తాబర్డరుగారి ద్వారా పొందితిని. నెల్లూరులో లేటు ఆర్.పరంజ్యోతి బి.ఏ.ఎల్.టి. గారి యొద్దనుండిన అంతర్వేదిగారి రికార్డులలో మరికొంత పరికరము దొరికినది. వంగ,ఉత్కళదేశీయులకు గృహనామములుండవు.మన కవిని "చౌధరి పురుషోత్తము" అని యీ దేశమున వ్యవహరించెదరు. అది వంగీయసాంప్రదాయానుసరణముకాదు. కావున కుటుంబము వారి కోరికపై ''పురుషోత్తము చౌధరి''యుని కవినామమిూచరిత్రమున వ్యవహరింపబడినది. గోదావరిజిల్లాలోని కమ్మ చౌధరీలకును మాకును సంబంధమేమియు లేదు.

ఈ చరిత్రమున గొంత భాగము రెండేండ్ల క్రిందట సిద్ధపరపబడినందున చర్వితచర్వణముగా నేవిషయమైన వ్రాయబడియుండినట్టి పునరుక్తి దోషములను పాఠక మహాశయులు క్షమింపగోరెదను. హైందవమత సిద్ధాంతరాద్ధాంతములు, కొంత కాలము సమర్థించుకొనుచు, పిదప వేదాంతియై,కౌపీనధారియై, అవధూతయై, అఘోరియై, శ్మశానములందును, నిర్జనపర్వత గుహాంతర సీమలందును, యోగాభ్యాసములు చేయుచు, దన్మూలమున, చిత్తవిశ్రాంతి నొందగోరిన పురుషోత్తముచౌధరిగారు మిషనెరీలుగాని, క్రైస్తవమత ప్రచారకులుగాని లేకుండిన కాలమున నొక చిన్న పత్రిక ద్వారా జగజ్యోతియైన దివ్యగురు తేజమునుగాంచి సర్వత్యాగియై ఆ "యమూల్యమౌక్తికమును" "నిగూఢనిక్షేపమును" గాంచగలిగిన విధమిందు నాశ్చర్యజనకము. ఆ కాలమున శ్రీకాకుళములో మిషనెరీగ నుండిన రెవ. ఐ.సి ఆర్చిబాల్డ్ దొరగారు ఏం.ఏ నా యుద్యమవిషయముప్రోత్సాహముగొల్పుచు :–

"I appreciate highly what you are trying to do, to perpetuate the influence for good of such godly men as Purushottam, Jagannadham and Anthravedy. In this good work we will help you with our prayers and by the purchase of your books when published." అని 1902 సం॥ ఆగష్టు 2 తేదిని వ్రాసిరి. అది నాయుత్సాహాగ్నిని ప్రోత్సాహపరచినందున నా భక్తవరుల చారిత్రములత్యంత ప్రయాసతో వ్రాసి ప్రచురించితిని. పురుషోత్తముగారి వృద్ధదశలోని పటము కలకత్తాలోని డెస్సాయను దొరగారిమొద్దనుండగా ఆయన నెవరో చంపి వేయుటచే నదిలభించుట దుర్లభముకాగా, చాలా ప్రార్థనలు చేసి ఒంగోలులోని డెస్సామిశమ్మ గారికి వ్రాసిన మీదట పటము కలకత్తా నుండి కటకము చేరగా మా సోదరులగు బాబు(సీనియరు) డానియేల్ చౌధరిగారు దాని నా పేరబంపిరి. చెన్నపురి యందలి హీవ్ల్ అండ్ క్లై వ్ను అను చిత్రపట సంఘమువారు దాని నతిజాగరూకతతో ప్రతి తీయించి పంపిరి. పాగాతో నున్న పటము మాదాబత్తుల బ్రహ్మాజీగారి కృతమున లభించినది. ఇందుకు ప్రభునామమునకు ధన్యవాదములు. ఒక శతాబ్దము నుండి తమ నవ్యభగవద్గీతా గానములే సర్వజనభూయిష్టులై యొప్పిన వీరి శతాబ్దోత్సవము జరుప ఆంధ్రక్రైస్తవ మహాసభవారు సంకల్పించినందున నీ జ్ఞాపక చరిత్రము సచిత్రముగ బ్రచురింప నుద్యమించితిని. ఇంతియు కాక వీరి ఛాయపటము పెద్ధది చేయించుటకును, అముద్రితగంథ్రములు ప్రచురించుకును, నిస్తారరత్నాకరము, క్రీస్తుపరతత్వము విగ్రహనిర్మాణము మున్నగు గ్రంథములు పునర్ముద్రణము గావించుటకును, చిత్రములకొరకును, చరిత్ర లేఖనమున దోడ్పడువారికి పారితోషికములకును, శుద్ధ ప్రతులు సిద్ధ పరచుటకును ఇత్యాదియిత్యాది వ్యయములకై దైవసహాయముకొరకు ప్రార్థింపుచుండగా, మత్ప్రియ మిత్రులగు జూనియర్ జే.పి.కోటిలింగము బి.ఏ.బి.డి. గారిచ్చిన మంచి సలహాలను బట్టి కొంత సహాయసంపద నొందగలిగితిని.

పురుషోత్తమ కవి పద్య గద్య కీర్తనములకై కృతజ్ఞులైన వారిలో నీ శతవత్సరస్మారకమునకై ఇప్పటికి క్రిందివారు తోడ్పడియున్నారు:-

రెవ. ఎఫ్.సి. సాకెట్ (Rev.F.C.Sackett) దొరగారు, మెథడిస్టుమిషన్, సెకందరాబాదు 100 అర్ధలు (50రూ)

డాక్టరు ధనరాజచౌధరిగారు, కటకపురి రూ. 5లు
డెన్సో మిషమ్మగారు, ఒంగోలు రూ. 5లు
శ్రీకాకుళము బాప్టిస్టు సంఘమువారు రూ. 5లు
రెవ. ఇ.బి. బ్రాంలే దొరగారు, కొయ్యలగూడెము రూ. 2లు
శ్రీమాన్ కే.జి.పాల్ గారు, విజయనగరము రూ. 5లు
రెవ. ఎం. నారాయణరావు గారు రూ. 1
డాక్టరు దయానిధి పాత్రో గారు, ఆముదాలవలస రూ. 5లు
రెవ. బి. సుబ్బారాయుడుగారు రూ. 1-9-0లు
రెవ. టి.బి. జోసఫ్‌గారు, టి.బి. సంఘము రంగూన్ రూ. 6లు
ఎం.ఇ. ఆర్చిబాల్డ్ మిశమ్మగారు ఎం.ఏ, శ్రీకాకుళము రూ. 5లు
జి. జాన్‌గారు. కాకినాడ అ 8లు
ఎం. నాగభూషణము గారు, విశాఖపట్టణము రూ. 3-2-0లు
డాక్టరు సత్యానందం జేకబుగారు, అనకాపల్లి రూ. 1-9-0లు
L.C Horwill Esq. I.C.S Dt Judge, Ganjam. Rs. 12.8.0
ఒంగోలు బాప్టిస్టు సంఘమువారు రూ. 2లు
విశాఖపట్టణము బాప్టిస్టు సంఘము వారు రూ. 5లు
నరిసిపట్టణము బాప్టిస్టు సంఘము వారు రూ. 3-2-0
రెవ. జే.బి మెక్లారిన్ దొరగారు డి.డి. రూ. 5లు
డి. సామ్యేలు గారు టెక్కలి రూ. 1-9-0
పి. ప్రకాశం గారు, హసన్నబాద్ రూ. 1
జి. పరమానందంగారు, దొండపాడు బాప్టిస్టు సంఘకార్యదర్శి రూ. 6-4-0
గుత్తి లండన్ మిషన్ వారు రూ. 25 లు
చల్లపల్లి చినఆదయ్య గారును, చల్లపల్లి జంగయ్య గారును, రేవేంద్రపాడు రూ. 5లు
శ్రీమతి టి. ప్రసాదరావు సతీమణిగారు రూ. 1
టి. పురుషోత్తమ దంపతులు, సికందరాబాదు రూ. 4లు
వి.సి.ఎచ్. జాన్ గారు, ఎం.ఏ.ఎల్.టి. పెద్దాపురం రూ. 1
శ్రీమాన్ టి. కె మహాంతిగారు, వైజాగ్ రూ. 5. లు

విజయనగరం బాప్టిస్టు సంఘమువారు రూ. 3-6-0

లూథరన్ సంఘమువారు, గుంటూరు రూ. 10లు.

కాకినాడలోని క్రైస్తవసంఘము 1934 డిశంబరు 16 తేదిని ఏ.టి పామరుగారి యజమాన్యమున జరిగించిన పురుషోత్తముగారి శతవత్సరస్మారక సభలో రెవ.ఎల్.ఇ. మిల్టన్‌గారు, దివాన్ బహద్దుర్ సర్. డాక్టర్ ఆర్. వేంకటరత్నమునాయుడుగారు, కళాశాల ప్రిన్సిపాలు పి. రామస్వామి ఎం.ఏ గారు, ఎస్. ఐ హాచ్. మిశమ్మ గారు, కే.ఐ ఎచ్. కొందరు స్థానిక మిషనెరీలు యిచ్చిన చందాలతో రూ 27.0.6లు జమచేసియిచ్చిరి. ఇంక మరికొందరి వాగ్దానము లందినంతట పూర్ణపట్టిక ప్రచురింపగలము. ఉయ్యూరు నుండి 100అణాలు పంపనొకరు వాగ్దానముచేసిరి.

పురుషోత్తముగారి విగ్రహనిర్మాణము 5000 ప్రతులీ సందర్భమున గుంటూరులోని యు.ఎల్.సి మిషను వారచ్చువేయించి, న్యూఒరిస్సా, కృష్ణా, ఆంధ్ర, రవి పత్రికలలోను శతవార్షిక సంబంధమైన నివేదనములు చేయబడెను. 1934 లో విజయనగరమున సమావేశమైన క్రైస్తవ మహాసభవారు ఈ శతవార్షికస్మారక సభలను జయప్రదముగావింప కే.జి. పాల్ గారిని, డి.ఆర్ . ఐజక్ బి.ఎ;బి.యిడి గారు పాతికరూప్యములు తమ ప్రాంతమునుండి పంపించెదమనిరి.

ఈ శతవార్షికలో కవియొక్క గ్రంథసముదాయ మంతయుజేర్చి ప్రచురింపవలెనని కొందరు మిత్రులు సలహాయిచ్చిరి. కాని, ధనాభావముచే నయ్యది దుర్ఘటమయ్యెను. ఈ చరిత్ర మధ్యమున కొన్ని చేర్చవలసిన కీర్తనలు జేర్చ వీలు లేకుండెను. దృష్టాంతముగా పురుషోత్తము గారి ప్రలోభకాలములలో ఆయన రచించిన **"నన్ను గన్నయ్య రావే నా యేసు" "పోపోవే యోలోకమా - చాలికచాలు నీపొందు వేమెుల్లము" "సందియమువీడవే - నా - మనసా యానందమున గూడవే" "ఎరిగి ఎరిగి చెడిపోతివి మనసా"** మున్నగునవి. వీరు వ్రాసిన దాదాపు 130 కీర్తనలో కొన్ని సత్యభజనలోను, 80 వరకు సంఘ సంకీర్తనములలోను గాననగు.

నేను బాల్యదారభ్యా యీ మా పితామహుని పద్య గద్యములను భక్తి రస ప్రోత్సాహకములైనవని ప్రేమతో జదువుచు వచ్చి "సుకవితాయద్యస్తి రాజ్యేనకిం" అనునటుల నీ మంచి కవిత్యము మా కుటుంబమున కొక సామ్రాజ్యముగ లభించినదని

యానందించుచు “పుష్కలాభి: స్తుతిభి: త్వాం స్తువంతిప్రభూ” అని యా పరమ జనకునికి ధన్యవాదములు చేయువాడ.

ఈ చరిత్ర ముద్రణము 32 పుటలు ఈ పురమందలి సుజనరంజనీ ముద్రాక్షరశాలలో ముద్రితములైనవి. దాదాపు సంవత్సర వరకు కారణాంతరమున నవాంతరము కలిగెను.

అంతట మా చిరకాల విహితులగు మహారాజశ్రీ దుగ్గిరాల వేంకట సూర్యప్రకాశరావు పంతులు బి.ఏ.గారి సిఫారసు మేరకును, కాకినాడ క్రైస్తవ సంఘముల యొక్కయు తదితరుల యొక్కయు, సహాయమూలకమునకు శ్రీ జార్జిప్రెస్ ప్రోప్రయిటరులగు మహారాజశ్రీ పి.శేషగిరిరావుపంతులుగారు, కార్యభారమెత్తుకొని చాల శ్రద్ధతో నీ ముద్రణము ముగించినందున వారికిని వారిసిబ్బందివారికిని వందనములు సమర్పించెదను.

ఈ చరిత్రమునకుపోద్ఘాతమును వ్రాసిన లక్కవరం ఎల్ల సంస్థానాధీశులును పశ్చిమగోదావరి జిల్లా విద్యాసంఘాధ్యక్షులునగు శ్రీరాజా మంత్రి ప్రగడ భుజంగరావు బహద్దరు జమీందారుగారికిని నిందుగల యభిప్రాయావళిని బంపిన శ్రీ శ్రీజయపుర మహారాజావారు, కానన్ రెవ. ధన్నవాడ అనంతంగారు బి.ఏ. మున్నగు మహనీయులకును వందనస్థుడను.

దీనిని భగవత్ సేవకు సమర్పించుచున్నాడను.

**కాకినాడ** **జాన్ చౌధరి**

**25-1-1935**

# రెవరెండ్ పురుషోత్తము చౌధురీ కవి

## జీవిత చరిత్రము; ఆయన సందేశము

## (శతవార్షిక స్మారకము)

# 1. అధ్యాయము

### దైవ సేవాహూతకుటుంబము; సత్యజ్యోతి విహీనమైన ఆధినివేశస్థానమందలి రాజవంశాది వివరణము.

**"ఏ బండనుండి చెక్కబడితిరో" యెషయా 51 : 1**

---♦--- ♦---♦---

**ప్రవాస వివరణము :-**

అమూల్య రత్నరాసులచేతను, ధనధాన్య సంపదలతోడను,రజిత కనకాది ఖనివర్గముల తోడను, ధూమ్రపర్వతపార్శ్వ ప్రదేశముల నుండి ప్రవహించుచు, వాణిజ్య నౌకాపూరితమైన సింధూ, గంగా, యమునా, గౌతమ్యాది నిమ్న నదీనదంబులతోడను, మయూర,కీర,శారికా, పరభృతాది శకుంత సంతానారావపూరిత శృంగారారణ్యములతోడను, పశుమేష గణభరిత మనోహరశాద్వలములతోడను, మత్స్యకచ్ఛప మరాళ శోభిత సరోవరంబులతోడను, మందవాతమునకు వినమ్రశిర:కంపముజేయుచు నల్లలాడు ఫలభరిత సస్యవంతములైన హరిద్రవర్ణ క్షేత్ర సముదాయముతోడను, నానావిధ ఫలపుష్ప భరంబై 'సకల దేశముకు రాణి'యని కవులచే నొప్పిన ఈ భారతదేశమును ఏకఛత్రాధిపతులుగ స్వీకరింపగోరు నానాజనాంగములు దీనిపై గన్ను వేసి జయింపజూచిన దినములలో నీ దేశమున అంత:కలహములు తక్కువ కాలేదు. అట్టి పూర్వదినములలో సేనులు గౌడరాష్ట్రము నేలుచుండిరి.ఆ రాష్ట్రప్రజలు మొగలాయీల యగచాట్లకులోనై, నానాముఖల జెదరినపుడు, మనచరిత్ర నాయకుని పూర్వపురుషులు వంగరాష్ట్రమందలి మిధునపురం జిల్లాలో కొంతకాలము నివాసముండి అనంతరము అప్పటి కళింగ, లేక ఆధునిక ఉత్కళ దేశాధిపతుల శరణాగతులయిరి. మిధునపురము జిల్లాలో వంగ, ఉత్కళ, హిందూస్థానీ భాషలు వ్యవహరింపబడును.అప్పటి కళింగ రాష్ట్రమునకు

గంజాంజిల్లాలోని వంశధారా తీరమందలి ముఖలింగమొకప్పుడును,అనంతరము పర్లాకిమిడియు, రాజధానులుగ నుండెను. దాని గంగవంశపు దేవులను వారలు పరిపాలించుచుండిరి.

**పర్లాకిమిడి రాజవంశము :-**

యోసేపుకు, మోషేకు ఈజిప్టులోని ఫరోవంశీయులును, నెహెమ్యాకు అర్తషహస్తారాజును, దానియేలుకు బబిలోను రాజులును సహాయభూతులై యుండినటుల నీ చౌధురీ వంశజులకు గంగవంశపు రాజులు సహకారులై యుండి యుండుటచే నా వంశీయుల సంగతి యీ చరిత్రమున క్లుప్తముగ బ్రశంసింప బడవలసి వచ్చెను.

*చరిత్ర ప్రకారము పశ్చిమ హిందూస్థానమున గంగేయుడను రాజు తన రాజ్యమును సంస్థాపించి కొల్హాపురమును దానికి రాజధానిగ జేసేను. ఆ వంశములోని కమర నవదేవు అనునాతడొక దండయాత్రను బంప ఆ సేనాని మహేంద్రదేశమున బ్రవేశించి యప్పటి రాజగు బాలాధిత్యుని నోడించి 8వ శతాబ్ధమున వంశధారా నదీతీరమందలి ముఖలింగమను మారు పేరుగల కళింగ నగరమును గట్టించెను. అచ్చట గంగవంశపు రాజులు మూడు శతాబ్దము లేలిరి. ఈ వంశీయుడగు రాజేంద్ర చోడగంగదేవు అనునాతడు గోదావరి వరకు గల చోడ రాజ్యమున బ్రవేశించి క్రీ॥ శ॥ 1075 సం॥రము విమలాధిత్యుని నోడించెను.

* Encyclopedia Madras Presidency &c. 1920 - 21

ఈతని కుమారుడు అనంతవర్మ చోడగంగదేవు అను రాజు 11వ శతాబ్దమున నుత్కళదేశమును జయించెను. 12వ శతాబ్దమున కపిలేంద్రదేవు అను రాజు పర్లాకిమిడి ప్రదేశము పై దండెత్తి, ఒరిస్సాలో ప్రజాసంక్షోభము లేచినందున ఆ ప్రదేశము విడిచి తిరిగి ముఖలింగమను కళింగ నగరము జేరెను. ఇంతటినుండి యీ గంగవంశమున వచ్చు రాజుల యుత్కళభాషాలిఖిత చరిత్రమొకటి మా కుటుంబ గ్రంథములలో నుండ, దాని నిప్పటి శ్రీ పర్లాకిమిడి రాజాసాహేబుగారికి సమర్పింప వారెంతయు సంతసించిరి. ఆ మధ్య రాజుల విషయము మనకంత యవసరము లేదు. 12వ శతాబ్దమున కపిలేంద్రదేవుగారితో వంగ, ఉత్కళ, ప్రాంతీయ లనేకులు పర్లాకిమిడి ప్రదేశమున బ్రవేశించిరి. 15వ శతాబ్దమున నీ గజపతులు మహానదీ గోదావరీ మధ్యదేశము

(కళింగము) ను జయించి యుండినటుల "ఇండియన్ ఇంపీరియల్ గెజెటు" కే.ఖండము సూచించును. అనంతరము ప్రతాపరుద్రదేవు రాజ్యమునకు వచ్చెను

## చౌధరీ వంశీయులు :-

ఈ గంగ వంశీయులలో నెవరి కాలమున చౌధరీ వంశీయులు పర్లాకిమిడి జమీందారుల యధీనమునకు వచ్చితిరో తెలియదు కాని, కొన్ని పురుషాంతరముల నుండి వారా తాలూకా జమీందారుల యొద్ద నుండిరి. ఉత్తర సర్కారులు కొంత కాలము మొగలాయిాల యధీనమున నుండెను. ఒక కాలమున చౌధరీ వంశీయుల క్రింద చాల గ్రామములు వుండి వారా గ్రామముల శిస్తు దస్తుల నిప్పటి కలెక్టర్లవలె వసూళ్లు చేసి యప్పటి ప్రభుత్వము వారి యధీనము చేయుచుండిరని మా తండ్రి గారు చెప్పి యుండిరి. అందుకు ప్రతిఫలముగా భూవసతులే యినాముగా బొంది వానికి వారు మిరాసీదారులుగా నుండిరి. "చౌధరీ" యనునది యింటి పేరు కాదు. వంగీయులకు, ఉత్కళులకు ఇంటి పేర్లుండవు. చౌధరీ లేక చౌధరి శబ్దమునకు చతుర్ధరీ యను నొక వ్యుత్పత్త్యర్థము కలదనియు, అది నాలుగు పరగణాల మీద లేక గ్రామముల పైన అధికారి కియ్యబడిన బిరుదమనియు వంగీయులందురు. "చతోపాధ్యాయ" యను సంజ్ఞారీతిని చతుర్ధరీ (చౌధరీ) యనునది చతుర్వేద పరాయణుల కుండు బిరుదమనే భావమును గూడ పురుషోత్తము చౌధరీ గారి చారిత్రమును ఉత్కళ భాషలో వ్రాసిన బరంపుర వాస్తవ్యులగు రెవరెండు. అనామచంద్ర పాత్రో గారు ప్రకాశింపజేసి యున్నారు.

ఉత్తర సర్కారులు మహమ్మదీయ ప్రభువుల యధీనమయి యుండినపుడు వారును గొందరికి "చౌధరీ" "ముజుందార్" మున్నగు బిరుదముల నొసంగి యుండిరి. 18వ శతాబ్దమున నైజాము ఉత్తర సర్కారులను తిరిగి ఈస్టిండియా కంపెనీ వారి కిచ్చి వేసినంతట ఆయా జమీలు జమీందారుల యధీనముననే యుండెను. 1726 సం॥ అన్వరుద్దీన్‌ఖాన్ శ్రీకాకుళము పౌజుదారుగ నుండినపుడు బుద్ధిరాజు చౌధరి గారి వారి సమకాలీనులై నుండిరి.

1798 సంవత్సరము శ్రీరాజా గజపతిదేవుగారు పర్లాకిమిడి జమీందారుగ నుండిరి. *

* Russel's Report No XXIV Vol I.Page3

పురుషోత్తమ చౌధరి గారి పితామహులగు బుద్ధిరాజు గంగాధర చౌధరీ గారు, జనకులగు కూర్మనాథ చౌధరీగారు పర్లాకిమిడి నరపతుల యొద్ద ఆశ్రమ స్థాపనము చేసికొని వేద పురాణాది గ్రంథ పారాయణము సేయుచు, ఆస్థాన కవులై యొప్పిరి. వారలు పర్లాకిమిడికి దాదాపు పదునెనిమిది మైళ్ళ దూరమందలి "అసురసాగర" పరివృతమైన తెంబూరు ముఠాలోని పన్నెండు గ్రూపులలోని యనేక గ్రామములకు మిరాసీదారులై పన్నులు వసూలు చేయుచు, అందుకై వారికియ్యబడిన భూవసతులుగలిగి, మదనాపురమను గ్రామమును తమ కార్యసీమకు కేంద్రస్థానముగ జేసికొని తరుచుగా రాజనగరమగు "ప్రవాళఖిముండి" యను మారు పేరుగల పర్లాకిమిడి దర్బారుకు బోవుచు వచ్చుచు గృతకృత్య కార్య నిర్వాహణమున నిమగ్నులైయుండిరి.

పంచగౌడులలోని శిష్టుల యాచార ప్రకార మీ కుటుంబములవారు తమ ప్రవర నిట్లు చెప్పుకొనువారు:-

"భరద్వాజానాం, అంగీరస, బార్హస్పత్య, భరద్వాజ్యేతిత్ర్యార్షేయ, ప్రవరాన్విత, భరద్వాజగోత్ర:, సామవేద శాఖాధ్యాయీ, కాత్యాయన సూత్ర: పురుషోత్తమ చౌధరీ- అహంభో అభివాదయే."

మరియు కుటుంబమున పుసవనము, సీమంతము, జాతకర్మ, నామకరణము, వహిర్నిష్క్రమణము, అన్న ప్రాశనము, చౌలము లేక చూడాకర్ణము, ఉపనయనము, వేదారంభము, సమావర్తనము, సప్తదిన వైవాహిక గౌడ బ్రాహ్మణ కర్మలు సిద్ధోత్కారమై యుండునవి.

ఆ కాలము నుండియు పర్లాకిమిడిలో ఆంధ్రభాష కోర్టులో వ్యవహరింపబడుచు వచ్చినందున ఆ భాషయందును, వంగభాషకు సమానమైన ఉత్కళ భాషయందును, ఈ కుటుంబము వారు నిపుణులై యుండిరి. మేదినీపురమునుండి వచ్చిన పూర్వులకు వచ్చియుండును బాంగ్లాయను వంగభాష చాలా మట్టుకు పూర్వపక్ష మాయెను. కుటుంబమున కొందరిది వైదిక వృత్తి, కొందరిది నియోగులకు జెందు కరణీకవృత్తి, లేక లిపికారవృత్తి. ఆ కారణమున తరుచుగ పురాణకాలక్షేపము చేయుట కుటుంబమున ప్రతివారి యభ్యాసము కాకున్నను కొందరికావృత్తియు, పురాణములు తాళపత్రములపై వ్రాసి విక్రయించి ధనార్జనము సేయుటయు బరిపాటిగ నుండెను.

పర్లాకిమిడి రాజవంశమున అంత:కలహములు పరంపరాగతమగుటచేత,శ్రీ రాజా గజపతిదేవుగారి సోదరులైన శ్రీరాజా జగన్నాథ గజపతి దేవుగారికి ఈస్టిండియా కంపెనీ వారు కొన్నాళ్లు సంస్థాన భారమప్పగించియుండిరి. కాని 1780 సంవత్సరము వారాయనను దొలగించినంతట, రాజు బిసోయిాలతో, గలిసి, పితూరీలు ప్రబలింపసాగెను. 1799 సం॥ ఏప్రెల్ 13 తేదిని కర్నల్ ఫాదరింగ్ గారు హోం 5000 సైన్యముతో తిరుగుబాటు నణప పర్లాకిమిడికి వెళ్లిరి. రాజా పురుషోత్తమ దేవుగారును, వారి పినతండ్రియగు దుగరాజుగారును బ్రిటిషువారి విశ్వాసపాత్రులై యుండిరి.

## సమకాలీనత:-

1802 సంవత్సరము శ్రీరాజా గజపతిదేవుగారు కాలవశులై నందున ఆయన కుమారుడైన శ్రీరాజా పురుషోత్తమ నారాయణ దేవుగారు అధికారమునకు వచ్చి, మూడేండ్ల వెనుక అనగా1805 సం॥ అక్టోబరు 29వ తేదిని మృతులైరి. అప్పటికి సంవత్సర ప్రాయమున నుండిన వారి కుమారుడు శ్రీ జగన్నాథ గజపతి నారాయణ దేవుగారు గద్దె పైకి వచ్చిరి ఆయన మన పురుషోత్తము చౌధరీగారి కన్న నొక యేడు చిన్నవారు.

ఆ కాలమున కోర్టాఫ్ వార్డ్స్ వారి యేర్పాటు మేరకు శ్రీదుగరాజుగారు మైనరు రాజు పక్షమున పరిపాలనా భారము వహించి యుండిరి.

కూర్మనాథ చౌధరీగారెన్నియో పర్యాయములు తమ కుమాళ్ళగు జగన్నాథ చౌధరిగారు, పురుషోత్తము చౌధరీగారులను రాజు సమక్షమునకు దీసికొని వెళ్ళ వారి విద్యా, చాతుర్య పరిశీలనములు గావింప బడుచుండుట పరిపాటిగా నుండెను. దుగరాజుగారు 1813 సం॥ వరకు జమీందారీ తమ వశమున నిడికొని కలతలు లేకుండ బాలించి, యా యేటనే బనారసుకు వెడలి యచ్చటనే మృతులైరి. ఆయన కుమారుడైన శ్రీ రాజా పద్మనాభ దేవుగారు 1832 సం॥ వరకు పర్లాకిమిడి సంస్థానాధికారమున నుండిరి. ఈ రాజుగారి కాలముననే పురుషోత్తము చౌధరి గారు ఆ సంస్థానముతో నానావిధ సంబంధములు కలిగి యుండిరి.

# 2 అధ్యాయము

జననము, విద్యాభ్యాసము, ఉపనయనము, ఆపద్రక్షణము, వివాహము, హిందూధర్మ ప్రగాఢానిష్ఠ, కాశీయాత్రా విఫలత, బ్రహ్మజ్ఞాన మతచర్చ, యోగాభ్యాసము, అవధూతాశ్రమము, మిథ్యాధర్మనిష్ఠ, మాయా గురుభక్తి, శుశ్రూషలు.

**" గర్భములో నేను నిన్ను రూపింపకమునుపే నిన్నెరిగితిని: నీవు గర్భము నుండి బయలు పడక మునుపే నేను ప్రతిష్ఠించితిని; జనములకు ప్రవక్తగాను నిన్ను నియమించితిని." యిర్మీయా 1: 5.**

---♦--- ♦---♦---

**కవి జననాదులు:-**

మూడవ జార్జి రాజుగారు ఇంగ్లాండు దేశమున పరిపాలించు చుండినపుడు మన కథానాయకులగు పురుషోత్తము చౌధరిగారు1803 సంవత్సరమున సెప్టెంబరు 5వ తేదిన గంజాం జిల్లా, తెంబూరు ముఠా మదనాపుర గ్రామమున కూర్మనాథ చౌధరిగారి యొక్కయు, సుభద్రాదేవి చౌధురాణి*గారి యొక్కయు ద్వితీయ పుత్రులుగ జన్మము దాల్చిరి. ఇరువది యొకటవ దిన మా గృహమున విశేషపర్వదినమై యొప్పెను. ఆ బారసాల నాడు బంధువులకు విందొనర్చబడి ఆ శిశువునకు పురుషోత్తమను నామకరణము చేసి ఉయ్యాల వేసిరి. సిద్ధాంత శిరోమణులాతని జాతకము వ్రాసి బహుమతులను వడసిరి. కాలక్రమమున వంగ, ఉత్కళ, శిష్టాచార వ్యవహారముల మేరకు వహిర్నిష్క్రమణము, అన్నప్రాసనము, చౌలము (చూడాకర్ణము) కూడా జరిగెను. అయిదవ యేట పురుషోత్తముచౌధరీగారునకు అక్షరాభ్యాసము మహోత్సవముతో గావించిరి. ఆంధ్ర, ఉత్కళ విద్యాభ్యాసమా బాలకునికి జరిగెను. రెండేండ్లలో ఆయన చాకచక్యతతో విద్య గరచుచు వచ్చెను. ఇంట జనకుని కడ ఆయన చిన్న చిన్న శ్లోకము లెన్నియో నేర్చుకొనెను. ఏడవ యేట ఉపనయనము జరిగించి గౌడ బ్రాహ్మణాచార ప్రకారము యజ్ఞోపవీతము వేసి ద్విజునిగా జేసి క్రిందిరీతిని గాయత్రీ నేర్పించిరి. **"ఓం భూర్భువ: స్వః, తత్సవితుర్వ్రేణ్యం, భర్గో దేవస్యధీమహి, ధియోయోన: ప్రచోదయాత్"** యజుర్వేదము 36 అ 3 మం. (ఓంకార స్వరూపుడు, స్వయంభవు,

దు:ఖ రహితుడు, సర్వవ్యాపకుడు, సమస్త జగత్తు నుత్పాదించి సకలైశ్వర్యముల నిచ్చువాడు, స్వీకరించుటకు శ్రేష్టమైన యోగ్యుడు, పరిశుద్ధ స్వరూపుడు, సమస్త సుఖముల నిచ్చు ఆ పరమాత్మ స్వరూపమును మేము ధరింతుముగాక! జగదీశ్వరుడయిన పరమాత్మయైనవాడు మా బుద్ధులను ప్రేరేపించునుగాక!) యని దాని భావము.

* వంగోత్కళభాషలలో కర్మధారయమున స్త్రీవాచకమున ఆణిశబ్దము పరంబగును.

ఆయన యా జపమును శైశవముననే నేర్చుకొనెను.

"యజ్ఞోపవీతం పరమపవిత్రం, ప్రజాపతేర్యా శ్చహజం పురస్తాత్। ఆయుష్యమగ్రియం ప్రతిమంచశుభ్రం, యజ్ఞోపవీతం బలమస్తు తేజ:" యనియును ఆయన పఠించ నేర్చిరి.

## విద్యాసక్తి :-

వయస్సు హెచ్చుజొచ్చిన కొలది పురుషోత్తమ చౌధరీగారు పురాణేతిహాసములనే కాక, వేదపారాయణము గూడ చేయుచు సంధ్యావందనాది నిత్యకృత్య నిరతుడైన ఏక సంధాగ్రాహియై వెలసెను. ఆయన స్వహస్త లిఖితమున అట్టి భాగములు వ్రాసియున్న పుస్తకములు నేటికిని కుటుంబము వారి యొద్ద గలవు. ఆయన జటిపఠియో యను దానిని గూడ నా గ్రంథములలో జూడగలము. పురుషోత్తముగారు అమరాంధ్రములు నేర్చుకొని, చలికాలమున ఆటకై పిల్లలు తంటెపు పుల్లల మంటలు వేసికొని నపుడు కూడ పుస్తకములు విడువక, యొక్క చలికాలముననే ముమ్మారు భాగవతపారాయణము పూర్తి చేసిరట! తన తండ్రి మహా విద్వాసుండై, మహాభారత, భాగవత, రామాయణాది హైందవ మత గ్రంథములు చదివి యర్థము చెప్పుట యాయన వినుచు, దాను కూడ నట్టి శక్తి సంపాదించుకొనెను.

## ఆపన్నివారణము :-

విద్యార్థిగ నుండిన దినములలో పన్నెండేండ్ల ప్రాయమున పురుషోత్తమ గారొక దాసరి చిన్నవానితో ***"కణిగె"*** యను గ్రామ తటాకమున స్నానము చేయబోయి, వారుభయులును ఈవలి యొడ్డు నుండి యావలికి ఈద దలచి వెళ్లుచుండగా నతని నడుమునకు గట్టుకొనిన బట్ట వీడి కాళ్లకు జుట్టు కొనెను. అంతట మరి యీదజాలక బుడుగు బుడుగున మునకలు వేయుచు, నీళ్లు త్రాగి కాళ్ళ కొన వ్రేళ్లపై

మాత్రమునిస్పృహతో నిలిచియుండెను. రెండవ చిన్నవాడు పారిపోయెను. దైవవశాత్తువ నిద్దరు తెలగాలు వెళ్లి నీళ్లపై గానబడు చుండిన యా బాలుని ముఖపద్మము వీక్షించి, గబాలున నీటదిగి ప్రాణాపాయమునుండి యాయనను రక్షించిరి.

ఇంకొక పర్యాయమాయన యా బాల్యప్రాయములో నొక బంధు గృహమును జేర చుట్టలు కాల్చుకొనుటకు గొంచము నిప్పు తెచ్చి పెట్టవలెనని పెద్దలు కొందరు కోరగా ఆయన పొరుగింటికి పోయి ధాన్యము దంచుచుండిన కాపువారి కోడలి చేతిని "అగ్గి త్వరగా దెచ్చి యిమ్మ" ని యాపినందున రోకలి జారి తన కుడికంటి బొమ్మ క్రింద గట్టిగా దగిలినందున బొట బొట రక్తము స్రవించెను. వారు ప్రలాపించి గుడ్డ కాల్చి రంధ్రములో బెట్టి కట్టుకట్టిరి. చాల కాల మా బాధ నివారింప కుండెను. ఆ కన్ను పోకుండినను 67 సంవత్సరములైన వెనుకయా నేత్రదృష్టి ముందుగా క్షీణించెను.

అనంతరమాయన మూడు నెలలు జ్వర పీడితుడాయెను. "లంఖణం పరమౌషధం" అని బోధించు వైద్యులెవరో చికిత్స జేయుచు ఆయన కొకనాటి రాత్రి దుర్దాహము హెచ్చుజొచ్చ, ఎన్నిసార్లు నీళ్ళడిగినను ఇచ్చినారుకారు. అంతలో నాతనికి స్ప ృహ తప్పి క్రింది గ్రుడ్లు మీదికి దేలవేయగా, నందరు రోదనము లిడసాగిరే కాని గరిటెడు నీళ్లు పోయివారును లేరైరి. దైవవశాత్తున ముందటి యాపదలలో వలె నెవరో తెగించి యాయన ముఖము మీద చన్నీళ్ల చల్లి మరి కొంచము పెదవులను జీల్చి నోట బోయగా ప్రాణములు తెమ్మదేరెను. అఘటనా ఘటన సమర్థుడు, తాత్కాలిక సహాయదాత, కరుణామయుండుగు యేసునాథుని నామమునకు సదాసర్వదా ధన్యవాదములు. ఆయన యపారకృపతో నెంతగా నా బాలుని గాపాడెను! పురుషోత్తమ చౌధరిగారి ద్వారా దేశమున జరగనైయుండిన మహత్తర సేవ విషయ మెరింగి యుండినందుననే పరాత్పరుడాయన నీ ప్రకారము నిరపాయముగ గాపాడియుండెను. మథనాపురమునకు సారవకోట చాల చేరువ. పదునాలుగు పదిహేను సంవత్సరముల ప్రాయముననే యచట నుండిన ముస్తాదారు గంధం నారాయణ దాసుగారి యింట నీయన పురాణ కాలక్షేపము రెండేండ్ల వరకును జేసి కొంత ధన సంపాదన చేసుకొన గలిగిరి.

## హైందవ మత ప్రగాఢ నిష్ఠ:-

బాల్యదారభ్య పురుషోత్తమ గారు విష్ణు సంబంధమైన విగ్రహోపాసనములు సేయుచు, జపస్నానఉపవాసములందును, తీర్థయాత్రలు సేవించుటలోను మిగుల సన్మానము గలిగియుండిరి, మరియు వైష్ణవ మతానుసారముగ భుజములమీద శంఖు చక్రములు కాల్పించుకొని గురువులు నేర్పిన మంత్రములు పఠించి తిరునామ కీర్తనలు పాడుట యాయన కాచారముగ నుండెను.**"భవన్తి నమ్రా స్తరవై: ఫలోద్గమ:"** యను నార్యవాక్య ప్రకారము పురుషోత్తమ కవి విద్యకు దగిన వినయ సంపన్నులై ప్రశంసార్హులైరి.

## అస్థానకవి పదవి :-

1813 సంవత్సరము నుండి 1832 సంవత్సరము వరకు శ్రీ దుగరాజుగారు కుమారులగు రాజా పద్మనాభ దేవుగారు, శ్రీ రాజా జగన్నాధ గజపతి నారాయణ దేవుగారు స్థానే ఈస్టిండియా కంపెనీవారి సెలవు ప్రకారము సంస్థాన భారము వహించి యుండిన సంగతి ముందు దెల్పియున్నాము కదా! సుమారు 1820 సంవత్సర ప్రాంతమున పురుషోత్తము చౌధరిగారి జనకులగు కూర్మనాధ చౌధరిగారికిని, పినతండ్రులగు రామకృష్ణ, రాధాకృష్ణ చౌధరీలకును తమ మిరాసీ భూవసతుల విషయము కొన్ని గృహఛిద్రములు లేచినందున పురుషోత్తము చౌధరిగారు పర్లాకిమిడి సంస్థానాధిపతి యొద్ద స్వతంత్రముగా కొన్నాళ్ళు నిలిచి ఆస్థానకవియై కొన్ని గ్రామములు సంపాదించు కొనిరి. ఆయన చాల కౌతకము గలవాడు. తెనాలి రామలింగ కవి వంటి వికటకవిగ నుండి, సంస్థానాధిపతికి ఉత్సాహము గొల్పువాడట.

శీతసాగరతీరమున **"చిజాలం"** అను ఇటాలియను ఇంజనీయరు చే ప్రస్తుతము పర్లాకిమిడిలో నున్న సౌందర్యవంతమైన రాజమందిర నిర్మాణము చేయబడక ముందచ్చట శనివారము సంతసాగెడి చోట నొక రాజమందిరము నిర్మాణం గావింపబడినది. సంస్థానాధిపతి యొక దర్బారు తీర్చి, కవుల నాహ్వానించి మందిర వర్ణనము చేయుడనగా, తక్కిన కవులు సముచిత వర్ణనములు గావిపంగా, పురుషోత్తముచౌధరి గారు మాత్రము తన వర్ణనమున ఆ రాజగృహము తన గృహముతో బోల్చదగదను భావము వెలువడించెను. ఆ పాదము చదివి రాజును పండితులును నందలి యింగిత భావము గ్రహింపలేక యది యెట్లని యడుగ "సూర్య చంద్ర

నక్షత్రాదులను నా గృహములో బరుండి చూడగలను", ఈ రాజగృహములో నుండి వానిని జూడలేనని పాదము పూర్తిచేయగా రాజును, సభాస్థారులును ఆయన యొక్క వికట కవిత్వమునకు పకాలున నవ్వినరట! ఈ సంగతి మా తండ్రిగారు మాతో జెప్పుచు వచ్చిరి.

ఆయన కిరువదేండ్ల ప్రాయము వచ్చెను. గౌడ శిష్ట శాఖలో మేనరికములు పాటించుట వలనను, రజస్వలానంతర వివాహములు అసమ్మతము లగుటవలనను అతని మేనమామ రఘునాధపాల్ మహంతిగారి కుమారిక రాధామణిదేవిగారు తొమ్మిదేండ్ల బాలికయై యుండినను, పురుషోత్తమ చౌధరిగారి వయస్సు యిరువదేండ్లయి యుండినను, పెద్దలాసంబంధమే నిశ్చయించి, సప్తదిన వివాహము మహా వైభావముతో జరిగించిరి. ఇట్లాయన బ్రహ్మచర్యాశ్రమము నుండి గృహస్థాశ్రమమునకు వచ్చెను. అనంతరమాయన తండ్రియైన కూర్మనాధ చౌధరిగారు కాలావశులైరి. ఈ కూర్మనాధ చౌధరి గారి తల్లి గంజాం జిల్లాలోని శ్రీ కూర్మంమందలి కూర్మనాధుని ఉపాసించి (సేవించి) సంతతి బడసినంతట ఆంధ్రదేశ మందలి యాచార ప్రకారమా దేవత పేరు కుమారుని కిడి యుండును. అట్టి పేరు వంగ,ఉత్కళ సాంప్రదాయమున సాధారణముగ గనబడదు.

తండ్రి మరణానంతరము తల్లియైన సుభద్రాదేవి చౌధరాణిగారును, అన్నయైన జగన్నాధ చౌధరిగారును పురుషోత్తముగారి యెడ నతుల ప్రేమ, సమాదర భావములు గలిగి ఆయన విద్యావిశారదుడు వినయ విధేయతా సంపన్నుడు, హైందవ మతభక్తియుక్తత గలవాడు నగుటంజేసి ఘన గౌరవములతో గాపాడిరి.

## హైందవ గ్రంథ రచనము :-

జనకుని మరణము వలన పురుషోత్తము గారు మరింత భక్తిరస నిమగ్నుడాయెను. ఆయన తన కాలమున గల కవితా శక్తి ప్రకారము విష్ణు పరమున నేడెనిమిది కీర్తనలును, శివపరమున నొకటియు, గురు పరమున నొక తత్వ కీర్తనయు, కృష్ణ లీల నొకటియు, అంత్యపాదమున ''దశరథరామా'' యని వచ్చు రామ శతక మొకటియు, "నీలాచల విలాసమ"ను పద్యకావ్య ప్రబంధ మొకటియు రచింపగ వానిని వినిన వారందలి మృదు మధుర పద జాలమునకును, కవితా నైపుణ్యతకును ఆయనను

శ్లాఘించి గొప్పగాను మెప్పుగాను జూచినందున నాయన కాశీ వెళ్ళి విద్యావ్యాసంగ మొనర్ప దృఢనిశ్చయత బూని, యొక స్నేహితుతో నేకీభవించి,యావశ్యక పదార్థములు సిద్ధపఱచి యింటివారికి, దెలుపకుండ వెళ్లగోరి, యా మూట నొక పొదలో దాచిపెట్టి ప్రయాణము సాగింప బోవుసరికి దానినెవరో తస్కరించిరి. అందుచే నా యుద్యమము నెరవేర లేదు. ఆ యౌవనావస్థలో శృంగారకావ్య ప్రబంధములు దామెంతయో సంతసముతో జదివి యుండినటుల జ్ఞాపిక గ్రంథమున నొప్పుకొనియున్నారు.

## బ్రహ్మజ్ఞానోదయము :-

మన యౌవన కవి తన యిష్ట దైవతమైన విష్ణు నుపాసించుచు! ఇతరుల మెప్పు వడయుచు, మోక్షనాయకుడని సంతోషదాయకుడని యాతని గొల్చుచున్న సమయమున ఆయన భక్తి వేరుగా మారసాగెను. ఆ కాలమున పర్లాకిమిడిలో బ్రహ్మజ్ఞాన మతము రాజయోగ శాఖకు జెందిన యొక యుద్యోగస్థుడైన దేవాంగి, పురుషోత్తము చౌధరిగారిని పిలచి తన యొద్దనున్న "రామస్తవరాజమ"ను వేదాంత గ్రంథము నిచ్చి, దాని జదివి భావము తనకు వివరింప గోరెను అయితే పురుషోత్తమ గారు దాని జదివినను ఆ దేవాంగి కోరిన యనుభవార్థ మాయన కప్పటికి అయోమయముగ నుండెను. అయిన నాయన దాని విడువక, యది తనకు మనోహరముగ నుండుట చేత దాని అరువు తీసికొని యామూలాగ్రముగా పఠించెను. అంతటితో దృప్తి జెందక దాని ప్రతి నొకటి యాయన యెత్తి వ్రాసికొని, దాని చర్వితచర్వణము చేసి క్రమేణ మననము కావించుకొని యీ ప్రపంచ సంసారము ప్రవాహ వేగతుల్యమనియు, శరీరాత్మలకు గల భేదమును, ఆత్మయొక్క నిత్యత్వమును జీవాత్మ పరమాత్మలనైక్యపరుచు సాధన సంపత్తులను, వానిని నేర్పు సద్గురుని కనుగొని యా గురువు వల్ల బోధ పొందవలెననియు, నటుల జేయని వారికి ముక్తి సాఫల్యత యెన్నడు సిద్ధింప దనియు నా గ్రంథము వలన నుపదేశింపబడెను.

ఈ వేదాంత గ్రంథము చదువుకొనినంతట హైందవ మతఛాందసాచారములు, భక్తిక్రియలు వృధాయని యాయనకు దోచెను. ఏతత్కారణమున కులాచార ధర్మములను, భార్య బంధు మిత్రాదులను సర్వ సంగములను త్యజించి, సన్యాసాశ్రమము జేరి బ్రహ్మజ్ఞాని కావలెనను వాంఛ యాయనలో హెచ్చ జొచ్చెను. కావున నందుకై కృషి

చేయగా తనకు ముందు లభించిన "రామస్తవరాజము'' గాక యింక "వేదాంతసారము" "శివయోగసారము" "ఆత్మబోధ" "విజ్ఞానదీపిక" "జీవప్రబోధ" భాగవతపురాణమందలి "భగవత్కథలు" కపిల మహార్షి తన తల్లియైన దేవహూతికి జెప్పిన "సాంఖ్యయోగము" ప్రహ్లాదుడు రాక్షస కుమారులకు ప్రబోధించిన "పరతత్వము" నారదముని ధర్మరాజు కుపదేశించిన ''పరమహంస ధర్మము'' అమనజగత బుషి చరిత్రము వశిష్ఠ రామాయణమున వశిష్ఠ మహా ముని రామునికి బోధించిన "ఆత్మజ్ఞానము" ఉత్కళ భాషయందు "ప్రేమభక్తి పంచామృతమ" ను గ్రంథమందలి నిష్కామ ప్రేమభక్తి సూచక "అవధూత చరిత్రము" ఇత్యాధి గ్రంథ సంచితము చేసికొని వాని నెత్తి వ్రాసికొని చదువుచు కొన్ని కంఠోపాఠము చేయుచు తత్వార్థములు నాయన గడుంగడు శ్రద్ధతో దెలిసికొను చుండెడి వారు. అప్పటి దళసరి ఆకుపచ్చ కాగితముల మీద పురుషోత్తమచౌధరి గారు వ్రాసియుండిన "ఆత్మబోధ" యను గ్రంథమును, దళసరి నీలిగోవ కాగితముల మీద వ్రాసియుండిన "జ్ఞానప్రదీపికయు' శ్లోక తాత్పర్య సహితము కటకపురిలో లభించినవి. ఉత్కళభాషలోని "యవధూతచరిత్రము" నాయన తాటియాకులు పూసవలె గుండ్రముగ గోసి, దానిపై నా గ్రంథము వ్రాసికొని పూసాకారమును బోలిన యా గ్రంథమును కంఠమాలగ దగిలించుకొని దాని ననుదిన పారాయణము సేయుటలో నత్యంత కుతూహలత గలిగి మెలగెను.

అంతటితో దృప్తి గొనక తన యాత్మను పరమాత్మయందైక్య పరపజేయు సద్గురువు లభింపవలెననియూ, పురుషోత్తమచౌధరి గారు ఎన్నియో యత్నపరంపరలు గావించెను. పాపమప్పటి కాయన కట్టి గురువుల విషయమై శ్లో॥ "గురువో బహువత్సంతి, శిష్యనిత్తాపహారక: దుర్లభో సద్గురుర్లోకే, శిష్యహృత్తాపహారక:" యను అనుభవము కలిగియుండ లేదు. ఎట్టకేలకేడుగురు మాయ గురువులాయన పాలిటకు గూడిరి. వారి పేరు ప్రసిద్ధులు తెలియబడి యుండలేదు. వారి వల్ల ఆయన యమ, నియమది అష్టాంగ యోగములను, అణిమాదిసిద్ధులను చిన్మయాది ముద్రలను గూర్చి కొంత నేర్పు పొందెను.

## యోగసాధనము మాయా గురుభక్తి :-

వారిలో ఉప్పు రామలింగమను గురువు తక్కిన వారికన్న మిక్కిలి యసహ్యాకర వస్తువులు తినవలెననియు, అసహ్యా కార్యములు చేయవలెననియు, నట్లు జేయని యెడల ముక్తి యెంత మాత్రము చెందలేరన్నట్టును, అవి కూడ సాధనలనియు నెంచి చెప్పెను. పురుషోత్తము చౌధరిగారు వృద్ధాప్యమున స్వయముగా వ్రాయించిన కొన్ని యాపూర్వానుభవములువారి వ్రాత ప్రతి నుండి యీ క్రింది పొందుపరచుచున్నాము:-

"చేయరానివి చేసితిని; తినరానివి తింటిని; వానిని యిక్కడ వివరించి వ్రాయలేను, ఏలనన అవి మిక్కిలి యసహ్యామైన కార్యములు. ఈ ఏడుగురు గురువులలో రొకడైనను నేను కోరిన బోధ నాకిచ్చుటకు శక్తి గలవారు కాకపోయిరి. మరియు నొక లజ్జాకరమైన సంగతి చెప్పుచున్నాను ఏలన నేను చదివిన గ్రంధంతరమున అతిధి సేవా క్రమ మొకటి యున్నది. ఒక యతిధికి ఎవడైన తన భార్య నప్పగించిన ఆ పుణ్యము బహు గొప్పదనిరి. అందుకు క్రింది పద్యముదాహరణముగా నిచ్చెదను:-

॥గీ॥ **జనకగురులనైన । జంపునర్థమునైన**
**ప్రాణమైన విడుచు । భార్యకొరకు**
**నట్టిభార్యచేత । నతిథి శుశ్రూషసే**
**యించిగెలుచు నజుని । నీశునైన**

నేను నాలాగు చేయవలెనని యత్నించితిని. నా యూరి సమీపమందలి కొత్తపల్లి యను గ్రామమున నొక మఠమున్నది. అందొక కృష్ణవిగ్రహమును రాజులుంచిరి. దానికి గావలసిన భూవసతులు రెండు గ్రామము లున్నవి. అందుపై నొక యధికారియు, ఇద్దరు పూజారులు నుండిరి. అప్పుడప్పుడు కొందరు బైరాగులు వచ్చి ఆ మఠమును నుండువారు. నేను వారి సేవ చేయుచుండువాడను. ఒక బైరాగితో నేను చాలా స్నేహము చేసి బహు విధేయుడనైయుండి, యొకనాడు నా యభిప్రాయము ననగా నా భార్య చేత అతిథిసేవ చేయించుకొనవలెనని వానితో జెప్పితిని అందుకతడు సమ్మతింప, నేను నా భార్యతో బహు ప్రేమతో రహస్యమున నీ సంగతి జెప్పితిని. ఆమె నా మీద బహు కోపము తెచ్చుకొని మీరు చేయు యీ యసహ్యాకార్యములకు నన్ను కూడ మీ యూరిలో దగిలించెదరాయని కోపపడినది. ఆ సంగతి నామె వినసహింపదాయెను.

“ఈలాగు వేదాంత గ్రంథములు చదువుటవల్లను యోగాభ్యాసము చేయుట వల్లను నాకు వైరాగ్యము విస్తరించెను. సర్వజీవుల యెడ కారుణ్యమును ప్రేమయును గలిగియుండ ప్రయత్నించితిని, అట్టి సాధనకై పగటియందైనను రాత్రియందైనను పైబట్ట లేకుండ వట్టి నేలపై బరుండునపుడు చీమలు కరచినను దోమలు కరచినను వానిని జంపక నొప్పి సహించుకొని “అహింసా పరమోధర్మః” యని మెల్లగా వాని దోలివేయువాడను. ఎట్టి జంతువునైనను, పురుగునైనను, ఇతరులు తిట్టి కొట్టి చంపునపుడు నా కంటితో జూచుటకైనను ఎంతమాత్ర మిష్టము లేకపోవునది. కులాభిమానము పోవలెనని యితరకులస్థులైన స్నేహితులతో గలసి భుజించితిని. భార్యతో సంసారము చేయుటకు అరుచి కలిగెను. యోగ పురుషుల సాంగత్యము తరచు జేయుచు వారి పాద ప్రక్షాల జలము చరణామృతమని బహిరంగముగ తలపై ప్రోక్షించుకొని, నాలుకపై వేసికొనువాడను. ఒకానొకప్పుడు నా యింటి వారు నాకు వడ్డించిన భోజనపదార్థములు నే నొకతట్టును, ఇంటివారు పెంచిన కుక్క యొక తట్టును కలసి భోజనము సేయుట ఆచారమైనది. స్నాన, జప, ఉపవాసాదులు చాలమట్టుకు తగ్గిపోయెను. దంతధావనమును చాలమట్టుకు విడిచిపెట్టితిని. నేను లోకమునకును లోకము నాకును వెఱ్ఱిగా గనుపించెను. ఇంటివారును ఇతరులును నా చేష్టలు చూచి నాకు వెఱ్ఱిపట్టెనని చెప్పి యొకప్పు డవమానకరముగ మాట్లాడు వారు. నే నట్టి వారిని కోపింపక, మారు మాటాడక, యోర్చుకొనటకు ధైర్యము వహించితిని. ఇట్టి నా స్థితిని జూచి నా తల్లియు, నా భార్యయు మిక్కిలి దు:ఖించువారు;

**అవధూతాశ్రమము :-**

చిట్టచివరకు నేనునస్యసించి యవధూతశ్రమము జెంద గృతనిశ్చయుడనైతిని, ఒంటరిగనైనను, ఇద్దరు స్నేహితులతో నైనను నిర్జనారణ్యములోనో కొండ యొండలలోనో యోగాభ్యాసము చేయువాడను. ఒకనాడొక కొండ నెక్కుచుండ యే జంతువు దేనిని తినెనో తెలియద గాని యొక పచ్చి తోలుముక్క రాళ్ళసందున బడియుండ నేనెత్తి దాని నసహ్యింపక నమలవలెనని చెప్పి, నేనే మొదట నారంభించితిని; తరువాత నా శిష్యులై యుండిన స్నేహితులును ఆలాగు కొంచెము కొంచెము నాలుక మీద బెట్టి పారవేసిరి.

భక్తి, జ్ఞాన, కర్మ, వైరాగ్య, రాజయోగాది సాధనలన్నిటిలో మన కవివరుడు

పొందవలసిన శిక్షణములను బొందెను.

ఆ కాలమున రాజయోగము సాధించువారిలో దుర్మార్గురాండ్రగు స్త్రీలు నుండిరి. వారిని 'ముక్తికాంతలను' వారు, మరియు అఘోరులను శవభక్ష్యకులు, అవధూతలను దిగంబర సాధువులు చిరకాలము నుండి ఇండియాదేశమున నున్నారు. అవధూత యొక్క లక్షణములు ఈ కింద్ర విధమున పురుషోత్తమచౌధరిగారి స్వహస్త లిఖిత గ్రంథములలో నొకదానియందు గలదు.

(నిజమైన అవధూత)

సీ॥ "చతురుడా జన్మ ప్ర । శాంతుండు నిస్సంగు
డును సమదర్శను । డును ఘనుండు
నై యాత్మయందు లో । కావలిలోకంబు,
లందు నాత్మయు జూచు । చనఘమైన
యనుపమయోగ్య క్రి । యాదావపావక
దగ్ధకర్మ ప్రయ । త్నమున జేర్చి
జడునికై వడి జీకు । చందంబునను మూక
పగిది నున్మత్తుని । భంగి చెవిటి

గీ॥ వడువునను గానబడుచు స । ర్వజ్ఞుడై ప్ర
శాంతకీలాహుతాశను । సరణిబొల్చి
సతత శాతంబు నంచిత । జ్ఞానసమమము
నైన బ్రహ్మస్వరూపంబు । దానయగును."

బాలుడగు బంధువొకడు కాలధర్మము నొంద వాని దహన పరుపక ఖనన మొనర్చిరి. ఈ మన పురుషోత్తమ జ్ఞాని యా శవమును బైకి తీసి కొంత తడవు కాళ్ళపై బరుండ బెట్టుకొని తనకు అసహ్యము భయము లేదని సమర్థించుకొని, తిరిగి పూడ్చివేసి నటుల మా తండ్రి గారు చెప్పిరి. ఇవన్నియు ముక్తి సాధన మార్గములని యీ దేశస్థు లెంతయో భ్రమించి దాని కావశ్యకమైన ఆత్మశుద్ధి మార్గ మెరుగకపోవు

చున్నారు. మన దేశమందలి యోగ పురుషులనేకులు గంజాయి ముత్తులై, పాపకార్మ భూయిష్టులై మెలగుటయు, మతము పేరిట “ఆ మిధున కైంకర్యాది” హీన కార్యము లొనర్చు చుండుటయు నా కాలమున పరిపాటిగ నుండెను.“యదుహృదయమ శుద్ధం తస్యసర్వవిరుద్ధం” అనునటుల అపవిత్రహృదయములు  అంధకార కార్యములు గలవారెటుల సద్గురువులుగ నుండగలరు? ఇట్టి యవస్థలోనే “అసతోమ సద్గమయ; తమసోమ జ్యోతిర్గమయ; మృత్యోర్మా అమృతం గమయ” యని ప్రలాపించుచు పురుషోత్తము చౌధరి హృదయ మెన్నిసార్లు అసత్యము నుండి సత్యమును, అంధకారము నుండి తేజమును, మరణము నుండి జీవమును వెదుకగోరెనో భగవంతుడే ఎరుగును.

‘యోగ:చిత్త వృత్తినిరోధ:’ యని పతంజలి చెప్పినటుల యోగసాధనము మానవచిత్తమును దైవచిత్తమున కరికట్టుటకని సూచింపబడినను యీ మన పురుషోత్తమ యోగి యనుభవములో మాత్రము పాపభూయిష్టమైన తన యేకాగ్రతవల్ల దైవచిత్తమునకు లోబడుట సాధ్యము కాకుండెను. తన చిత్తమును తండ్రి చిత్తమున కరికట్టిన మహా మహుడొక్క యేసుక్రీస్తు ప్రభువే. ఆయన  పురుషోత్తముచౌధరిగారికి తన నిశ్చలతత్వమును నేర్ప సంకల్పించెను.

**‘నన్ను జాగ్రత్తగా వెతుకువారు నన్ను కనుగొనెదరు’** అను దైవ వాక్యమెంతయో నిశ్చయమని యిక ముందువచ్చు సంగతులవల్ల గ్రాహ్యమగును.

# 3. అధ్యాయము

మిషనరీ యుద్యమ ఫలితము; నూరేండ్ల పత్రిక; పత్రికల విలువ; గంజాంజిల్లా పూర్వపరిస్థితులు; అపాయ విమోచనము; కృతప్రతిజ్ఞా సాధనము.

**"దేవు డెవరిని ముందుగా ఎరిగెనో వారిని ముందుగా నిర్ణయించెను. ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగ దీర్చెనో వారిని మహిమపరచెను." రోమా 8: 29-30.**

సంకల్పసిద్ధుడైన భగవంతుడు తన చిత్తానుసార కార్యక్రమము జరిగించు విధము అగమ్యగోచరము, తన ప్రత్యక్షతలు నానా విధములు.

---♦--- ♦---♦---

## మిషనరీ యుద్యమము :-

మిషనరీప్రయత్నములు దేశమున వ్యాప్తమగుచుండెను. కలకత్తా దరి **"సిరంపురము"**న జేరిన విలియం కేరీ 1800 సంవత్సరమున సిరంపురం చేరి కొన్ని పత్రికలు, బైబిలు గ్రంథ భాషాంతరములు ఆంధ్ర భాషను గూడ జేసి కొన్నిటిని ముద్రణము గావించి వ్యాపింప జేసెను. *లండన్ మిషన్ సోసైటీ వారిచే,పంపబడి 1805 సంవత్సరము విశాఖపట్టణము చేరిన రెవ. డెసగ్రాంజిస్ దొరగారు ఆంధ్రభాష నేర్చుకొని 1810 సం॥ ఆగష్టు 12వ తేదీని మృతి జెందక ముందు మత్తయి, మార్కు, లూకా సువార్తలను దెనిగించిరి.అవి1812సం॥ సిరంపురమున అచ్చు వేయబడినవి. ప్రిచెట్ అను ఇంకొక మిషనెరీ విశాఖపట్టణమున నూతననిబంధన నాంధ్రీకరింప, 1819 వ సంవత్సరమది చెన్నపురిలో నచ్చువేయబడెను. 1829వ సం॥ చెన్నపురిలో బైబిలుసొసైటీ వారు బహుశ దానినే తిరిగి ముద్రించిరి. ఈ ముద్రణము వలన గలిగిన యమోఘ ఫలితవిషయము తరువాత జూచెదము. విశాఖపట్టణమునకు వచ్చిన మిషనెరీలు ప్రారంభముననే చనిపోయిరి. కటకము నుండి చెన్నపురి వరకు గల విశాల ప్రదేశమున సువార్తోదయ మింక దగిన రీతి జరిగి యుండలేదు. రోమను కథోలికులు మాత్రము ఆయా స్థలములలో నుండిరి.

* "History & Origin of the Missionary Societies" Vol II Page 214

## పటాలపు దొరల దైవభక్తి :-

దేశ క్షేమార్థమును, పితూరీలు తరుచుగా లేచుచుండుట చేతను ఈస్టిండియా కంపెనీవారు విజయనగరము, శ్రీకాకుళము, బరంపురము మున్నగు పట్టణములలో పటాలములను నిల్పియుండిరి. శ్రీకాకుళములో 41వ బటాలముండెను. మేజర్ బక్స్టర్, కేప్టన్ కీటింగు, జనరల్ టెయిలర్, లెఫ్టినెంట్ ఫెయిర్, కేప్టన్ కేంబెల్, కేప్టెన్ రిచ్చర్డ్సన్, ఆడ్జుటాంట్ ఎలివిన్ మొదలగు దైవభక్తి పరులైన యాంగ్లేయోద్యోగీయులు పటాల సంబంధమైన కార్యములలో నుండియు, వారలే విద్యా వ్యాప్తికి, సువార్త గ్రంథ ప్రచారమునకు దోడ్పడుచుండిరి. మేజర్ బ్రేట్ (Major Brett) అను మహా భక్తుడు విశాఖ పట్టణములో నుండెను.

## 9వ నెంబరు క్రైస్తవ పత్రిక - హీల్‌దొరగారు :-

రాతి యక్షరములతో మోటురకపు కాగితములపై యచ్చుపడి **'క్రీస్తుమతగురువులు ఈ సీమ సమస్త జనులకు వ్రాసిన పత్రికలి"** యను శీర్షికతో ఉన్న 9వ నెంబరు పత్రికను 1825 సం॥ పురుషోత్తముచౌధరిగారికి విద్యావంతులైన వారి అన్నయగు జగన్నాధ చౌధరిగారిచ్చి యుండిరి. ఆ దినములలో పురుషోత్తము చౌధరీ గారు దాని చదివినను దాని సారాంశము గ్రహింప లేక దానిని తన పెట్టెలో పడవేసిరి. భగవత్ప్రేరితుండుగా వెళ్ళెనో యన నాకాలమున పర్లాకిమిడిలో సర్వే కార్యమున నుండిన లెఫ్టినెంటు హిల్ (Lieutnenaut Hill) అను ఇంజనీయరు మదనాపుర ప్రాంతమున కొండలు కొలుచుటకు వెళ్ళగా ఆ శ్వేతముఖిని దర్శన మొక విద్యుత్సారమువలె పురుషోత్తముచౌధరికి దట్టి వెంటనే యేడేండ్ల క్రిందట తాను పెట్టెలో వేదాంత గ్రంథ సముదాయమున దాచియుంచిన పై క్రైస్తవ పత్రిక జ్ఞాపకమునకు వచ్చెను. అదియే దేవు డాయనను దర్శించుట! వెంటనే ఆయన పెట్టెలు వెతకి దానిని బైటకి తీసి తిరిగి చదివెను. ముందాయన దానిని జదివినను గ్రహించి యుండలేదు. అందు బరమాత్ముడగు దేవు డొక్కడేయనియు ఇతర దైవము లక్కరకు రావనియు, ఇత్యాది సుభోదలు తేట తెల్లముగ నున్నవి. ఆ పత్రిక నుండి ఆ కాలపు భాషా శైలితోను, అచ్చు పొరబాట్లతోను ఉన్నది యున్నట్లే యొకటి రెండు భాగముల నీ క్రింద వివరించుచున్నాము.

* ఈ పత్రిక 1902సం॥ మే 22 తేదిని కటకపురిలో పురుషోత్తముగారి రికార్డులు వెతుకుచుండగా లభించి కుటుంబమువారి యొద్ద దాచబడి యున్నది.

"సర్వలోక దయాపరుడైన కర్తని ఆజ్ఞ ప్రకారము మోక్షంపొందె మార్గమును బోధించె గురువులైన మేము యీ దేశమందు వాసముగా వుండె జనులందరికిని చేసెటి ఆశీర్వాదము – మిమ్మును అజ్ఞానములో నుంచి రక్షించి గతిపొందె మార్గానికి లోపడచాయ వలెననే యిచ్ఛచేత మేము మీకు వ్రాసిపంపిన పత్రిక యేమంటే:–

"................. ..................... ..................... దేవుడొకడె దేవునికీ మనుష్యులకూ మధ్యస్త గాడైన వాడొకడె. ఇతడే మనుష్యుడైన యేసుక్రీస్తువు ...... యీ కర్తుడైన యేసునకు యితర సకల మనుష్యుల కంటే కలిగిన శ్లాఘ్యములు యేవని తెలియ వలెనంటే యితడు వకడు మాత్రమే పరిచ్ఛేదముగా పాపము లేనివాడై వున్నాడు. తానె దేవుని కుమారుడు; తాను మనుష్యావతారమును దాల్చి యేసువనే నామమును ధరించుకొని ముప్పదిమూడు సంవత్సరములు భూలోకమందుండి యీ సుకృతమైన సత్యవేదమును బోధించెను. తన బోధ నిజమైవున్నదని దానికి సాక్షిగా అనేక ఆశ్చర్యములను చేసి మోక్షమును వుడికే జనానికి వుత్తమ పథ జాడగా నడిచెను. అతడు తన పరిపూర్ణమైన కృపనుంచి తనను వప్పగించిచ్చి అపరాధము లేక హింసపడి మరణము పొంది సకలమైన మనుష్యుల పాపముల కొరకు దేవునికి ఉత్తరవాదము చేసి అతనికీ మనుష్యులకూ అనుకూలము చేసి సకలమైన దౌర్భగ్యములో నుంచి మనుష్యులను రక్షించి వాండ్లకు పాపపు పరిహారమున్నూ, మోక్షమునున్నూ కలుగ జేసివున్నాడు. తాను దేవుని కుమారుడై అతని వల్ల మనుష్యులకు పంపించబడ్డ రక్షకుడై వున్నాడనెటందుకు వుపసాక్షిగా అతడు జీవమును విడిచి మరణము పొంది మూడవ దినమందు మళ్ళీ ప్రాణముతో లేచి నలభై దినముల పరియంత్రానికి తనను అనేక జనులకు దర్శనం చేయించెను. అంత్యమందు అతడు తన శిష్యులకు గురు పట్టమును యిచ్చి వాండ్లకు జగతైక్కడెక్కడా పోనునూ సమస్త జనులకు బోధించనునూ ఆజ్ఞాపించిన తరువాత వాండ్లను వక పర్వతం మీదికి పిలుచుకొని పోయి వాండ్లను ఆశీర్వదించి వాండ్లు చూస్తుయుండగానే సమస్తుల ముందర మహిమ తోటి మోక్షానికి పోయెను .... .... "

**“ యీ యిసు క్రీస్తువు నుంచి మనుష్యులు మోక్షమును పొంద వచ్చునే గాని వేరే వకరి నుంచి పొందెవైనము అగుపడలేదు.” యీ నిరూపమును చదివి మోక్షమును పొందెటందుకైన వుపదేశములును యింకా వివరముగా తెలియ ఆశగా వుంటే, వాండ్లు మా వద్దకి వచ్చి ముఖ వచనముగా మాతోటి మాట్లాడుదురు గాక; మీరు అడిగెటి సకల కార్యములకు ప్రత్యుత్తరము చెప్ప నిరంతరము మేము సిద్ధముగా వున్నాము..”**

ఈ పత్రిక చదివిన వెనుక క్రీస్తు మత మెట్టిదియో దాని మూల సిద్ధాంతము లెట్టులుండునో దాని దెలుసు కొనగోరు వారిని ఈ పత్రిక ద్వారా యాహ్వానించుచున్నారుగదా! కర్తవ్యమేమియని పురుషోత్తముచౌధరిగారు చాల తర్జన భర్జన పడి యవధూతాశ్రమముననే నిలువ వలెనను కృతప్రతిజ్ఞ నప్పటికి విడచుకొని, క్రీస్తుమత సిద్ధాంతములను బరిశోధించిన మీదట ఏది యుత్తమమో దాని జేయ దలచిరి. కాబట్టి యది మొదలాయన యీ నూతన మతమును గూర్చి బోగట్టా చేయగా గొందరది మంచి మతమనియు, కొందరు జాతి పోవుననియు జెప్పినను ఆ మాటల నాయన పాటింపక, తన యన్వేషణా పథమున ముందంజ వేసి చనగ బహుశ పటాలపు దొరల వల్ల వ్యాప్తి కాబడిన **“సృష్టి వివరము” “పరమ గతి మార్గము” “సన్మార్గమును జూపే సత్యోపదేశమైన గురుబోధ”** యను నీ మూడు పత్రికలు మాత్రము గ్రామాంతరములో స్నేహితుల యొద్ద లభించెను. వానిని జదివినంత మునుపటి పత్రికలో దనకు దెలిసియుండని సైతానును గూర్చియు క్రీస్తు వలన లభించు మేలును గూర్చియు దెలిసికొనెను. అప్పుడాయనకు తాననుసరించిన బ్రహ్మజ్ఞాన మార్గము కన్న క్రీస్తు మార్గము దొడ్డదిగ దోచెను. **“సత్యోపదేశమైన గురుబోధ”** యను పత్రిక చివర నొక ప్రార్థన వ్రాయబడి యుండెను. పూర్వపు గురుగుహ్య మంత్రోపదేశమువలె అది యుండక పరాత్పరుడగు దేవుని యెడ ప్రేమారస జనిత భావమందు వ్యక్తమైనందున సమ్మతించి పురుషోత్తముగారు హృదయ పూర్వకముగ నా ప్రార్థనను సమ్మతించి **గురుబ్రహ్మాం, గురువిష్ణు:, గురుదేవో మహేశ్వర:। గురుసాక్షాత్ పరబ్రహ్మాం, తస్మ్య శ్రీగురువే నమ:॥** ఇత్యాది విశ్వాసము నా దినము నుండియే పూర్వపక్షము చేసి, గాయత్రీ, సంధ్యావందనాది జపములను వీడి పై పత్రికలోని దైవ ప్రార్థన యందే దీక్షారతులై, దానినే పరమ గురు మంత్రముగ నెంచి, సర్వకాలసర్వావస్థలయందు అనుదినము ముప్పది నలువది యేబది పర్యాయములైన ఆయన దాని పున:శ్చరణ చేయుచుండువారు.

**సత్యమార్గ జిజ్ఞాస:-**

బ్రహ్మ జ్ఞాని యేకేశ్వర వాది జాతిపరిత్యాగి, విగ్రహ ద్వేషియైనను పాప క్షమార్పణ మతనికి మానవ కల్పిత మార్గములలో నెక్కడ గలదు? శ్రేయస్కర, మంగళప్రద మార్గము పాపవాంఛితుల కెటుల దెలియును? దైవనిర్మిత, సమ్యకృత క్రీస్తు మార్గ విషయమైన పరిశీలనమున బడుటతోనే సన్యసింప వలెనను వాంఛ పురుషోత్తము గారి నుండి తొలగ బంధు మిత్రాదుల కానంద జనకముగ నుండినను, ఆయన క్రీస్తు మతాన్వేషణా దీక్షాపరుడై యున్నాడను లోగుట్టు వారికెంత మాత్రము తెలియకుండెను. 1832వ సంవత్సరమాయన యొకసారి విశాఖ పట్టణము వెళ్ళి క్రీస్తుమత విషయము విచారింపగా నెవరో రోమన్ కతోలికుల గుడి ఆయనకు జూపించిరి. అక్కడికి వెళ్ళినపుడొకనితో సంభాషణ సాగెను. కాని ఆ గుడి లోపలి విగ్రహములును, ఆ సంభాషణయు ఆయనకు సరిపడినవి కావు. అప్పటికి మిషనెరీ లెవరు ఆ పురమున లేకుండిరి. అక్కడ లండన్ మిషన్ సొసైటీలో మిషనెరీగ నుండిన రెవ. జేమ్సు డాసను గారా సంవత్సరమే గతించిరి. పదునారేండ్ల ప్రాయముగల వారి కుమారుడగు విల్లియం డాసన్‌గారు తన మేడ యెదుట నాడుకొనుట జూచిరి. కాని యా బాలునికి దన మతాభిప్రాయము లెరిగింప పురుషోత్తముగారు సమ్మతింపక తిరిగి యింటికి వెళ్ళిరి.

**పితూరీమూలమున స్వాగతావకాశము :-**

రసూల్‌దొరగారి రిపోర్టు మేరకు ఇటీవలి పితూరీ కాలమున శ్రీరాజా జగన్నాథ గజపతి నారాయణ దేవు గారు పర్లాకిమిడి సంస్థానమునకు వారసులైయుండ, కోర్టు ఆఫ్ వార్డ్స్ వారి యేర్పాటులకు వ్యతిరేకముగ గజపతి పట్టమహాదేవిగారికిని, రాజమాతయగు స్వగీదేవిగారికిని అభిప్రాయ భేదములు కలిగెను. అప్పటి చెన్నపురి గవర్నరయిన సర్ తామస్ మన్రో దొరగారు 1822 సం॥ జూలై నెలలో పర్లాకిమిడి స్వయముగ దర్శించిరి. ప్రభుత్వ నియమములకు వ్యతిరిక్తులైన కక్షలవారు పర్లాకిమిడి వీధులలోనే హోరాహోరిగా పోరాడిరి. సంస్థానాధిపతి శ్రీ రాజా జగన్నాథగజపతి నారాయణదేవుగారును, ఆయన దేవిగారుయు కోర్టాఫ్ వార్డ్స్ వారి కింద్ర

నుండగోరియు, రాణీ రేఖాచంద్రుడు గారు అను సర్దారును తన యధికారమున నుంచి యుండిరి. రాజ కుటుంబ మందలి తక్కిన వారు బిసోయిాలతో గూడి కొల్లగొట్ట నారంభించిరి. అట్టి స్థితిగతులలో రాజు ప్రచ్ఛన్నుడై యుండగోరి నపుడును, రాణీగారు సర్దారు రేఖానిచంద్రుడుగారికి అధికార మిచ్చి యుండినందునను, ఆ కాలమున నాతడు రాజ నగరమున "సన్మాని" యై 1175* మంది సంస్థానపు సిపాయలను తన యధీనమున నిడికొని, మహా వైభవముతో నుండెను. పర్లాకిమిడిలోని రేఖాని వారి వీధిలో నూరేండ్ల క్రిందట నాతడు కట్టించిన గృహము నేటికిని గలదు. ఒకనాడు వారి గృహమున బురాణ కాలక్షేపము జరుగుచుండెను. పౌరాణికు డేదియో తప్పు చదివెను. పురుషోత్తమ చౌధరిగారా వీధిని వెళ్ళుచు నిల్చి క్షణకాలము పౌరాణికుడేది చదువుచుండెనో విని తప్పు దిద్ది, యా పద్యమో, శ్లోకమో చదువవలసిన క్రమము దెల్పిరి. అది మొదలా యింటి వారికి పురుషోత్తము గారంటే చాలా యభిమానము. ఆయన కంఠస్వరము చాల శ్రావ్యమైనది గనుక పురాణము చదివి యర్థము చెప్పుట కాయనను బలవంత పెట్టువారు. మొన్న మొన్నటి వరకు వృద్ధులగు రేఖాని ముకుందదాసుగారు, పురుషోత్తము చౌధరిగారి రూపు రేఖా విలాస వర్ణనములు చేయుచు పూర్వదినములను గూర్చి చెప్పుచు వచ్చువారు.

* Russel's Report No XXIV, Page 36

## పర్లాకిమిడిలో అధ్యాపకత క్రైస్తవమత చర్చ :-

1832 సంవత్సరము పురుషోత్తముగారు తమ యన్నగారి సెలవుపై పర్లాకిమిడిలో పాఠశాల యొకటి స్థాపించి, రాజు గారి దేవీ మఠములో భోజనము చేసి, రేఖాని చంద్రునిగారి యరుగు మీద బరుండు చుండువారు. ఆ పురమున నుండగా ఒక నాడాయన క్రైస్తవ ధర్మ జిజ్ఞాస విషయికమైన భోగట్టాగల యొక యుత్తరము వ్రాసి ఈ యుత్తరము బరంపుర మందలి ఫాదరీ దొర కిప్పించ వలెనని పై విలాసమిడి, యొక కూలివారిచే దానిని బరంపురమునకు బంపించెను. వాడు దాని దీసికొని పోయి యొక రోమను మతస్థుని కియ్యగా నతడు దాని జదివి తమ ఫాదరీ ప్రస్తుత మక్కడ లేడనియు, విశాఖపట్టణము పోయి యున్నాడనియు, ఆయన పేరు దోన్ జూజే జూమియర్ డి.అట్టాయిడీ (Deun Jeujevier De Attai De) యనియు, వారి కిష్టమయిన నతని వెళ్ళి చూడవచ్చుననియు, లేనియెడ నాయన తిరిగివచ్చు వరకు

దాలిమి చేయవచ్చుననియు, కటకములో గూడ నిద్దరు మిషనెరీ లున్నారనియు, వారిలో నొకరు వచ్చి కొన్నాళ్ళ క్రిందట బరంపురములో పత్రికలు పంచిపెట్టిరనియు, మత విషయములలో వారికిని వీరికిని ఇలాకా లేదనియు దెలియజేసెను. కూలివాడు తెచ్చియిచ్చిన ప్రత్యుత్తరము పురుషోత్తమ చౌధరిగారందుకొని ఆ రోమన్ ఫాదరీయొక్క బారెడు పేరు చదువుకొని నపుడు తనకు విసుగుగా దోచినందున ఆతని సూచన యాయనకు సమ్మతి కాకుండెను. ఆ సంవత్సరమే అనగా 1832 సం॥ జూన్ నెల 20 వ తేదిని శ్రీ విక్టోరియా మహారాణిగారు ఇంగ్లాండు దేశ సింహాసమునకు వచ్చియుండిరి.

## ఆనరబెల్ రస్సెల్ దొరగారి యాగమనము :-

పర్లామికిడి ప్రాంతమున నంటియుండిన పితూరీ 1832, 1833 సంవత్సరములలో హెచ్చుజొచ్చెను. ఈస్టిండియా కంపెనీ దాని నణచుటకై రివిన్యూబోర్డులో సీనియరు మెంబరును వెనుక చెన్నపురి గవర్నరుగారి సభలో సభ్యులునైన ఆనరబిల్ జార్జి ఎడ్వర్డు రస్సెల్దొర (Hon'ble G.E.Russel Esq) గారిని కమిషనరుగ నియమించి పంపగా ఆయన 1833 సం॥ *ఫిబ్రవరి 18వ తేదీని పర్లామికిడి చేరిరి. పురుషోత్తమచౌధరిగారు క్రీస్తు మత విషయమై భోగట్టాచేయుచు ఆయన కొక యర్జీ పంపించి ప్రత్యుత్తరమునకై వేచియుండెను.

* Russel's Report No.XXIV Vol I page 43

పర్లాకిమిడి మత్స్యగృహ పర్వతపాదమున నున్నందున మార్చి నెల నుండియే యెండ వేడిమి విస్తరించును. మిగుల నిర్భయులైన వారే కాని భీతావహచిత్తులెవరైనను పితూరి భయములచే బైట బరుండువారు కారు.

స్ఫురద్రూపియు, మిగుల ఎఱ్ఱని దేహచ్ఛాయయు గల ముప్పదేండ్ల మర్యాద గల గృహస్థొకడు తన దైవిక కృత్యములు నెరవేర్చుకొని, శిష్యవర్గమునకు సెలవిచ్చి, రాత్రి భోజనము చేసి, తన మనమున నిజ రక్షన్వేషణా దీక్షతో దైవ ప్రార్థన చేసికొనుచు, పర్లాకిమిడి లోని రేఖాని వారి గృహమునకు బోయి యథావిధిగా నా యరుగు మీద బరుండి సత్యోపదేశ గురుబోధ యను పత్రికలో గొన్నాళ్ళ క్రిందట చదివిన ప్రార్థననే సాయంసంధ్యగా గావించుకొని, నేడేల యీ యూరికి పటాలము వచ్చినదియో, యేమి

వింత జరుగునో యని యోచించు కొనుచు తనకు లభించిన త్రాణకర్త యేసుప్రభువునే స్మరించుకొని, యాయన యందే భరోసా నిలిపి విశ్రమించెను. ఆయన మన చరిత్ర నాయకుడే.

## ఆపన్నివారణము :-

ఆ దినమున, అనగా 1833 సంవత్సరము మార్చి నెల 9 వ తేదిని శ్రీకాకుళమున నుండిన 41వ (N.I) సిపాయి దళము కేప్టన్ లోగనదొర (Captian Logan) గారి సేనా నాయకత్వమున కమీషనర్ రస్సెల్ (Russel) గారి సహాయార్థము పర్లాకిమిడి చేరెను. (రస్సెల్ రిపోర్టు 43 వ పుట) బహుశ: వారా రాత్రియే పితురీదారులను బట్టుటకు తమ వ్యూహము లేర్పఱచు కొని యేమరి పాటున సర్థార్ రేఖాని చంద్రునిగారిని బట్టు కొనుటకై నడి రేయిని యతని యింటిపై దాడికి వెడలిరి. కొంచెము నిద్రావస్థలో నున్న పురుషోత్తము చౌధరి గారు బైట అరుగుమీదనే పరుండియుండినందున వారీచప్పుడు విని లేచి అలనాడు సిరియనుల జేత చిక్కిన యెహోషాపాతు రాజువలె (1 రాజులు 22: 32-33.) దప్పించుకొననై యుండగా, ఒక భటుడు లాఠీకఱ్ఱతో కొట్టినందున కుడిచేతితో ఆపుకొనుటలో చిటికిన వ్రేలికి దెబ్బతగిలి యది వంగిపోయెను. పురుషోత్తముగారు మొఱ్ఱో నేను పితూరీ దారును కానని యెంత చెప్పినను వారు నమ్మక, కమిషనరు రస్సెల్ గారి యెదుట కాయనను కొనిపోయిరి. పురుషోత్తముని డిఫెన్సు రస్సెల్ గారు వినినప్పుడాయన తనకు అర్జీ పెట్టియుండిన క్రీస్తు మతాన్వేషి యని నిజమెఱిగి ఆయనను వదలి వేసిరి. ఒక పితూరీదారుని యింట దొరకిన వ్యక్తిని విడుచుట సాధ్యము గాదు కాని, యొక క్రీస్తు మతాన్వేషి పితూరీ దారులలో నుండడని యా ప్రభుత్యోద్యోగి యభిప్రాయ పడుట దైవాత్మ ప్రేరితము కాక యింకేమి యగును? దేవుడాయనను నడిపింపనై యుండిన మార్గము వేరుగనుండగా సర్కారు సైన్యావళి ఆయనను బంధింపలేదు కదా! హేరోదు రాజు బారినుండి అలనాడు పేతురును విడిపించిన ప్రభువే పురుషోత్తముచౌధరి కవిని గూడ నొక మహత్కార్య నిర్వహణ నిమిత్తము ఆశ్చర్యకరముగ విడిపించెను. ఆ రాత్రి యా నొప్పితో యాయన యెంతో బాధపడెనో కదా! దెబ్బ తగిలి వంగిన వ్రేలు మాత్రము చిరకాల మటులనే యుండెను. ఆ కాలపుపిల్లలు కొందరొక వ్రేలువంచి ఆయనతో నవ్వులాడుచు "తాతా సలాం"

అను వారలని నేటికిని జెప్పుదురు. ఈ సంఘటనము విషయము పురుషోత్తముగారు మా తండ్రిగారికిని, విశాఖపట్టణ మందలి కీర్తి స్టీవెన్ గారికిని జెప్పియుండ వారి ద్వారా వింటిమి.

చేతికి దెబ్బతగిలి వ్రేలు విరిగిన విరిగినది కాని తమకు కమిషనరు ఎడ్వర్డు రస్సెల్ గారు క్రీస్తుమత గూఢాంశములు తెలుపలేక పోయిరి కదా! యను నిస్పృహ మన చౌధరిగారికి నుండియుండక పోలేదు.

**"శ్రేయాంశీ బహు విఘ్నాని"** యను లోకొక్తి ననుసరించి తమ మత విషయిక మయిన బోగట్టాలలో గలుగుచు వచ్చిన సత్కార్య విఫలత లాయననింక స్థిరత రావస్థకు నడిపించుట కేయని మనము గ్రహించెదము.

## చెన్నపురి ప్రయాణ సన్నాహము :-

మోషే ........... ఐగుప్తు ధనము కంటే క్రీస్తు విషయమయిన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని, అల్పకాలము పాప భోగ మనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమానుభవము మేలని యెంచి, ఫరో కుమార్తె కుమారు డనిపించుకొనుట కొప్పుకొనలేదు. (హెబ్రీ 11: 24-26) పురుషోత్తమచౌధరిగారు యీ విధముననే పర్లాకిమిడి రాజాశ్రమము కన్న క్రీస్తు వారి యండ నుండి సేవా నిమగ్నులైయుండ దృఢ నిశ్చయతబూని, అధైర్యపడక యహర్నిశలు చింతిపంగా తుదికొక సదుపాయమాయనకు దోచెను. అప్పుడు చెన్నపట్టణములో దక్కదక్కిన యీ మధ్య ప్రదేశమున నొక ప్రోటెస్టంటు మిషనెరీయైనను బోధకుడైనను లేకుండెను. కావున నేలాగైనను తన యాత్మ వాంఛించు నిజగురు సందర్శనా భాగ్యము బొంది యా యేసుక్రీస్తు ప్రభుని చారుపురావృత్తమును గూర్చిన విశేష సంగతులు నేర్చుకొనుటకు దాను చెన్నపట్టణమైన పోయి తీరెదనియు, అంతదూర మేలాగు పోవనగునో యనియు నుపాయము లాయన అన్వేషించు చుండెను.

క్రీస్తు మత మవలంభించిన వారాకాలమున నా ప్రాంతమున నెవ్వరు లేకపోయినను "జాతిదొరలు" క్రీస్తు మతావలంబకులనియు వారికి మడితడి జపము తపము లుండవనియు, మాలా మీలాయను భేదముండదనియు, యధేచ్ఛగా పంచములచేత వంటవార్పులు చేయించుకొను చున్నారనియు, క్రీస్తు మత ప్రవేశము

చేత వర్ణ సంకరమయి పోవుననియు, క్రమేణ విగ్రహాలయములు నిర్మూలమై, అర్చకాదివృత్తులు పడిపోయి తమ ధనాకర్ష మార్గములు పోవుననియు, భయపడిన కొందరు క్రీస్తు మతము **"**మాలమత" మనియు మతములో బ్రవేశించువారి నోట ఉమ్మివేయుదురనియు నోట గొడ్డు మాంసపు తునకలు, గ్రుక్కెదరనియు, ఈ దేశమున బ్రాహ్మణులు ప్రాణ ప్రతిష్టలు చేసి నిల్పియుంచిన విగ్రహములు దేవుళ్ళు కావను వారి కండ్లు ప్రేలిపోవుననియు, ఇత్యాది యనృత కల్పనను మాత్రము ప్రజలలో బలీయముగ జొప్పించి యుండిరి.

విద్యా విహీనులవలె నిష్టాగరిష్టులైన విద్యావంతులును,ఛాందసులును సనాతన ధర్మమే దేశమున నిలుపవలెనుకాని, ***"జాతులవారి"*** యాచారములు మాకు నచ్చివచ్చునవి కావనియు, నానావిధములు దూషణలాడు వారాకాలముననను యుండిరి. కావున క్రీస్తుమతము పేరే మా యింట విన సహింప గూడనిదగ నుండెను. పురుషోత్తముచౌధరి యన్నగారగు జగన్నాధచౌధరిగారు గొప్ప శాస్త్రవేత్త, పౌరాణికుడు, చాల గ్రామములును పన్నెండు గ్రూపులును గల తెంబూరు ముఠా మిరాసీదారు; రాజకార్య ధురీణుడు తండ్రి తదనంతరము వీరి యాజ్ఞానుబద్ధులుగానే పురుషోత్తము చౌధరిగారు భగద్విషయమున దక్క తక్కిన యావద్విషయములలో అన్నగారి వాక్యములను శిరసావహించు వారు, కుటుంబ వ్యయములన్నియు జగన్నాధచౌధరిగారి చేతి మీదనే జరుగుచుండెను.

పర్లాకిమిడిలో శిష్యవర్గము ద్వారా బడి జీతములో లభించిన యొక్క రూపాయి మాత్రము మన కధానాయకుడు మిగిలించుకొన గలిగి దానిని తన ధోవతి (పరిధానము) యొక్క వెనుక చెంగున గట్టి, దోపుకొనుచు, నెవ్వరికిని దెలియనీయకుండెను. స్థలాంతరము వెళ్ళు సావకాశము లభించునపుడు చెన్నపురికి వెళ్ళు మార్గమున నా రూకతో గొన్నాళ్ళు కాలక్షేపము చేసికొని, మొగమెఱుగని యపరిచిత దేశమున భిక్ష చేసి కొనియైన యా నాలుగైదు వందల మైళ్ళు ప్రయాణము సాగించి చెన్నపురి జేరి యచ్చటి ఫాదరీలను సంప్రదించి, క్రీస్తు మత విషయమై యాప్సితసిద్ధి నొందుటకై యాయన దృఢసంకల్పమై యుండెను.

## అమోఘ సావకాశ లభ్యము :-

"ఆడబోయిన తీర్థమెదురాయె" నన్నట్లు దైవ సంకల్పవశాత్తుగా ప్రయాణము తలబెట్టుకొనిన యొకటి రెండు దినములలోనే జగన్నాథచౌధరిగారు కోర్టు పనిమీద శ్రీకాకుళము వెళ్ళవలసివచ్చెను. పురుషోత్తముగారు బహుశ: 1833 సం॥ ఏప్రిల్ నెలలో పర్లాకిమిడి నుండి మదనాపురము వెళ్ళియుండెను. అన్నగారు చేయవలసిన కార్యమును తానే నిర్వహించుకొని వచ్చెదనని నచ్చజెప్పి కొందరు బంధువులతో నాయన శ్రీకాకుళము బయలు వెడలెను. అచ్చట ఆయన చేయవలసిన కార్యము నిర్వహించు, బంధువులను ముందుగా పంపించివేసెను. ఆయన తన వెనుక కట్టుచెంగులో దాచిన రూపాయి ఆలాగే యుండెను. తనకు ముందు దొరికిన నాలుగు పత్రికలును బరంపురము నుండి రోమన్ మతస్తుడు వ్రాసిన యుత్తరమును రసూల్‌దొరగారికి, పంపించిన అర్జీ నకలును ఆయన తనతో దీసికొని వెళ్ళెను.

# 4. అధ్యాయము

హెలెన్ నాట్ దొరసానిగారు, అడ్జుటాంటు ఎవిలిన్‌గారు , మేజరు బ్రేట్‌దొరగార్ల పరిచయము. పురుషోత్తముగారి దృఢనిశ్చయత, జ్యేష్ఠసోదరుని ప్రలాపము, గృహాగమనము, భార్య యొక్క ప్రథమాగమనము ప్రత్యాగమనము, విశాఖపట్టణము చనుట, కటకపురి యాత్ర, క్రైస్తవ మత స్వీకారము.

**" అబ్రహాము........... విశ్వాసమును బట్టి ఆ పిలుపుకు లోబడి తాను స్వాస్థ్యముగా బొందనైయున్న ప్రదేశమునకు బైలు వెళ్ళెను" హెబ్రీ 11: 8.**

దేవుని యొద్ద నుండి మహత్కార్యములను నిరీక్షించి దేవుని కొరకు మహత్కార్యములను బూనిన విల్లియం కేరీదొరగారి జీవితాస్తమయ సమయము సమీపించిన దినములలో భారతదేశము కొర్కైన వారి మిషనెరీ ప్రయత్న ఫలితములు ఫలప్రదములగు చుండెను.

---♦--- ♦---♦---

## హెలెన్‌నాట్ (Helen Knott) దొరసారిగారి ద్వారా మతోపదేశము:-

నాగావళీ నదీతీరమున శ్రీకాకుళమున నిప్పుడున్న మిషనెరీల బంగాళాకు దిగువగానున్న 'బలగ' యను పేటలో నదీ తీరమున పటాలపు దొరల మేడలుండెను. అందు భక్తిగల దొరలు, దొరసానులు నివసించు చుండిరి. క్రీస్తు మతమును గురించి యెరిగిన వారచ్చట ఎవరైన నుందురేమోయని జిజ్ఞాస చేసి తరువాత చెన్నపురి ప్రయాణము సాగించుట కొక తలంపు పురుషోత్తము చౌధరిగారిలో జనించెను.

ఆ ప్రకారమాయన విచారణ చేయగా, కేప్టెన్ నాట్‌దొరగారి సతీమణి హెలెన్‌నాట్ (Helen Knott) అను పటాలపు దొరసానిగారా పురమున రెండు ఆంధ్ర బాలికా పాఠశాలలు నెలకొల్పి, విద్యాభ్యాసము చేయించుచుండి నటులను, క్రైస్తవ మత సంబంధమైన పత్రికలు పంచి పెట్టుచుండినటులను ధర్మగుణ మణియును, దొడ్డ దొరసాని యునియును దెలిసికొనిరి. అప్పుడాయన మనోల్లాసముతోను ముఖ వికాసముతోను నిండి, క్రైస్తవ మత విషయమై తన హృదయ వాంఛితముల నామెకు దెలియజేసికొనుటకు కోరిక గలవారైరి. 1833 వ సంవత్సరము ఏప్రిల్

నెలలో ఒకనాడు పగలు పన్నెండు గంటలప్పుడు పురుషోత్తమచౌధరిగారు హెలెన్‌నాట్ సతి మేడ యొద్దకు బోయి, ప్రవేశద్వారము యొద్ద నిలువబడిరి. ఎండ హోరున గాయుచు, వడగాలి భోరున వీయుచు ఆయన మీద ఈవలి జల్లుచుండెను. ఎండలో నిలువ బడియుండగా కొంచము సేపయిన తరువాత ఆమె కిటికి రెక్కల సందు నుండి పురుషోత్తముని జూచి, లోపలికి రండని యా దయగల దొరసానిగారు వర్తమానమంపించెను. ఆయన వెళ్ళి సలామిచ్చిన తరువాత ఆయన యెవరో వెళ్ళినకతంబేమియో యని యాతని స్థితినంతటిని గురించి హిందూస్థానీ భాషలో అడిగిరి. ఆయన గొంతమట్టుకు దెలియ జేసిన తరువాత "హిందూమత దైవపరీక్ష" యను పత్రికను ఆయనకిచ్చి మరునాడు రమ్మనిరి. పురుషోత్తము సత్య మతాన్వేషి బసకుబోయి, దానింజదివి మరికొంత తెలివి పొంది, మరునాడు వెళ్ళి క్రీస్తు మత మందు వారికి గల తాత్పర్యమంతా తెలియజేసిరి. దొరసానిగా రాయనను నమ్మక యేదియో మిష చేత వెళ్ళినట్టు భావించి మాట్లాడిరి. అప్పుడు పురుషోత్తముచౌధరిగారు తన పూర్వపు స్థితిని ఆత్మ రక్షణార్థమై తాము పడిన పాట్లన్నిటిని అమూలాగ్రముగ నామెకు దెలిపి, తమ యొద్దనున్న పత్రికలను, రోమన్ మతస్థుడు బరంపురము నుండి వారికి వ్రాసిన యుత్తరమును, మాన్యాస్పదులైన రసూల్‌దొర గారికి తాము పంపించిన యర్జీ నకలును ఆమె యెదుట నుంచగా, ఆమె వానిని జదివించి, సంతోషపడి నమ్మిరి. అప్పుడాదొరసానిగారు క్రీస్తు మతము నవలంబించు నెడ సంభవింపబోవు కష్ట నష్టములను, ఉపద్రవములను, శోధన బాధలను ఆయనకు తెలియజేసి గట్టిగా పరీక్షింపగా వాని నన్నిటిని దేవుని కృపవల్ల సహించుకొందునని పురుషోత్తము చౌధరిగారు మారు చెప్పిరి. ఆమె యానందచిత్తయై, మరికొన్ని పత్రికలను **"లూకా శుభవార్తమానము"** **"మోక్షయాత్ర"** యను పుస్తకములిచ్చి, కొంత హితోపదేశముచేసి, దినదినము రావలెననియు, పుస్తకములు బాగుగ చదివి నూతనాంశములు తెలిసికొన వలననియు జెప్పిరి. పురుషోత్తముగారెంతయు సంతసించి తన కత్యంతాదరము జూపిన యా యాంగ్లేయ లేమ యెడ కృతజ్ఞుడై, నిరుపేదకు నిక్షేపము లభించినటుల చిరునగవుతో బసకు బోయి, వానిని జదివి, పూర్వము సృష్టముగ దెలియని సంగతులు చక్కగా దెలిసికొనిరి. మరియు పాపమిటువంటిదనియు దాము చేసిన యే సత్కార్యము వల్లనైన నది పరిహరింప బడదనియు దాని పరిహారార్థము పరమేశ్వరుడే తన నిర్హేతుక జాయమన

కటాక్షము చేత యేసుక్రీస్తు నారవతారధారియైన తన కుమారుని బంపెననియు, **'ఆయన రక్తము చిందించి ప్రాయశ్చిత్త బలియై, తన పుణ్యము వల్ల పాపిని పుణ్యవంతునిగ జేసి రక్షించుననియు, నీ మున్నగు ముఖ్యాంశములు కొన్ని యాయనకు బోధపడినవి. అంతట మన సత్యాన్వేషిలో సంతసము జనించి క్రీస్తును వెంబడింప వలెనను దృఢనిశ్చయత మరింత వృద్ధి జెందెను."**

## అడ్జుటాంట్ ఎవిలిన్ దొరగారి ప్రేమాదరము :-

ఒకనాటి ఉదయమున నాట్ దొరసానిగారు ఈ మన నూతన మతాన్వేషి నచటనున్న పటాలములోని అడ్జుటాంట్ ఎవిలిన్‌దొరగారి యొద్దకు పంపిరి. ఆ దొరగా రాయనతో సంభాషించి " చెన్నపట్టణము లోనున్న ఫాదిరీ దొరల యొద్దకు నేను మిమ్మును ఓడమీద బంపెదను వెళ్ళెదరా?" అని యడుగ పురుషోత్తముచౌధరిగారు మిక్కిలి సంతోషపడి, "చెన్నపట్టణమునే కాదు, మరి యెక్కడికి బంపించినను వెళ్ల సిద్ధమైయున్నానని తెల్పిరి. అప్పుడా దొరగారు సంతోషములో ఆకాశము వైపు చూచి, "యీ చీకటిగల దేశమున దేవుడొక దీపము ముట్టించినాడని నేననుకొనుచున్నాను" అని పలికి, ఆయన వంక జూచి "మీకు బంధువలెవరైన నున్నారా?" యని ప్రశ్నించెను. ఉన్నారని పురుషోత్తముగారు చెప్పిరి. "మీరు చేయబోవునది వారికి తెలియునా? అని దొరగారడిగిరి "తెలియదని" యాయన మారు చెప్పెను. ఇప్పుడైనను వారికి దెలియ జేయుటకు మీకిష్టమా? లేదా? యని తిరిగి యా దొరగారడిగిరి. మీకేది బాగుగ నుండునని తోచునో దానిని నేను చేయుదను అని యాయన ప్రతి చెప్పెను. " మీరు వారికి దెలియ జేయుట మంచిది; మీరొక యుత్తరము వ్రాయ వచ్చును, దానిని పట్టుకొని వెళ్ళు మనిషికి కూలి యంత యగునో నేను దాని ఇచ్చెదనని" ఎవిలిన్‌దొర గారన్నందున పురుషోత్తముచౌధరీగారు తమ యన్నగారైన జగన్నాధచౌధరీగారికొక లేఖ వ్రాసిపంపిరి.

## జ్యేష్ఠ సోదరుని ఆక్రందనము :-

జగన్నాధ చౌధరిగారు దాని జదువుకొనినంత గుండెలు జారి యాయనయును, కళ్లికోట అస్థాన పండితుడుగ నుండిన రామకృష్ణ కాళీమహంతిగారు మున్నగు బంధువులును చాల దు:ఖముతో బరుగిడి వెళ్ళిరి. వారు పురుషోత్తము గారిని

ఆలింగనము చేసికొని యేడ్చి, క్రీస్తు మతము లోనికి వెళ్ళవద్దని యెంతయో బ్రతిమాలిరి. వారు తమ దు:ఖముచే ఆయనను వశపరచుకొన జాలక నాట్ దొరసానిగారి మేడ యొద్ద కాయనను దీసికొని వెళ్ళి ఆమెతో మిక్కిలి ఘర్షణచేసిరి. ఉభయత్ర చాల సంభాషణలు జరిగెను. జగన్నాధ చౌధరిగారు దుర్భర దు:ఖ బాధితుడై హెలెన్ నాట్ దొరసాని యెదుట తన తల పగులగొట్టుకొని చచ్చెదనని యొక రాయి యెత్తుకొనిరి. తుదకు దొరసానిగారు పురుషోత్తముగారు వారి వశమందప్పగించి, ఆయన క్రీస్తు మతమును గురించి యెంతకాలము నుంచి ప్రయత్నము చేయుచుండెనో ఆ రహస్యమంతా వారికి దెలియ బడుటకు బరంపురం ఉత్తరము మొదలయినవన్నియు వారి చేతికి సమర్పించిరి. వారు వానిని జదివి యాశ్చర్యమగ్నులై నాట్ దొరసానిగారితో సంభాషణ చాలించి. పురుషోత్తముగారినే నిందింప నారంభించిరి. ఆయన యన్నగారు దు:ఖము భరింపలేక యాతని కాళ్ళ మీద సాగిలబడి గట్టిగా బట్టుకొని “ఓ నాయనుంగు తమ్ముడా? ఓ నా యేక సోదరుడా? హా! నేనేమి చేతునురా! హా! నే నెటులనోర్తునురా? యని మిక్కిలి ధ్వనిచేసి యేడ్చి, వసనాభి విషము తిని చచ్చిపోయెదనని బజారు వైపునకు వెళ్ళిరి. తక్కిన బంధువులాయనను చాల దూషించి, బహు విధములుగ మాట్లాడి యాయన మనస్సును కదిలింప లేక విడిచిపోయిరి. ఆ పగలంతయు వారికి భోజనపానములు లేక యుండెను. సాయంకాలము సరికి ఆయన యన్నయును, ఒక బంధువుడును తిరిగి యాతని బస యొద్దకు వెళ్ళిరి. ఇప్పుడు వారొక కుయుక్తి చేత ఆయనను వశపరచుకొన దలచి జగన్నాధముగారు కన్నీరు మున్నీరుగ ఏడ్చి దీనధోరణిని తమ్ముడా నిన్నుగన్న మన తల్లియు, నీ భార్యయు, నీవు పంపిన యుత్తరము విన్నది మొదలుకొని అన్నపానాలు పుచ్చుకొనక బహు దు:ఖక్రాంతులై యింటి యొద్ద పడియున్నారు. వారి కన్నులకు మాత్రము నీవు కనబడి తిరిగి వెళ్ళి రావచ్చును. కనుక నీవు మాతో ఇంటికి రావలెనని చాల దు:ఖముతో అనేక విధములుగ బోధించెను. కన్నీరు కారుట జూచిన రాళ్ళ వంటి హృదయములైనను నీళ్ళు కాకుండునా? అన్నగారి దీనాలాపములు విని మన సత్యాన్వేషి కొంచము ఆలోచన చేసి, వచ్చెదనని వాగ్దాన మిడెను. అప్పుడాయన యన్నగారికి కొంత యోదార్పు దొరకెను. ఆ రాత్రివారు వంతమాని వంట చేసికొని భోజనము చేసిరి. పురుషోత్తముగారు నాట్ దొరసాని యొద్దకు వెళ్ళి సంగతియంతా తెలియజేసి తమ యూరికి వెళ్లి తిరిగి యెనిమిది రోజులలో

వచ్చెదనని సెలవు గైకొని మరునాటి ఉదయము అన్నగారితోను, బంధువులతోను ప్రయాణోన్ముఖులై శ్రీకాకుళమున కిరువది మైళ్ళు దూరముననున్న మదనాపురమను స్వగ్రామమునకు వెళ్ళిరి.

## పురుషోత్తముగారి మాతృ దర్శనము:-

అప్పుడాయన తల్లియు, భార్యయు ఆయనను జూచి కంటికి నేలకు నేకధారగ రోదనము లిడిరి. మరియు ననేక మంది బంధు బృందములును, స్నేహితశ్రేణియు, తదితరులును, ఆయనను జుట్టుకొని వారివారి నోటికి వచ్చినట్లు అనేక విధములుగ మాటలాడిరి; కొందరు నిందించిరి; కొందరు గద్దించిరి; కొందరు దూషించిరి. కొందఱాయనను కట్టి పెట్టి యొక యింటిలో మూసియుంచుట కాలోచించిరి.

## బంధు నిర్భంధ విముక్తి :-

చివరకు వారి యత్నములన్నియు నిష్ఫలములాయెను. ఏలనన; నింతకు ముందాయన నేర్పు పొందియున్న ప్రకారమాయన సాధువర్తనుడై యుండుటను బట్టి ఆయన మరల వారి దయాప్రాప్తి నొందెను. ఆయన భార్యయైన రాధామణిచౌధురాణిగారాయనతో వెళ్ళుటకు యత్నించి యిదిగో రేపు అదిగో మాపు వెళ్ళుదమని చెప్పుచు వచ్చినందున పదునాలుగు దినములు గడచెను. అంతట మనకవి త్వరపడుటచే ఆయన ధర్మపత్నియు రమారమి రెండేండ్ల ప్రాయము గల తమ ప్రథమ సంజాత **శాంతికుమారి** చౌధరిగారిని మరి యొక బంధువును మాత్రము వెంటబెట్టుకుని శ్రీకాకుళము చేరిరి. పురుషోత్తముగారు అప్పటికి జాతిని పరిత్యజించి యుండనందున బంధువు లేదియో యాలోచించుకొని, యామెను నిరాయాసముగా విడిచిపెట్టిరి. ఆమె నిమిత్తమే యా బంధువును దోడిచ్చిరి. వారు శ్రీకాకుళము చేరినను, రాధామణిదేవిగారి మనస్సు కుదురుబాటు లేక దిగులుపడి స్వబంధువుల యొద్దకు తిరిగి పోవుట కభిముఖము దాల్చెను. ఇది యిట్లుండ గడువు తీరినది నుండి హెలెన్‌నాట్ దొరసానిగారు పురుషోత్తముగారి సత్యాన్వేషి రాక యాలస్యమై నందున ఆయన యేమైపోయెనో యని విచారపడి, ఆయన కొక యుత్తరము వ్రాయించి అందు వేరొక తెల్ల కాగితమును ఒక రూపాయిని బిడాయించి, ఆయన యూరికి వెళ్ళి ఆ యుత్తరము రహస్యముగ ఆయన కిచ్చి వచ్చుట కిద్దరు మనుష్యులను బంపించిరి. ఆ యుత్తరము పట్టుకొని వెళ్ళిన

మనుష్యులా గ్రామము పేరు తెలియక, తిరిగి,తిరిగి, పురుషోత్తమచౌధరి ఆయన భార్యయు శ్రీకాకుళమున బ్రవేశించినాడే, వారు కూడ జేరి దైవవశాత్తుగా ఆయనను కనుగొని, ఆయనను వారు ముందు నాట్ దొరసానిగారి బసలో జూచియుండుట చేత బోల్చి ఆ యుత్తర మాయన కిచ్చిరి. ఆయన, దానిని విప్పి చదువుగా నందలి ముఖ్య సంగతులు లిట్లుండెను:–

శ్రీకాకుళము

మే 1833

బాబు పురుషోత్తముచౌధరి గారికి – అర్యా! గడువు తీరినది నుండి మేము మీ రాకకై ప్రతిక్షణము ప్రతీక్షించుచున్నాము మిమ్మును మీ బంధువులు నిర్బదించుచున్న యెడల నేను పంపించిన యీ తెల్లకాగితము పై కలెక్టరు దొరగారికి అర్జీ వ్రాసి దాని ఈ మనుష్యుల ద్వారా నా యొద్దకు పంపిన నేనాయనకాయర్జీ యందజేయించి ఆ నిర్బంధము నుంచి మిమ్మును విడిపించెదను. మీ రేదియో యొక యుపాయము చేసుకొని రహస్యముగ తప్పించుకొని వచ్చుటకు మార్గము కనిపించిన, దాని నా పేర వ్రాసిన యెడల, ఒక సవారీనైనను గుఱ్ఱమునైనను రహస్యముగ బంపించెదను, అందుపైని మీరు త్వరగా రావచ్చును. ఇందులో బిడాయించిన రూపాయి మీ ఖర్చుకొరకు ఉపయోగించండి.

ఇట్లు

**హెలెన్‌నాట్**

## ఆయన భార్య యొక్క ప్రత్యాగమనము :–

ఈ యుత్తరమును చదివి నంతట ఆ దొరసానిగారికి తన యెడ నుండిన దయయు, క్రైస్తవ పక్షమును పురుషోత్తముచౌధరిగారు గ్రహించి చాల సంతోషించెను.

నాట్ దొరసానికి తాము ప్రవేశించిన సంగతి పురుషోత్తముగారు తెలియ జేయగనే ఆమె యొక సవారిపైని వారి యొద్దకు వెళ్ళి జయశీలురై వచ్చిన ఆ మతాన్వేషిని, ఆయన ధర్మపత్నియైన రాధామణి చౌధురాణిగారిని, వారి చిన్న కుమారికను జూచి చాల సంతోషించి రాధామణి దేవిగారికి కొన్ని హితవాక్యములు చెప్పిరి.

రాధామణిదేవిగారికీ నూతన మత ప్రవేశ విషయమును, బంధు బృందములను త్యజించుట విషయమును మనోవ్యాకులతగ నుండెను.ఆ మూడవనాడు ఆమె యత్తగారును, అన్న గారును శ్రీకాకుళము వెళ్ళగా, వారిని జూడగానే యామె కెక్కడ లేని ధైర్యమును సంతోషమును విజృంభించెను. ఆమె మనోస్థితిని జూచి యాపట్ల నామె తనతో నుండుటకు పురుషోత్తముగారు సమ్మతింపక,ఆమె తిరిగి వారితో వెళు ్ళటకు సెలవిచ్చిరి. ఆమె అత్యంతానందభరితయై **"మీరు క్రీస్తుమతమును స్థిరపడి మరల దేశమునకు వచ్చినప్పుడు నేను మీతో గూడ వచ్చెద"** నని వాగ్ధాన మిడెను ఆ మరునాడు పురుషోత్తముగారి జనని సుభద్రాదేవి చౌధురాణిగారును, ఆమె సోదరుడును, రాధామణిదేవి చౌధురాణిగారిని దోడ్కొని మదనాపురమున కేగిరి.

## కర్తవ్య కార్య నిశ్చయత.:-

అనంతరము హెలెన్ నాట్ (Helen knott) దొరసానిగారును, అడ్జుటాంటు ఎవిలిన్ (Adjutant Evilin) సేనానియు పురుషోత్తముచౌధరిగారిని గురించి యేమి చేయవలెనో యని కర్తవ్య మాలోచించిరి. పటాలపు భక్తులాకాలమున మిషనెరీ యుద్యమము బూని. భక్తి వైరాగ్యములు గలవారై యుండినందున ఎవిలిన్ సేనాని మిగుల ప్రేమతో పురుషోత్తముగారికి వలయు సహాయ సంపద నొనర్చుచు వచ్చిరి.

## విశాఖపురిలో జీవితము - ఎలివిన్ సేనాని మరణం :-

విశాఖపట్టణమునకు 1805 సంవత్సరము మిషనెరీలుగ జేరిన జార్జి క్రేన్ (Rev. George Cran), అగస్టన్ డెస్ గ్రాంజెస్ (Rev. Augustus Des Granges) అను లండన్‌మిషన్ మిషనరీఫాధరీలు 1809,1810 సంవత్సరములలోనే మృతులైరి. వారి వెనుక **రెవ.జేమ్సు డాసను** (Rev. James Dawson)గారెప్పుడు వచ్చినారోకాని ఆయనకూడ బహుశ శిరంపురమున కేరీ గారచ్చు వేయించిన పత్రిక లా ప్రదేశమున వ్యాపింపజేసియే యుండెదరు. ముందొకప్పుడు మన కథానాయకుడు విశాఖపట్టణము వెళ్ళినప్పుడాయన వ్యాధి బాధితుడై యుండెను. దైవ వశమున ఆయన 1832 సంవత్సరమున మృతి బొందినప్పుడు తమ యిద్దరు కుమాళ్ళను ఈస్టిండియా కంపెనీకి చెందిన సైన్యాధిపతియగు మేజర్ బ్రేట్ (Major Brett) గారి పరము జేసిరి. అప్పుడా సేనాని లండన్‌మిషన్ వ్యవహారములను నిర్వర్తించుచుండెను. వారిలో ఆంధ్రదేశమున

చిరపరిచితులైన **విలియం డాసన్** (Mr.William Dawson) **గారు** మిషన్ పాఠశాలల భారము వహించి యుండిరి. అట్టి తరి శ్రీకాకుళమందలి అడ్జుటాంటు ఎవిలెన్ సేనానియు, నాట్ దొరసానిగారును విద్యుక్తమాలోచించి మేజర్ బ్రేట్‌గారి పేర సిఫారసు ఉత్తరములు వ్రాసి, వానినొక గట్టి తోలు సంచిలో నిడి, పురుషోత్తముచౌధరి గారి చేతికిచ్చి యొక మనుష్యుని దోడిచ్చి ఆయనను విశాఖపట్టణము పంపించిరి. 1833 సంవత్సరము మే నెలలో ఆయన యచట జేరి మేజరు బ్రేట్ సేనాధిపతికి ఆ లేఖల నిచ్చిరి. ఆయన వానిని చదువుకొని మిక్కిలి సంతోషించి, క్రైస్తవ ప్రేమాదరణముతో మన నూతన మతాన్వేషి నాదరించి, కావలసిన సదుపాయములు శక్తి వంచన లేక చేయుచుండిరి. కొన్ని మాసములైన తరువాత అడ్జుటాంటు ఎవిలిన్ సేనాని, విశాఖపట్టణము వెళ్లి వ్యాధి బాధితుడై ఆకస్మిక మరణ మొందెను. కావున ఆయన పురుషోత్తముగారికి జేయుచు వచ్చిన సహాయ మంతటితో నిలిచెను.

మేజరు బ్రేట్ దొరగారును, విలియం డాసనుదొరగారును పురుషోత్తముగారిని చాల ప్రేమించిరి. డాసను గారు మిక్కిలి చిన్న వయస్సున నుండినను, మన కథానాయకుని కొన్ని నెలలు పర్యంతము తమ స్వగృహముననే అతిథిగా నిలిపి, భోజనాది సదుపాయముల జేయు చుండిరి.

## 1829 సం॥ బైబిలు :-

దేవుడు తాను ముందుగా నిర్ణయించిన వారిని తన మహిమ రాజ్యము లోనికి ఆహ్వానించుటకు సాధన సంపత్తులు ఆశ్చర్యముగా నేర్పరుచును. ఈ తన సేవకుని కావశ్యకమైనదొక దైవగ్రంథమని దేవుడెరిగి యుండెను. కావున ఆయన జన్మించిన కొన్ని సంవత్సరముల లోనే చెన్నపురిలో బైబిలు సంఘము స్థాపింపబడెను. 1818 సం॥ రెవ.ప్రిచెట్ట్ (Rev. Pritchett)గారు విశాఖపట్టణమున నూతన నిబంధన నాంధ్రీకరించిరి. అది యా క్రిందటి సంవత్సరము కలకత్తా బైబిలు సొసైటీవారి ధన సహాయముచే చెన్నపురిలో నచ్చు వేయింపబడెను. 1829 సం॥ చెన్నపురి బైబిలు సొసైటీవారిచే నా పురమున ముద్రింపబడిన ఆంధ్ర నూతన నిబంధన నొక ప్రతిని *మేజరు బ్రేట్‌దొర గారు పురుషోత్తముగారి కిచ్చిరి. ఆ శుభవర్తమాన గ్రంథము నాయన ఆమూలాగ్రముగ శ్రద్ధాభక్తులతో, చదివి ముఖ్య భాగములను పెన్సిలుతో

గుర్తించి యుండుట నేటికిని నందు జూడగలము. మేజరు బ్రేట్ గారా క్రైస్తవ వేదములోని సంగతులను, వాక్యముల నక్కడక్కడ జూపించుచు పనస విప్పినటుల బోధించుచు ఆయనను ధైర్యపరుప శ్రమ పుచ్చుకొను నంతటి యోపిక కనపరచిరి.

* ఈ గ్రంథము కాకినాడలోని వారి మనుమలగు ఈ గ్రంథకర్తయొద్ద నున్నది.

## యజ్ఞోపవీత విసర్జనము :-

పురుషోత్తముచౌధరిగారు తాను పూర్వము విశ్వసించిన మతములకును క్రీస్తు మతమునకును గల తారతమ్యము, సారాసారములు, చక్కగా గ్రహించి అడుగడుగునకు నూతన నిర్ధారణలు చేసికొనుచు వచ్చిరి. బంధు బృందములను విడనాడిరి. కులాచారములకు తిలోదకములర్పించిరి. కొన్ని విడనాడి కొన్ని యుంచుకొనుట కాయన కిష్టములేదు. అది భేషజమని ఆయన గ్రహించెను. ద్విజత్వ సూచకముగ **'యజ్ఞోపవీతం పరమపవిత్రం'** అని ఉపనయనమునాడు పురోహితు లాయన కర్పించినట్టియు పంచ గౌడులలోని శిష్టశాఖవారు పూజనీయముగ జూచినట్టియు జన్నిదమింకా ఆయన మెడలో నుండెను. దాని నుంచుకొని క్రీస్తు నామమును గూడ ధరించిన నిష్కపట భక్తి కాదని బాగుగా గ్రహించి, 1833 సంవత్సరము జూన్ నెల 10 వ తేదీని నిండు ధైర్యముతో పురుషోత్తముగారు తన యజ్ఞోపవీతమును దొలగించి, దానిని మేజరు బ్రేట్‌దొర గారి చేతికి సమర్పించి యా విధమున బహిరంగముగ తన జాతిని పరిత్యజించెను.

ఒక ముతా మిరాసీదారునని, పర్లాకిమిడి రాజన్యుల ఆస్థానకవి వర్గములోని వాడనని భరద్వాజస గోత్రీతయుడ నని పంచగౌడులలోని మైథిలాశాఖీయుడనని, కాత్యాయన సూత్రాధారినని, సామవేద శిష్టుడనని, తన గోత్ర సూత్ర ప్రవరాది యాభిజాత్యములు చెప్పుకొని అతిశయించుటకన్న పౌలను భక్తాగ్రేసరునివలె **'ఏవి తనకు లాభకరములై యుండెనో వానిని యేసుక్రీస్తు ప్రభువును గూర్చిన యతి శ్రేష్ఠ జ్ఞానము నిమిత్తము పరిత్యజించి, చెత్తవలె నిస్సారముగ నెంచుకొని'** మన పురుషోత్తముచౌధరి ఛాందసాచారా నిమగ్నుల మధ్య ప్రప్రథముడుగ తాను ప్రేమించిన యేసు నాయకుని పక్షమున ధైర్యస్థైరములతో నిల్చిరి. అనంతర మాయన 1833 సంవత్సరము **"కులాచారపరీక్ష"** యను పత్రిక వ్రాసి దాని చివర నీ క్రిందిపద్యము నుదహరించిరి:-

కం॥ "నరకుల మొక్కటి యైనను
బెరుకులు మెండయ్యు వాని - బిరుదు లణంచన్
ఇరు తెగవులఖడ్గంబిది।
పురుషోత్తమదాసునికి ప్రభు - వుదయచేసె కృపన్॥

ఈ పత్రిక వేనవేలుగా విక్రయ మగుచు నేడనేకుల సత్యపరిశీలనకు సహకారియగుచున్నది.

కులాచారములకు దోడు దేశారిష్టదాయకమైన విగ్రహారాధనను గూడ ఆయన మనసార నిరసించి **"ముక్తి మార్గప్రదర్శనము" "విగ్రహ నిర్మాణా"** ది సర్వవ్యాప్తిగ నున్న పత్రికల ద్వారా కూడ తన హైందవ మత విముఖతను ప్రకాశింప జేసెను.

## కటకపురి ప్రయాణము :-

పురుషోత్తముచౌధరీ గారిప్పుడు బాప్తిస్మమను మత స్నానదీక్ష స్వీకరించుటకు మిగుల గోరిక గలవారై యనేక పర్యాయములు మేజర్ బ్రేట్ దొర గారికి దమ మనో భీష్టమును దెల్పెను. ఆయనను చెన్నపురిలో నున్న మిషనెరీ యొద్దకు ఓడ మీద పంపించుట కాయన చాల ప్రయత్నించిరికాని, బాపురే! వర్షకాలమారంభమగుటచేత నప్పటి తెరచాప యోడలు ఆ పురమునకు వెళ్ళ వీలుకాదయ్యెను. అందుగూడ దైవచిత్తము లేక పోలేదు. అప్పుడా భక్తులెల్లరు జేయుచు వచ్చిన ప్రార్థనలకు ఫలితమేమోయన, శ్రీకాకుళము నుండి హెలెన్ నాట్ దొరసాని కటకములో నున్న ఒరిస్సా బాప్టిస్టు మిషనెరీలకు పురుషోత్తము గారి గూర్చి వ్రాసిన యుత్తరమునకు ప్రత్యుత్తరమందెను. అందు వారాయనను కటకము పంపించుడని దొరసానిగారిని కోరియుండిరి. నాట్ దొరసాని యా లేఖను విశాఖపట్టణము పంపిరి. మేజర్ బ్రేట్ దొరగారు సేనాని దానిని జదివి పురుషోత్తమ కవిని బిలిచి కటకమందలి మిషనెరీలు మీకు స్నానమిచ్చుటకు వాంఛాపరులై రమ్మని వ్రాసియున్నారని తెల్ప ఆయన నాహ్లాదంబున సంబరమంది వెళ్ళ వేగిరపడిరి. మరునాడే దొరగారు ప్రయాణమునకు కావలసినదంతయు సిద్ధము చేయించి, సిఫారసు ఉత్తరము వ్రాసి వారి చేతికిచ్చి కూలివాని నొకని దోడిచ్చి పంపించిరి. బహుశ 1833 సం॥ జూన్ నెల అంతముననో జూలై నెల ప్రారంభముననో పురుషోత్తముగారు బయలుదేరి యుందురు. సరియైన

రాజమార్గములు లేని యా కాలమున మృగ, వ్యాళ, మర్కట, చోర, కిరాత, నిరంతరంబైయున్న కీకారణ్యములు మధ్యమధ్యను దాటుచు దాదాపు రెండు మూడు వారములలో, మూడువందల మైళ్ళు దూరభార ప్రయాణము వారు చేసి యొకచో చిలుక సరస్సును గూడ దాటి కటకపురి కరిగిరి.

పురుషోత్తము గారా మహా నగరమున ప్రవేశించి బాప్తిస్మము పొందిన విషయమును గూర్చి వంగరాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శియైన ఆండ్రూ స్టర్లింగ్‌దొరగారు, రెవ. జేమ్సు పెగ్స్‌దొర గార్లును వ్రాసిన **"ఒరిస్సా దాని భూగోళ చరిత్రము, దాని కనుబంధించిన జనరల్ బాప్టిస్టు మిషన్ చరిత్రమును"** గ్రంథము 229 పుట నుండి *విపులమైన వివర మియ్యబడి యున్నది.

* "Orissa its, Geography, Statistics" &c P 229

## కటకపురి వర్ణనము :-

అప్పటికి కటకములో నెంతయో యెక్కువ మంది క్రైస్తవులు లేరు, ఉండిన కొద్దిమంది యొక్క సహవాస భాగ్యము పురుషోత్తము చౌధరిగారికి లభించుట కేవలము దైవ సంకల్పము. కటకపురిలో 1822 సంవత్సరము ఫిబ్రవరి 12 వ తేదీని యింగ్లీషు బాప్టిస్టు మిషనెరీ సమాజము వారు తమ సువార్త సేవ నారంభించిరి. ఈ నగరము "బారాబజారు లేక పన్నెండు అంగళ్ళు గలిగి మహానది దాని యుపనదియైన కట్‌జోడి నదుల మధ్యస్థమైన యొక ద్వీపమనవచ్చును. 1912వ సంవత్సరమున ఢీల్లీ దర్బారు జరిగినంత వరకది బాంగ్ల(వంగ) రాష్ట్రమునకు జెంది యుండి వేల కొలది యాంధ్రులకును వాసస్థానమై యున్నది. ఆధునిక ఉత్కళ రాష్ట్రమునకది రాజధాని నగరమగుచున్నది. అక్కడ బంగాళీ, హిందూస్థానీ భాషలును, వాడుకలో నున్నవి. అప్పటి కచ్చట పురుషోత్తముగారికి (తర్వాత వియ్యమందిన) బాబుదొయితారి నాయకుగారు మరికొందరు క్రైస్తవులైయుండిరి. వారును మిషనెరీలును మన కవి రాకకై వేచియుండి, ఆయనకు సుస్వాగత మొనర్చిరి. కలకత్తా శిరంపురము మున్నగు నగరములలో జరుగుచుండిన సంఘసంస్కరణములు, దేశ పరివర్తనములను గూర్చి మాత్రమే కాక హైందవ ధర్మమందలి విరజాస్నాన సమయమున జ్ఞానాజ్ఞాన దుర్దోషాపరిహరార్థం, స్నానం అహంకరిషే" యను భావమునకును యేసుక్రీస్తు

ప్రభువునందలి నూతన జన్మసూచకమగు స్నానమునకును గల సంపూర్ణ భేదభావములకును పురుషోత్తముగారిచ్చట విపులముగ గ్రహింపగల నేర్పు పొందిరి. ఆయన యా పురమున నుండగనే వంగీయ సంస్కర్తయగు రాజారామ మోహనరాయి 1833 సంవత్సరము సెప్టెంబరు 27 వ తేదిని యింగ్లాండులో కాలవశులైరి. ఆయన విగ్రహారాధనమును, కులాచారములను ఖండించుచుండిన కాలముననే మృతులైనను యేసుక్రీస్తు ప్రభువునందలి నవజీవనముతో పురుషోత్తముచౌధరిగారట్టి సంస్కరణములను నేటికిని సాగింపగల శక్తి సంపన్నత వడసిరి.

కటకపురియందలి యింగ్లీషు బాప్టిస్టు సంఘమువారు పురుషోత్తముచౌధరిగారి భక్తి విశ్వాసములను పరిశీలించి, ఆయనను దమ క్రైస్తవ సంఘమున జేర్చుకొనినంతట ఆ మహా సంతోషదినమును గూర్చి ఆయనకు స్నానమిచ్చిన రెవరెండు చార్లెసు లేసీదొర (Rev.Charles Lacy)గారు పూర్వోక్తి గ్రంథమున క్రింది విషయము లుదహరించియున్నారు.

**పురుషోత్తమచౌధరీ గారి స్నాన దీక్షా స్వీకారము :-**

“1833 వ సం॥ ఆక్టోబరు 6 వ తేదీ ఆదివారము ఆయనకు (అనగా పురుషోత్తము చౌధరి గారికి) బాప్తిస్మమియ్య నిశ్చయింపబడెను. సర్క్యూటు జడ్జిగారు (గంగా మందిరమను) పెద్ద కోనేటిని అందుకై యుపయోగింపగోరిన వెంటనే సదయ హృదయులై సెలవొసగిరి, అది బజారు నొద్ద రాజమార్గము ప్రక్కను కేంద్ర స్థానమున నుండుటచే నీ పరిశుద్ధ స్నాన సంస్కారమునకు బాగుగ దగియుండెను. మేము దేశ (ఉత్కళ) భాషలో నొక కీర్తన పాడి ప్రార్థించి మంగళ సమాచారము తెల్పితిమి. వేయి మందికి తక్కువకాని ప్రజలచ్చట సమావేశమైరి. ప్రారంభారాధన జరిగిన తరువాత జనసమూహ మా సుందర సరోవరము యొక్క పచ్చిక గడ్డిపై నిజేచ్ఛనలంకరింప నది చూడ్కులకు నిండు వేడ్కలు గొల్పుచుండెను. ఆ ప్రజలు నిశ్శబ్ధముగ నుండిరి. ఆచార్యులు (రెవ. చార్లెస్ లేసీదొరగారుయును) స్నాన దీక్ష పొందగోరిన వ్యక్తీ (పురుషోత్తము చౌధరీగారుయును) మెట్లు దిగి నీళ్ళలోనికి వెళ్ళిరి. అప్పుడు సర్వాంగస్నాన బాప్తిస్మ దీక్షయియ్యబడెను. పితాపుత్ర పరిశుద్ధాత్మల నామమున ఆంగ్లేయముననను దేశ భాషలోను ఉచ్చరింపబడెను. అట్టి బహిరంగస్థాన మేర్పరుపబడుటకు గారణము లున్నవి. అనేకుల

నాకర్షించి వారికి మతోపదేశము చేయుట మొదటి కారణము. ఈ సంస్కారవిషయము జనసామాన్య హృదయములలో మత వైషమ్యముగలవారు కష్టపడి ప్రవేశపెట్టిన హాస్యాస్పద దురభిప్రాయములు, దానిని (ఆ స్నానకర్మను) వారు వీక్షించుటచే దొలగుననునది యింకొక కారణము.

## లండన్ మిషన్‌వారి ఫలితము – కరపత్రముల విలువ :-

" ఆ సాయంకాలమే మన సోదరుడు ప్రభు కృపాసాదాసనముయొద్దకు సమీపించి ఆ కృపాసహిత సంస్కారము (Lord's Supper) యొక్క అర్థమును గ్రహింపగలిగిరి. అది మొదలుకొని ఆయన తన స్వస్థానమునకు ప్రయాణమైన నేటిదినము వరకును మేమతని విషయమై మంచి నిరీక్షణ గలిగి యుండునటుల ఆయన మాటలవల్లను, కార్యములవల్లను, తెలియవచ్చెను. ఇప్పుడాయన విధేయుడై, దైవవాక్యపఠనమున చాకచక్యతగలిగి, యితరులలో నా వాక్యప్రచార విషయము ఆసక్తి వహించియున్నాడు. సముద్రతీరమునందలి మా స్వతంత్ర సోదరుల కష్టములకు ప్రథమఫలితముగ నున్నట్లీయన కనబడుచున్నాడు.ఆయన రక్షకుని బహిరంగముగ స్వీకారము చేయు అభిప్రాయముతో మొదట విశాఖపట్టణము దర్శించినప్పుడు (జేమ్సు) డాసన్‌దొరగారు మిక్కిలి కాయిలాతో నుండినను సజీవులై యుండిరి. తన సమీపర్తులనేకులను గూర్చి యీయన (పురుషోత్తముగారు) మంచి సాక్ష్యమిచ్చుచున్నారు. కావున నింతటినుండి యా ప్రధేశమున కొన్ని ముఖ్య ఫలితములు యేసుప్రభువు యొక్క మందలోనికి జేర్చబడుట యసాధ్యము కానేరదు. ఈ సంఘటన యొక నూతన సాదృశ్యమును వ్యక్తీకరించుచున్నది. మన ప్రయాసము నిష్ఫలమైనదని మనము మొఱ్ఱబెట్టుచు ప్రభువు వైపునకొక్క వ్యక్తియైనను తిరుగుట జూడకుండయే చనిపోవుచుండగా సీయోన్ మార్గవిషయము విచారణ చేయువారు మాత్రమే కాక, మనము పంచిపెట్టి యుండిన యేదొక కరపత్రము ద్వారానో మన సువార్త ద్వారముననో, జీవమార్గ విషయమైన విస్పుట విజ్ఞానము సంపాదించి, ఆనంద భరితులై యందు నడచుచున్న వారలు కలరు. మన రక్షకుని ద్రాక్షవనమున మనము కష్టజీవులమైన వెనుక మనకు తెలియకయే జీవమార్గములోనికి నడిపించు సాధన సంపత్తులమై బహుశ: పెక్కంద్రను సంప్రదింపగలము. ఈ ప్రోత్సహమెంత యుత్సాహదాయకమైనది! అట్టి ప్రకటన యెంత యానందదాయకము! అట్టి సాక్షాత్కార మెంత సంతోషజనకమైనది! మనము ఫలించు

రీతి దేవుడు బాగుగ నెరుగును గనుక ఆయన యుక్తమని చూచిన విధమున మనకిక్కడ ప్రత్యక్షఫలసిద్ధి గలిగినను పరోక్షముగా లభించినను మనకార్యభారమాయన చేతవిడిచి ముందంజవేసి కార్యాచరణ మొనర్చిన యెడల నట్టి ప్రోత్సాహము మనల నెటుల నుద్రేకింప జేయవలెను!

"ట్రాకు సొసైటీల ఉపయోగము కూడ నిందు జూచుచున్నాము వివేకవంతుడై సత్యగ్రహణము చేసి త్రాణకర్త యందు ఆనందించి యాశ్రయించి యున్న యీ యువకుని జూచుచున్నాము. ఒక్క క్రైస్తవునితోనైనను సంభాషింప నొక్క తరుణమైన చిక్కియుండక, మత సంబంధమైన పత్రిక మూలమున సమస్త మితనికి సంఘటిల్లినది! ఆగామి ఫలితము లింత ప్రాముఖ్యమైనవి. ఈ యువకుడిక మీదట తన స్వదేశీయులకు శుభవర్తమాన ప్రచార మారంభించును. ఆయనకనుగ్రహింపబడియున్న కృపా విశేషత చేతను, విమోచనా భాగ్యము వల్లను ఆయనకు గొప్ప పలుకుబడి కలిగి నమ్మకస్థుడై యుండిన యెడల, ననేకులను పవిత్ర జీవమార్గమునకు నడుపుటకు మార్గదర్శి కాగలడు."

"ఈయన (1833) సంవత్సరమున ఆక్టోబరు 21 వతేదిని స్వదేశాభిముఖుడై కటకపురి విడిచెను. ఈయనకు ప్రయాణమున చేదోడు వాదోడుగ నుండటకును క్రైస్తవ మతాభిలాషులై యున్న తన సోదరులను జూచుటకును బరంపురములో మతాన్వేషుల ననేకులను జూచి వచ్చుటకును, రాధు అను నాతని బంపితిని. ఆయన (పురుషోత్తము చౌధరిగారు) ఇచ్చటికి వచ్చినది మొదలు తానెవరిమధ్య సౌఖ్యముగనుండెనో ఆ స్వదేశ క్రైస్తవబృందమును విడువ వ్యసనాక్రాంతుడై యుండెను. ఆయన క్రైస్తవమతమునకు లభించిన వారిలో సర్వసామాన్యుడుకాడు. ఆయన తమ దేశమందలి ఆంధ్రుల కత్యంత ప్రయోజనీయుడును ఆ తీరమందలి లండను మిషన్ సొసైటీవారి కత్యంత సహాయకారియునై యుండును."*

* See Orissa; and its Geography Statistics History Religion and Antiquities by Andrew Sterling Esq; late Persian Secraetary to the Bengal Government etc. P230.

**అమూల్య రత్నము :-**

పూర్వోక్త సందర్భమును క్రోడికరించుచు 1834 సం॥ ఒరిస్సా జనరలు బాప్టిస్టు మిషనెరీ సొసైటీవారు తమ రిపోర్టుయొక్క 20వ పుటలో నిట్లు వ్రాసిరి. "పై సందర్భము ననుసరించిచూడ లండను మిషనెరీ సొసైటీవారి పరిశ్రమపై గల దైవాశీర్వాదముచే, పురుషోత్తముగారు త్రాణాధిపతియొక్క మధ్యవర్తిత్వ కిరీటమున: జేర్చబడిన* రత్నసమానులై యున్నారు."

* Report of the General Baptist Missonary Society 1834 P.20.

Purushottam, as appeared from the preceeding narrative is a gem added to the Saviours meditorial crown, by the divine blessing on the efforts of the London Missionary Society.

మీద సూచింపబడిన **"ఒరిస్సా దాని భూగోళము, చరిత్రము మతము, దాని ప్రాచీనత"** యను గ్రంథముననే మన కవి బాప్తిస్మ చరిత్రము వ్రాయుచు, క్రింది విషయములను బేర్కొనియున్నవి :-

**స్వీయవృత్తాంతము :-**

"ఈ 1833 సంవత్సరము సంఘమున ప్రవేశించినవారి సంగతి, అందు ముఖ్యముగ విశాఖపట్టణము నుండి వచ్చిన పురుషోత్తముగారి సంగతి ప్రోత్సాహ సూచకముగ నున్నది. సొసైటీవారి రిపోర్టులో ఆ సంగతి యిట్టున్నది. "--- గత సంవత్సరము చాలమంది హిందువులు విమోచనకర్త యొక్క మందలో జేరి సువార్త కొరకై సంప్రాప్తమైన విచారములు క్షూణతలు సహించుచు, వారి దృఢ మతాభిమానము వ్యక్తీకరించిరి. వారిలో నొకరు పురుషోత్తముగారు, విశాఖపట్టణములో స్థాపింపబడిన లండన్ మిషన్ సొసైటీ యొక్క మిషనెరీల ప్రథమ ఫలితముగ వారు కనబడుచున్నారు. ఈ హైందవ యువకుడు మనోహరమైన స్వీయ చరిత్రమును తెలియజేసెను. ఈయన ప్రారంభమున తమ దేశీయుల మూఢాచారములు విగ్రహారాధనములో నిమగ్నుడై ప్రతిమార్చనమునను వాటి పూజా పురస్కారము లందును హేయకరమైన అభ్యాసము లందును ఆసక్తిపరుడై యుండెను. అయినను వాని నాచరించు చుండగనే సత్యమత మూలము నెరుగుట కీయనలో జిజ్ఞాస ఘటించెను. ఒకప్పుడాయన కొక పత్రిక

లభించినది. ఆయన దాని జదివి మూలముట్ట జేసిరి. అనంతరము మరి మూడు నాలుగు పత్రికలు దొరికెను. అవి యాయనకు ముక్తికర్త ప్రదర్శనములాయెను. ఆయా సంఘటనలు, పరిశోధనలు జరిగిన వెనుక ఆయన క్రీస్తువారి శిష్యుడుగానుండ నిశ్చయించుకొనెను. అయితే యా మిషనెరీలు చనిపోయిరి. వారి కష్టఫలితము చూడకయే మృతులైరి. పురుషోత్తముగారు తుట్టతదకొక భక్తిగల యుద్యోగస్థునితో స్నేహము చేయ ఆయన వారి బాప్తిస్మము నిమిత్తము నాలుగు వందలమైళ్ళు దూరమందలి మద్రాసు పంప నిశ్చయించిరి. క్రైస్తవుడు కాగోరిన యొక హైందవుడు తన వాస స్థానమునకు 300 మైళ్ళు లోపు దూరమున ఫాదిరీ పట్టము పొందిన యొక క్రైస్తవ బోధకుని కనుగొన కుండినట్టి దేశస్థితి యెంత భయంకరమైనది!. ఇండియాలో మిషనెరీలు కరవుగా నుండుట యెంతయు ఘోరము! ఈయాసక్తి గల హైందవుడు ఎంతమనోహరముగా  దేవునిచే మెప్పు పొందెనో ఆయన స్వంత సాక్ష్యము వల్లనే తెల్లమగుచున్నది. ఆయన తన క్రైస్తవ స్నేహితులతో జేరక ముందు రక్షకుడెటుల దన విషయము జాగ్రత తీసుకొనెనో ఆయనుభవమాయన యిటుల దెలియజేసిరి:–

“యేసుక్రీస్తు ప్రభువు తన నిర్హేతుక జాయమానకటాక్షముచేత విశ్వాసమందును జ్ఞానమందును నాయాత్మ అభివృద్ధి నొంది బలపడునటుల జేసెను. సైతాను స్నేహితులను ధైర్యముతో ధిక్కరించి పాపములో జాలకాలము కొట్టుకొని యంధకారములోను దారుణభయములలోను చిక్కింపజేయుచు వచ్చిన యీ మర్త్యదేహము నన్నెల్లప్పుడు త్రోసివేసియుండినదేకాని నా కృపగల రక్షకుని సహాయము నాకు లభించెను. ఈద్వివిధ శత్రువుల బలమునుండి బారినుండి ఆయన నన్ను విమోచించెను. నా సన్నిహితబంధువులు, నా సోదరుడు, నా ప్రియజనని, నాభార్య చాలమంది జ్ఞాతులు, స్నేహితులు నా యాశ్చర్యకరమైన మార్పువిషయమై యెరిగి నన్ను బాధింపజొచ్చిరి.

“కొందరు దూషణ లాడిరి, కొందరు అపహసించిరి, కొందరు కఠూక్తులుచ్చరించిరి. కొందరు నన్ను బంధించి యుంచ దలచిరి, మరికొందరు నానావిధముల నన్ను వేధింపజొచ్చిరి. అయినను నేనెవరియందునా నిండు భరోసా నిల్పితినో, నేనెవరిని నా పరమగురువని వెంబడించితినో, ఆ యేసుక్రీస్తు ప్రభువు నన్ను తరుము వారి దూషణలకు శాంతముతో ప్రత్యుత్తరము లిచ్చుటకును, నిర్భయముగను, నిస్పృహ

లేకయు తత్తరపాటు జెందకయు నిల్చుటకు నాకు ధైర్యస్థైర్యము లొసగెను. నేను మనోనిబ్బరము చేసికొని నన్ను కలవర పరచువారి సాంగత్యము విసర్జించితిని. అట్టి కృప విషయమై నేనాశ్చర్యానంద మగ్నుడనై నన్ను హింసించు వారి బారి నుండి ఇట్లు విడిపించిన ఘన రక్షకుని కృపను కొనియాడుచున్నాను."*

* Orissa its geography statistics etc; from page 230.

కటకపురిని క్రైస్తవ గోష్ఠిలభించి తమ ఆధ్యాత్మిక యాప్సితసిద్ధి జెందినందున ఆ దినములలో నూరేండ్ల క్రిందట తమ యాత్మీయానుభవమును, క్రింది ప్రప్రథమగీతమున పురుషోత్తమచౌధరిగారు విశదపరచియున్నారు.

క్రైస్తవానుభవ ప్రథమ గీతము.

రా – ముఖారి తా – త్రిపుట

మా యేసు క్రీస్తుని – మఱుగు గల్గెనురా = నాయాత్మ ఘనరక్షా – నగము నెక్కెను రా ॥మా యేసు॥

1. ముందు నాలో పాప – ములు జూడ బడెరా – డెందము తా నన్ని – టిని నొప్పుకొనెరా = యందుకై బలు దు:ఖ మాత్మ జెందెనురా – సందేహములు వీడు – జాడ గన్గొనెరా ॥మా యేసు॥

2. సువిశేష బోధన – చెవు లాలించెనురా = అవివేక శాస్త్రోక్తు – లంటు వీడెనురా = నవసత్క్రైవ గోష్టి – భువి నా కబ్బెనురా – వివిధము లగు వేల్పు – ల్విష మైరిగదరా ॥మా యేసు॥

3. బాధగురువు లమోము – ల్బహు లజ్జబడెరా – గాధ మంత్రము లన్ని – కడగండ్లయి చెడెరా = శోధించి నాయత్మ – శుద్ధి గోరెనురా – సాధించు ప్రభు క్రీస్తు – శరణు జొచ్చెనురా ॥ మా యేసు॥

4. మతి లోని లోతు మ – ర్మము గానబడెరా – మితి లేని ఘనపాప – మే నిండు కొనెరా = హితముగా తన జీవ – మిచ్చె క్రీస్తుడురా – మృతిచేత మన పాప – వితతి గొట్టెనురా ॥మా యేసు॥

5. కుల గోత్రముల బుద్ధి - కుటిలంబు దెగెరా - బలవత్పిశాచ శృంఖలము విరిగెనురా = సిలువ మోసినవాని - చిర సౌఖ్యోన్నతిరా - నెలవుగా నాలోన - నిలచి యున్నదిరా ॥మా యేసు॥

6. తనపోల్కె నొరులగ - న్గొన ప్రేమ య్యెనురా - మనసు దేవునికిన - ర్పణ సేయ బడెరా = ఘన కృపశాంతులు - గొనెను నెమ్మదిరా - మనసు మార్పుడి మోక్ష - మహిమ గన్గొనెరా ॥మా యేసు॥

7. రాగ ద్వేషముల సం - భ్రమ మెల్ల జెడెరా - మూగి బొమ్మలు పాదాముల ద్రొక్కబడెరా = యోగ మార్గములన్ని - యోటి కుండలురా - సాగు పాపపు బుద్ధి చతికిళ్ల బడెరా ॥ మా యేసు॥

పై కీర్తనలోని రెండవ చరణమున "నవసత్ క్రైస్తవ గోష్ఠి భువి నాకెబ్బెనురా" యను పాదమును బట్టి యీ కీర్తన కటకపురి క్రైస్తవ బృందముతో మన కవి సహవాసము చేయుచుండిన సమయమున వ్రాసియుండిరని, గ్రహింపవలెను. ఆంధ్ర సంఘ సంకీర్తన గ్రంథమున నిది శతవత్సర కీర్తన సంధ్యావందనము గాయత్రీజపములు చిరపరిచయమైనను స్వానుభవ, యిష్ట దైవతా సూచకముగా పురుషోత్తముచౌధరిగారు సుమారు 1820 వ సంవత్సర ప్రాంతమున సనాతన ధర్మపరాయణుడై యుండగా వ్రాసియుండిన రామ గీతమొకటి కాళీమహాంతీ దీనబంధు పాఠనాయకుగారు, కాళిమహాంతి కృష్ణచంద్రపాఠనాయకు గార్లు పర్లాకిమిడిలో దాదాపు ముప్పది యైదేండ్ల క్రిందట బాడుచుండిరి. చరణములు సంపూర్తిగ లేకున్నను దాని నిచ్చో విమర్శింతము.

రా॥ శుద్ధ కాంభోజి తా॥ జంపె

1. కన్న తండ్రివను కొంటి - గతి నీదె రామ - యెన్నొ వ్రతములు జేసి, యీ మనుజ జననంబు- నెత్తినందుకు మేల - దెందుంగనంబడదు ॥ కన్న తండ్రి॥

2. హద్దు మాలిన వట్టి యాళ బొరలుటె కాని - వద్దిమొల త్రాండైన- వచ్చునే వెనుక- ముద్దు కొడుకులు సతులు మూల దాచిన ధన యి - పెద్ద నిద్దురవేళ పెంతురే మనసా ॥ కన్న తండ్రీ॥

3. ఆరుగుణములునన్ను - అల్లరలు సేయని - వారింప వైతివి - నీ - వాం డనోకానో = కారు మూర్ఖవు పిల్ల - గానౌదునీభూరి- కరుణగోరుచునుంటిని ॥ కన్న తండ్రి ॥

4. పరవస్తుమణి శ్రీని - వాసవరదాచార్య - గురుపాదములునమ్యు - కొని కొల్వరాదా = ధరణి మదనాపరీ - పురవాసుడై నట్టి - పురుషోత్తమముని బోధ - పూనుకొనరాదా ॥ కన్న తండ్రి॥

ఈ కీర్తనలోని రక్షణ విషయముయిన యనిశ్చయములును, క్రైస్తవుడయిన వెనుక వ్రాసిన పై కీర్తనలోని ఆత్మరక్షణ విషయమందలి సుస్థిరత, సునిశ్చయమును గమనింప దగినవి. క్రీస్తువారు పాపపరిహారార్థము కావించిన ప్రాయశ్చిత్తము యొక్క అమోఘబలము, ఆయన పునరుత్థానము యొక్క అనూన ప్రభావము గ్రహించి పురుషోత్తముకవి వ్రాసిన తక్కిన కీర్తనలకును దీనికిని పాఠకులు తారతమ్యము నెఱిగి తమయనుభవములనటుల జక్కపఱుచుకొన వీరిజీవితము కరతలామలకముగ సూచించును.

పురుషోత్తముచౌధరి గారు 1833వ సంవత్సరము ఆక్టోబరు నెల 6వ తేదీని పూర్వోక్త విధమున కటకపురిలో క్రైస్తవమత స్వీకారము చేసి, రెవరెండు చార్లెస్ లేసీదొరగారు, మేజరు బ్రేట్ దొరగారి కిచ్చిన, యుత్తర మందుకొని సుమారిరువది దినముల దూరభార ప్రయాణము తిరిగి సాగించి ఆ సంవత్సరము నవంబరు నెలలో విశాఖపట్టణము చేరిరి. ఆ నెల 17వ తేదీని వీరి పేరు కటకపురి బాప్టిస్టుల సంఘమువారి రిపోర్డులో వ్రాయబడినటుల రెవరెండు యంగ్‌దొరగారు నాకు వ్రాసియుండిన లేఖవల్లను, బాప్తిస్మము పొందిన తారీకు 1833 సం॥ ఆక్టోబరు 6వ తేదీయని రెవరెండు టి. బెయిలీ దొరగార నాపేర వ్రాసిన యుత్తరము వల్లను తెలియ వచ్చెను.

దైవకృపా సంకల్పమున నింత యాశ్చర్యకరరీతిని నూరేండ్ల క్రిందట మన పితామహులనదగు పురుషోత్తముగారు యేసుప్రభువు వారి పాపోవశమున ప్రాయశ్చిత్తము ద్వారా తమకు లభించిన యీ మహోత్కృష్ట కళ్యాణ పదవిని యమోఘ రక్షణ్యమును స్వీకరించి వచ్చిన వెనుక దేవుడా దీన సేవకుని ద్వారా యీ దేశమున జరిగిన విశాల ఘన సేవ విషయ మికను జూచుదము.

## 5. అధ్యాయము

**"లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మునుగూడ హింసించెదరు" యోహాను- 15: 20.**

పురుషోత్తముచౌధరిగారి స్వచ్ఛంద సువార్త సేవా ప్రారంభము, మేజరు బ్రేట్ సైన్యాధిపతితో చెన్నపురికి మిషనెరీ యాత్ర. మతద్వేషులు మన కవిని వధింప జూచుట, వివిధ తాడనములు, బళ్లారికి ప్రయాణము, దీర్ఘ సువార్త యాత్ర.

---♦--- ♦---♦---

### విశాఖపట్టణమున ప్రథమ సేవ - దండతాడనములు :-

మార్గాయాసముచే డస్సియుండినను నవజీవన శోభాయుత ముఖారవిందముతో మన చరిత్ర నాయకుడు 1833 సంవత్సరము నవంబరు నెలలో విశాఖపట్టణము చేరి, రెవరెండు చార్లెస్ లేసీదొరగారు తమ చేతికిచ్చిన లేఖను మేజరు బ్రేట్ దొరగారి చేతికందించినంతట ఆ యుత్తరమాయన చదువుకొని, పురుషోత్తముగారు క్రీస్తు మత దీక్షా స్వీకారము చేసిన వివరములను గూర్చియు, ఆయన వ్యక్త పరచిన ధైర్యస్థైర్యములను గూర్చియు ప్రభు నామమునకు ధన్యవాదములు చేయుచు పురుషోత్తముగారి వైపు సంతసవదనారవిందులై దృష్టిపారించి "మీరు వేరుకార్యమున బ్రవేశించుట కన్న ప్రభుయేసుక్రీస్తు సువార్తను ఈ ప్రాంతీయ ప్రజలకు ప్రచారముచేయుటయే మీకుత్తమోత్తమసేవయై యుండునని చార్లెస్ లేసీదొరగారు వ్రాయుచున్నారు. నేను మీ విషయమదే యభిప్రాయము గలవాడను. చెన్నపట్టణము వ్రాసి మీ కొరకు గొంత వేతన మేర్పాటు చేయించెదను. మీరు దైవవాక్య ప్రచారము చేయుచుండుడని వచించిరి. పురుషోత్తమ చౌధరి గారొకింత సంతసించి, ప్రియ వచనములు పల్కిన సైన్యాధిపతిని సవినయ భావమున దృష్టించి "ఆర్యావర్యా! మీరంత ప్రయాసపడుట యేల! నేను ఏకాకిని, నిస్సంగుడను కదా! నాకు అన్నపానములు లభించిన జాలును. వేతనమేల? అని దొరగారికి వినయ సూచన చేసిరి. మేజరు బ్రేట్ దొరగారు కొన్ని హితవాక్యములు చెప్పి పురుషోత్తమకవి యిష్టానుసారము జరిగించుటకు సమ్మతించెను. ఒక భారతీయుని యెడల నొక యూరోపియను ఉద్యోగికి కల యీ సుహృద్భావమునకు క్రీస్తు ప్రేమయే మూలమనుట నిర్వివాదాంశము. పురుషోత్తమకవికి

ఇంగ్లీషుభాష వచ్చియుండనప్పటికీ హిందుస్థానీ, ఆంధ్ర బాషలలోనే యా దొరలతో దమ వ్యవహారములు జరిగించుకొనిరి. విశాఖపట్టణమందును, సింహాచలము మున్నగు చుట్టుపట్టుల పల్లెలలోను దవ్వు గ్రామములలోను తత్కాలావధి అదివరకెన్నడు సువార్త వినియుండని జన సమూహముల మధ్య నిలువబడి, వారి జాతి మతాచారములకు విరుద్ధముగానున్న క్రీస్తుమత సిద్ధాంతములను ఒక మిషనెరీగాని క్రైస్తవుడుగాని చేదోడువాదోడుగా నుండని యా కాలమున వీధులలోను, సంతలలోను, బజారులలోను బోధించుచుండగా ప్రజలాయనను తరుముచు, దూషించి, దుర్భాషలాడుచు, అప్పుడప్పుడాయనను పట్టుకొని కొట్టుచుండెడివారు. మరియు ప్రచారానంతరమాయన పత్రికలు పంచిపెట్టునప్పుడు జనులు వానిని పుచ్చుకొని ఆయన యెదుటనే తుత్తునియలుగ జించి యా ముక్కల నాయన తలమీదను తలంబ్రాలు చల్లువారు **"లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మునుగూడ హింసించెదరని"** ప్రభువు చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొని "పరోపకారార్ధం మిదం శరీరం" అను ఆర్యోక్తి ప్రకారమాయన సహజ శాంతముతో నా శ్రమలను సహించుకొనుచు, ప్రభు కార్యనిమగ్నుడై ముందంజ వేసి చనుచుండెను వాక్య బీజము లెల్లప్పుడు రాతి నేలలోనేగాక ముండ్ల తుప్పలయందును, మంచి క్షేత్రములందును, బడుచుండును. తదనుసారముగ ఆయన యుపదేశముచే కొన్ని వాక్యబీజములు ముగ్గురి సేద్యవంతమైన హృదయ క్షేత్రములలో బ్రవేశించినందున, వారు జాతిని పరిత్యజించి ఆయనతో భోజనభాజనములలో బాల్గొనుచు, ప్రభువు సంగతి విని, చదువుకొనుచు వచ్చియు తమ పూర్వ వ్యామోహముల వైపు మళ్ళుకొని వెనుకంజవేసి చనిరి. అంతమాత్రమున ఆయన యధైర్యపడక, తన ప్రచార కార్యమును సాగించుచునే యుండెను.

## చెన్నపురికి మిషనరీ యాత్ర మరియు చెన్నపట్టణమున ప్రచారము :-

అంతలో ప్రభుత్వమువారు మేజరు బ్రేట్ సైన్యాధిపతిని గొన్నాళ్ళు చెన్నపురికి మార్చిరి, ఆ సేనానితో పురుషోత్తము చౌధరిగారుయును చెన్నపట్టణము వెళ్ళి యక్కడి మిషనెరీల వల్లను క్రీస్తు సంఘము వారివల్లను గొంత నేర్పు పొందుటకు వాంఛ గలవారై యున్నట్లు దొరగారితో మనవి చేసినందున ఆయన తనతో మన నూతన విశ్వాసిని దీసికొని వెళ్ళుట కంగీకరించిరి. ఆ కాలమున పొగ యోడలను వేరే లేనందున

వారొక తెరచాపయోడ నెక్కి బయలుదేరిరి. ఎదురుగాలి వీచుటచే ఓడ నడువక, 18 దినములు నీటిమీదనే యుండి నానాకష్టముల పాలైరి. పురుషోత్తముచౌధరిగారదివర కలవాటుపడియుండని "బిస్కటులు" భుజింపవలసి వచ్చినందున, ఆయనకాప్రయాణము ప్రాణాంతకముగ నుండినటుల తన బిడ్డలతో జెప్పుచుండువారు. పురుషోత్తముగారు ఓడలో బైబిలు చదువుచు, "అయ్యా యెంత దివ్యమైన సంగతులిందున్నవి"యని బ్రేట్ సేనానితో ననగా "గ్రుడ్డి వాడు కన్నులు తెరచుకొలది మరింత యమోఘ విషయములను తెలిసికొనగలడు" అని యా దొరగారు చెప్పుచు ప్రోత్సాహ పరచువారట. వారెట్టకేలకు విశాఖపట్టణమునకు దాదాపు 500 మైళ్ళు దూరమందలి చెన్నపట్టణము చేరి పరుషవాకములో బసదిగిరి. పురుషోత్తముచౌధరిగారు మునుపటి వలెనే మేజరు బ్రేట్ దొర (Major Brett) గారి యొద్దనే యుండి దినదినము యధావిధి చెన్నపురి వీధులలోను, బజారులలోను ఏకాకిగ వెళ్లి యొక పత్రిక గట్టిగా చదివి ప్రభువాక్య ప్రకటనము జేయువారు, చెన్నపట్టణమున ఆంధ్ర, తమిళ భాషలు చిరకాలము నుండి వాడుకగా నున్నవి. ఆ కాలమున నచ్చట నుండిన రెవ.జాన్ స్మిత్ (Rev. John Smith), రెవ.డబ్లియు.ఎచ్.డ్రూ (Rev. W.H Drew)అను మిషనెరీలను, మరికొందరు భారతీయ క్రైస్తవులను పురుషోత్తముచౌధరిగారు సంతోషముతో దర్శించుచువచ్చిరి. కాని భాషలు భేదమగుట వలన వారివల్ల పొందవలసిన నేర్పువిషయము వీరి కోరిక సఫలీకృతముకాలేదు.

ఆంధ్ర భాష నెరిగిన వారికి మాత్రమాయన యథావిధిగా నచ్చటి ప్రవాస కాలమున మత ప్రచారము చేయుచువచ్చెను. ఆ పురువాసులాయనకు బెట్టిన బాధల విషయమును ఒక దినమందాయనను జంపుటకు వారు చేసిన ప్రయత్నములను గూర్చియు పురుషోత్తముగారి రికార్డుల నుండి క్రింది సంగతులు మనము తెలిసికొననగును.

### చెన్నపట్టణమున హింసలు :-

" ఒక దినమందు నేను చెన్నపట్టణమున చచ్చౌకముగా నున్న యొక వీధి (జార్జిటౌన్ లోని లోన్ స్క్వేరు) లో ప్రసంగించుచుండగా ప్రొద్దుపోవుచున్నందున మేజరు బ్రేట్ దొరగారి బంగళాకు తిరిగి వెళ్ళుటకు నేను తలంచుచుండగా నా యెదుటి యరుగుమీద గూర్చుండిన కొందరు పడుచువారు నన్ను పిలిచి యింకా కొంత వినిపించుమని

కోరిరి. "ఇంత సేపు మీరు విన్నదిచాలు నేను దూరము వెళ్ళవలెను గనక నేను పోవలెనని" చెప్పితిని. వారు గబాలున దిగి ఆలాగంటే వల్లకాదు, నీవు ఆవశ్యముగా మా వారికి వినిపించవలెను. కనుక నిన్ను విడిచి పెట్టము. నీవు మాతో గూడ రావలెనని నా రెండు చేతులు పట్టుకొని యొక సందులోనికి నన్ను తీసికొనిపోవుటకు నడికట్లు కట్టి ప్రయాసపడిరి. నా మనస్సులో వారెద్దియో యొక యపాయము జరిగించెదరని యూహించి "ప్రొద్దుపోవచ్చెను కనుక నేనాసందులోనికి రానని" చెప్పి స్థిరముగా నిలువబడితిని. అప్పుడు వాండ్రు నీవు రాకుంటే యేలాగు? నిన్ను మేము విడిచిపెట్టముగదా?యని బలవంతముగ నన్ను మీదికెత్తి యీడ్చుకొనిపోవ నారంభించిరి. నా ప్రాణము పోగొట్టుటకు తీసుకొని పోవుదురా యని నేను పెద్ద కేకలు వేసి యరచితిని. అంత నిద్దరు అరవ క్రైస్తవ యువకులు ఆ మార్గమున వారి యిండ్లకు బోవుచుండి నా శబ్దమువిని యక్కడకి వచ్చిరి. వీరికిని వారికిని వాదాను వాదములు జరిగెను. ఈ క్రైస్తవ యువకులు వారి చేతులలోనుండి నన్ను విడిపించుటకు ప్రయాసపడిరి. కాని వాండ్రు విడువమని యొకటే పట్టుపట్టి నన్ను ఈడ్వసాగిరి. వాండ్రు నా తలను పట్టుకొని యటులాగిరి, ఈ క్రైస్తవులు నా కాళ్ళు పట్టుకొని యిటులాగిరి. నా పక్షమున వీరిద్దరు మాత్రమే యైనందున వారికి చాలక పోయినది. అప్పుడీ యిద్దరును వీధివాండ్రను గట్టిగా బిలిచి " ఓయీ వీధివాండ్రు ఈ మనుష్యుని జంపుటకు ఈ సందులోనుండి యీడ్చుకొని పోవుచున్నారు. కాబట్టి యీయన దొరయైన మేజర్ బ్రేట్ గారితో మేము చెప్పెదము. ఆ వెనుక మీ మీదికి వచ్చే యుపద్రవమేమౌనో కాచుకొనండి" యని గొప్ప బొబ్బ పెట్టినందున ఇండ్లలో నున్న పెద్దవాండ్రు కొందరు పైకి వచ్చి యా దుష్ట సమూహమును తరిమి వాండ్ర చేతులలో నుండి నన్ను విడిపించిరి. ఈ లాగులాటలో నాశక్తి తరిగెను. కనుక వీరిద్దరును తమ భుజముల సహాయమువల్ల నన్ను మెల్లగ నడిపించి పరుషవాకములో బ్రేట్ దొరగారి యింటి యొద్ద నన్ను విడిచిరి. ఈ గొప్ప గండము నుండి నన్ను తప్పించిన భగవంతునికి చాల స్తోత్రములు చెల్లించితిని."

చీకటి పడినది పురుషోత్తముచౌధరిగారేమి యింకా రాలేదని మేజరు బ్రేట్ సైన్యాధిపతి ప్రతిక్షణము ప్రతీక్షించుచుండగా మూర్ఛబోయిన మనుష్యుని యెత్తుకొని వచ్చినటుల ఆ దుండగీండ్ర దుష్టవర్తనము చేత కొరప్రాణములతో దీసికొని రాబడుచున్న

వ్యక్తిని జూచుచు దొరగారు నిశ్చేష్టులై, ఆ క్రైస్తవులవల్ల సంగతి గ్రహించి, యా మత ద్వేషులకు ప్రతీకారము చేయదలంపక యేసుక్రీస్తు ప్రభువు పొందిన చిత్ర వధను జ్ఞాపకము చేయుచు, పురుషోత్తముచౌధరిగారిని శాంత సహానుభూతి వచనములతో నూరడించిరి. పురుషోత్తముచౌధరిగారు **"నాగటిమీద జెయవేసి వెనుకకు తిరుగు"** రకము మనిషి కాదు. చెన్నపురి పౌరులు మతద్వేషపూరితులైయున్న ఆయన యేసుక్రీస్తు ప్రభుని ప్రేమతో పూరితుడు; వారాయనను నిరాకరించి లుస్త్రలో పౌలును బాధించునటుల బాధించి వేధించినను ఆయన పౌలువలె వానిని దులిపివేసి తిరిగి యా ప్రజల యజ్ఞానాంధకారము బాపుటకే యత్నించెను. బ్రాడ్వేవారు బాధించినను, మౌంటురోడ్డు వారమర్యాద చేసినను ఆయనకు భయముండునది కాదు. చెన్నపట్టణవాసుల క్రైస్తవమత ద్వేషమును గూర్చి వారిటులవ్రాసియున్నారు!– " మరియొక దినము బజారువీధిలో ప్రసంగించుట కారంభించితిని, చాలమంది ప్రోగుపడి వినిరి. నేను పుస్తకములు పంచుట కారంభించినపుడు ఒకరి మీద నొకరు త్రొక్కులాడి నన్ను యిటునటు చాల త్రోసిరి, నా దోవతి కట్టుచెంగు పీకి వేసిరి. వారి కాళ్ళతో నాకొంకులను త్రొక్కి పొడిచిరి. నా జుట్టు కొందరు లాగిరి, కొందరు కంకరరాళ్ళతో నన్ను కొట్టిరి, తరువాత ఆ వీధిలోనుంచి నన్ను తోలివేయుటకై నా మెడపట్టి గెంటుచు, బహు విధముగా పెద్ద కేకలు వేయుచు వారి నోటికి వచ్చిన మాటలన్ని యాడుచు, ఈలాగు నన్ను నడిపించుచున్న సమయమున మరియొకడు తన యింటిలో నుండి పెద్ద కేకలు వేసికొని రాక్షసివలె వచ్చి, తన కాలినున్న జుతి (చెప్పు) తీసి కొట్టుటకై నా తలమీద బెట్టెను, కాని ప్రభువు కృపవల్ల కొట్టలేదు. వారంతా దూషించిన మాటలు నేను వ్రాయలేను. ఈలాగున రమారమీ మూడు నెలలు చెన్నపట్టణములో నుంటిని." అకటా! పై సందర్భములు చూచిన యెంత యవమానము! అబ్బా!యదియేమి ఘోరము!అయిన **"దాసుడు తనయజమానుని కన్న గొప్పవాడు కాడని" యోహాను15:20)** యేసుప్రభువు వారు చెప్పి యుండిన మాటల నాయన తలపోసికొని యట్టి యనాదరము లభ్యమైనపుడా క్రూరత్వమును ఘోరమైనదిగా నెంచక నోరిమితో సహించుకొను ఆ క్రైస్తవుని నీతి రీతి యీ క్రింది పద్యములలో గ్రహింపవచ్చును:–

సీ॥ అవమానములు భవ్యమగు - మంచి బహుమతుల్
దూషణంబులు మణీ - భూషణములు
అపహాస్యములు చంద్ర - హారముల్ మరి క్రూర
దుష్టి పాతములు ము - త్తి యపు సరులు
నిందాకటూక్తు లిం- పొందు చందన సుగం
ధామోద లిప్త శ్రే - ష్ఠాంబరములు
తాడనంబులు మూర్ధ్న - తైలాభిషేకముల్
గద్దింపు లజ్జరా గముల గనులు
గీ॥ చిత్త విశ్రాంతి గల క్రైస్త - వోత్తమునకు
ధరను జెందు విపత్పరం - పరలు, ఇంపు
సొంపుగల సంపదల భంగి - జూడ నొప్పె
యేసువాక్యార్థ మెదలోన - నిముడువలన"

సీ॥ అపహాసకులు గూడి - యాడికల్ పాడనీ
యాత్మబోధానంద - మణగి పోదు
నిందకుల్ గుమిగూడి - తొందరల్ వెట్ట నీ
మదిలోని నెమ్మి - యెప్పటికి బోదు
తరిమి గద్దించు ని - ష్ఠుర చిత్తులుండ నీ
చిత్సుఖాను భవంబు - చెదరిపోదు
పడరాని పాట్లు వె - ట్టెడు వారలుండ నీ
పరమ భాగ్యాసక్తి - తరిగిపోదు
గీ॥ అతులితానంద మోక్షరా - జ్యాధికార
వైభవోన్నతుడగు యెహో - వా కృపాను
భవము మదికబ్బినట్టి క్రై - స్తవుని ప్రేమ
భక్తి వెడలింప నెవ్వారి - వశముగాదు.

## పురుషోత్తముచౌధరి బళ్ళారి వెళ్ళుట:-

1824 సంవత్సరమున బళ్ళారిలో లండను మిషను వారు దత్త మండలమందలి యాంధ్రుల మధ్య సువార్త ప్రచార మారంభించి యుండిరి. అక్కడ నొక ఆంధ్ర క్రైస్తవ సంఘమున్నదనియు, రెవరెండ్ హవెల్ (Rev Havel) అను మిషనెరీ ఆంధ్రభాషను ఉపన్యపంచగలరనియు పురుషోత్తముచౌధరిగారు విని యచ్చటికి వెళ్ళుటకు వాంఛించి, తన యభీష్టమును బ్రేట్ సేనానిదొరగారికి దెలిపిరి. ఆయన ఆ విషయమును గురించి యాలోచించెదమనిరి. మేజరు బ్రేట్‌దొర (Major Brett) గారు ప్రార్థనా నిరతులు, ఆయన ప్రార్థనా ఫలితముగ కొన్ని యద్భుతములను జరిగియుండిన నటుల ప్రతీతి, వారి సంయుక్త ప్రార్థనా ఫలితమోయన నంతలో బళ్ళారినుండి రెవ. జాన్ హేండ్సుదొర (Rev. John Hands) గారు చెన్నపురి వెళ్ళిరి. ఒకనాడాయనయును, జాన్ స్మిత్ (Mr. John Smith), డబ్ల్యియు హెచ్ డ్రూ (Mr. W.H Drew), మేజర్ బ్రేట్ (Major Brett) గార్లు ఒకచో సమావేశమై పురుషోత్తముగారి గురించి యేమి చేసిన కల్యాణ సాధమగునో యని యాలోచించి, ఆయన బళ్ళారికి వెళ్ళి యచ్చట నుండిన రెవ. జాన్ రీడ్స్‌దొరగారి యొద్దనుండిన సర్వతోభావ శ్రేయస్కరమగునను పర్యవసానమునకు వచ్చిరి. బ్రేట్ (Major Brett) సేనాని యంతట మార్గమునకు కావలసినవన్నియు పురుషోత్తమ కవి కొరకు సిద్ధము చేసి పంపించిరి. ఆ కాలమున చెన్నపురినుండి బెంగుళూరుకి బళ్ళారికి 440 మైళ్ళు మిలిటరీ రోడ్డు వేయబడి యుండెనట. చెన్నపురి నుండి యిప్పుడు బళ్ళారికి రైలుమార్గమున దూరము 307 మైళ్ళు. ఆ కాలమున నాటు మార్గమున మన పురుషోత్తముగారు బహుశ: ఆర్కోణము, రేణిగుంట, కడప, గుత్తి, అనంతపురము, గుంటకల్లుల మీదుగా బళ్ళారి చేరి, రీడ్స్ గారి యొద్దకు వెళ్ళిరి. *అతిథి అభ్యాగత క్రైస్తవ ప్రేమాదరణముల నొప్పిన ఆ దొరగారాయన నెంతయో ప్రేమించి, వలయు శీతలోపచారము లొనర్చుచు వచ్చిరి. రెవ. రీడ్సుగారాంధ్ర భాషాపరిచయము గలవారగుటచే వారి వల్ల పురుషోత్తముచౌధరిగారు నూతన విషయము లనేకములు నేర్చుకొనుచు, నచ్చటి యాంధ్ర ప్రజలకు ప్రభునామ ప్రచారము చేయుచు, పాఠశాలలను పరీక్షింప నియమితులై యాకార్య మొనర్చుచు సంతసమున నుండెను. ఆంధ్ర క్రైస్తవులలో రెవ.సామ్యేల్, కేటకిష్ట్ బర్డర్ మున్నగు ప్రముఖలతో ఆయనకు సహవాస సంభాషణలు సమకూడెను. కొన్నిదినము లయిన తరువాత ఆయన

కచ్చుట పైత్యజ్వరము తీవ్రముగా వచ్చి బలహీనులై, శయ్యాగతులైరి. అయితే రీడ్స్‌గారిత్తరి పితృ సమానమున చికిత్స లొనర్చి, వలయు పరిచర్య చేసిరట. దైవ మహాకృపచే పురుషోత్తముచౌధరిగారి యారోగ్యము కుదుటబడెను.

* 1853 సం॥ ఇండియాలో మొదటి రైలుమార్గము బొంబాయినుండి తానా నగరుకు పడినది.

పురుషోత్తముచౌధరిగారు తాము పొందిన యాత్మ రక్షణ భాగ్యమున తమ భార్యయు, బిడ్డయు, బంధు బృందములును భాగస్వాములై ప్రభు మార్గమున నుండవలెనను తాత్పర్యముచే బళ్ళారిలో చాలకాలముండి పోవుటకు సమ్మతింపక స్వదేశమునకు వెళ్ళెదనని రీడ్స్ గారిని సెలవడిగిరి. దొరగారు ప్రస్తుతము వారు వెళ్ళిపోవుట కసమ్మతులైరి. అందు విషయము చాల సంభాషణలు జరిగెను. ఆయనను విడుచుటకు రీడ్స్‌దొరగారికి కించిన్మాత్రమైన సమ్మతిలేక పోయెను. చివరకు పురుషోత్తముచౌధరిగారు వెళ్ళుటకు తగియున్న హేతువులన్నియు రీడ్స్‌దొరగారు తేటగ దెలుసుకొనిన తరువాత అందుకు సమ్మతించి ఆ కవివరునకు వలయు సహాయమంతయునిచ్చి, స్వదేశమునకంపిరి.

**స్వదేశాభిగమనము గొప్ప సువార్త యాత్ర - విశాఖపట్టణము చేరుట :-**

ఈయన మన నూతన విశ్వాసి క్రైస్తవ మార్గజిజ్ఞాస ప్రారంభించి కటకపురిలో క్రైస్తవులైనది మొదలు ఆ పురి నుండి చెన్నపురి మీదుగ బళ్ళారి వరకు చేసియుండిన దీర్ఘమైన దాదాపు 1300 మైళ్ళ మిషనెరీ ప్రయాణమున వేన వేల ప్రజలకు ఉత్కళ, ఆంధ్ర భాషలలో సువార్త ప్రకటించియున్నారు. ఇప్పుడాయన సమకట్టిన యీ మెట్టదార ప్రయాణమున పట్టణములు పల్లెలెన్నియో గలవు క్రీస్తు శుభవర్తమానము అందలి నివాసులెన్నడు వినియుండరు. అపోస్తలుడైన పౌలు **"అయ్యో సువార్త ప్రకటింపనియెడల నాకు శ్రమ"** యని చెప్పి యుండినటుల పురుషోత్తముచౌధరిగారు తమ దేశ ప్రజలు యేసు ప్రభువు ప్రాయశ్చిత్తము ద్వారానైన విముక్తిని గ్రహింపవలెనని గాఢమైన యభిప్రాయము గలిగి యుండుటచే బళ్ళారి విడిచి గుంటకల్లు, అనంతపురము, మదనపల్లి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, మంగళగిరి, బెజవాడ, ఉయ్యూరు, బందరుల వరకు వెళ్ళి మార్గమున గల పట్టణములను గ్రామములను దర్శించి క్రీస్తువారి శుభవార్త ప్రకటించుచు పత్రికలు పంచిపెట్టుచు,

అక్కడక్కడ పరాభవము లొందుచు వచ్చినట్లు ఆయన రికార్డులో నున్నది. మంగళగిరిలో ఆయన సువార్త ప్రకటించుచుండ అతిథి సత్కారులుగ నుండిన యొక బ్రాహ్మణ కుటుంబము వారాయనను భోజనమునకు పిలిచి అరుగు అలికి, ముగ్గు పెట్టి, విస్తరవేసి షడ్రషోతపేతముగ భోజనము సమకూర్చిపెట్టి, అభ్యాగత సేవ నొనర్చి యుండినటుల మా తండ్రిగారు చెప్పియుండిరి. ఆ ప్రకారమాయన ఆ దీర్ఘ ప్రయాణము సాగించిరి. బందరు చేరినంత రెవ. జాన్ రీడ్స్ దొరగారిచ్చిన యుత్తరమచ్చుటి జిల్లా జడ్జియయిన జస్టిన్ వాట్సన్ (Justice Watson)గారి కందియ్యగా క్రైస్తవాభిమానము గలిగిన న్యాయాధికారాయనకు దయతో నిచ్చిన యిరువది రూపాయలను వందనములతో నందుకొని మళ్ళు ముఖమున ఏలూరు మీదుగా భద్రాచలము వెళ్ళి క్రైస్తవమత ప్రచారముచేసి, రాజమహేంద్రవరము, సామర్లకోట, కాకినాడ పిఠాపురము, మున్నగు పట్టణములలోను, పల్లెలలోను క్రైస్తవమత బోధ గావించి దాదాపు వేయి మైళ్ళు సంచార మొనర్చిన వెనుక విశాఖపట్టణము చేరి, హెలెన్ నాట్ దొరసాని (Helen knott)గారి యల్లుడైన కేప్టెన్ రిచర్డ్సన్ (Captain Richardson) అను సైన్యాధిపతి యింట ఎనిమిది మాసములు అతిథిగ నుండి క్రైస్తవ మత ప్రచారము గావించిరి. ఇట్లు ఈయన 18 మాసముల కాలముననే దాదాపు 3000 మైళ్ళ సువార్త ప్రచారక సంచారము గావించిరి. ఇది యపోస్తలుడైన పౌలు ప్రయాణములకన్న దూరముగ నుండెనని గణింపగలము.

ఆ కాలమున నొక్క చెన్నపురి, బళ్లారి నగరములలో దక్క నీమధ్య ప్రదేశమున కటకపురి వరకు ప్రొటెస్టాంటు మిషను లేవియు స్థాపింపబడియుండని కారణమున మన పురుషోత్తముగారు  సంచార మిషనెరీగ ప్రభువు నియమించుటలో ఆయన దయా సంకల్పములెంత వింతయైనవి! ఆ దినములలోనే యనగా 1834 జూన్ 9వ తేదిని శిరంపురంలో మిషనెరీ నాయుకులైన విలియం కేరీ కూడ మృతిలైతిరి. కావున మన కథానాయుకుని వంటి యింకొక గ్రంథకర్త, కవీశ్వరుడు, మత ప్రచారకు డావశ్యకమాయెను. **"ఇండియాలో క్రైస్తవమతము"** అను గ్రంథము 89వ పుటనుండి చూడ, 1840 సం॥ నెల్లూరులోను, 1837లో నరసాపుర మందును, 1841 సం॥ బందరులోను, 1842 సం॥ గుంటూరులోను, 1844 సం॥ రాజమహేంద్రవరమునను,

1880 సం॥ హైదరాబాదులోను, 1874 సం॥ ప్రాంతమున కాకినాడలోను ఆయా మిషనులు తమతమ కార్యము లారంభించెను. మన చరిత్ర నాయకుడు వీరందరి కన్న ముందుగనే విశాల దేశమున క్రీస్తు సువార్త ప్రచురింప కృపపొందుట పెక్కంద్ర భావిభాగ్యోదయము నిమిత్తమేయని చూడగలము.

## దేహబంధువులకు శుభవార్త ప్రచారము:-

అపోస్తలుడైన పౌలు తన దేహబంధువుల రక్షణ విషయము తాను శాపగ్రస్థుడవుటకు కోరి వారికొరకెటుల ప్రయాసపడెనో పురుషోత్తముచౌధరిగారు అదేవిధమున బంధు బృందము నందు ప్రీతివీడక తమ నూతనాశయములతోను క్రీస్తు ప్రభువునందు తమకు గలిగిన అమందానంద శాంతియుత హృదయముతోను జేరి, వారికి పాపోపశమన ప్రాయశ్చిత్త మార్గము జూపింప ప్రయత్నించిరి. కాని వారాయన నొక మ్లేచ్ఛుని జూచిన దానికన్న హైన్యముగ (హీనముగా) జూచి, కులదూరుడైనాడని, **"మాలకూడు తినివేసినాడని"** నెగ్గించుచు, తగ్గించుచు మాట్లాడి పెంట సమీపమున కొక గుంట త్రవ్వి విస్తరవేసి కబళెడన్నము పడవేయుచు, ఆయన యడుగిడిన చోట్ల నెల్ల బేణీళ్ళు చల్లుచు అనాదరణముగ జూచిరి. ఆ మదనాపుర గ్రామమున ఆయన యొక అద్దె యిల్లు తీసికొని చుట్టుపట్టులనున్న సారవకోట, తెంబూరు, తిలారు, ఉర్లాము, పర్లాకిమిడి, మున్నగు ప్రదేశ నివాసులకు ప్రభువైన యేసునామము తెలియజేయుచు, బంధుమిత్రాదుల హీనోపచారములను బెండ్లివిందులవలె భావించుకొనుచునట్టి యనాదరపరంపరచే దు:ఖభాజితమైన తమ హృదయమునకు శాంతి సంబోధనము గావించుకొనుచు, 1834 సంవత్సరాంతమున నచ్చట నీ క్రింది కీర్తన వివరించిరి--

## క్రీస్తు ప్రభువునందు ధైర్యము

రా - మారువ తా -ఆది

లోకము వారెల్ల - లోకువ జూచిన - లోపము నీకేమిటి = ప్రాకటముగ గ్రీస్తు - పతితత పావన మూర్తి - నీకోసమై ముక్తి - నిలయము గట్టంగ ॥లోకము॥

1. దరిలేని దురిత దు - స్తర పారావారము - దాటించు వారెవ్వరు - భీకరమైన - నరకాగ్ని బెట్టు బం - ధుర దేవకోపాగ్ని - మరలించు వారెవ్వరు - చంచల బుద్ధి = స్థిరపరచి పరమార్థ - మెఱిగించి చిరముక్తి - గురి దెల్పు వారెవ్వరు - ఈ ధరలోన = నరరూపు దాల్చి నీ కొఱకై జీవన మిచ్చు - కరుణాబ్ధి క్రీస్తుడు - వరదుడై యుండంగ ॥లోకము॥
2. మాటిమాటికి బాప - మార్గమున జనుచుండు - మది ద్రిప్పు వారెవ్వరు - సైతానుని - తాటించి మరి వాని - గేటించి యభయ హ - స్తము నిచ్చు వారెవ్వరు - మృత్యువు ముల్లు = మీటించి సుఖమాత్మ - నాటించి తన యోర్మి - చాటించు వారెవ్వరు - యెరూషలేము = బైట కల్వరిమెట్ట - పై మేను బలియిడిన - మేటి క్రీస్తుని నామా - మృతము నీకుండంగ ॥లోకము॥
3. హృదయ సంతాప దు: - ఖ దురంతమగు చింత - ల్వదిలించు వారెవ్వరు - నెమ్మది నిచ్చి - పదిలమ్ముతో మోక్ష - పద మిదుగో యంచు - పదమను వారెవ్వరు - ఎన్నడు నిన్ను = వదలివెయ్య నంచు - మృదువాక్యములు తెల్పి - ముదమిచ్చు వారెవ్వరు - నింకొక నాడు = సదయుడై క్రీస్తుడు - చనుదెంచి నిను ముక్తి - సదనస్థునిగ జేయు శాస్త్రోక్త మిటులుండ ॥లోకము॥

శ్రీకాకుళములో రెండేండ్ల క్రిందట తాను క్రీస్తుమతమును స్వీకరించెదనని రహస్యముగ భర్తతో చెప్పియుండిన మన రాధామణీదేవి చౌధరాణీ యిప్పుడు భర్తతో వెళ్లిపోవుటకు వాంఛ గలిగియుండినను కుల బంధములను తొలగించుకొనుట కింక ధైర్యము చాలనందున ఒకనాడు రహస్యముగ "నే నిప్పటికింక రాజాలనండీ" యని భర్తతో జెప్పినందున ఆయన యిచ్చట నుండి శ్రీకాకుళమునకు జని యచ్చట "ప్రభువునందు మిక్కిలి ప్రేమగల యింజనీయరు ఆరంస్ట్రాంగుగారిని దర్శించి యాయన ప్రేమాదరణము క్రింద నుండ ఒకటి రెండు దినములలో ఆ దొరగారికి విశాఖపట్టణము నుండిన కెప్టెన్ రిచర్డ్సన్ (Captain Richeadson)గారి యొద్ద నుండి యొక లేఖ అందెను.

## రెవ.జే.డబ్లియు గార్డన్ దొరగారి రాక :-

ఎనిమిది దినముల క్రిందట లండన్ నగరము నుండి రెవరెండు జె.డబ్ల్యు. గార్డన్ దొర (Rev. J.W. Gordon) గారు అను మిషనెరి వచ్చి యున్నట్టును పురుషోత్తముచౌధరియను క్రైస్తవుడా ప్రాంతమున నుండిన ఆయన రాక కెదురు చూచు చుండినటుల నాయనకు దెలియజేసి త్వరగా బంపిచవలననియు నందు వ్రాసియుండెను. దైవవశాత్తుగా ఆ దినము చౌధరిని ఆరంస్ట్రాంగ్ గారి యతిథులై యుండినందున వెంటనే యా సంగతి యాయన వారికి జెప్పినప్పుడు వారు మిక్కిలి సంతోషించి విశాఖపట్టణము వెళ్ళి రెవ. గార్డన్ దొరగారిని సంప్రతించిరి.

## కుటుంబము విభక్తమగుట:-

ఇప్పుడు మనము కొంత తడవు మన చరిత్ర నాయకుని అన్నగారాయిన జగన్నాధ చౌధరిగారు మదనాపుర మందలి సమిష్ఠి కుటుంబము నుండి విడిపోయి వేరొక స్థలమునకు వెళ్ళుటలో గల దైవనిర్ణయ విషయమయిన యుపాఖ్యానాంశము వైపు మళ్ళుదము.

పురుషోత్తముచౌధరిగారు క్రైస్తవ మతావలంబనకై వెడలి పోయిన వెనుక పర్లాకిమిడి ప్రాంతమందలి పితూరీ, హెచ్చుజొచ్చి జనరల్ టెయిలర్ సైన్యాధిపతి యాజమాన్యమున 21 పటాలము 1834 సం॥ జనవరి 16, 18 తేదీలలో పర్లాకిమిడి చేరెను. అచ్చటికి 8 మైళ్ళ దూరమున నున్న వంశధారా నదీప్రాంతమందలి ఆకులతంపర (పర్ణసాగరపురము) వల్లాడ, భామిని, లబ్బా ప్రదేశములలో పితూరిదారులగు సర్దార్ జోగిరాజు, సర్ధార్ ఫకీరురాజు, సవర గర్నెల్ మున్నగువారు తమ సైన్యములతో వ్యూహపడగా, జనరల్ టెయిలర్ ఆనరబిల్ జార్జి ఎడ్వర్డు రసూల్ దొరగార్లు 1834 సం॥ జనువరి 30 వ తేదీ ఉదయము బ్రిటిష్ పటాలముతోను, ఫిరంగులతోను పితూరిలో జేరిన ఆకులంపర (పర్ణసాగరపుర) మొఖాసాదారులతోను వారి కక్షదారులతోను యుద్ధముచేసి వారిని ఓడించిరి. కావున ఆ సంవత్సరము ఏప్రెల్ 12 తేదీని సర్ధార్ ఫకీరురాజు బ్రిటిష్ సైన్యపక్షమున జేరిపోయి శత్రువుల నప్పగించెను. *ప్రభుత్వము వారి యొక్కయు, కోర్టాఫ్ వార్డుస్ యొక్కయు అనుమతి పైని తీసికొనబడిన ఆకులతంపర మొఖాసా, రసూల్ రిపోర్డు 90 పుటలో సూచింపబడినటుల తిరిగి వారి కిచ్చివేయబడగా, 1834 డిశంబరు 9 తేదిని అది వారికి స్వాధీనమాయెను.

ఆ యుద్ధానంతరము ప్రభుత్వము వారు హీరమండలము దరి లక్ష్మీనరసాపురంలో జరిగించిన యొక దర్బారుకు జగన్నాథ చౌధరీగారియును ఆహ్వానింపబడెను. పర్ణసాగరపుర మొఖాసాదారు సర్దారు శ్రీ ఫకీర్రాజుగారొక నల్లని యజానేయమునెక్కి యా దర్బారుకు బోయియుండిరి. సంగీతమున నిపుణులగు జగన్నాథ చౌధరీగారు అందు కాలక్షేప మొసగియుండిరి. ఆ గాన వినోదము తమకు శ్రవణానందమగుటచే మొఖాసాదారు ఫకీర్రాజుగారు సభానంతర మా గాయకవరుని చేతిని పట్టుకొని ఉత్కళభాషలో ఆయనతో సభాంషించి, ప్రభుత్వము వారు తిరిగి తమ మొఖాసా తమ కిచ్చివేసినందున తమ కుమాళ్ళలో నెవరినైన తమ మిరాసీదారుగ పంపిన యెడల మాన్యము లిచ్చి సత్కరించెదమని బహు ప్రీతిపూర్వక వాగ్దానముల జేయగా, 1834 సంవత్సరాంతముననో 1835 సంవత్సర ప్రారంభముననో జగన్నాథ చౌధరిగారు తన జ్యేష్ఠ పుత్రుడగు అప్పలనరసింహ చౌధరీగారిని, కనిష్ఠ పుత్రుడగు గోపినాధ చౌధరిగారిని తన భార్యయగు రేఖామణిచౌధరాణీగారిని, కుమార్తెయగు భానుమతిదేవిగారిని తమతో దీసికొని వెళ్ళి, మదనాపురమున చక్రపాణిగారిని, ఆదినారాయణగారులను కుమాళ్ళను విడిచిరి. ఈ కుటుంబ మిటుల గార్యార్థము పర్ణసాగరపుర గ్రామమునకు జేలుటచే గలిగిన ఆత్మీయులాభములను, పురుషోత్తముగారాచ్చట జేసిన సేవాఫలితములను తరువాత మా పాఠకులు గ్రహింపగలరు.

* Russel's Report No.XXIV page 64,65.

# 6. అధ్యాయము

విశాఖపట్టణమున రెవ. గార్డన్ దొరగారితో సేవాపునరారంభము; రాథామణిదేవిగారి మహోత్యాగము; కటకపురికి రెండవ ప్రయాణము; ఆమె క్రీస్తు మతమును స్వీకరించుట.

**" నేను బర్నబాను సౌలును పిలిచిన పని కొరకు వారిని ప్రత్యేకపరచుడు,"**

**అపో 13: 2.**

---♦--- ♦---♦---

1832 సంవత్సరము రెవ. జేమ్సు డాసన్ దొరగారు చనిపోయిన మూడేండ్ల వెనుక రెవ. జే డబ్లియు, గార్డన్ దొరగారు లండన్ మిషన్ సొసైటీ పక్షమున మిషనెరీగా విశాఖపట్టణము చేరిరని చదివియున్నారు కదా? వారు ఇంజనీయరు ఆరంస్ట్రాంగు దొరగారి ద్వార పంపించిన వర్తమానము పురుషోత్తముచౌధరిగారు విశాఖపట్టణములో వారిని సంప్రదించిన వెనుక వారి ప్రేమాదరణములనందుకొని, బర్నబా పౌలుల వలె నిద్దరును సువార్త ప్రచారమునకు దొణంగిరి. ఎక్కడి లండను నగరము! ఎక్కడి విశాఖపట్టణము వెనుక చాలాకాలము వరకు పురుషోత్తము, గార్డన్ గార్ల ద్వారా జరుగవలసిన సువిశేషప్రచారమాంధ్రదేశమున కమూల్యభాగ్య మొనరింపవలసినందున వారినిద్దరిని సహకారులుగ గుదుర్చుటలో గల దైవ సంకల్పమగమ్య గోచరము; లోగడ లండన్ మిషన్ వారి ధనసహాయమున 1827 సంవత్సరము వెలసిన పన్నెండు పాఠశాలలలో 500 మంది విద్యార్థులు లుండిరి. మేజరు బ్రేట్ సేనాని యాజమ్యామున హైందవోపాధ్యాయులచేనవి సాగుచుండెను. అప్పుడు పురుషోత్తముచౌధరి వానిపై పరీక్షకులుగను, మత ప్రచారకులుగను నుండుటకు గార్డన్ దొరగారు కోరి, కొంత వేతనము నియమింప సూచింపగా ఒంటరిగ నుండినందున దమకు జీతమక్కరలేదనియు, ఆ కాలపు చౌక ధరల ప్రకారము సకల విధమైన ఖర్చుల కొరకు రోజుకు రెండణాల నాలుగు పైసలిచ్చిన కాలక్షేపము జరుగుననియు పూర్వము బ్రేట్ దొరగారితో జెప్పియుండినటుల ఆయన గార్డన్ దొరగారితోను జెప్పిరి. అందుపై గొంత సంభాషణ సాగెను. చివరకు పురుషోత్తముగారి కోరిక ప్రకారమే జరిగించిరి.

రమారమి యొక సంవత్సరము వారిద్దరు నేకాభిప్రాయులై సువార్త ప్రచారము చేసిరి.

1835 సంవత్సరము డిశంబరు నెలలో మన కథానాయకుడు మరియొకసారి విశాఖపట్టణమునకు సుమారు 80 మైళ్ళు దూరమందుండిన తమ కుటుంబము వారిని జూడ వెళ్లిరి. అప్పటికి వారి తల్లి  కాలము చేసినటుల గనబడును.

రెండేడ్ల నుండియు మన కవియు, నాట్ దొరసానియును, మేజరు బ్రేట్ దొరగారును చేయుచు వచ్చిన ప్రార్థనలకు ఫలితమేయని బాబు  రఘునాద్‌పాల్ మహాంతి, కుమార్తెయైన పురుషోత్తమ భక్తవరుని సతీమణి రాధామణి దేవిగారు యేసుప్రభువు యొక్క భక్తురాలై జీవింప సాహసించెను. బందువు లెప్పటి వలె పురుషోత్తముగారిని నిందించి మత వైషమ్యము చేత ననాదరభావమునే చూపించుచుండిరి.

ఇట్లుండ, ఆ డిశంబరు నెల 22 వ తేది మధ్యాహ్నము ఒంటి గంట సమయమున జరిగిన సంఘటన సుప్రసిద్ధమైనది. ఒక కావటి వాని కుదుర్చుకొని పురషోత్తముచౌధరిగారు ప్రయాణ సన్నాహముతో దమ యింటి యరుగు మీద గూర్చుండి యుండిరి. లోగడ యేర్పాటుల మేరకు శ్రీమతి రాధామణిచౌధురాణి పసుపు చీర గట్టుకొని కాళ్లనందెలె కడియములు ఘళ్ళుఘళ్ళున శ్రావ్యనాదములొనర్ప సకలసద్వస్తు భూషితయై, కన్నులకు కాటుక రేఖలొక సొంపు నింప, నెన్నుదుట బున్నపుచంద్రుని బరిహసింపు పుణ్యాంగనాసూచకమైన కుంకమ బొట్టు పెట్టుకొని తాను గోషాయువతి యగుటచే గొందరు బిడ్డలు కలుగు వరకు బహిరంగముగ భర్తతో మాట్లాడ గూడదను వంగోత్కళ దేశ నియమముండినను అసూర్యంపస్యయగు నీమె వరలోనుండి తీసిన కత్తివలె నతి ధైర్యముతో కన్నవారి యిల్లు విడచి భర్త కూర్చొనియుండిన యింటి గుమ్మము కడకు బోయి, ముఖము వాల్చి, ముందర నిలచి, ఉత్కళ భాషలో "ప్రాణేశా! మీకెంతగతి గూడెను; మా కన్నవారు మీకు బెట్టుచున్న కడగండ్లకు నేనోర్వలేను ప్రాణనాధా! మీరు విశ్వసించుచున్న యేసుప్రభువు నా త్రాణకర్త యని నేనును నమ్ముచున్నాను. పదండి వెళ్ళుదము నేను మీ వెనువెంట వచ్చుటకు సిద్ధముగనే యున్నాన"ని చెప్పెను. ఇట్లామె పట్టపగలు భర్తతో మాట్లాడుచున్న యా సంభవమును జూచుటకు అనేక స్త్రీ పురుషులొక సంతవలె గూడిరి. కొందరు, పొలములలో చేని కోతపని విడిచిపెట్టి యీ వింత జూడ పరుగెత్తుకొని వచ్చిరి. రాధామణిగారి తల్లియైన లావణ్యవతియు, అన్నలగు భాస్కర

మహంతి, రాజామోహన్ మహంతి అనువారలును జాలమంది బంధువులు నింట నుండిరి. గనుక వారిలో మిక్కిలి యాక్రందనము లేచెను. వారేమేమో నిందలాడి చాల గందరగోళము చేసిరి. ఆమె యన్నలలో నొకరు ముందుకు వచ్చి "రాధామణీ! నీ భర్త మా వాకిటకైన రాకుండ, మాతో జెప్పకుండ నీకు నీవె గుమ్మముదాటి యాయన యొద్దికి వెళ్లుటకు నీకింతధారణ యింత సాహసమేలాగు పుట్టెను? అతనితోగూడ ఆ మాలకూడు తినుటకు నీ మనస్సేలాగొప్పెను. మేమిక్కడ అంత పరువు మురువుతో పేరు ప్రఖ్యాతులతో నుండగా నీవు మా పరువు మర్యాదులు పోగొట్టుదువా?నిన్ను మేమెంత మాత్రము పోనియ్యము" అని ధిక్కరించి చెప్పెను. అప్పుడా చెల్లెలు ధైర్యముతోను, మృదువుగాను "అన్నా నేను రెండేండ్లన్నర పర్యంతము నా పెనిమిటిని జూడక మీ యింట నుంటిని! ఈ మధ్యను నాకు ధైర్యము చాలనందున ఆయన యెన్ని మార్లువచ్చి పిలచినప్పటికిని నేను వెళ్లలేదు అందుకు మీరే సాక్షులు, ఇప్పుడు నా మనసు స్థిరపడినది, ఆయనది యేమార్గమో నాదిన్ని యామార్గమే యవునుగాక! మీరు నన్ను అటకాయించలేరు; మీ కులాచార మర్యాదలు నాకక్కరలేదు. నేటితో వాటి నన్నిటిని వదలుకొనుచున్నాను. నా పెనిమిటి రాజైతె నేను రాణినగుదును, ఆయన భిక్షకుడైతే నేను భిక్షమెత్తెదను కనుక నాకు సంతోషముతో సెలవియ్యుడ"ని ప్రతిచెప్పెను. అప్పుడామె యన్నగారు చింతతో "అమ్మా! నీకు తినుటకేమైన తక్కువైనదా! కట్టుట కేమైన తక్కువైనదా! నా కరణీక గ్రామములలో నొకటి నీకిచ్చెదను.దానివల్ల కలిగిన ఫలసాయముకూడ నీకు తెచ్చియిచ్చెదను. కాబట్టి నీవా మాలకూటికి పోవద్దు" అని చెప్పగా "అన్నా! నీ విదంతా నాకు చేయగలవు కాని, భర్త నియ్యలేవుగదా! భర్తను విడిచియుంటే పరులేమందురో గ్రహించుకొనుము. నేను నిశ్చయముగా వెళ్ళెదను నన్నడ్డవద్దు" అని మారు చెప్పెను. ఇటువంటి యనేక ప్రశ్నోత్తరములు జరిగిన తర్వాత ఆమె యన్నయును బంధువులును, చూడవచ్చిన జనులలో కొందరును కన్నీళ్ళు విడిచి యేడువసాగిరి. తుదకామె యన్నగారొక చురకత్తి యెత్తి "నీవు వెళ్ళినట్టయితే యిదుగో యీ కత్తితో పొడుచుకొని చత్తునని" యామెను బెదిరింపసాగెను. అవి పెదవులు జారివచ్చిన బెదిరింపులేయని యామె ఎరిగి, ధృఢము తప్పక "నీకు నీవే చత్తునంటే నేనేమి చేయగలనన్నా" నీ యిష్టప్రకారము నీవు చంపుకో గాని యిదుగో నేను సెలవు పుచ్చుకొనుచున్నాను; నా చిన్న బిడ్డ శాంతి యెక్కడ? దాని

నాకిచ్చివేయుడి; నేను వెళ్ళుచున్నాను అని యామె చెప్పినప్పుడు బంధు బృందములోని స్త్రీ పురుష లందరు ముందుటికంటే యధికముగా హా హా కారములెత్తి మా(క్రందనము చేయ, నా దు:ఖ ధ్వనులు బహు దూరము వ్యాపించెను. అంతలో నెవరో వారి గారాబము కొలది యా పిల్లను దాచియుంచిన యామె నిలిచిపోవునని తలంచి పిల్లనియ్యమని దాచివేసిరి. ఎన్నడైన నింతమంది యున్నప్పుడు గుమ్మములోనికి రానటువంటి రాధామణీదేవిగారు కులాచారములను ప్రతిఘటించి గోషాపద్ధతి మూలముట్టించి యా ప్రజల మధ్య నుంచి భర్త యొద్దకి వెళ్లిరి. ఆయన కావటి వానితో ప్రయాణ సన్నాహులై యుండిరి. కావున బయలు వెడల సిద్ధపడిరి. "పిల్లనియ్యలేదు, దాచుకొనిరని" యామె భర్తతో చెప్పెను. ప్రేయసీ భయపడకుము; ఈ యూరి పొలిమేర దాటకముందే వారు మన పిల్లను దెచ్చి యప్పగించెదరు; లేదా పిల్లతో వారందరు శ్రీకాకుళము కోర్టుకు రావలసియుందురని" పురుషోత్తముగారు ప్రత్యుత్తరమిచ్చెను. "మంచిది పదండి వెళ్ళుదము" అని యామె నడువసాగెను. ఇటువంటి యా ధైర్యమును జూచిన వారందరును మిక్కిలి యాశ్చర్యమగ్నుమానస్కులైరి. పిత్రార్జిత భూములపై తమకు హక్కుండినను, వాటిని గురించి పురుషోత్తముగారు తలంచినటుల గనబడదు.

రెండు సంవత్సరముల ఆరుమాసములు కుటుంబ దూరులుగ నుండి, యిప్పుడు తమకు " కార్యేషు దాసియు, కరణేషు మంత్రియు, రూపేచ లక్ష్మియు, క్షమయా ధరిత్రియు, సహనేచ మాత యునైన తమ ధర్మపత్ని తాము విశ్వసించిన యేసు ప్రభువు నందు సహ విశ్వాసినియై యీ విధముగ దమ పక్షము చేరినందున పురుషోత్తమ భక్తవరుడు హృదయానందభరితుడై దేవుని స్తుతించుచు, కావటి వాని ముందు నడువుమని నియోగించి వారుభయులు వెనుక నడవసాగిరి. అది కోత కాలమై యుండుటచేతో మతద్వేషము చేతనో ప్రయాణమున కాగ్రామమున వారికి బండిదొరకదయ్యెను. రాధామణిదేవిగారు ముసుగెత్తి వేసికొని భర్త వెంబడి నడువసాగెను. బంధువులు తక్కిన వారందరు బహు శోకభరమున ఎలుగెత్తి యేడ్చిరి. వారలు పది బారలు దూరము పోవకముందె వారి చిన్న బిడ్డను తెచ్చి వారికప్పగించిరి.

అప్పుడు పశ్చిమమున సూర్యుడు సింధూర తిలకపు చందమున శుష్కించుచు

రాధామణిదేవిగారు కట్టుకొనిన బచ్చని చీరపై అరుణ కిరణములు ప్రసరింపజేయగా అది ప్రతిఫలించుచుండెనట! వెనుక నున్న జనసమూహములు తమకు ద్రోచినట్లెల్ల శాప వచనములెత్తి యాకాశము నింపుచుండిరి. మరియు నెవ్వడో బిగ్గరగా "చచ్చిన పెనిమిటితో గుండములో బడబోవు ఆడు దానిని జూడండి చూడండి" యని అరచెనట! మదనాపుర గ్రామమున నా మధ్యాహ్నము పై కథయంతయు జరుగుచుండగ మన కవి క్రింది ఈ కీర్తన రచించెను.

## రక్షణాహ్వానము

**రా – శ్రీరాగము** **తా – త్రిపుట**

రారో జనులార – వేగము గూడి – రారో ప్రియులార – శాశ్వతమైన – ఘన రక్షణ జేర = సారాసారముల్ = సమ్మతిగా జూచి – ధీరత్వమున క్రీస్తు – జేరు దారి గోరి ॥రారో॥

1. అనుమానము లన్ని – మీరలు మాని – అద్యంతము లేని = కనికరము చేత – మనల రక్షింపను – దన జీవము నిచ్చు – ఘనుని క్రీస్తుని గొల్వ ॥రారో॥
2. మన పాపము లన్ని – మోయను దే –వుని చే బని బూని = మనుజావ తారుడై – వినుట కద్భుతమైన – పను లెన్నో చేసి సి – ల్వను బడిన ఘను జేర ॥రారో॥
3. పాపాత్ములగు వారి – భారము ద్రుంచి – బలుడైన యుపకారి = ఓపికతో దన – దాపు జేరిన వారి – శాపము తా మోసి – కాపాడు ఘనువేడ ॥రారో॥
4. తన యాత్మకు గీడు – గల్గించెడు – ఘనత లెల్లను పాడు = తనువు నిత్యముగా – దని యభిమాన – ముసు వీడి మన క్రీ – స్తుని జాడ గతిజూడ ॥రారో॥
5. సకలాంతర్యామి – నిరాకారు – డొకడే యంతట సామి = ప్రకటముగా మర్త్య – లకునెల్ల మధ్యస్థ – డొకడే క్రీస్తుడు సం – రక్షకుడై యిలకు వచ్చె ॥రారో॥
6. ఒక మానవుడైన –పాపము లేని – యకళంకుడెవడన్నా = సకలావస్థల సంసార బద్ధులై – మెకముల వలె జ్ఞాన – మెరుగించి వారెల్ల ॥రారో॥

వారు దారిలో బోవుచుండ మనకవి తన భార్యయొక్క ధైర్యస్థైర్యములకొక వంక సంతసించుచు, వేష భూషణముల నిస్సారతను గూర్చి యామెకొకింత యుపదేశింప నామె తన యలంకారములను దీసివేసి హైందవ పుణ్యాంగన లతిభక్తితో, జూచుకొను గాజులను సహా లాగి వేసెనట! అనంతర మామె యాథ్యాత్మిక విషయములలో నతీతాంశములు నేర్చుకొన గలిగెను.

ఈ వృత్తాంతము చదువుచుండ జాన్‌బన్యన్ వ్రాసిన యాత్రికుని ప్రయాణమున క్రైస్తవుడు "నాశనపురము" నుండి పలాయనుడగుచున్న సంగతి జ్ఞాపకమునకు రాక మానదు." **"మృతులు తమ మృతులను పాతిపెట్టనిమ్ము, నీవునన్ను వెంబండించు"** అని యేసుప్రభువు చెప్పిన చొప్పున ఈ మన యాత్రికుడు, యాత్రికురాలు తమ సిలువ నెత్తుకొని తమ త్రాణపతియైన యేసు నాథుని వెనువెంబడిజని మదనాపుర వాసులకు ఆంధ్రదేశ వాసులకు పై కీర్తలలోని యాహ్వాన మింకను గావించుచున్నారు.

1935 సంవత్సరము డిశంబరు నెల 23 వ తేదిని మన నూతన యాత్రికులిద్దరు తమ చిన్న బిడ్డ శాంతికుమారితో శ్రీకాకుళము చేరి యచ్చట గొన్నాళ్ళుండి, యెచ్చటికి పోవలెనో యని కర్తవ్యమాలోచించుకొనిరి.

కటకపురిలో యిష్టా గోష్ఠి సహవాసమునకు భారతీయ క్రైస్తవ స్త్రీలుండిరి. ఆంధ్ర భాషా పరిచయము రాధారాణిదేవి గారికి విశేషముగ నుండలేదు. ఉత్కళ భాష వ్యహరించు నామె యుత్కళ స్త్రీలుండు స్థానమునకే వెళ్ళగోరెను. పురుషోత్తముగారికిని నట్లే తోచెను. పురుషోత్తము గారు తమ నిర్ధారణ విషయము విశాఖపట్టణ మందలి గార్డన్ దొరగారికిని మరికొందరు స్నేహితులకును దెలియజేసి, వారి ప్రత్యుత్తరములును ఉపకారములును వడసి, 1836 సంవత్సరము జనవరి నెలలో శ్రీకాకుళము విడచి కుటుంబముతో కటకపురి కేగిరి. "కులీనతా సంపన్నత్వాదుల నొప్పిన యొక భారతీయ యువతి యిటుల యేసు ప్రభువును తన పరిత్రాణకర్తగా భావించి దూరభార ప్రయాణము చేసి తమ యొద్దకు జేరుట కటకపురి మిషనెరీలకును, క్రైస్తవబృందమునకు నత్యంతానందదాయక మాయెను." రాధామణిగారికి అక్కడ భారత నారీమణుల సహాయమున క్రైస్తవ మతానుష్ఠాన విషయమైన విశేష విషయములు నేర్చుకొని, స్నానదీక్ష గైకొన నాశించి నందున 1836 సంవత్సరము ఏప్రిల్ 3వ తేదిని కటకపురి

ఒరిస్సా బాప్టిస్టు మిషనెరీ రెవరెండ్ ఏ.సట్టన్ దొర (Rev. Amos Sutton)గారి వల్ల బాప్తిస్మము స్వీకరించిరి. ఆ సందర్భమును గూర్చి 1837 సం॥జూన్30వ తేదినంతమైన జనరలు బాప్టిస్టు మిషన్ వారి సాంవత్సరిక నివేదికలో నీ క్రింది విధమున వ్రాయబడి యున్నది.

"యీ యువతి క్రీస్తు ప్రభువును అంగీకరించిన విషయ మాలోచించిన సువార్త ప్రచారకుల సంఖ్యను తక్కువగ నన్నదను దు:ఖకరమైన దృష్టాంతమును రక్షణకర్త యొక్క విధానము లన్నిటిని, ప్రతిఫలింప నీమెకు గల మనోహరవాంఛారతియు వ్యక్తమగుచున్నవి. కోరిక సృష్టమగు చున్నది. యేసు ప్రభువు యెడల ఆమెకు గల భక్తి విశ్వాసము లీవిధమున బహిరంగ నొప్పుకొనుట కీమె యిరువది దినముల ప్రయాణము చేసెనని" యొక అమెరికను మిత్రుడు తెల్పెను. *ఆహా! యిది యెంత యాశ్చర్యకర సంఘటనము! ఎంత యద్భుత ధర్మానుచరణము! ఆచార భూయిష్టమైన శిష్టశాఖకు జెందిన యొక నారీమణి కూపస్థ మండూక న్యాయమున పరదావాసినియై యుండక తనలోని యమూల్యమైన యాత్మ రక్షణ భాగ్యము నీ విధముగా బొంది అనేకులకును, ముఖ్యముగ కుటుంబము వారికిని ఆదర్శ ప్రాయముగుట ధన్యవాదకరమైన విషయము గదా? ఈమెకు స్నానమిచ్చిన రెవ. అమోస్ సట్టన్ గారొక అమెరికా స్త్రీని వివాహమాడుటచే ఆ దినములలో నాయన ఆమెరికాకు బోయి యుండగా ఆంధ్రదేశమున సువార్త విరివిగా ప్రచురింపవలసిన యావశ్యకత దెల్పిరి. అందుచేతనే అమెరికను బాప్టిస్టు మిషను, సంస్థాపితమై రెవ.ఎస్.ఎస్. డే దొరగారు పంపబడిరని "ది యెంటరు ప్రయిజర్" వ్రాయుచున్నది.

* Report of the General Baptist Missionary Society 1837, page 15.

# 7. అధ్యాయము

**....నన్ను తన పరిచర్యకు నియమించి నమ్మకమైనవానిగా నెంచి నందుకు నన్ను బలపరచిన ఘన ప్రభువైన యేసుక్రీస్తుకు కృతజ్ఞుడనై యున్నాను. 1తిమోతి 1: 13.**

అభిషేకము; ఉత్కళదేశమున ప్రథమ పాలక పదవి. జడ్జి స్టోరీ దొరగారి వశమున సేవ; రెవ.ఎస్.ఎస్. డే దొరగారికి ప్రథమ సహాయకులగుట.

---♦--- ♦---♦---

## పురుషోత్తముగారి నభిషేకించుట, కార్య నిరూపణము :-

తమ సహధర్మచారిణి స్నానము పొందిన వెనుక పురుషోత్తముగారు తిరిగి విశాఖపట్టణము వెళ్ళుటకు యుద్యమించిరి. కాని కటకపురి మిషనెరీ వారు ఆయనను విడువ సమ్మతింపక, యా కుటుంబము నచ్చట నిల్పివేయ గోరినందున వారచ్చట నిల్చిపోయిరి. వారనంతరము పురుషోత్తముచౌధరిగారి గుణశీలములను, క్రైస్తవమతాసక్తిని యోచించి, ఆయన సర్వ విధముల ప్రభువుయొక్క ప్రేషితుడుగ నుండ యోగ్యులని నిశ్చయించి 1836 వ సంవత్సరము ఏప్రిల్ నెల 24వ తేది యాదివారమున సంఘమును సమకూర్చి ముగ్గురు మిషనెరీ లాయన తలమీద హస్తనిక్షేపముచేసి సువిశేష ప్రచారమునకై యభిషేకించిరి. అత్తరి వారి సంబంధికానుండిన బాబుదొయితారి నాయకు మహాశయోగారును అభిషిక్తులైరి. ఈ విషయము ఒరిస్సా బాప్టిస్టు మిషను వారి రిపోర్టులో నీ విధమున వ్రాయబడి యున్నది:- "కావున రెండవ పర్యాయము సమర్థులైన స్వదేశమిషనెరీల యభిషేకము జరుగుట మిషనెరీ కల్యాణవాంఛితులగు మిత్రులకత్యంతాహ్లాదదాయకమును, అభినందనీయమునైన విషయము. అత్తరి ప్రభువు కార్యార్థమునకు ప్రత్యేకింపబడిన సోదరులు దొయితారి నాయక్, పురుషోత్తముచౌధరీగార్లల, అభిషేకారాధన ప్రభువు దినమందు (ఏప్రిల్ 24 వ తేది) 1836 సం॥ కటకములో కాన్ఫరెన్సు మహాసభ జరిగిన వెంటనే జరిగెను. సట్టన్ గారు లేఖనములు చదివి అభిషేక ప్రార్థన చేసి, 1 తిమోతి 4 వ అధ్యాయము 16 వ వచనము నుండి చార్జి (అధికార భారము) అప్పగించిరి. డబ్లియు బ్రౌన్ గారు

ఉత్కళభాషలో ఉపోద్ఘాతోపన్యాసము గావించి అంత్య ప్రార్థన చేసిరి. ఆరాధనారంభమున రామచంద్రా గారు ప్రార్థించి బ్రౌన్, సట్టన్, నోయెల్ గార్లతో హస్తనిక్షేపము చేయుటలో పాల్పొందిరి. ఆరాధన యంతయు ఒరియా భాషలో జరిగెను. సభా సమావేశము బాగుగా నుండెను. ఆ సావకాశము మనోహరమైనదిగ నుండెను. భారతదేశ సోదరు లిట్టివనేకములు చూచెదరు గాక! సొసైటివారి కిప్పుడు నలుగురు అభిషేకబోధకులు కలరు."

## బరపురమునకు ప్రథమ సహాయక మిషనెరీగ వెళ్ళుట:-

గంజాంజిల్లాలోని బరంపురమున 1836 సంవత్సరము ఇంగ్లీషు బాప్టిస్టు మిషనెరీలు తమ పనినారంభిప దలచిన రెవ. డబ్లియు.బ్రౌన్ (Rev. W. Brown) దొరగారిని మిసనెరీగ నేర్పరచి, రెవరెండ్ పురుషోత్తముచౌధరిగారిని సహాయక మిషనెరీగ నియమింపగా ఆసంవత్సరము మే లేక జూన్ నెలలో ఆయన కుటుంబ సహితము బరంపురము చేరిరి. ఆయన యుపదేశమూలమున బాలాజీసాహుగారు అనునొక ఉత్కళ బ్రాహ్మణుడు భార్యా సహితము క్రైస్తవుడాయెను. ఈయన* కుటుంబమువారు నేటికిని క్రైస్తవ సంఘమున గలరు. బ్రౌన్ దొరతగారా కాలమున కలకత్తా వెళ్ళిపోవుటచేత పురుషోత్తముచౌధరిగారే యాప్రదేశమున సువార్తప్రచారము చేయుచుండిరి. బాలాజిసాహు ఆయనకు సహాయకులై యుండిరి.

* బాలాజీ సాహుగారు 1875 సం॥ జూన్ 3 తేదిని ప్రభువునందు నిద్రించిరి.

అప్పుడు గంజాం జిల్లాకు కలెక్టరుగ నుండిన స్టీవెన్సు (Stephen Esq)దొరగారు బహుభక్తిపరులు. పురుషోత్తముచౌధరిగారిని బాలాజీసాహు గారిని వెంటనే పంపించవలెనని ఆయన బ్రౌన్‌దొరసానిగారి పేర వ్రాయగా, ఆమె యాసంగతి చెప్పినమీదట వారిద్దరు బయలుదేరి బరంపురమునకు ఐదు క్రోసుల దూరమున నున్న సీతారాంపల్లియను మారుపేరుండిన ఛత్రపురము వెళ్ళి జిల్లా కలెక్టరు గారిని దర్శింప, ఆయన వారిని జూచి కుశల ప్రశ్నలడిగిన తరువాత తనలోని యుద్దేశము బయలుపరచుచు, "మీరుభయులు మీ కుటుంబములతో వచ్చి నా యొద్ద నుండుడి. బలులిచ్చుటకు కోదులను వారు దాయగా, సర్కారు వారు విడిపించిన పదునలుగురుకోదు (కాండ్ల) పిల్లలు నా కడ పెంచబడుచున్నారు. వారి సంరక్షణ బాలాజిసాహుగారు

మీకప్పగింతును. ఇక్కడను, ఈ చుట్టుపట్టుల గ్రామాదులలోను ఉన్న ఉత్కళ, ఆంధ్ర భాషలు గల ప్రజలకు పురుషోత్తముచౌధరి గారూ! మీరు బోధించవచ్చును. మీ కుటుంబములకు, మీకు కావలసిన ఖర్చు వెచ్చములు నేను బాగా ఇచ్చెదను. ఇక్కడ మీ కొరకు మంచి యిండ్లు కట్టించెదను. ఆరాధనల నిమిత్తమొక దేవాలయముకూడ గట్టించి యిచ్చెదను. చెన్నపట్టణము నుండి పత్రికలును, పుస్తకములును, అవసరమైనన్ని తెప్పించి యిచ్చెదను. ఇంక మీమీ బంధువు లెవరైన క్రైస్తవులయే పక్షమున వారికొరకున్ను ఇండ్లుకట్టించి, వారుచేయదగిన యుద్యోగములను వారికిప్పించెదను. కాబట్టి మీరు వీనియన్నిటికి సమ్మతించి నా యొద్దకు మీరు వెళ్ళిపోరావలెనని" తేటతెల్లమైన చక్కని తెలుగు మాటలతో స్వచ్ఛముగ జెప్పిరట. ఈ దొరగారు మంచి భక్తి గలవారని వారు ముందే తెలిసికొని యుండిరి. అప్పటికి వారే విధ వాగ్ధానమును చేయక యింటికి బోయి, యాలోచించుకొని మూడు నాలుగు దినములలో తిరిగివచ్చి చెప్పెదమని చెప్పి, సెలవు గైకొని ఆ రాత్రి ఆ యూరనే యుండి, తెల్లవారి బయలుదేరి యిండ్లకు జేరిరి. అయితే యా రాత్రి బహుభయంకర సంఘటనము జరిగెను. అలాగు వారితో నా సాయంత్రము మాట్లాడిన కలెక్టరు దొరగారు ఆ రాత్రి వాంతిభేదిచే 12 గంటలకు చనిపోయిరని, వారిండ్లలో నడుగు పెట్టీ పెట్టుటతోనే బ్రౌన్ దొరసానిగారు వారికి దెల్పిరి. అందుచే వారు నిశ్చేష్టితులై మానవజీవితమెంత యనిత్యమైనదియోయని తలపోసిరి.

## జడ్జీ స్టోరీ దొరగారి యాహ్వానము:-

ఆ కాలమున శ్రీకాకుళములో సివిలుసెషన్సుజడ్జిగ నుండిన ఈ. స్టోరీ (Justice E. Story) దొరగారు పటాలపు ఉద్యోగీయుల ద్వారా పురుషోత్తముగారిని గూర్చి విని, ఆయన తన యొద్దనుండి ప్రభువు కార్యము చేయుటకు గోరి వ్రాసినందున పురుషోత్తము చౌధరిగారా సంగతి విషయము కటకపురి మిషనెరీలకు వ్రాసివారియనుమతివడసి చత్రపురములో నుండిన కోదుపిల్లల సహితము తమ యొక్కయు, బాలాజిసాహుగారి యొక్కయు, కుటుంబములతో శ్రీకాకుళమునకు వెళ్ళి జస్టిన్ స్టోరీ దొరగారి యొద్ద గొంతకాలముండి శ్రీకాకుళంచలనమున సువార్త ప్రచారము జరిగించిరి.

ఒకనాడు జడ్జీదొరగారు పురుషోత్తముచౌధరిగారిని బిలిచి, ఈస్టిండియా కంపెనీవారి కొలువునకు వచ్చుటకిష్టముండిన శిరస్తదారు హోదా యుద్యోగమిచ్చెదనని మంచిజీతమిప్పించెదనని చెప్పినను **"మోషేవలె ఐగుప్తు ధనముకంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని"** శుభవర్తమాన ప్రచారముతప్ప మరిదేనిజేయ దమకిష్టములేదని తెల్పిరి. ఈ సంగతి పురుషోత్తముగారి కుమార్తెయైన మార్తాబర్దరు బంధువు జేమ్సుచిన్నయ్యగారు 1902సం॥ నేను కటకము వెళ్లియుండగా నాతో జెప్పిరి.

**మెరియా పిల్లల రక్షణము:-**

మనమీ చరిత్రమున పదునలుగురు కోదుజాతి వారి పిల్లలనుగూర్చి చదివియున్నాము, ఆ జాతి ప్రజలు గంజాంజిల్లా మన్య ప్రదేశములోనుండి, బూరపెన్ను, తారపెన్ను, అను తమ దేవతలకు బిడ్డలను బలియిచ్చు వాడుక పడియుండిరి. అట్లు బలియిచ్చుటకు గొనిపోబడిన వారిని ప్రభుత్వము వారు రక్షించి మిషనెరీల కప్పగించెడివారు. అట్టి విమోచిత బాలురు క్రీస్తుద్వారా ఆత్మీయవిమోచనము కూడ పొందిరి. కోదులు ఇతరులపిల్లలను గూడ దొంగతనముగా బలి యిచ్చుటకై యెత్తుకొనిపోవువారు. వారిని "మెరియా" పిల్లలందరు. అట్టి మెరియా పిల్లలు కూడ మన కవి ద్వారా ప్రభువును దెలిసికొని యాయన సేవకులై వారి సంతతివారిప్పుడును మన మధ్యనున్నారు.

పురుషోత్తము చౌధరిగారిప్పుడు శ్రీకాకుళముననుండుట యింకొక విషయమున దైవ సంకల్పమై యుండెను. అమెరికన్ తెలుగు బాప్టిస్టు వారు ఆంధ్రదేశమున దమ సేవ నారంభింపనుద్యుక్తులై తమ ప్రథమ మిషనెరీయైన రెవ. సామ్యేల్ ఎస్. డే (Rev. Samuel S. Day) గారిని బంపగా ఆయన 1836 సం॥ మార్చి 7వ తేదీని విశాఖపట్టణము చేరిరి. కొన్ని మాసములచ్చట రెవ.జే. డబ్లియు.గార్డన్ దొర గారితో నుండి యింగ్లీషు ఆరాధనలలో దోడ్పడుచు వచ్చిరి. 1836 సంవత్సరమచ్చట 100 మంది వరకు భారతీయ బాలికలు లభించుటచే నొక బోర్డింగ్‌ను గార్డను, పోర్టరు దొరసాని గార్లు నడపించుచుండిరి. ఆ సంవత్సరమే విశాఖపట్టణమున మొదటి ఆంధ్ర క్రైస్తవ దేవాలయము నిర్మింపబడెను. ముద్రాశాల యొకటి స్థాపింపబడెను. 150మందివరకు "సబ్బాతుబడుల"కు వచ్చుచుండిరి. *అప్పుడే

**"కులాచార పరీక్ష"** యచ్చుపడి యుండును. అట్టి యభివృద్ధి గల స్థలములో డే గారుండినను ఆయన స్వయముగా మిషనెరీలు లేని స్థలమేర్పరచుకొన గోరుటచే నచ్చటికి 70 మైళ్ళు దూరమందలి నాగావళీనదీతీరమందలి శ్రీకాకుళమునకు డే దొరగారు కుటుంబముతో జని యాంధ్ర భాష నేర్చుకొన నారంభించిరి. దాని విషయము రెవ. ఎన్. కనకయ్య అను సోదరులిట్లు వ్రాసియున్నారు.

* The History of the Telugu Mission (Lonestar) page 28.

## డే దొరగారితో సువార్త సేవ :-

"ఆ సమయములో నచ్చట సువార్త బోధకులై యుండిన పురుషోత్తమయ్య గారు వీరికి జాల సహాయులై బడులు స్థాపించు విషయమున కుమ్మక్కు చేయుచు, డే దొర, గార్డన్ దొర గార్లతో గలుసుకొని తరుచుగా శ్రీకాకుళ ప్రాంతమందు సువార్త సంచారము చేయుచుండినట్లు పురుషోత్తమయ్య గారి వలన స్వంతముగా దెలియ జేయబడెను. ఆ కాలమున క్రమమైన రస్తాలును, బాటలును లేనందున సవారీలవల్ల మోయబడుచు గంతయెద్దులవల్ల సామాను వగైరా మోయబడుచు సంచరింపగలిగిరి"*

* The First Quinquennial Report of A.B.M & C.B. Missions ప్రథమ పంచాబ్ద సభాచర్యలు 6వ పుట.

ఈ విధమున అమెరికను తెనుగు బాప్టిస్టు మిషన్ వారి ప్రథమ సహాయకులుగ నుండ పురుషోత్తము గారు ప్రభువుచే నియోగింపబడిరి. మరియు ఆయననుగూర్చి "The first preacher who was raised up in the American Baptist Telugu Mission to assist their Pioneer missionary ,Rev. Day" ("వారి నాయక మిషనెరీయగు రెవ.డే గారికి సహాయము చేయుటకు అమెరికన్ బాప్టిస్టు మిషన్‌లో లేవనెత్తబడిన ప్రథమ సువార్తకులు") అని రెవ.ఎఫ్.డబ్లియు. ఆరంస్ట్రాంగ్ గారు వ్రాసియున్నారు. *శ్రీకాకుళములో డే దొరసానిగారు స్థాపించిన సబ్బాతు బడికి ఆ కాలమున వేంకటప్రసాదపాఠనాయక్ అను నొక చిన్నవాడు వెళ్ళుచు ఆ సాధ్వివల్లను వెనుక పురుషోత్తముచౌధరి గారి వల్లను యేసు ప్రభువు నందలి విశ్వాసముతో బలపడి తన యజ్ఞోపవీతము తీసివేసి, డాసన్ దొరగారి కాలమున బాప్తిస్మము పొందెను.

ఈయనయే పోషకుల నామము ధరించిన రెవరెండు జొసయాబర్డరు. డే దొరసానిగారి ప్రయాస ఫలితము అమెరికన్ బాప్టిస్టు వారనుభకవింపకపోయినను ఆయన చాల కాలము లండన్ మిషన్ బోధకులగనుండి 1874 సంవత్సరము కాకినాడ సంఘ పాలకులుగ బిలువనంపబడిరి. ఈయన క్రైస్తవుడైన వెనుక పురుషోత్తముచౌధరిగారి యొక్క ద్వితీయ కుమారిక మేరీసుందరిగారిని వివాహమాడిరి. ఆ ఫలితము డే దొరగారి కాలమందేయని అమెరికన్ బాప్టిస్టుమిషను వారెరిగియుండకపోవచ్చును. విత్తువారొకరు కోయువారొకరు గదా!

* Canadian Mission Report for 1877

డే దొరగారు శ్రీకాకుళమును తమ స్థిరమైన మిషన్ క్షేత్రమని తలంచనందున ఆ స్థలము విడిచి 1837 సం॥ మార్చి7వ తేదిని చెన్నపురి జేరి యా ప్రాంతమున సేవ నారంభించిరి.

శ్రీకాకుళము దరి పారుచున్న నాగావళీ నదీతీరమందలి మేడలో రెవ.సామ్యేల్ డే గార్లును, జస్టిస్. ఇ. స్టోరీదొరగారును, వారి కుటుంబములును, పురుషోత్తము చౌధరిగారుయును, ఎన్నిసార్లు ఆ ప్రదేశ రక్షణ విషయము దేవుని బ్రార్థించిరో గ్రహింపజాలము! వారి ప్రార్థనా ఫలితములు నేటికినిలభించుచున్నవి.

# 8. అధ్యాయము

బరంపురమునకు పునరాగమనము; సిపాయీల మతద్వేషము, వారి నిరాదరణము, విశాల సంచారములు, శుభవార్తమాన ప్రచారము, యూరపియన్ మిత్రుల యాదరణము, హెలెన్ నాట్ దొరసానిగారి పున:దర్శనము.

**"సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" రోమా 1: 16.**

---♦--- ♦---♦---

రెవ. డబ్లియు బ్రౌన్‌దొరగారు స్థానాంతరులైన వెనుక కొంతకాలము వరకు బరంపురమునకు మిషనెరీలెవరు నియమింపబడలేదు. కటకపురి మిషనెరీలంత మాననీయ రెవ. ఐజక్ స్టబ్బిన్స్ మహాశయుని మిషనెరీగా నియమించిన వారి సహాయార్థము పురుషోత్తము చౌధరిగారినే నియమించి ఆయనను తిరిగి పంపించి వేయుడని జడ్జీ స్టోరీ గారికి కటకపురి మిషనెరీలు వ్రాయగా, పురుషోత్తము గారికిని, సాహు గారికిని, వారి కుటుంబములకును, వారితోనుండిన పదునలుగురు మెరియాపిల్లలకును తగిన సహాయములిచ్చి జడ్జిగారు వారిని శ్రీకాకుళమునకు దాదాపు 80 మైళ్ళు దూర మందలి బరంపురమునకు పంపివేసిరి. అచ్చట ఆంధ్ర, ఉత్కళ భాషలు వ్యవహరించెదరు. ఆ కాలమున నది సేనానివాస స్థలమై యుండెను. నియమింప బడిన మిషనెరీ యింక రాకముందే యధావిధిగా సహాయక మిషనెరీయైన పురుషోత్తముచౌధరిగారు తమ సువార్త ప్రచారము నారంభించిరి. వీరు బరంపురము చేరిన రెండు మూడు దినముల తరువాత పురుషోత్తముగారు, బాలాజీ సాహుగారితో ఒక సాయంకాలము బాహాపురమునకు, బరంపురమునకు మధ్యను సాగియుండిన సంతకు వెళ్ళి కీర్తన పాడి మతప్రచార మారంభింపగా చాలమంది సిపాయీలు చుట్టుచేరి కొంచము సేపు ప్రసంగమునాలకించిరి. కొందరు దురాత్ము లేవియో యుబుసులు వేసికొని వారికేసి చూచి "మీరిద్దరు దొంగలు గదా? చిన్నపిల్లలకు మిఠాయిలు కొనియిచ్చి వారినెత్తుకొనపోలేదా? అవును మీరాలాగు చేసినారు. ఇప్పుడు మా చేతికి మీరు దొరికినారు; మా కొత్వాల్ చావిడికి మిమ్ముడను దీసికొని పోయెదము; మీరు మా

వెంటరావలసిననదని బలవంతముగా వారిద్దరిని బట్టుకొని “యిదిగో మాకు దొంగలు దొరికిరి! దొంగలు దొరికిరి! యని కేకలు వేయుచుండగా మరికొందరు ప్రోగుపడి కట్టి పెట్టండని కొందరు, కొందరు కొట్టండని , తిట్టుకొని కొందరు, వారి జుట్టు లాగుచు, ఇటువంటి నానాయవస్థలు పెట్టి బాహోపురములో నుండిన కొత్వాల్ యొద్దకి వారిని దీసికొని పోయిరి. అక్కడ కూడ నట్టి కేకలు వేసిరి. ఆ కొత్వాల్ మంచివాడు గనుక చల్లని మాటలతో “మీరెవరు? వీరంతా మిమ్ములను బట్టుకొని యేల యిక్కడికి దెచ్చిరి? మీరేమి చేస్తిరని” యడిగెను. ద్వేషపూరితులైన యూదులు తమ ప్రభువును పిలాతు ఎదుట నిలిపిన సంగతిని, అపొస్తలులు రోమాధికారుల యెదుట నిలిచిన సంగతిని వారు జ్ఞాపకము చేసికొని, తమ ప్రభునామ ప్రచార సేవా విషయము వారికి దెల్పిరి. అప్పుడా కొత్వాల్ కోపదృష్టితో సిపాయిాల వైపు జూచి “యీ మనుష్యులు మీరు చెప్పిన చొప్పున చోరులు కారు; వీరు హేరాళముగా దమ మతమును గురించి బోధించువారు, మీరు తెలిసియు వ్యర్థముగ దెలియని వారివలె నటించి వీరిని నా యొద్దకి దెచ్చితిరి. ఇట్టివారు నిర్దోషులు కాబట్టి వీరిని విడువండని” వారి పక్షముగా మాట్లాడినప్పుడు అలనాడు యూదులు పిలాతు నెదుట **“శిలువ వేయుము శిలువ వేయుము”** అని కేకలు వేసినటుల గొందరు దుర్జనులు చాలా వివాదము చేసి సహజ శాంతచిత్తుడైన ఆ కొత్వాలును గాబరా పెట్టినందున ఆయన నామాట మీరువినరు కావున సుబేదదారుగారియొద్దకు వెళ్ళుదమురండని వారి యుభయుల చేతులు దాను పట్టుకొని సమీప మందున్న సుబేదార్ గారి యింటికి దీసికొని వెళ్లి జరిగిన సంగతి యావత్తు ఆయనతో జెప్పెను. అప్పుడా సుగుణ సంపన్నుడైన సుబేదారు ఆ సిపాయిలను బహుగా గద్దించి, తరిమి, వారిమీద గోపబడి “ఇటువంటి ప్రచారకులు ఫాదరీ దొరల యొద్ద నుండుట మీకు దెలియదా? మీరు ఎవరింటికి వారు వెళ్ళితేనే తప్ప యేమయినా దౌర్జన్యము చేసినట్టయితే రేపు కర్నలు దొరగారితో జెప్పి మీకు తగిన శిక్ష చేయించకపోతే చూడండి” యని పెద్ద కేకలు వేసి, లేచి వారిని దన యావరణ నుంచి తోలివేసెను. ఆ సుబేదారు గారప్పుడు బాధితులిద్దరిని జూచి మీరు సుఖముగా మీ యిండ్లకు వెళ్ళండి బాబూ? యని దయతో జెప్పిరి. అందరకు మన పురుషోత్తముచౌధరిగారును, బాలాజీ సాహు గారును “అయ్యా! యీ దుర్జనులు మళ్ళీ మమ్మును జుట్టుకొని బాధ పెట్టెదరు రాత్రి కూడా యైయున్నది; మాకు మీరెవరినైనా దోడిచ్చి పంపించిననే తప్ప

మేము వెళ్ళలేము గదా" యని మనవి చేసిరి. అందుకా సుబేదార్, కొత్వాల్ ఆ సదుపాయము చేయునని చెప్పి ఆయన వశమున వీరి నప్పగించెను. కొత్వాల్ చావడియెదుట పహారా సిపాయిలుండిరి. కనుక వారి వశమున మన ప్రచారకులిద్దరిని అప్పగించెదనని యా కొత్వాల్ తోడుకొని వెళ్ళుచుండగా మార్గములో దాగియున్న యా దుష్ట సమూహము మళ్ళి వారిని జుట్టుకొని, ముందటి వలెనే వారి కొంకులు త్రొక్కుచు, బట్టలు పీకుచు, వారిలో నొకడు బాలాజీ సాహుగారినికొక్కదెబ్బ కొట్టెను. అతడు "చస్తిని చస్తిని" అని పెద్ద కేకలు వేసి నేల పడిపోయెను. ఆ ధ్వని విని పహారా సిపాయిలు పరుగిడి వెళ్ళి యా సమూహమును చిందర వందరగా తరిమి బాలాజీని రెండు రెక్కలు పట్టి యెత్తుచుండు నంతటిలో ఆ చెడ్డ సమూహమంతయు పారిపోయిరి. అప్పుడు కొత్వాల్ వారిని పటాలపు సరిహద్దులు దాటించి రండని యిద్దరు పహరా సిపాయిలను పంపించగా వారు బాలాజీ సాహును కొంత యోదార్చి నడిపించుచు పటాలపు లయినుల యావలికి సాగనంపిరి. బాలాజీ గారు వారికంత యుపద్రవమైన దెబ్బ తగులకున్నను వారి బారినుండి త్వరలో దప్పించు కొనుటకంత గడబడ చేసెనట.

## రెవ.ఐజక్ స్టబ్బిన్ గారి రాక:-

ఆ రాత్రి యా సిపాయిలు పురుషోత్తముచౌధరిగారికి, ఆయన సహకార్యకారికి బెట్టిన యవస్థలు కర్ణాకర్ణి పటాలపు దొరలకు దెలిసి, క్రైస్తవుల జోలికి ఎవరైనను వెళ్ళిన యెడల వారిని శిక్షించెదమని సిపాయిలకు జాటించిరి. అది మొదలుకొని వారెన్నడు మరి వారి జోలికి వెళ్లలేదు. ఆ యుపద్రవము తప్పినందున మన ప్రచారకులు ప్రభువును స్తుతించిరి. ఐతిహాసిక సంఘటనము లిటుల జరుగుచుండ 1838 సంవత్సరము మార్చి నెల 6 తేదిని లోగడ మిషనెరీగా నియుక్తులైన రెవరెండ్ ఐజక్ స్టబ్బిన్స్ (Rev.Isaac Stubbins)దొరగారు బరంపురము చేరి యచ్చట అయిదేండ్లుండిరి.

## బరంపుర బాప్టిస్టు సంఘ స్థాపనము :

అహరోననునొక యాంధ్రుడా దినములలో క్రీస్తుమత స్వీకారము చేసియుండెను. ఆయనయు బాలాజీసాహుగారి దంపతులును, పురుషోత్తముగారి దంపతులును అప్పటిలో స్నానము పొందిన వారి ప్రథమ సంజాత శాంతికుమారి చౌధరిగారుయు,

విదేశీయులు నలుగురును కూడి మొత్తము 8గురితో స్టబ్బిన్స్‌దొరగారు 1838 సం॥ ఏప్రిల్ 1వ తేదిని బరంపురు బాప్టిస్టు సంఘము స్థాపించిరి. ఆ సంఘమునకు పురుషోత్తముచౌధరీ గారు ప్రథమ పరిచారకునిగ నియమింపబడి వెనుక పాలకత్వభారము వహించి స్నాన ప్రభుభోజనాది సంస్కారము లాయనయే జరిపించు చుండిరి.

మరియు పురుషోత్తము చౌధరిగారును, ఐజక్ స్టబ్బిన్స్ దొరగారును ప్రతి సంవత్సరము గంజాంజిల్లాకు జెందియుండు తాలూకాల యందంతట చాలసార్లు ఓపికతో సంచారములు చేయుచు, లక్షలకొలది ప్రజలకు సువార్త ప్రచారము చేసి, వేలకొలది పత్రికలు పంచిపెట్టుచు వచ్చిరి. ప్రతి జూన్ మాసమున రథయాత్ర వచ్చినదనగా పురుషోత్తముతచౌధరిగారు పూరీ జగన్నాథమునకు దూర భార ప్రయాణములు చేసి, యేసు ప్రభువు ద్వారానైన రక్షణ వార్తను ప్రచారము చేయుటకు వెనుకంజ వేయకుండిరి. ఆ కాలపు వారి కార్యసీమ బహు విస్తీర్ణమైనది. ఆనాడు బైసికిళ్ళు మోటారు బండ్లు పుట్టియుండలేదు. పాదచారులుగా కావటి వానితోడనో, రెండెడ్ల బండ్ల మీదనో ప్రయాణములు సాగించువారు. (ఆ దినముల లోనే అనగా 1839 సం॥ ఆగష్టు 9 వ తేదిని డాక్టరు జాన్ మెక్లారిన్ అంటోరియో లోని అన్వేదుపురమున జన్మించిరి.) “కష్టేఫలే” యను న్యాయమున వెదజల్ల బడిన సువార్త బీజములు ఫలించుచు రాగా సంఘము నిండు చుండెను. ప్రపుల్ల కుమారి యను పురుషోత్తముచౌధరిగారి పోష్య సోదరి హైందవులలోనే వైధవ్యము నొందెను; ఇరుగు పొరుగు ఆంధ్రు లామెను “గడ్డెమ్మా”యను ముద్దు పేరున బిలుచువారు. ఆమె యాత్మ రక్షణ విషయము పురుషోత్తముగారును, ఆయన భార్యయు ప్రార్థించుచు వచ్చిరి. ఆ పతివిగత పర్లాకిమిడి ప్రదేశము నుండి బరంపురము వెళ్ళి వారితో నుండెను. 1840 సం॥ ఒకనాడు స్టబ్బిన్స్‌గారు పిల్లలకు ప్రేక్షకులకు బోధించుచుండగా పురుషోత్తముగారి సోదరియగు ప్రపుల్లకుమారి చెక్కిళ్ళ మీదుగ అశ్రుధార కారుటగని స్టబ్బిన్స్‌గారాశ్చమగ్నులైరి. ఆనాడు సభలో దైవ ప్రత్యక్షత కలిగి యుండెనని భావింప బడెను*. అనంతర మామెను ప్రభువు నందు స్థిర విశ్వాసినియై సంఘమున జేరెను. పురుషోత్తముచౌధరిగారి ద్వారా ఆరుగురు స్నాన దీక్ష గైకొనిరి.

* Misssion Report 1840

దూర భార ప్రయాణముల వలన పురుషోత్తముచౌధరిగారికి గలుగుచు వచ్చిన ఆయాసమును జూచి రెవ. స్టబ్బిన్స్‌దొరగారాయన యెడ దమకు గల సహజమయిన ఔదార్యముచే నొక గుఱ్ఱమును కొనియిచ్చి దాని వ్యయములన్నియు తామె భరించువారు. అది వారి సంచారములలో సహాయకారిగ నుండుచు వచ్చెను. బరంపురములో డేవిడ్ చౌధరియను కుమారుడును, మేరీసుందరి, మార్తామనోరమ, హెలెన్‌హేమాంగిని యను కుమార్తెలును పురుషోత్తముచౌధరిగారికి రాధామణి దేవికి ఉదయించిరి. పురుషోత్తముచౌధరిగారి విషయమై 1839 సం॥ రిపోర్టులో రెవ స్టబ్బిన్స్‌దొరగారిట్లు వ్రాసి యున్నారు:–

"పురుషోత్తము గారు వ్యక్తి ధర్మ క్రైస్తవ ధర్మమునను, బోధక ధర్మమునను మిక్కిలి యుత్కృష్టావస్థగల వ్యక్తిగా సాధారణముగా నెరుగబడియున్నారు. నా యావత్తు ప్రయాణములలోను నిజంగా నా ప్రయాసమంతటిలోను నా సహకారులైయుండిరి. కావున ఆయన శ్రద్ధా శక్తుల విషయమును అలసట లేని యాసక్తి విషయమును నేననేక పర్యాయములు సాక్ష్యమిచ్చియుంటిని.... పురుషోత్తము, బాలాజీ గార్ల ప్రవర్తన, సంభాషణలను బట్టి చూడ **"వారు దేవుని హృదయానుసారమైనవారని వ్యక్తీకరింపబడి యున్నారు"** పురుషోత్తముగారు చాకచక్యత గలిగినవారు. ఆయన దివ్యమైనట్టియు మనోహరమైనట్టిగా నుండె బోధకులు. ఆ రిపోర్టు లోనే మిస్ కిర్స్‌మన్ (Miss. Kirsman) గారిట్లు వ్రాయుచున్నారు:– "మొన్నటి వారము పురుషోత్తముగారు కటకములో నుండిరి. మేము రాకముందే యాయన బరంపురము వెళ్ళిపోయి నందున ముందు నేనాయనను జూడలేదు. ఆయన మహా భక్తి గలవారుగ గనబడెదరు; ఆదివారమునాడాయన క్లుప్త ప్రసంగము చేసిరి. గంగాధర గారి పవిత్ర ధైర్యము తీక్షణ స్వభావమును బట్టియో లేక పురుషోత్తము గారి సాధుత్వము ప్రేమ పట్టుదల గల మనస్సును బట్టియో నేనంతయో సంతసించుచున్నాను."

ఈస్టిండియా కంపెనీ యుద్యోగీయులలో జాలమంది పురుషోత్తముగారి యెడల ప్రేమాభిమానములు గలిగియుండిరి. కావున జడ్జీ స్టోరీ (Justice E. Story)దొరగారు, కలెక్టరు కాన్వాయి(Mr. Konvoy), కేప్టెన్ మిల్హారు (Captain Milher), హెలెన్ నాట్ (Mrs. Helen Knott), అనువారు కలిసి ఆయన కొక మంచి

పెంకుటింటిని బరంపురములో గట్టించియిచ్చిరి. ఇట్లాయన యచట స్థిర నివాసియై యుండగా తనయన్నయైన జగన్నాథ చౌధురిగారు తమ్ముడు క్రైస్తవుడు కాకముందు సమిష్టి కుటుంబమున గలిగిన ఋణమని 120 రూపాయిలు ఆయన పై మోపిరి. స్టోరీదొరగారు అప్పటికి చెన్నపట్టణమున నుండిన మేజరు బ్రేట్‌దొర గారు, మరికొందరు నా ఋణము తీర్చివేసిరి.

అయిదేండ్ల వెనుక స్టబ్బిన్సు దొరగారు సీమ దేశమునకుబోనైయుండి సంఘ కార్యము లన్నియు గొన్నాళ్లు వరకు పురుషోత్తము చౌధరిగారి మీద విడచిరి. అనంతరము హెన్రి విల్కిన్‌సన్ (Rev. Henry Wilkinson) దొరగారు మిసనెరీగా బరంపురము వెళ్ళగా వారిద్దరును గలిసి మరి రెండేండ్లు సువార్త ప్రచార మొనర్చిరి.

## కలకత్తా నగర సందర్శన :-

1843 సంవత్సరము నాట్ దొరసానిగారు మోల్మెన్ నుండి శ్రీకాకుళము చేరినంతట పురుషోత్తముచౌధరి గారిని, కుటుంబమును జూడ నపేక్షించి తమ పెట్టెబండి పంపించినందున వారందరు వెళ్ళి కొన్నాళ్ళుండి వచ్చిరి. ఇంకొకసారి యామె కలకత్తా వెళ్ళగా చౌధురిగారా మహానగరమున కొన్నాళ్ళు వరకుండి తమ పూర్వికుల కలవడియుండి, యుత్కళ భాషకు సోదరిభాష యనదగు బాంగ్లభాషను వ్రాయను, చదువను నేర్చుకొని యచ్చటి క్రైస్తవులు కొందరితో పరిచయము చేసికొనిరట. హెల్లెన్ నాట్ దొరసానిగారు, పురుషోత్తముగారి కనిష్ఠ పుత్రికకు హెలెన్ అను తమ నామమిడి యుండిరి.

పురుషోత్తమ చౌధురి జ్యేష్ఠ పుత్రిక శాంతికుమారికి వివాహ వయస్సు వచ్చిన మీదట నామెను కటకపురియందలి ఘనశ్యామబాబు* అనునొక భక్తునికిచ్చి వివాహము చేసిరి.

*రెవ. దొయితారి నాయక్ గారు కుమారుడు.

# 9. అధ్యాయము

మన యాత్రికుడు, అపొల్యోనుచే గాయపఱుపబడి తిరిగి వాని జయించిచుట. ఆయన యొక్క సుమనోజ్ఞానుభవము, భక్తి తరంగిణీ ప్రవాహము అమోఘ గీతాగానము.

**"నేను అత్యధికముగా హెచ్చిపోకుండు నిమిత్తము..... శరీరములో ఒక ముల్లు..... ఉంచబడెను" 2 కొరింథి12:7.**

**"నా కృప నీకు చాలును; బలహీనత యందు నాశక్తి పరిపూర్ణమగుచున్నది."**
**2 కొరింథి 12 : 9**

---♦--- ♦---♦---

**యాత్రికుని శత్రువు :-**

**"సుఖస్యానంతర దు:ఖం"** అను న్యాయమున ఆ మనోహర జయ జీవితమున పదేండ్లు నిర్విఘ్నయాత్ర చేసి వచ్చిన మన క్రైస్తవ యాత్రికుని 1844 సంవత్సరము అపోల్యోను అను మారు పేరుగల పరలోకము నుండి త్రోయబడిన దూత ఓడించుటకై సమయము వేచి, శోధన బాణము లాయనపై కురిపించి, ఆ యాత్రికుని ఘోరముగ గాయపఱచెను. కొంత తడవు క్రైస్తవుని సర్వాంగ కవచధారణ కాయన తడువుకొని తిరిగి వానిని బూని జయశాలియైన విధము క్రింద జూచెదము. ఆ వృత్తాంతమాయన యిట్లు చెప్పియున్నారు.

"ఇవ్విధముగా బరంపురములో యేసుప్రభువు నందు నేను జీవించుచు ఆయన సేవలో నా దినములు గడుపు చున్నప్పుడు పిశాచి యెల్లప్పుడు దేవుని జనుల నంటియే యుండును గనుక ప్రభువు కార్యము విఫలము చేయు నిమిత్తము నా దుష్ట స్వభావమును పురికొల్పెను. కనుక నేను పాపమున బడిపోతిని. నా పాటు మిక్కిలి లోతైయుండెను. నేను మెళకువగా నుండనందున గర్జించే సింహము వచ్చి భక్షింప వచ్చెను. నేను నా విరోధియైన సైతానుకు చోటిచ్చితిని కనుక అదివచ్చి నాలో జొరబడెను. నా మనోనేత్రము మూతబడిపోయెను. కనుక పాపమను మిక్కిలి లోతుగల చీకటి నూతిలో పడిపోతిని"

ఇట్టి ప్రలోభమాయనకు గలిగినను దైవకృపాబలమున ఆయన తిరిగిలేచి **"పశ్చాత్తాపేణ శద్ధ్యతాం"** అను దివ్యానుభవము వడసినటుల ఆయన యా సమయమున లిఖించిన కీర్తనల వల్లను పద్యముల వల్లను గ్రహింపగలము. వానిలో కొన్నిటి నీ క్రింద బొందుపరచున్నాము.

## యాత్రికుని పోరాటము :-

ఈ ప్రళయశోధనమున విల్కిన్సన్ గారాయన యందెంతయు సహానుభూతిగలవారై యుండినను, ఆయన 1845 సం॥న కటకపురి వెళ్ళిపోయి కంటోన్మెంటు (సేనానివేశస్థల) పల్లపుజొల్లములలోను కోటదరి నదీ తీరమునను సంచారముచేసి, సాష్టాంగ ప్రార్థనలతో దైవ సాన్నిధ్యమున విలపించుచు ఒకనాడు మహానదీతీరమందలి యొక సొరంగమున గూర్చొని యి క్రింది పాప విలాప గీతము వ్రాసిరి :-

### పాప విలాప గీతము

రా - యదుకులకాంభోజి తా - ఆది

త్రాహి మాం క్రీస్తు నాధ - దయ జూడ రావే = నేను - దేహి యనుచు నీ పాదములే - దిక్కుగా జేరితి నిపుడు ॥త్రాహి మాం॥

1. గవ్వ చేయరాని చెడ్డ - కర్మేంద్రియాధీనుడనై - రవ్వ పాలై నేనెంతో - నెవ్వబొందితి = త్రవ్వుచున్న కొలది - పెరుగు - దరగదు నా పాప రాశి - యివ్విధమున జెడిపోతినినే - నేమి సేతు నోహొూ హొూహొూ ॥త్రాహి మాం॥
2. నీ యందు భయభక్తులు లేని - నిర్లజ్జాచిత్తముబూని - చేయరాని దుష్కర్మములు - చేసినాడను = దయ్యాలరాజు చేతిలో - జేయి వేసి వాని పనుల - జేయ సాగి నే నిబ్బంగి - జెడిపోయితి నే నయ్యయ్యయ్యొ ॥త్రాహి మాం॥
3. నిబ్బర మొక్కించుకైన - నిజము రవ్వంతైన లేక - దబ్బర లాడుటకు ము - త్తాత నైతిని = అబ్బురమైన ఘోర పా - పాంధకార కూపమందు - దబ్బున బడిపోతి నయ్యో - దారి చెడి నేనబ్బబ్బబ్బా ॥త్రాహి మాం॥

4. నిన్ను జేరి సాటిలేని - నిత్యానంద మందబోవు - చున్నప్పుడు నిందలు నా - కెన్ని చేరినా = విన్నదము లేకుండ నీ - వే నా మదికి ధైర్యమిచ్చి - యన్నిట రక్షించితివి నా - యన్న నీకు స్తోత్ర మహాహా ॥త్రాహి మాం॥

## పంచచామర పన్నముల నుండి

**యాత్రికుని విలాపము :-**

తిరంబుగగా యెహోవకన్న దిక్కుగన్నులుంచకన్।
పొరల్ ధరించి పోతరించి బుద్ధిమాలి యొక్క మం।
టి రూపునాసచేసి నేగణించినాడ పాపమో।
నరావతార ధారి క్రీస్తునాధ దీన రక్షకా!
నిరంతరంబు నా మొగంబు నేలతట్టు వంచినా!
కరంబు చేత రొమ్ముగొట్టి కంటనీరు జారగా।
నిరుత్తరుండనై యొకప్డు నేరమెంచు కొందునో।
నరావతార ధారి క్రీస్తునాధ దీనరక్షకా!
హరించు పాపమెల్ల నీ మహాపవిత్ర రక్త బిం।
దు రాసిలోన నొక్కచుక్కలో గదా యిదేమదిన్।
నిరంతరంబు నమ్మినాడ నీవె సాక్షి విందుకో ।
నరావతార ధారి క్రీస్తునాధ దీనరక్షకా!

**ఇట్టి పద్యములు రకార ప్రాసతో 50 కలవు.**

**శతకములో నుండి**

ఉ॥ నేను దురంత పాతకుడ నేను దురాత్ముడ నేను క్రూరుడన్।
నేను మహాపరాధినిదె నేను కృతఘ్నుడ, నేను నీచుడన్। దీన
దవయ్య నేను భవ-దీయ దయామృత దృష్టి నాపయిన్। మాను
గ బంపి నా మనసు - మార్పడ జేయవే యేసునాయకా!

ఉ॥ కాపురుషాళి క(గ్రజుడ – గల్మష రాసుల పెంట భూరి సం। తాప
దురంత చింతలకు – దావగువాడనమార్గ దుర్గుణ ప్రాపకుడ
న్మహానరక – పాత్రుడనో కరుణాపయోధి నీ। దాపను జేరినాడ
తవ – దాస్యమొసంగవే యేసునాయకా!

మ॥ అరుణాబ్జాంతరమైన తేనియల పానాసక్తి చే జొక్కు సుం। దర
మత్తాళి విధంబునన్ గళితరక్త స్తంభ శుంభద్భవ । చ్చరణాబ్జం
బులలోని గాయముల పొంతంబోయినా చిత్తమున్ । పరమానంద
రసంబు గ్రోలుగద దేవా యేసుక్రీస్తు ప్రభూ॥

శా॥ వాతోద్ధూతముచే తదుర్దిన ఘన ప్రచ్ఛన్నముంబాసి ఖ । ద్యోతుం
డంబరివీధి చండతరదీంప్తు డౌచు గన్పట్టునా । రీతి న్నీ కరుణా
మహానిలము ప్రేరేపించి మత్పాతజీ । మూతంబుం
దొలగించి యాత్మ వెలుగిమ్మా యేసుక్రీస్తు ప్రభో ॥త

మ॥ పరిశుద్ధాత్మ విశుద్ధ తత్వగృహధర్మ ద్వారమా, మోక్షపా।
పురమా తెల్వులపూరమా విమలసారోదార కాసారమా వర
భక్తాత్మ విచారమా! పరమ దివ్యజ్ఞానమూలంబనా । దురితంబెల్ల
క్షమిపంవేయని నుతింతున్ యేసుక్రీస్తు ప్రభో।

శా॥ నాకన్నంగడు పాపకర్ముడోకడైనన్ లేదు భూమండలిన్
నీకన్నన్ బ్రియరక్షకుండెచట నన్వేషించినన్ వేడికన్ నాకున్
నీకును జోడుగూడెగదనన్నుం బ్రోవుమిట్లైన ముల్లోకంబుల్
నిను మెచ్చు నీ బిరుదునిల్చున్ యేసుక్రీస్తు ప్రభో॥

క్రీస్తు ప్రాయశ్చిత్త పుణ్యము నందు విశ్వసించిన విశ్వాసికి గలుగు నిజ పశ్చాత్తాప సూచకమైన రెండువందల పద్యములలో పురుషోత్తముచౌధరికి యేసు ప్రభువు ద్వారానైన పాపవిమోచనమందు గలిగి యుండిన భరోసాయును, అవిచ్ఛిన్న విశ్వాసమును ప్రస్ఫుటమగును.

**యాత్రికుని యనుభవ భాగ్యము :-**

ప్రలోభములు, లేక దుష్ట ప్రేరేపణములు మానవుల చుట్టు కంచి వేసి వాని లోబరచుకొనుట సహజమే. **"బలవాన్ ఇంద్రియ గ్రామో, విద్వాన్ అపికర్షతి:"** యను అనుభవము నిశ్చయమైనదై నను **"యేసు ప్రభువు మూలముగా జయమిచ్చు దేవుడు"** మానవ హృదయ పతనమున నతని విడువక, పైకిలాగుచు సుఖకళా వళులు భక్తుని మనస్సులో నిల్చుటకు సంసిద్ధుడై యుండును. మరియు

సీ॥ అలపిశాచికి నెంత బలమున్న బలవంత
  మున బట్టి యీడ్చి కొంపోవ లేదు।
తరమైన బలుమనోహరమైన యెరలు జూ
  పును కాని జగములోపు గొనలేదు।
పొగరుతోవగ జూపి దిగులొనర్చును గాని
  కుస్వభావము గెల్చు కొనగలేదు।
తుచ్ఛంబుమెచ్చు మాం సేచ్ఛలౌ మత్సరా
  దులు నాత్మతో బోర నిలువలేవు।

గీ॥ ఆత్మరక్షార్ధి ప్రభుకృప నరులకెల్ల
వశము కాకుండ బోరాడవలయు గాని
నెపముకల్పించి యొకరిపై నేరముంచ
తగవు సరియౌనె క్రైస్తవోత్తముని కెపుదు?॥

సీ॥ "పాముకోరలతోడ సాము చేయగవచ్చు
  గాని దుర్మనసుతో గదియరాదు।
కడలి భంగముల పొంగడచవచ్చును గాని
  దుస్వభావపు టుబ్బు త్రోయరాదు।
పుడమిక్రింది పునాది నడపవచ్చును గాని
  ఖలచిత్త మనువేరు కదపరాదు।
పిడుగైన నొడిలోన బెట్టవచ్చును గాని
  యుగ్రభావపు కాక కోర్వరాదు.।

గీ॥ కటకటా యెన్నిమార్లు సత్రై క్షస్తవుండు
వానితో బోరి పోరి తద్వశతనొంది
విన్నదనమున కన్నీరు విడచి విడచి
దైవకృప తట్టుకనిపెట్టు తాల్మితోడ" ॥

## శిక్షా విముక్తి :-

అని పురుషోత్తముచౌధరికవియే తమ క్రైస్తవ నీతి ప్రకాశములో వ్రాసియున్నారు. తక్కిన మతములకును క్రైస్తవ మతమునకును గల వ్యత్యాస మీ దైన్యసేవకుని జీవితము వల్లనే దెల్లమగును. యేసు ప్రభువు మానవులను దమ **"పాపముల నుండి రక్షించుటకై యవతరించెను". "యేసు ప్రభువు రక్తము సమస్త పాపములనుండి మనలను పవిత్రులనుగా చేయుచున్నది."** యను బైబిలు హితబోధ నంగీకరించిన వారు క్రీస్తు మూలముగా విమోచితులై, శిక్షావిముక్తులై పాప విజయులై పాపక్షమార్పణ వలన గలుగు నిత్యానంద భరితులై యుండెదరు. పురుషోత్తముగారు శోధనానంతరము ఆయనకు ముందు స్నానమిచ్చి యుండిన రెవ.చార్లెస్ లేసీ గారాయనను దిన దినము పరామర్శించు చుండువారు. ప్రాచీన సోదరులలో కొందరాయనను పరివర్తన మెట్లుండునోయని కనిపెట్టుచు వచ్చిరి. ఒకనాడొక దొరగారితో ఆయన సంభాషించుచుండినపుడు తన పాపము క్షమింపబడ నేరనిదను నిరాశ పురుషోత్తముగారు వ్యక్త పరచగా **యేసుప్రభువు పాపక్షమార్పణ దాత కాడను అవిశ్వాసమే మహాపాపమని యాయన చెప్పినంతట పురుషోత్తముగారిలోని సందేహ నివారణ మైనటుల గ్రింది పద్యము సూచించును :-**

ఉ॥ పాపములన్నిటిన్ మిగుల పాపము క్రీస్తు మదీయపాపము
న్బాపగ నోపడంచు నపనమ్మిక లెందుటయే నితాంతమౌ
పాపమిదేయటంచు నొకభక్తుడు చెప్పినదాలకించి నీ
ప్రాపున జేరవచ్చితి గృపామతి బ్రోవవె యేసునాయకా॥

మరియు నా భక్తుడు **"పురుషోత్తమ సోదరా? మీ పాపము లెక్కువైనవియా? క్రీస్తు రక్తపు చుక్క విలువ యెక్కువయైనదియా?** యని యడిగినంతట, ఆయనలోని

సందేహమంతయుబోయి 1845 సం॥ ననే క్రింది గీతము వ్రాసికొనిరి.

**సింహావలోకముచే గలుగు బలము హెబ్రీ 13 : 5.**

రా – సావేరి　　　　　　　　　　　　తా – ఆది

ఎందుకే చింతించెదవు నా – డెందమా నీ కందమా = యిందాక రక్షించివా – డికను నిన్ను విడువబోడు ॥ఎందుకే॥

1. తొల్లి నీ వొనరించినట్టి – దోషమెంత యరసి చూడు – చెల్లచెదరై పఱచు తరిని – చెయ్యి చాపి పట్టినాడు – అల్లుకొనిన నీ దుర్గుణము – లణగ ద్రొక్కి వేసినాడు – తల్లడిల్లజేయు నీ శ –త్రువుల దరిమి ప్రోచినాడు = వల్లగా దన్నాడా నేడు – వద్దు సందేహంబులు వీడు ॥ఎందుకే॥

2. తలయెత్తరాని చోట – గళలిచ్చి నిలిపినాడు – తలిదండ్రులవలెను నీ – తప్పులు చాలా గడిపినాడు – పలుమారు నీ యక్కరలు – దెలిసి యందిచ్చినాడు – బలహీనమపుడు నీకు ని – ర్భయ మియ్య వచ్చెడు వాడు – పలు విధంబు లగు బాధల – బార దోలివేసి నాడు = నెల విప్పుడు లేదన్నాడా నీతో నిక సరి యన్నాడా ॥ఎందుకే॥

3. ఒక్క నీ తల వెండ్రుక యైన – నూడిపడ దని చెప్పెడు వాడు – దిక్కు నీకిక నేనే యని తన – దివ్య వాక్కుల దెలిపెడు వాడు – చిక్కులను బెట్టెడు పగవారి – చేత నిను జిక్కింపని వాడు – ఇక్కట్టు మెట్టుల దాటించుట – కిదిగో యని చెయి యిచ్చెడు వాడు = హక్కు లే దన్నాడ నేడు – అతడు నిను వెలి వేయబోడు ॥ఎందుకే॥

4. యేసు తన రక్తముతో నిన్ను – నెంచి ముందే కొనుకొన్నాడు – దోసములు వెడలించు విమలా – త్ముండు నీ సాక్షిగ నున్నాడు – ఆశతో నీవు గొలిచెడు తండ్రి – యంతటా గాపై యున్నాడు – నీ సురక్షణ జేయువారు – నిన్ను జుట్టి యున్నా రెల్లపుడు = శేషరహితానంద మల్లదె – చేరువగుచున్నది చూడుము ॥ఎందుకే॥

ఆంధ్ర క్రైస్తవులు మిషనెరీలు వ్యాపించి యున్న ఆఫ్రికా, బర్మా, మోల్మేన్, రంగూన్,

హైదరాబాదు, ఖరగ్‌పూర్, తాతానగరము, ఇంగ్లాండు, కెనడా మున్నగు ప్రాంతములందంతటట గూడ సర్వసాధారణముగా పాడబడుచున్న క్రింది కీర్తనయు ఈ కాలముననే పురుషోత్తముగారిచే వ్రాయబడినది :-

**పాపి యేసుప్రభువు దరిజేరుట.**

రా - ముఖారి                                          తా - త్రిపుట

ఉన్నపాటున వచ్చు - చున్నాను నీ పాద - సన్నిధికో రక్షకా = యెన్నశక్యముగాని పాపము -లన్ని మోపుగ వీపు పైబడి - యున్నవిదె నడలేక తొట్రిలు - చున్నవాడను నన్ను దయగను ॥ యున్నపాటున ॥

1. కారుణ్య నిధి యేసు నా రక్షకా నీ శ - రీర రక్తము చిందుట = భూరి దయతో నన్ను నీ దరి - జేర రమ్మని బిలుచుటయు నిష్కారణవు నీ ప్రేమ యిది మరి - వేరె హేతువు లేదు నా యెడ ॥ నున్న పాటున॥

2. మసిబొగ్గు వలె నా మానసమెల్ల గప్పె దో - ష సమూహములు మచ్చలై = యసితమగు ప్రతిడాగు తుడువను - గసటుగడిగి పవిత్ర పరపను - నసువులిడు నీ రక్తమేయని - మసల కిప్పుడు సిలువనిదె గని ॥ యున్నపాటున॥

3. వెలపట బహు యుద్ధములు లోపటను భయము - గలిగె నెమ్మది దొలగెను = బలు విధములగు సందియంబుల - వలన పోరాటములచే నే - నలసి యిటునటు కొట్టబడి దు - ర్బలుడనై గాయములతో నిదె ॥ యున్నపాటున ॥

4. కడు బీదవాడ న-ంధుడగు దౌర్భాగ్యుడను - చెడిపోయి పడి యున్నాను = సుడివడిన నా మదికి స్వస్థత - చెడిన కనులకు దృష్టిభాగ్యము - బడయ వలసినవన్ని నీచే - బడయుటకు నా యొడయొడా యిదె ॥ యున్నపాటున ॥

5. నీ వాగ్దత్తము నమ్మి - నీ పై భారము పెట్టి - జీవ మార్గము గంటిని = కేవలంబగు ప్రేమచేతను - నీవు నన్ను క్షమించి చేకొని - భావశుద్ధి నొనర్చి సంతో-షావసరముల నిడుదువని యిదె ॥ యున్నపాటున॥

6. దరిలేని యానందకరమైన నీ ప్రేమ - తరమే వర్ణనజేయను = తెరవు కడ్డంబైన

యన్నిటి విరుగగొట్టెను గాన నేనిపు - దరుదుగా నీ వాడనవుటకు - మరి నిజము నీవాడనవుటకె ॥ యున్నపాటున ॥

ఇంగ్లీషుభాషలో Just as I amయను కీర్తన భావము రెవ. జాన్ హే దొరగారివలన గ్రహించిన మీదట దానిక పాఠాంతరముగా స్వీయ అనుభవమును నీ కీర్తనలో పురుషోత్తముగారు చొప్పించిరని చెప్పుదురు. దీని యమోఘ యాత్మీయభావమును హర్షింపని వారుండరు.

శోధనపరంపలచే మనస్సు ఐహిక విషయములవైపు మరలుకొనబడిన యవసరంబున ఆయన ఆత్మసంబోధనముగా

నీ గీతము వ్రాసిరి :-

## స్వీయ ఉద్బోధనము

రా - మోహన తా - ఆది

వద్దు మనస - బుద్ధి కురుచ = పెద్దలకు బెద్ద పరి - శుద్ధ డగు క్రీస్తు తా - దిద్దు నిను బ్రేమ సరి - హద్దులను మీరబో ॥వద్దు॥

1. చెడ్డ తలపు - లడ్డి నిలుపు = మెడ్డెలకు నెడ్డెయగు - గడ్డ సాతానునకు - మెడ్డుకొని దొడ్డ ప్రభు - బిడ్డవలె నడువు మిక ॥వద్దు॥

2. నింద పాలు - బొంద మేలు = పొందుగను అందముగను - ముందు నీ యందు వెలు - గొందు ప్రభు సుందర ని - బంధనలు మరచి పో ॥వద్దు॥

3. ఆశ బెట్టు - యేసు తట్టు = దోసములు వాసి చన - జేసి నిను మోసికొను - యేసు నిజ దాసులను - బాసి యుండకు మిక ॥వద్దు॥

4. బెండు పడకు - నిండు విడకు = దండి గల తండ్రి యొక - యుండు యేసుండు నీ - యండ నుండగ నీ - గుండె దిగు లేల యిక ॥వద్దు॥

5. పట్టు విడకు - దిటము సెడకు = నెట్టుకొని ముట్టడిగ - జుట్టుకొను కష్టముల -బిట్టు విడగొట్టు ప్రభు - తట్టు కనిపెట్టు మిక ॥వద్దు॥

6. మంచి గుణము - లెంచికొనుము = వంచనల మించి గ - ర్వించి నీ దుర్భావము - ద్రుంచు ప్రభు నొద్ద గురి - యుంచి ప్రార్థించు వి ॥వద్దు॥

ఈ క్రైస్తవ యాత్రికుడు నాశనపురము విడి యిమ్మానుయేలు రాజసేవలో నేర్పరియై యుద్ధరంగమున శత్రు బాణహతిచే బాధితుడై జయశాలియై! తనయాత్మ నాయకుడగు యేసునాయకుని సహాయముననే జయసిద్ధి గాంచనగునను దివ్యానుభవమిటుల వ్రాసియున్నారు.

**అనుభవైక వేద్య సాధనము :-**

కం॥ "నిజమగు క్రైస్తవుడొక్కడే
వృజినాత్మంగవిసి మీద గ్రిందంబడుచున్ విజ
యము గోరుచు బోరును
నిజరక్షకుడైన యేసుని సహాయమునన్ "

కం॥ ఈ యుద్ధము మదికను భవ
మైయుండిన యోధవీరుడవునవును నిజం
బేయిదియిన సాక్ష్యంబిదు
మాయా క్రైస్తవులకిది యపరిచయుముగదా?

ఈ భక్తవరుడు 1845 సం॥ జూలై నెలలో **"యేసు నాయక శతకమును"** ఆ సెప్టెంబరు నెలలో **"యేసుక్రీస్తు ప్రభో శతకము" "పంచచామర పన్నములును"** తమ పశ్చాత్తాప సూచకముగ వ్రాసిన వెనుక ఆ శతకముల యొక్కయు, కీర్తనల యొక్కయు ప్రతులు శ్రీకాకుళమందున్న రెవ విల్లియం డాసన్‌దొరగారికిని, విశాఖపట్టణమందలి డాక్టర్ హే, రెవ జాన్‌స్టన్ దొరగార్లకును తపాలాలో బంపించిరి.

1845 సంవత్సరాంతమున కటకపురి ప్రాంతీయ మిషనెరీ మహాసభ జరిగినప్పుడు పురుషోత్తముగారి ప్రసక్తి వచ్చినది. ఆయన పశ్చాత్తాపము చాలామందికి ఆమోదకరముగ నుండినను మిషన్ కార్యదర్శియైన రెవ. ఏ. సట్టన్ దొరగారు ఆయననింక నానావిధ పరీక్షలలో నుంచవలెననియు వేతనము తగ్గించవలెననియు పట్టుపట్టిరి. అది యాయనలోని క్రైస్తవ ప్రేమ రాహిత్యమో, దైవసంకల్పమో, యను గొప్ప మీమాంస యనుభవ వేద్యులను బాధించుచుండును. **ఆతడా పట్టుపట్టి యుండని యెడల పురుషోత్తముచౌధరి గారా దేశమున నుండిపోయి ఆంధ్ర క్రైస్తవ సంఘముల కేమంత**

**యుపచరింపని వారుగ నుండియుందురు. అయితే యాయన యా ప్రాంతము నుంచి బైటపడి. వేరు స్థలమున సువార్త సేవ చేయవలెనని దైవ సంకల్పమై యుండి యున్నందుననే** ఆ సట్టన్‌దొరగారట్టి గట్టి పట్టుపట్టి నారని యనుకొనక తీరదు. ఇట్టి సందిగ్ధావస్తలో అనాదరదృష్టి పాత అధికారి యొద్ద పనిచేయవలె నా క్షమాదర స్థానమునకు జనవలెనా చూపించవలెనని పురుషోత్తముగారు ఎన్నియో ప్రార్థనలు చేసిరి. ప్రభువాయనకు ఆశ్చర్యరీతిని బహుళసావకాశములు చూపెను.

ఇప్పుడు వ్యవహారములాశ్చర్యముగ మారినవి. ఆంధ్రదేశమున పై శతకములు చదివిన వారిలో రెవరెండ్. విల్లియం డాసన్ దొరగారు మున్నగు వారు తమ వైపునకు అనగా పూర్వపు శ్రీకాకుళ ప్రాంతమున కొకసారి రమ్మని ఆయనకు వ్రాసిరి. దైవ కృపా సూచిక ఆహ్వానముగ దాని బరిగణించి పురుషోత్తముచౌధరి దంపతులు ప్రార్థనా పూర్వకముగ నాలోచించుకొని ముందుగా శ్రీకాకుళము వెళ్లి అక్కడి సభను జూచిన తరువాత తిరిగి రాగలిగినచో యిక్కడ కటకపురిలో మిషన్ కార్యదర్శి నియమించిన కార్యము చేయుదునని పురుషోత్తముగారు అందరితో జెప్పి సెలవు గైకొని కుటుంబమును కటకపురిలో విడిచి ఒంటరిగ శ్రీకాకుళము వెళ్లిరి.

# 10 వ అధ్యాయము

శ్రీకాకుళముకాహ్వానము అచ్చట యారేండ్ల జీవితము, డాసన్, పురుషోత్తమకవుల ప్రథమ సంఘ సంకీర్తన గ్రంథము, కళత్రవియోగము, విశాఖపట్టణమున పన్నెండేండ్ల జీవితము, గ్రంథరచన, గోదావరి జిల్లాలో సువార్త సంచారము.

**అయ్యో! నేను సువార్త ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ 1కొరింథి 9 :16.**

---♦--- ♦---♦---

## శ్రీకాకుళములో సువార్త సేవ :-

శ్రీకాకుళము నుండి రెవ. సామ్యేల్ డే దొరగారును, రెవ.పురుషోత్తము చౌధరీగారును వెడలిపోయిన తరువాత మిషనరీ యుద్దేశములతో నుండిన అచ్చటి జిల్లా సెషన్సుజడ్జియగు జస్టిస్ ఈ. స్టోరీ(Justice E. Story)దొరగారి కోరిక పైని లండన్ మిషనెరీ సమాజము వారు 1840 సం॥ ఏప్రిల్ నెలలో రెవ. విల్లియం డాసన్ దొరగారి నచ్చటకు మిషనెరీగా పంపించిరి. 1845సం॥రాంతమున పురుషోత్తముచౌధరీ గారు శ్రీకాకుళము చేరినంతట, డాసన్ దొరుగారును అచ్చటి సభ వారును వారియెడల చాల దయ చూపించి ఆదరించి తమయొద్ద నుండుటకు డాసన్ దొరగారు కోరి వారికి వారి కుటుంబమునకు వలయు పోషణాదికముల నేర్పరచినందున ఆయన యా సభలో జేరి భార్యబిడ్డలను కటకము నుండి పిలిపించుకొనెను. అచ్చట యధావిధిగా సువార్త ప్రచారము చేయుచు ప్రభువును సేవింప, డాసన్ దొరగారాయనకు వీలు కలిగించిరి. ఆత్మీయ బలసమృద్ధి కలిగి జయజీవితము సాధ్యమైనపుడు పురుషోత్తముగారిలో తన రక్షకుని యెడల కృతజ్ఞత హెచ్చుజొచ్చెను. అప్పుడాయన తన ప్రార్థనలకు ప్రత్యుత్తరమిచ్చిన ప్రభువును స్తుతించుచు బహుశ 1845 సంవత్సరాంతమున ఈ క్రింది అమోఘ భక్తిభావగర్భిత కీర్తనము రచించిరి.

## ప్రార్థనా ప్రతిఫలానందము.

రా – శంకరభరణము　　　　　　　　　　　తా – ఆది.

యెహోవా నా మొఱ లాలించెను – దన – మహా దయను నను గణించెను = అహర్నిశల దీనహీనడగు నా – దు హాయనెడు ధ్వని – గ్రహించి మనిపెను ॥యెహోవా॥

1. పిశాచి గడిమి బడగొట్టెను – దన – వశాన నను నిలువ బెట్టెను = ప్రశాంత మధుర సు – విశేష వాక్కుల నిశాంతమున జే – ర్చి సేద దీర్చెను ॥యెహోవా॥
2. మదావళము బోలు నామదిన్ – దన – ప్రదీప్త వాక్యాం కుశా హతిన్ = యధేచ్ఛలన్నిటి గుదించి పాపపు – మొదల్ తుదల్ నరికి దరికి జేర్చెను ॥యెహోవా॥
3. అనీతి వస్త్ర మెడలించెను – యే – సునాధు రక్తమున ముంచెను = వినూత్న యత్నమె – ద నూని యెన్నడు – గనన్ వినన్ ప్రే – మ నాకు జూపెను ॥యెహోవా॥
4. విలాపములకు జెవి నిచ్చెను – శ్రమ – కలాపములకు సెలవిచ్చెను = శిలానగము పై – కి లాగి నను సుఖ – కళావళుల్ మన – సులోన నిలిపెను ॥యెహోవా॥
5. అగణ్య పాపియని త్రోయక – న – న్ను గూర్చి తన సుతుని దాచక = తెగించి మృతి కొ – ప్ప గించి పాపపు – నెగుల్ దిగుల్ సొగ – సుగా నణంచెను ॥యెహోవా॥

## ప్రథమ సంఘ సంకీర్తన గ్రంథము :-

ఆ కాలమున పురుషోత్తముగారు, డాసన్ దొరగారికి వ్రాత కోతలలో తోడ్పడుచుండ నుభయులును గలసి క్రైస్తవ సంఘములకు వలయు గ్రంథ రచనమునందు కొంతకాలము గడిపిరి. డాసన్ గారును ఆంధ్ర కవిత్వమున గొంతప్రవేశము గలవారట. వారిద్దరి పేళ్ళతో నొక కీర్తనల పుస్తకమచ్చు వేయబడి నేటికిని కొందరి యొద్ద ప్రతులుగలవు. 1869 సంవత్సరపు మూడవ ముద్రణమున ఆ పుస్తకములో పురుషోత్తముగారి కవికృత కీర్తనలు 78. కలవు. నాదినములలో డాసన్ దొరగారి బంగాళా శ్రీకాకుళములోని

బలగలో నుండెను.ఆ ఆవరణముననే క్రైస్తవ సహాయకుల నిలయము లుండునవి. "వురోధన్యోనదీతీరా" అనురీతి ఆ నగర మొప్పెను. పురుషోత్తముచౌధరిగారు శ్రీకాకుళమునకు 30 మైళ్ళ దూరమందలి పర్ణసాగరపుర (ఆకులతంపర) గ్రామ మిరాసీదారుగ నుండిన తమ యన్నగారయిన జగన్నాథ చౌధరిని బంధు మిత్రులను సందర్శించుచు, వారి కనేక పర్యాయములు క్రీస్తు సువార్తను చెప్పుచు దృఢమైన ప్రార్థనాపూర్వక ఆస్తి భారము వేయుచువచ్చిరి.

## రహస్య ప్రార్థనాభ్యాసము :-

ఆయనకు రహస్యప్రార్థన అభ్యాసముగ నుండెను. ఇంట ప్రార్థనకు ప్రత్యేకముగ నొకగది లేకపోయినందున, ఎదుటనున్న నాగావళీనదీ యిసుక తిన్నెల మీదికి ధ్యానమునకై వెళ్లుచుండువారు. రాత్రి భోజనాంతరమునను, అర్థరాత్రి యందయినను అటుల వెళ్ళునపుడొక పొరుగింట విశ్వాస పాత్రమైన కుక్క, చెవులపిల్లి డొంకలలో నుండి యొక యిసుక దిబ్బపైకి బోవుచుండుట చూచి, ఆయనకు ముందుగా నడచుచుండునది. ఆయన మోకాళ్ళూని ప్రార్థంచుచుండగా కొంచము దూరమున ఆ కుక్క యొక పహారా సిపాయి వలె కొంతసేవు కూర్చుండి మరికొంత సేపు చుట్టు తిరుగుచు, ఇంటికి వెడలు నపుడు వారికి ముందుగ నడచునది. బలగమేడ ఆవరణనుండి క్రైస్తవులెల్లరు వరుసగా బయలు వెడలి పట్టణమందలి దేవాలయమునకారాధన నిమిత్తము ఆదివారములనాడు వెళ్ళునపుడా కుక్క యందరికి ముందర నడచి గుడిలో ప్రసంగసమయమున వెనుక కూర్చుని తానును ప్రసంగము వినునటుల మౌనముగ నుండునది. అందరు కీర్తనలు పాడునపుడు తన స్వరమును అందు కలుపుచుండినది. కీర్తనలు వినుటకు దాని శ్రద్ధ యింతంత కాదట! దొరగారి పై అంతస్థుగదిలో నొకానొకప్పుడు సభా సమావేశమైనప్పుడు ఆ కుక్క యేలాగో అక్కడికి వెళ్లి యొక సభ్యుని వలె కూర్చుండునది. అది పురుషోత్తము చౌధరిగారికి మంచి సహాయకారిగా నుండు మాదిరి కుక్కగ నుండెనట.

పురుషోత్తముగారు రహస్య ప్రార్థనలకై డొంకలలో బడి వెళ్ళునపుడు పామో, పురుగో యుండునను భయమొకప్పుడాయనకు గలిగినను **"దేవుని సెలవులేనిది యొక తలవెంట్రుకయైన నేలబడదని"** యాయన తిరిగి ధైర్యము తెచ్చుకొనువారు, బద్ధకము

కలుగనెడ "దొరగారిప్పు డెక్కడికైనను వెళ్ళుటకు బిలిచిన వెళ్ళక తప్పదు కదా! దైవసాన్నిధ్య సౌఖ్యమనుభవించుటకై వెళ్ళుటకేల బద్ధకించెదవు మనసా" **"లేలెమ్ము క్రైస్తవుడా నీలో మేల్కొని ప్రార్థనసారము వర్ధన గోరుము – సార్ధకకాలము వ్యర్థము సేయకు"** అని తమ్ముదాము హెచ్చరించుకొనువారు. పురుషోత్తముచౌధరిగారి జీవితమున ఆత్మీయానందముతో గల యనుభవ సంసిద్ధత ఆయన సదా సర్వదా భగవత్ సన్నిధాన వర్తుడగుట వలననే గలిగెను. ఆ నాగావళీ నదీగర్భమున వ్రాయబడిన కీర్తనలు లెక్కకు పెక్కులై యుండెను. ఆ కాలమున **"రక్షణ చరిత్రము"** వ్రాయబడినందున అందలి కీర్తనలు కొన్ని సంఘసంకీర్తనలలో చేర్చబడెను.

## మండాదిలో సువార్త :-

శ్రీకాకుళ సమీపమందలి మండాది యను గ్రామమున డాసన్ దొరగారు కొంత భూవసతి సంపాదించి పేద క్రైస్తవుల సహాయార్థమిచ్చియుండిరి. వారికి బైబిలు కథలు నేర్పించుటకై మన కథానాయకుడు వెళ్లి యప్పుయప్పుడచ్చట నివసించు దినములలో ఒక నాడాయన రహస్యప్రార్థనకై పుర బాహ్య ప్రదేశ మందలి ప్రేతస్థలమునకు బోయి మోకాళ్ళుని ప్రార్థించుచుండ, ఆ గ్రామస్థులు దుమ్ముల గొండియను దుష్ట జంతు విచ్చుటకు వచ్చినదని దుడ్డు కర్రలు పట్టుకొనిపోయి, పురుషోత్తముచౌధరిగారిని పోల్చి నవ్వుకొనుచు నిండ్లకు బోయిరి. ఆయన యా ప్రాంతమున దర్శించి సువార్త చెప్పని గ్రామముండియుండదన వచ్చును.

## కుమారి వివాహము :-

లోగడ పదేండ్ల క్రిందట శ్రీకాకుళమున డే దొరసానిగారి సబ్బాతు బడిలో ప్రభువును తెలిసికొని పురుషోత్తముచౌధరిగారి యుపదేశముచే క్రైస్తవులైన వేంకట ప్రసాద పాఠనాయకు అను జొసయాబర్దరుకు ఈ దినములలో దమ ద్వితీయపుత్రికయగు మేరీసుందరి నిచ్చి వివాహమొనర్చిరి.

## దేవాలయ ప్రతిష్ఠ :-

1846 సంవత్సరమున ఆరువేల రూపాయల వ్యయముతో డాసన్ దొరగారు శ్రీకాకుళము చౌకు బజారు వీధిలో నొక దేవాలయము కట్టించిరి*. దీని ప్రతిష్ఠ

ఆ యేడు జరిగించినప్పుడు పురుషోత్తముచౌధరిగారు **“యెహోవా నీ మహిమాస్థవము – యేసూ నీ సుందర మందిరము – ఇందియెంతో నిత్య శుభకరము”** అను సమర్పణ కీర్తనను వ్రాయగ, రెవ.డాసన్ దొరగారు భారతీయుని వలె వస్త్రధారణ మొనర్చి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని, సితారా వాయించుచు, ఉత్సవముతో బలగమేడ యొద్దనుండి వచ్చి ఆ కీర్తనను పాడుచు గుడిచుట్టు ప్రదక్షిణ మొనర్చి దాని యుపక్రపణోత్సవము జరిగించిరని యప్పటి పెద్దలు చెప్పువారు. రెవ. డాసన్, హే, పురుషోత్తము చౌధరి, పులిపాక జగన్నాధము, జొసయాబర్డరు గార్లు మున్నగు వారు ప్రసంగించిన యా యాలయము నేటికిని దైవారాధనలకై యుపయోగింపబడుచున్నది.

* ఈయాలయము కనేడియన్ మిషన్ వారికొరకు 1884 సం॥ రెవ. జే.ఆర్ హచ్చిన్సన్ దొరగారు కొనిరి.

## రాధామణి దేవి గారి మతాసక్తి :-

మన రాధామణిదేవి చౌధురాణియుగారును మత విషయములలో మిక్కిలి యాసక్తి పరురాలై బాధ్యత గలిగియుండి భక్తోపదేశములు చేయుచుండు వారనియు, ఆమె మూలముననే తాము క్రైస్తవులవుటకు ప్రేరేపింపబడినట్లు చిట్టి వలసలో కొందరు, బూర్వముండిన ఐజకు పుల్లరుగారొక పర్యాయము నాతో దెల్పిరి.

## కళత్ర వియోగము; విశాఖపట్టణ సేవ :-

1850 డిశంబరు 31వ తేదిని పురుషోత్తముచౌధరిగారి కనిష్ఠ పుత్రుడగు సామ్యేల్ చౌధరిగారు శ్రీకాకుళంలో జన్మించిరి. అనంతరము 9మాసములకు అనగా 1851 సంవత్సరము సెప్టెంబరు నెలలో రాధామణి దేవిగారు అచ్చట ప్రభువునందు విశ్రమించిరి. ఆ కాలమందిప్పటి హైస్కూలు కభిముఖముగా నుండిన ఇంగ్లీషు దేవాలయావరణమున ఆమె ఖననము చేయబడెనట. 47 సంవత్సరముల పురుషోత్తముచౌధరిగారు ద్వితీయ కళత్ర విషయము తలపెట్టలేదు. శ్రీకాకుళములో ఆరేండ్లు గడిపిన వెనుక బిడ్డల విద్యనిమిత్తమై డాసన్ దొరగారి సెలవుగైకొని 1851 సంవత్సరాంతమున విశాఖపట్టణము వెళ్లిరి. ఆయన సోదరి కుటుంబ సంరక్షణ భారము వహించి తోడ్పడుచు వచ్చెను.

## ఒక దయగల మహారాజు :-

డాక్టరు జాన్‌హే (Dr. Rev. John Hay M.A) దొరగారు స్థాపించిన యాంగ్ల పాఠశాలలో మన కవి తన బిడ్డలను జేర్చెను. అప్పుడచ్చట రెవ.జే. యస్.వార్డ్లా (Rev. J.S. Wardlaw) దొర దంపతులుండిరి. పురుషోత్తముచౌధరి గారి కనిష్ఠ పుత్రికా మార్తామనోరమ చౌధరిగారుయను బాలికను, వార్డ్లా సతీమణి తమతో లేటు మహారాజా గోడే గజపతి రావు జి.సి.ఐ.ఇ. గారి మందిరమునకు గొనిపోవుచు శ్రీ మహారాజా వారి కుమార్తై లేటు వడ్వాన్ రాణీ గారితో జేర్చి యిద్దరికి దివ్యముగ ఆంగ్లభాష నేర్పించిరి, కుమార్తైకేయే బట్టలిచ్చువారో ఆయా విధములయినవి ఆమె సహపాఠియైన మార్తా మనోరమ చౌధరిగారికిని శ్రీ మహారాజా వారు బహూకరించుచు, అప్పుడప్పుడు పురుషోత్తముచౌధరిగారిని బిలువనంపించి సంభాషణలు చేయుచుండువారట. లూకా మహామాననీయుడైన థెయొఫిలాసునకు వ్రాసినట్టు పురుషోత్తముగారొకప్పుడు శ్రీ మహారాజా గజపతి రావు గారి కొక సువార్త లేఖ వ్రాసి పంపించి యుండిరని వారి చిన్న కుమార్తై నాతో జెప్పెను.

## గ్రంథ ప్రచురణము :-

ఆ దినములలో హే దొరగారు బైబిలు భాషాంతరము ప్రారంభించినందున పురుషోత్తమ చౌధరి వారికి జేయూతగ నుండిరి. అక్కడ నుండిన మిషన్ ముద్రా యంత్రశాలలో మనకవి వ్రాసిన **"రక్షణచరిత్ర", "ముక్తిమార్గప్రదర్శనము, మనసేమూలము, అంధకార నాశనము, మషూచివిషూచిసంకజభ్రాంతి, నివృత్తి, జగన్నాధపరీక్ష, కులాచారపరీక్ష"** మున్నగు పత్రికలు పి. బక్లాండు గారిచే అచ్చుపడుచు వచ్చినవి. ఆ పురాతన సంపుట మొకటి నేటికిని గలదు. 1851 సంవత్సరముననే పురుషోత్తముచౌధరిగారు విశాఖపట్టణమున తమ క్రైస్తవనీతిప్రకాశమను ఏకాశ్వాస పద్యకావ్య ప్రబంధము రచించిరి.*

*1872సం॥ రెవ.దాస్ అంతర్‌వేదిగారీ గ్రంథము యొక్క 1000 ప్రతులు చెన్నపురిలో ముద్రింపించిరి. అనంతరము రెవ.ఎడ్వర్డు పి.రైస్ బి.ఎ గారి సలహానుబట్టి 1893సం॥ సి.ఎల్.యస్ వారు 2000 ప్రతులు ముద్రించిరి.

ఈ పురమున నప్పుడు రెవ.పులిపాక జగన్నాధముగారు, లాలా షణ్ముఖరాంగారు, సామ్యేల్ పాల్‌గారు, విల్యం బెర్రీ దొరగారు, స్టీవెన్ గూకీ దొర దంపతులు, బక్లండు దొరగారు, షప్పర్డు దొరగారు మున్నగు వారు క్రైస్తవ సంఘమున నుండిరి. వారి సహవాస భాగ్యమును పురుషోత్తముగారు చాల యపేక్షించి యుండిరి.

విశాఖపట్టణములో మన కథానాయకులు జీవించిన పన్నెండేండ్లలో జిల్లాలోని జామీందారీ నగరములలోను, ఇతర పట్టణములలోను, పల్లెలలోను విరివిగా సంచారము చేసి సువార్త ప్రచారము గావించిరి. కొన్ని పర్యాయములాయన గోదావరి జిల్లాలో గూడ సంచారములు చేసియుండిరి.

ఆ కాలపు మిషనెరీలాయన కొక డేరాయును, సహాయకులను ఇచ్చి యుండినందున యథేచ్ఛగా సువార్తసంచారములు చేయగలిగి యుండిరి.

## 1860 సం॥ ప్రయాణములు :-

పురుషోత్తముచౌధరి స్వహస్త లిఖితముగల రిపోర్టులు, గ్రంథములు కొన్ని 1902 సం॥ నేను కటకపురి నుండగా ఆయన పెట్టెలు వెతికి తీసికొని వచ్చిరి. అందొకటి "ముఖ్యమైన నకళ్ళు" అని యున్నది. అందాయన 1860 సం॥ ఫిబవరి15వ తేదిని విశాఖపట్టణము, విడిచి ప్రస్తుతముహెూం మిషన్ కార్యక్షేత్రముగానున్న చోడవరము, వడ్డాది, అనకాపల్లి, శామలాపల్లి, పెద్దకాడిలొడు, సౌతువాడ, శ్రీరామపట్టణము, రోలుగుంట, కొత్తకోట, కోటపాడు, మాడుగుల, మున్నగు 30 గ్రామములలో 17 దినములు సువార్త ప్రకటించి నూతన నిబంధనలు పత్రికలు చాలా విక్రయించి మాడుగులలో పోష్టాఫీసు వీరవల్లిలో నున్నట్టు విని విశాఖపట్టణమున నుండిన మిషనెరీకి (బహుశ డాక్టరు జాన్ హే దొరగారికి) అక్కడ నుండి 1860 సం॥ మార్చి నెల 3 వ తేదిని పంపిన యుత్తరము యొక్క నకలు క్రింది సంగతులున్నవి.

"మేము మూడు దినములు చోడవరములో నుండి నిన్నను వడ్డాదికి వచ్చినాము. ఈ దినమున్ను వడ్డాదిలో నుండి రేపు సాయంతనముకు మాడుగుల చేరవలెనని ఆలోచించినాము. రెండుమూడు దినములు మాడుగులలోనుండి, అక్కడి నుండి నరిసిపట్టణము వెళ్లి , మరియొక ద్రోవను అనకాపల్లికి దిగివచ్చుటకు ఉద్ధేశము కలిగియున్నది. ఇల్లు వదలిన యీ 17 దినములు 30 గ్రామములు తిరిగినాము.

అక్కడక్కడ 2, 3 దినములు ఒక్కొక్కచోటను ఉండిపోయి పని జరిగించుచున్నాము. జనులు చక్కగా సువార్త వింటూయుండి, సంగతిని కొందరు మనస్సులోనికి తెచ్చుకొనునట్లు కనుబడుచున్నారు. కొన్ని కొన్ని స్థలములలో బియ్యమున్ను డబ్బులున్ను తెచ్చి మాకిచ్చుచున్నారు. ప్రభువు దయచేత ఇప్పటికి స్వస్థత గలిగి తండ్రి యెదుట నుండి శక్త్యానుసారముగ పనిచేయుచున్నాను. జనులు పత్రికలు మాత్రము కొంటున్నారు...... నేను ప్రయాణమై వెళ్ళుచున్నప్పుడు ఇరుప్రక్కలను విస్తారముగా అగుపడే గ్రామాదుల సంఖ్యను గురించిన్నీ, వాటిలోకి ప్రభువు యొక్క వెలుగు ఎన్నడైన వెళ్లకపోవుటను గరించిన్నీ నా హృదయములో ఎటువంటి తలంపులు పుట్టునో యేమి చెప్పగలను. ఱెక్కలు లేని యొక మెరుగుడు పురుగు ఏ తట్టు ఎగిరివెళ్లగలదు? ఏ పాటి వెలుగు చూపించగలదు? అని నిట్టుర్పువిడిచి ప్రభువు తట్టు చూచుటయేగాక మరియేమి చెప్పజాలుదును? తగినటు వంటి పనివాండ్రు ఒక నూరుమందియైనా ఈ జిల్లాలో ఉన్నప్పటికి యింకా కొన్ని అసాధ్యములు ఉండిపోవునేమో యని నాకు తోస్తుంది. యేమిచేయను? ప్రభువు తన కార్యవృద్ధి కొరకు తానే లేచివచ్చుగాక! దేవుడు తన ఘనపరిశుద్ధ నామము కొరకు తన కుడిచెయ్యి చాపునుగాక!

పురుషోత్తముచౌధరిగారు, రెవ. జే. ఎస్. వార్డ్లా దొరగారి పేర వ్రాసిన క్రింది యుత్తరములోని విషయములును పాఠకుల కాయన యాత్మీయ భావములు వెలువడింపగలవు.

సరికిపట్టణము

తే 10 ది మార్చి 1860

వార్డ్లా దొరగారికి,

ప్రియమైన, దయగల తండ్రీ !

“............ నేనున్ను రంగయ్యయున్ను నేటికి 25 దినములాయెను. విశాఖపట్టణము విడిచి పడమటి తట్టున్న తాలూకాలలో తిరుగుచు ఇది వరకు 45 గ్రామాదులలో మన రక్షకుడైన యేసు యొక్క సువార్త ప్రకటన చేసి యిప్పుడు నరిసిపట్టణము చేరియున్నాము. ఇంకా కొన్ని దినములు ఈ తట్టు ఉండి పనిచేసి అనకాపల్లికి దిగివెళ్ళి, తరువాత యీ నెలాఖరుకు విశాఖపట్టణము చేరవలెనని

యుద్ధేశము కలిగియున్నది. గ్రామాదులలో బహు జనులు శుభ సమాచారము వినుటకు సంతోషముగా చెవి యిస్తున్నారు. ఫలింపచేసే కార్యము దేవునిదై యున్నది....... ..... ఈ గొప్ప జిల్లాలో దినమునకు ఒక గ్రామము చొప్పున ఒకటి తప్పకుండా తిరిగినట్టయిన 5, 6 సం॥లయినా చాలునో లేదో యని నాకు తోస్తున్నది. ఇంతగొప్ప విశాలమైన యీ దిక్కున మిణుకు మిణుకు మెరిసే యొక చిన్న మెరుగుడు పురుగు వంటి నేను ఈ మూలనుంచి అమూలకున్ను, ఆ మూలనుంచి ఈ మూలకున్ను ఎంతదూరము పరుగెత్తగలను? ఏపాటి వెలుగు ప్రజలకు చూపించగలను? సువార్త ప్రకటించు పనికొరకై పనివాండ్రు కొందరు కావలసియున్నారు. అందు నిమిత్తము దేశీయ(నేటివి) క్రైస్తవుల సభలలో బుద్ధిగలవారిని కొందరిని యెంచి యీ పనికి తగినట్టుగా వారికి కొంత నేర్పించి, సువార్తకులనియైనా, మరియేదైనా యొక పేరు వారికిచ్చి పంపించిన ప్రభు రాజ్యము వ్యాపించును గదా యని నాకు తోచినది............. ఇప్పుడు యూరపు దేశమందున్న క్రీస్తు భక్తులు ఈ యిండియా దేశములో అనేక పాఠశాలలు స్థాపించి వాటివల్ల క్రీస్తు మతము ప్రబలింపచేసి, ప్రజలందరికీ మేలు చేయవలెనని తమ తమ ఆస్తి లోనిది కొంత కొంతసొమ్ము చందావేసి యిస్తున్నారని వినబడుచున్నది. ఇది మిక్కిలి ఘనమైన కార్యమే....... ....... అయినప్పటికి కొందరు దేశసంచారము చేసి గ్రామాదులలో నున్న ప్రజలకు క్రీస్తును గురించి ప్రకటన చేయుట మరి మంచికార్యమని నాకు తోచినది. సువార్తకులు దేశమంతట తిరుగగలరు. పెద్దలు, పిన్నలు, స్త్రీలు, పురుషులు అందరున్ను అడ్డము లేకుండా వారి ప్రగంగములు వినవత్తురు. చాలా దూరము రవులుకొని ఆ వెలుగు వ్యాపించుచు, బడులు స్థాపించుట కూడదను తాత్పర్యం నాది కాదు. బడులు కూడా అవశ్యము ఉండవలెను. బడులు స్థాపించుట యొక వంతు, సువార్త ప్రచారకుల నేర్పరచి ప్రకటన చేయ పంపుట నాలుగు వంతులై యుండవలెను... .... తమ చిత్తమైతే యీ యుత్తరమే తమరు తర్జుమా చేసి యిండియా దేశపు మేలు కోరిన భక్త వర్గములకు వినిపింపవచ్చును.... ఈ ఘనకార్యము ఎత్తుకొనుటకు తమరున్ను, హే దొరగారున్ను చాలుదురు. హే దొర గారు కొన్ని నెలల తరువాత సీమ వెళ్ళుదురు గదా! వారికి బదులుగా తమరే రావలెనని కోరుచున్నాను. నా కుటుంబస్థులున్ను, క్రైస్తవులందరున్ను బాగా ఉన్నారని నా పెద్ద కుమారుడు డేవిడ్ చౌధరి విశాఖపట్టణము నుండి నాకు పంపిన యుత్తరము వల్ల తెలియబడినిది.

ఇప్పుడు మేము బసదిగి మామిడిచెట్టు క్రింద కొంతనీడ యెండయును, గాలిదెబ్బవల్ల దూళి అధికముగాను, కొన్ని చిన్న పురుగుల బాధయు నుండగా ఈ యుత్తరము వ్రాసినాను, వేళయైనది గనుక వ్రాత ముగించి పనిచేయుటకు వెళ్ళుదును.

నేను తమ క్షేమముకోరు
తమ దీన సేవకుడైన,
పురుషోత్తము చౌధరి

ఆ కాలమున ఆ వృద్ధభక్తుడా ప్రాంతమున సంచారము చేసి, అట్టి వృక్షాచ్ఛాయల క్రింద జేసియుండిన ప్రార్థలనకు ఫలితము నాయన 1892 సం॥ అక్టోబరు నెలలో రెవ.జి.హెచ్. బేరో గారు నరసిపట్టణమును మిషన్ క్షేత్రముగ నాక్రమించు కొనినది నుండి యచ్చట నొక సంఘము వెలయుచున్నది.

## 1861 సం॥ ప్రయాణములు :-

పురుషోత్తము చౌధరిగారి 1861 సం॥ లిఖిత నివేదికను బట్టి ఆయన సువార్త ప్రయాణములను గూర్చి యింకా వివరముగా దెలియచున్నది. ఆ సంవత్సరము జనువరి 21 వ తేది మొదలు ఫిబ్రవరి 27 వ తేది వరకు 38 దినములు విశాఖపట్టణము గోదావరి జిల్లాలలో 46 పట్టణములు, గ్రామములలో ఆయన సువార్తను ప్రచురించి యుండిరి. ఆ రిపోర్టులోని కొన్ని విషయము లీకాలపు బోధకులకు సహాయకరములుగ నుండునని వానినిందు బొందుపరచుచున్నాము. పురుషోత్తము చౌధరిగారు, రంగయ్యగారు యనునొక సోదరుని వెంటపెట్టుకొని యొక డేరాతో నీ గొప్ప సంచారమున వెలువడిరి. ఇందు నవాబుపేట, అనకాపల్లి, ఎలమంచిలి, ధర్మవరము, మునిబాలుని పాలెము, కొత్తూరు, రాయుడుతోట, దెబ్బలపాలెము, పాయకరావుపేట, తుని, ఒంటిమామిడి, తొండంగి, రవణక్కపేట, పిఠాపురము, సామర్లకోట, భీమవరము, సబ్బవరము, కాకినాడ, జగన్నాయకపురము, కోరంగి, మొగులపాలెము, పెద్దాపురము, సంద్రేడు, రాయవరము, నల్లజెర్ల, రంగంపేట, రాజానగరము, జగన్నాధపురము, వెంకటాపురము, మాదిగపల్లి, రాజమహేంద్రవరము, పాలకొలను, నరసాపురము, నరేంద్రపురము, తాళ్ళూరు, మధురమాలపేట, రాఘవమ్మపేట, జగ్గమ్మపేట, ధర్మవరము,

అన్నవరము, గోపాలపట్టణము, నక్కపల్లి, ఉపమాక, విజయరామపురము, లక్ష్మీదేవిపేట, అగనంపూడి, యను స్థలములు దర్శించిరి. 1861 సం॥ ఫిబ్రవరి 22 వ తేదిని అనకాపల్లిలో ప్రజలు సువార్తను విని పత్రికలు, గ్రంథములు కొందరు కొనిరి. యెలమంచిలిలో చాలామంది పత్రికలు కొనిరి. నక్కపల్లి ప్రాంతములో మశూచికము విశేషముగ వ్యాపించియుండినను సువార్తప్రచారము జరిగెను. 28వ తేదిని తుని పాయకరావుపేట గ్రామములలో జాలమంది జనులు వినిరి. "ఒకడు వేదాంత సంగతి దేహతత్వసంగతి వీటిని గూర్చి చాలసేపు గడబిడగా పెద్ద ధ్వనితో మాట్లాడినాడు. ఒక తురక చిన్నవాడు ఒక న్యూటెస్టమెంటు కొనుక్కొనెను." అని వ్రాసియున్నారు.

ఒంటి మామిడిలో పురుషోత్తము చౌధరిగారు ప్రసంగించిన తరువాత వినిన శాస్త్రి యొకడు కొంతసేపు వితండ వాదము చేసి యొక పత్రిక కోరగా **"ముక్తిమార్గప్రదర్శన"** మాతని కిచ్చిరి. ఇంకొక బ్రాహ్మణుడింకొక పత్రిక కోరగా **"హిందూమత దైవపరీక్ష"** యను పత్రికనిచ్చిరి. 28 వ తేది సోమవారము నాడు పిఠాపురములో "చాలామంది సంతోషముగా విన్నారు. బ్రాహ్మణులు విస్తారముగా కూడి వినిరి. కాని యొక్కరైనా యెదురాడలేదు. పుస్తకములు బహుజనులు కొనిరి" అని వ్రాసియున్నారు.

## సామర్లకోటలో గడబిడ :-

29, 30 వ తేదిలలో సామర్లకోట భీమవరములో నాలుగు ప్రసంగములు జరిగెను. " చాలా మంది సువార్త బహు సంతోషముగా ఆలకించిరి. అట్టి సమయములో చెన్నపట్టణపు అరవ మనుష్యుడు తప్పత్రాగి కన్నులెర్రగానుండ, రాక్షసుని వలె అందరిని తోసికొని నడుమను మా యిద్దరి యెదుట నిలిచి భయంకరముగా కన్నులను చేస్తూ వికారమైన కేకవేసి, యేమేమోమాట్లాడి మమ్మును కొట్టుటకు సిద్ధపడుచుండెను. అంతట ప్రసంగ శ్రవణాసక్తి గల యిద్దరు ముగ్గురు మంచి మనుష్యులు పెరుమాళ్ళ సేవజేసియున్నావని వానికి తెలియజేసి వానిని వెళ్లిపొమ్మని చాలా మంచిమాటలతో బ్రతిమాలి చెప్పిరి. అందుకు వాడు వారిని లక్ష్యపెట్టక మరింత తీవ్రపడి మమ్మును తన యిష్టము చొప్పున జరిగించుటకు పెంకి మాటలాడుచు పై బడుటకు వచ్చెను. బాగా వింటున్న ఒక డఫేదారు మా పక్షముగా మంచిమాటలాడి ఆ మదగర్వియైన

త్రాగుబోతును బలవంతముగా పట్టి ఆ గుంపులో నుంచి బైటికి ఈడ్చుకొనిపోయి వానికేమేయో మంచి బుద్ధులు చెప్పెను. వాని గడబిడ అణగిన తరువాత ప్రజలు ఇంకా వినేటందుకు ఆసక్తి కలవారై యుండుటవల్ల నేను మళ్లీ ప్రభు వాక్యము ప్రసంగించుట కారంభించితిని కొంతసేపయిన తరువాత మళ్లీ ఆ రాక్షసహృదయుడు మెల్లిగా  గుంపులో దూరి మా యెదుటనే వచ్చి నిలిచి, కొంచెము వినయముగా మాట్లాడనారంభించి నా చెయ్యి పట్టుకొని “ నీ వేలు వంక అయిపోయెను ఎందుకురా అప్పా” అని ఒక తిట్టు తిట్టి మళ్లీ తన రాక్షసాకారము చూపించవచ్చెను. అప్పుడు తక్కిన వారు విని  వానిని సహించరైరి........ మేము తప్పించుకొని వెళ్లిపోతిమి.”

“భీమవరములోను సాయంకాలము సంతలోను దేవుని కృపా వాక్యము ప్రసంగించగా చాలామంది చక్కగా వినిరి. నేడు రెండు పూటలున్ను ఫాదిరీ లాజ్ దొరగారు మాతో వచ్చి మా ప్రసంగముల యొద్ద నిలిచియుండిరి” యని వ్రాసియున్నారు.

31వ తేదీ లక్ష్మివారము; “ ఈ దినము మేము కాకినాడకు వెళ్ళుచున్నప్పుడు మార్గములో సబ్బారము అనే వూరియొద్ద బసదిగి గ్రామములోనికి వెళ్లితిమి. ఇది యగ్రహారము.... మేము వెళ్లి వీధి మధ్యను నిలిచి నేను పత్రిక చదివిన తరువాత రంగయ్య కొంత మాట్లాడెను. వెనుక నేను దేవుని పరిశుద్ధ నీతి న్యాయ విధులను గురించిన్ని మనుష్యులు విగ్రహారాధనాది పాపములు చేసి దేవకోపాగ్నికి పాత్రులై యుండుటకు గురించిన్ని అందుకు యేసుక్రీస్తు తప్ప హిందూ దైవతములు తగరనిన్ని యిత్యాది సంగతులు తేటగా వివరించినప్పుడు కొంతమంది బ్రహ్మణులు ప్రోగుపడి....... నిశ్శబ్దముగా నుండి ఒకరిని ఒకరు ముఖములు చూచుకొంటూ వుండిరి. నేను కనపరచిన న్యాయములన్నీ యొప్పుకొన్నట్టు వారి భావమని నాకు కనబడెను. పత్రికయియ్యబోగా వారిలోనొకడు అవి మాకెందుకు అనెను.

## కాకినాడ, జగన్నాధపురములలో సేవ:-

ఫిబ్రవరి 1వ తేది శుక్రవారము; “ కాకినాడ, జగన్నాధపురము ఈ రెండు స్థలములలో నాలుగుమార్లు ప్రసంగము చేసినాము. అనేక జనసమూహములు కూడి సంతోషముగా ఆలకించిరి. కాకినాడలో ఈ దినము గొప్ప సంతయుండెను. కొన్ని గ్రామములవారు వచ్చిరి. కనుక అనేకులు సంత యొద్ద మా ప్రసంగము సంతోషముగా

వినిరి. ఒకచోట **కులాచార పరీక్ష** అంతా చదువబడెను. ఒక మనుష్యుడు తనకు "మోక్షము తక్షణమే దొరికే పుస్తకమిమ్మ"ని చాలా బ్రతిమాలెను. కాకినాడ సుందరమైన పట్టణము"

**2వ తేది శనివారము :-** " కాకినాడ నుండి యేర్లుదాటి కోరంగి చేరినాము. ఈ దినమంతా మూడు చోట్ల ప్రభువు నామమును ప్రసంగించినాము. బహుజన సమూహములు కూడి సంతోషముగా విన్నారు. ఒక బ్రాహ్మణునికిన్ని, నాకున్ను మతములను గురించిన్ని శాస్త్రములను గురించిన్ని, విశ్వాసమును గురించిన్ని, సూర్య చంద్ర గ్రహణములను గురించిన్ని చాలా సంభాషణ ప్రశ్నోత్తరములు జరిగెను. పత్రికలిక్కడ అమ్మకమైనట్టు మరియెక్కడనున్ను కాలేదు. మార్గములో మొగలపాలెములో ప్రభునామము చాటినాము."

**3వ తేది ఆదివారము:-** కాకినాడలోనున్నూ, జగన్నాధపురములోనున్నూ ప్రభువాక్యము ప్రసంగించినాము. బహు జనము పోగుపడి విన్నారు.

**4వ తేది :-** తిరిగి సామర్లకోటలో ప్రసంగము.

**5వ తేది పెద్దాపురము :-** ఉదయము పెద్దాపురము వచ్చినాము. ఈ గొప్ప గ్రామములో రెండుసార్లు బజారులో జీవసమాచారము ప్రసంగించినాము. బహుజనములు విన్నారు. అనేక బ్రాహ్మణులున్ను పోగుపడిరి. ఇద్దరు బ్రాహ్మణులు కొంచెము తర్కించిరి....... సువార్తను చెప్పి బ్రాహ్మణుల తంత్రోపాయములు నేను, వివరించినపుడు వారు సిగ్గునొందిరి. ప్రజలందరు అంతగా ఆలకించిరి".

6వ తేది.......... ........ రాయవరములో ఒక స్త్రీ తన చేతులు జోడించుకొని నిలిచి ప్రభు నామము వినెను." మేము మిక్కిలి యెండపడి యుండుట చూచి ఆ స్త్రీ తనంతటతానే దాహము ఇస్తునాయని మమ్మునడిగి తన యింటికి బోయి మంచి చల్ల (మజ్జిగ) తెచ్చి యిచ్చి మా దాహము తీర్చెను."

7వ తేది లక్షివారము నాడు రాజానగరములో నొకడు **ముక్తిమార్గప్రదర్శనము** కొని, మిక్కిలి సంతోషించి అటువంటివి యింకా కావలెనని అవి సరిపడనందున మేము లేవన్నప్పుడు అతడు కాగితముల పుస్తకము కుట్టి అందులో ఎత్తి వ్రాసి తన బంధువుల కిచ్చెదనని చెప్పెను."

## పాలకొొలను, నరసాపురమును దర్శించుట :-

8 వ తేది శుక్రవారము రాజమహేంద్రవరము దాటి 9 వ తేది శనివారము పాలకొొల్లు చేరినాము. ఈ గ్రామములో 9, 10, 11 తేదీలు ఈ మూడు దినములు ఉన్నాము. బౌడన్ దొరసాని గారిని, క్రీస్తు సంఘమును చూచినాము. రెండుమార్లు సంతలోనున్న వీధిలోనున్ను ప్రసంగించినాము. ఆదివారము క్రైస్తవ సంఘములో మత్తయి 4 పర్వము 4వ వాక్యమును బట్టి ప్రసగించినాము.

12 వ తేది మంగళవారము సాయంకాలము బౌడన్ దొరసానిగారితో కూడా వారి పడవనెక్కి రాత్రి 7 గంటల లోపల నరసాపురము చేరినాము.

నరసాపురము 13, 14 తేదీలలో బుధ, లక్షివారములు ఈ రెండు దినములు నరసాపురము వీధులలో నుండి 5 మార్లు ప్రభు వాక్య ప్రచారము చేసినాము. ప్రజలు అనేకులు వినిరి. కొందరు సమాధానముగా వినిరి. రెండుచోట్ల జనులు తర్కవాదము చేసినారు. 14 తేది లక్షివారము సాయంత్రము బీరు దొరసాని గారి యింటిలో ఆరాధన జరిగించడమైనది. చాలామంది క్రైస్తవులుండగా మత్తయి 11వ పర్వము 28 వాక్యమును బట్టి ప్రసంగించినాను. జమాబందీ నిమిత్తము నా నా గ్రామముల ప్రజలు విస్తారముగా నరసాపురము వచ్చియుండిరి. అనేకులు ప్రభు నామము విని చాలా పత్రికలు కొన్నారు."

## రాజమహేంద్రిలో ప్రచారము :-

రాజమహేంద్రి :- 15వ తేది శుక్రవారము నరసాపురములో పడవ యెక్కి మరునాటి యుదయము సరికి రాజమహేంద్రవరము చేరినాము. 16 తేది సాయంత్రము చిన్న బజారులో దేవవాక్యము ప్రసంగించినప్పుడు చాలా మంది కూడినారు. కాని కొందరు త్రాగుబోతులు చేరి.... క్రీస్తు మతమును నిందించి మమ్ము దూషించిరి. ఒకడు ఇంకొక సంవత్సరము మాత్రమే గదా; తరువాత మీ పని యేమవుతుందో చూతురుగానీ యనెను."

" 17 వ తేది యాదివారము పాదిరి హైనే దొరగారు ఆరాధన జరిగించిరి. కొందరు క్రైస్తవులున్ను చాలామంది హిందువులున్ను గుడికి వచ్చిరి. హైనే దొరగారు కొంచెము ప్రసంగించిన తరువాత నేనున్ను ప్రసంగము చేసినాను. సాయంత్రము క్రైస్తవుల యిండ్లకు వెళ్లి పరామర్శ చేసినాము.

“ 18 వ తేది సోమవారము రాజమహేంద్రరము పెద్ద బజారు వీధిలో నిత్య జీవానంద వాక్యము ప్రసంగము చేసినాము. అనేకులు పోగుపడి విన్నారు. ఒకడు “భీష్ముని, కృష్ణుని కార్యములకంటె క్రీస్తు వాక్యములలో ఉండే అతిశయమేమిటి” యని యడిగెను. అందుకు నేను వారు దైవత్వముగలవారు కారని ఆ గ్రంథములవల్లనే ఋజువు పరచి క్రీస్తు యొక్క దేవ మానవత్వములను గురించి వివరించినప్పుడు కొంత వొప్పుకొని నన్ను మెచ్చెను కాని ప్రభువును మెచ్చుడాయెను.”

**“19 వ తేది మంగళవారము :–** రాజమహేంద్రి విడిచి మధ్య రెండు గ్రామములు చూచి 19 వతేది బుధవారము తాళ్ళూరు, మధుర, మాలపల్లి, రాఘవమ్మపేట, జగ్గమ్మపేట, యీ 4 గ్రామములలో అనేక జనులకు సువార్త ప్రకటించినాము. రాఘవమ్మపేట నాయుడు సంతోషముగా విని కొన్ని పత్రికలు కొని తన కుమారులకిచ్చెను. వంటకు భత్యమిచ్చెను”.

“ 22 వ తేది శుక్రవారము గోపాలపట్టణము, అన్నవరము ఈ రెండు గ్రామములలో చాలామంది సువార్త విన్నారు.

## శ్రీ తుని రాజుగారితో సంభాషణ*

*ఈయన పెద్దాపురం, గొల్లప్రోలు, కొట్టయం, తుని మున్నగు ఎస్టేటులజమిందాయిన శ్రీరాజా వత్సవాయ వేంకటసూర్యనారాయణ జగపతిరాజు బహద్దరుగారట.

“ 23 వ తేది శనివారము తుని గ్రామములో నాలుగు చోట్లను ప్రసంగము జరిగెను. అనేక ప్రజలు సంతోషముగా వినిరి. నేటి సాయంత్రము మా డేరా యొద్దికి కొంత మంది ప్రజలు వచ్చి కూర్చుండి బాగా వినిరి. వారు వింటున్న సమయములో రాజుగారును, అతని ప్రధానులును అనేక మంది బ్రాహ్మణులును. హెడ్డు పోలీసును, ఇంకా చాలామందియు యిచ్ఛా విహారముగా పోవుచుండి మా డేరా మార్గముగా వచ్చిరి. రాజుగారిని చూడగానే నా చుట్టు కూర్చున్న ప్రజలును వారితో కూడా నేనును సగౌరవముతో లేచి నిలువబడితిమి.

**రాజుగారు :** “ మీరెవరు అని నన్ను అడిగిరి”

**నేను :** “ క్రీస్తు మతస్థుడను, క్రీస్తు మతము ప్రజలకు బోధించవచ్చిన వాడను.”

**రాజుగారు:–** ‘‘ మిమ్మును నేను కొన్ని మార్లు చూచినాను కాని మిక్కిలి సంభాషించుటలేదు. ఇప్పుడు క్రీస్తు మతములో

ఉన్న ప్రత్యక్ష ప్రమాణములు వినగోరుతాను చెప్పవలెనని మా డేరా యెదుట మైదానములో గూర్చిండిరి. తన పరివారమందరిని గూర్చుండుమనిరి. నన్ను తమ యెదురుగా కూర్చుండుమనిరి. ఆ సమయమున 50, 60 మంది కెక్కువ జనులు రాజుగారి యిరు ప్రక్కలలో గూర్చుండిరి."

* ఇందును బట్టి పురుషోత్తమచౌధరి గారు 1861 సంవత్సరమునకు పూర్వమున్ను ఇట్టి దీర్ఘ సువార్త సంచారములు చేసిరని విశదమగును.

**రాజుగారు:–** మర్యాదగా మాట్లాడ నారాంభించి " మీ చేతిలోనివి యేమి పుస్తకములు" అని అడిగెను.

**నేను :–** " క్రీస్తు మత సంబంధమైన న్యాయములు బోధించే పత్రికలని" చెప్పినాను.

**రాజుగారు:–** " క్రీస్తు మతము అవలంభించుట వల్ల ఫలమేమి దొరుకునని" అడిగిరి.

**నేను :–** " పాపక్షమార్పణమును, పరమందు నిత్య జీవానందమును కలుగునని" చెప్పితిని.

**రాజుగారు:–** " అందుకు ఋజువేమిటి? ఏ నిదర్శన మున్నది. చెప్పుడనిరి".

**నేను :–** " దేవుని ఆత్మను పొందిన భక్తులు వ్రాసిన గ్రంథము దేవగ్రంథము కనుక ఆ వాక్యములు రూఢిగ నమ్మవలెను. తమరు నిదర్శనమడుగుట న్యాయమా? ఎందుకంటే తమరు ఏదో యొక మతము ధరించి ఆ మతాధికారియైన వేల్పును అనుసరించి యున్నారు గదా? వారిని చూడలేదే. చూడనప్పటికిని నమ్ముచున్నారే! నన్ను నిదర్శనం అడిగేది యెందుకు? అంటిని.

**రాజుగారు:–** అలాగైతే మాకు మీకు గ్రంథములే కదా సాక్ష్యము? మా గ్రంథములలో చెప్పియున్న శివకేశవులను, రామ,కృష్ణాద్యవతారములను మేము నమ్మి తరించలేమా? వీరికంటే క్రీస్తు యొక్క విశేషమేమిటి? యనిరి.

**నేను :–** " పక్షపాతము లేకుండా తమరు చెప్పిన దైవతములను, క్రీస్తును శాస్త్రములవల్ల సరిపోల్చినప్పుడు క్రీస్తు వంటివారు ఇతరులుకారు. ఏమంటే గ్రుడ్డివాని కొరకు గ్రుడ్డి వాడున్ను, దోషి కొరకు దోషిన్ని పనికిరారు. ఇతర వేల్పులు పాపాత్ముని రక్షించ

జాలరు. క్రీస్తు నిష్పాపియును, దేవమనుష్యత్వములయందు తగియున్నవాడును, దేవుని చేత నిర్ణయింపబడి పాపుల రక్షించ వచ్చిన అవతార పురుషుడును, అనుటకు మంచి దృష్టాంతములు కలవని" యంటిని.

**రాజుగారు:–** " మా దైవముల యొక్క మహాత్కార్యములన్నీ కప్పివేసినారు, చేసిన అక్రమకార్యములు మాత్రము బైటకు తెచ్చి వాటిని బట్టి ఆక్షేపించుట యుక్తమా? మేము క్రీస్తును గూర్చి యెంత మాత్రము ఆక్షేపించము. ఉభయ మతములు మంచివే అంటాము. కాని మీరెందుకు మా దైవములను ఆక్షేపిస్తున్నారు?" అనిరి.

**నేను :–** " ఒక ఆక్షేపణయైనా చేయలేదు. ఉన్నదున్నట్లే చెప్పెదము కాని లేనిది కల్పించి ఆక్షేపించము. రామకృష్ణాద్యవతార పురుషుల యందు కొన్ని మహత్కార్యములు గ్రంథకర్తలు ఆరోపించి వ్రాసినప్పటకిని వారికి పాపమున్ను, శిక్షయున్ను ఉండినట్లు చెప్పిరి. అట్టివారు మహత్కార్యములను చేయజాలరు" అని చెప్పితిని.

**రాజుగారు:–** " వారు అక్రమములు జరిగించి శిక్ష పొందడము ఎందుకంటే వారు లీలామానుషులు గనుక, లోకులలో ఇటువంటి అక్రమములు ఎవ్వరు చెయ్యతగదనిన్ని, చేసినట్టయితే తాము పొందిన శిక్ష ప్రకారము అంతకంటే అధిక శిక్ష వచ్చును సుమా అని బుద్ధి చెప్పుట కొరకే ఆలాగు మచ్చు చూపించిరి" అని చెప్పిరి.

**నేను :–** " అది తగనిమచ్చు, దైవత్వము గలవాడు ఆలాగు చేయడు. అంతేకాదు, ఒక గ్రామాధికారి తాను లెస్సగా త్రాగి మత్తుబొంది, వీధిలో పొరలుతూ, హాస్యాస్పదుడైయుండి, అట్టివాడు – ఓయీ గ్రామస్థులారా! మీలో ఎవరున్ను కల్లు త్రాగకూడదు సుమండి, త్రాగినట్టయితే నా వలె మీరు చెడిపోతారు, మరిన్ని నేను మిమ్మును దండింతును. అని యతడు చెప్పినట్టయితే ఆ త్రాగుబోతు అధికారి యొక్క బుద్ధి ప్రజలు విందురా? వానిని లక్ష్యపెట్టుదురా? వానికి భయపడుదురా? కాబట్టి **"యథాదైవ తథాభక్తా"** అనే న్యాయము చొప్పున దైవములు నడిచిన అక్రమ ప్రకారము వారి భక్తులున్ను నడుతురే గాని తిన్నని నడువడి వారికి ఎక్కడ దొరుకును? ఎంతమాత్రము దొరకదు" అంటిని.

**రాజుగారు:–** " క్రీస్తు మతస్థులైన జాతులవారు తిన్నగా నడుచుకొంటున్నారా? వారిలో

అక్రమములులేవా? అని అడిగిరి.

**నేను :–** " ఇంగ్లీషు దొరలంతా భక్తులుగారు. క్రీస్తు నామము వహించినప్పటికిన్ని అనేకులు దుర్మార్గులున్నారు. వారిశిక్ష వారికొరకున్నది. వారిని మీరైనా, నేనైనా కనిపెట్టవద్దు. ఏమంటే వారందరు మనవంటి నరులు. అయితే యిప్పుడు జరుగుచున్న సంభాషణ మనలను రక్షించే అవతార పురుషులను గురించి అయ్యున్నది. కనుక అట్టివారు దోషరహితులై యుంటేనే కాని పనికిరారుగదా" అంటిని.

**రాజుగారు:–** " క్రీస్తును మేకులు వేసి చంపుట యెందుకు? ఆయన దేవత్వము గలవాడై యుంటే చావడమెందుకు? అని అడిగిరి".

**నేను :–** " దేవుని న్యాయ ప్రమాణమును గురించిన్ని, దయను గురించిన్ని, సూక్ష్మముగా చెప్పి క్రీస్తు పాపులకొరకు ఆలాగు మృతి బొందవలెననే దైవనిర్ణయమున్ను, ప్రజలకొరకు క్రీస్తు వచ్చునని ప్రవక్తలు ముందు చెప్పిన ప్రకారము అంతా నెరవేరుటయున్ను, మళ్లీ క్రీస్తు వచ్చి మృతుల నందరిని మంటిలోనుండి లేవనెత్తి న్యాయము తీర్చుటయున్ను ఈ సంగతులు సంగ్రహముగా చెప్పి ఆ యేసుక్రీస్తే రక్షకుడని నేను దృఢముగా పలికినప్పుడు రాజుగారున్ను తక్కిన వారున్ను విని వారిలో వారు తమ మతముకు విరోధముగా ఉన్నదని యేమేయో అనుకొనిరి."

"ప్రొద్దుమునిగి చీకటి వస్తున్నది గనుక వెళ్లి పోదామని రాజుగారును ఆయన జనులందరును లేచి వెళ్ళిపోయిరి.

(డేరా యుండుటవల్ల ఇట్టి వారందరు వచ్చుటకును, కూర్చుండి సంభాషించుటకును మంచి హేతువు కనబడెను.)"

**24 వ తేది ఆదివారము:–** నక్కపల్లి. ఉపమాకలలో సువార్త చెప్పుచుండగా రంగయ్య గారి పిల్ల చనిపోయినదను వార్త వచ్చినందున ఆయన ముందుగా వెళ్ళిపోయెను. తక్కిన గ్రామములలో సువార్త ప్రచారము చేసి పురుషోత్తము గారు ఫిబ్రవరి 8 వ తేదిని విశాఖపట్టణము చేరిరి. రిపోర్టు చివరకు **"ఈ ప్రయాణ కార్యము దేవుడు ఆశీర్వదించును గాక!"** యను ప్రార్థనను ఆయన వ్రాసుకొని యున్నారు. పురుషోత్తము గారు సజీవులై యుండగనే చాలా పట్టణములు కనేడియన్ మిషన్ స్టేషనులుగమారి, ఆపెద్దలు చేసిన ప్రార్థనలకు ప్రతిఫలమోయనజాల చాల చోట్ల

క్రైస్తవ సంఘములు లేచినవి. మీద వివరించిన తుని రాజా గారి కుమారిక శ్రీ రాజా జగపతి సుభద్రయ్యమ్మ బహదురు గారికి కొన్ని యేండ్ల క్రిందట రాజుల మిషన్ పక్షమున పురుషోత్తము చౌధరిగారి, మనుమలలో నొకరగు ఈ చరిత్ర రచకుడే చక్కగా గిల్టు వేయబడిన యొక బైబిలు గ్రంథము నొక సభలో బహూకరించెను.

## చిన్న కుమార్తె వివాహము :-

పురుషోత్తముచౌధరి విశాఖపట్టణములో నివసించిన పన్నెండేండ్లలో క్రైస్తవ మత ప్రచారమేమి, గ్రంథ రచనయేమి, విస్తరించెను. ఆయన రెండో అల్లుడు జొసయా బర్డరు సోదరుడు టైటసు బర్డరునకు తన చిన్నకుమార్తె మార్తా మనోరమనిచ్చి "వివాహము చేసిరి. 1860 వ సం॥ ఆక్టోబరులో వారిద్దరు శ్రీకాకుళములో నుండిరి. లోగడ నరిసిపట్టణము నుండి రెవ. జే. ఎస్. వార్డ్లా గారికి పురుషోత్తముచౌధరిగారు వ్రాసిన యుత్తరమునకు 1860 సం॥ అక్టోబరు1వ తేదిని వారికి జవాబందినది. అందు వారీదేశమునకు తిరిగివచ్చుటకు గల యుద్దేశము వ్యక్తపరుపబడి యుండుటచే వారు తప్పకుండా రావలెనని ప్రేరేపించుచు ఆ నెల 10 వ తేదిని పురుషోత్తముగారు వారికి యుత్తరము వ్రాసెను.దాని నకలు జాగ్రత్తగ దాచ బడియున్నది. గ్రంథవిస్తరత భీతిచే దాని బ్రచురింపలేదు.

## మేజరు బ్రెట్‌దొరగారి మరణము - బిడ్డలు కటకపురి యభిగమనము :-

పురుషోత్తముచౌధరిగారు విశాఖపట్టణములో నుండిన కాలముననే యక్కడ పూర్వము తమకు ప్రభు మార్గోపదేశము చేసియుండిన సైన్యాధిపతి మేజరు బ్రెట్ అను భక్తవరుడు 1857 సంవత్సరము ఫిబ్రవరి 26 వ తేదిని తమ 87 వ యేట మృతులై యచ్చటి పటాలపు ఉద్యోగీయుల పితృ వనముననే ఖననము కాబడిరి. పురుషోత్తముచౌధరి కుమాళ్ళుగు డేవిడ్ చౌధరిగారు విశాఖపట్టణము లండన్‌మిషన్ హైస్కూలులో విద్యకరచి ఆంధ్ర భాషయందు కొంచము ప్రవేశము గలిగి **"ఎందుకు మరచితివి-యేసుని ప్రేమ యెందుకు మరచితివి"** యను కీర్తనను మాత్రము వ్రాసిరి. ఆయన సోదరుడు సామ్యేల్ చౌధరి అచ్చటనే విద్యనభ్యసించి వారుభయులును ఉద్యోగములకై వెనుక కటకపురికి బోయిరి. డేవిడ్ చౌధరిగారు పోలీసు యిన్‌స్పెక్టరుగా నుండి సుస్వాభావముగల ఎమేల్య యనునొక ఆంగ్లోయిండియన్

కన్యను వివాహము చేసికొనిరి. ఆమె మంచి కోడలుగ నుండెను. పురుషోత్తము గారి బిడ్డలీ విధముగ స్వదేశమున కాయనకు ముందుగ వెళ్లిరి.

1861 సంవత్సరాంతమున పురుషోత్తము గారు లండన్‌లో నుండిన వార్డ్లా గారికి వ్రాసియుండిన యింకొక యుత్తరము నకలు పెన్సిలు వ్రాతలోనున్నది. దానివల్ల మనకవి 1861 సం॥ సెప్టెంబరు నెల 20 వ తేదిని విశాఖపట్టణము విడిచి రంగయ్య గారు అను సహాయకునితో తూర్పు ఉత్తరములకును 120 మైళ్ళ దూరము నుండిన పర్లాకిమిడికిని వెళ్లి 28 దినములు ప్రయాణములు చేసి 46 గ్రామములలో అనేక జనసమూహములకు సువార్త ప్రకటించినట్టును పర్లాకిమిడిలో నొకయుద్యోగుస్థుడు నికోదేము వలె రహస్య విశ్వాసియై, తమతో ఉత్తర ప్రత్యుత్తరములు చేయు చుండినట్లును, డాక్టరు జాన్ హే (Dr. Rev. John Hay M.A)గారు ఆ తట్టు ప్రయాణము చేసి యాయనను జూడనై యున్నట్టును వ్రాసియున్నారు. ఆలాగే రెవరెండు జాన్ హే దొరగారు, రెవ. జే. డబ్లియు గార్డన్ దొరగారు(Dr. Rev. J.W. Gordon), రెవ. పులిపాక జగన్నాధము, రెవ. పురుషోత్తముచౌధరి, జొసయా బర్డరు మరికొందరు భక్తులు ఒక పర్యాయము పర్లాకిమిడి ప్రాంతమునకు ప్రయాణము చేసి, పురుషోత్తముచౌధరిగారి యన్నగారగు జగన్నాథ చౌధరిగారు యుండిన పర్ణసాగరపురమను ఆకులతంపర గ్రామమున చౌధరిగారిని, యచ్చటి మొఖాసాదారులు మున్నగు వారికిని సువార్త ప్రకటింప వెళ్ళగా మ్లేచ్ఛుల నీడ సోకరాదని జగన్నాథ చౌధరి వారిని తమ చావిడి యరుగు మీద మాత్రము నిలువబడజేసి తమ్ముడు “జాతి చెడిపోయినాడని” మనస్సున గినుక వహించియుండిరి.

పురుషోత్తముగారు యిప్పుడు వేరొకచోట సంఘ కార్యభారమెత్తుకొన దైవనిర్ణయమై యుండెను.

## 11. అధ్యాయము

**చిట్టివలసలో సంఘపాలకత్వము శుభవర్తమాన ప్రచారము ప్రముఖ వర్గము సంఘమున జేరుట. స్వదేశాభిగమనము "కన్నీళ్ళతో విత్తువాడు సంతోషముతో పంటకోయుదు."**

---♦--- ♦---♦---

1862 సంవత్సరమున పురుషోత్తముచౌధరీగారు భీమునిపట్టణము దరినున్న చిట్టివలస సంఘాధ్యక్షులుగ బంపబడి యచ్చట ఎనిమిదేండ్లు ప్రభుకార్య మొనర్చిరి. వారి యుపదేశముచే క్రైస్తవ మత విశ్వాసమున స్థిరపడి, అచ్చటీ యంత్రశాలపై విచారణ కర్తలుగ ఘనకార్యమొనర్చిన కీర్తివిశారదులైన మాదాబత్తుల బ్రహ్మజీ అను భక్తుడు 1904 సంవత్సరము క్రింది విషయములు తెలియజేసి యుండిరి.

## చిట్టి వలస పరిస్థితులు :-

భీమునిపట్టణము తాలూకాలో చిట్టివలస గ్రామమున గోస్తనీ నదీతీరమున "మెస్సర్సు ఆర్బత్ నాట్ అండ్ కంపెనీ" (Messrs Arbuthnot and Company)వారు చక్కెర చేయు " ఫ్యాక్టరీ" యొకటి స్థాపించిరి. దాని పైని సి.యస్. మించిన్ (Mr. C.S Minchin) దొరగారు మేనేజరుగ నుండిరి. అచ్చట పనిచేయు ఆంధ్రులకు సువార్త ప్రచారకుడొకడుండవలెనని ఆయన కోరి, విశాఖపట్టణములో రెవ.జే. డబ్లియు.గార్డన్ (Rev. J.W. Gordon) దొరగారు ఆంధ్ర ప్రజలకు బోధకులుగను, రెవ. జే. హే (Rev. John Hay M.A) దొరగారు విద్యా, ముద్రాక్షరశాలలపైనిన్నీ , రెవ. జే. మర్డాక్ (Rev. J.Murdock) దొరగారు ఇంగ్లీషు వారికిని బోధకులుగా నున్నప్పుడు ఒక బోధకుని పంపవలెనని వారిపేర వ్రాసిరి. వారు పురుషోత్తముగారు భక్తుని చిట్టివలసకు పంపించిరి. ఈ దైవజనుని జూచినవారు ఆయనలో నున్న దైవభక్తి వల్లను, ఇతరులను తనవలె బ్రేమించు సుగుణమును కనిపెట్టినందునను ఆయనను ప్రేమించువారు, ఆయనను పెద్దలు "అయ్యా" యనియు "బాబూ" యనియు, పిల్లలు "తాతా" యనియు బహు మర్యాదగ బిలిచి గౌరవించువారు. అనేకులు స్వంత బంధువుల యెడ నటించునట్లు ఆయన యెడ నటించువారు. ఆయన క్రైస్తవులను తన బిడ్డలవలె ప్రేమించినందున వారాయనను తండ్రి వలె బ్రేమించువారు. ఆ కాలమందు చిట్టివలసలో నుండిన రెండు క్రైస్తవ కుటుంబములు ఆయన ప్రేమ నెన్నడు మరువలేవనుటకు

సందియములేదు. ప్రభువు ప్రేమ ఆయనయందు నిలిచియుండినందున ఆయనయందట్టి ప్రేమ కలదనియు, క్రియల ద్వారా ఆయన తన ప్రేమ నందరికి అగుపరచెననియు వారు సాక్ష్యమియ్యగలరు. ఆయన క్రైస్తవ పిల్లలను గొల్లవాడు గొఱ్ఱెపిల్లలను భుజముల మీద నెక్కించుకొని మోయునట్లు మోయువాడు.

## పోలిపల్లిలో సేవ :-

సాధ్యమైనంత వరకు ప్రతిదినము సాయంకాలము సువార్త ప్రకటించుటకు తప్పక పొరుగూళ్ళకు వెళ్ళువారు. సింగివలస అగ్రహారమను నొక వైదిక బ్రాహ్మణ గ్రామమునకు ఆయన తరుచుగా వెళ్ళువారు. రాజాపులోవ యను మరియొక గ్రామమున నుండువారు ప్రభువు వాక్యమునకు లోబడువారు గనుక దానిని **"నా ప్రియమైన రాజాపులోవ"** యని పిలుచువారు. పోలిపల్లి యను పొరుగూరు రాజులును, బ్రాహ్మణాదులు మున్నగు వారలుండు గ్రామము. ఆయన ఆదివార సాయంత్రముల యందు దనతో వెళ్ళగల సహోదరుల నిద్దరు ముగ్గురిని వెంటబెట్టుకొని యచ్చటికి వెళ్ళువారు. అచ్చట గడుసు తనమును గర్వమును గల శాస్త్రియొకడుండెను. అతడును తక్కిన వారును దూషణముగ మాట్లాడినను పురుషోత్తముగారు శాస్త్రోక్తముగ మాట్లాడుచు, బాల్యమునుంచీ హిందూమత శాస్త్రములలో బరిశ్రమగలవారై యున్నందున, పద్యములను, శ్లోకములను ఉదాహరణముగా దీసి సర్వజన సమ్మతముగా బోధించుట చేతను, హితవాదులుగ నుండుటచేతను, ఆయన ధోరణి ప్రేమతోను, వినయముతోను, గూడినది గనుకను, వినువారిలో కొందరు తమ శాస్త్రములను దామే నిందించుకొని క్రీస్తు మతమును సమ్మతించువారు.

## ప్రజా గౌరవము :-

వీధులలో జగడము లాడుచు బండబూతులాడువారు ఆయనను జూడగానే "పురుషోత్తముగారు వచ్చుచున్నారు. తిట్లాడకండి" అని చెప్పువారు. ఏలననిన అటువంటివారు ఆయన కెదురు పడగానే "బాబులారా! చెడ్డమాటలాడుట వలన మీ హృదయములను మీరే చెడగొట్టుచున్నారు. మీ తిట్లలో నొకటియైనను మీ యెదుటి వారికి కీడుచేయదు. కాని మీకే కీడు చేయును గదా! యని యిట్లు బుద్ధిచెప్పువారు.

క్రైస్తవుల కొరకు ప్రతి యాదివారమున చిట్టివలస గుడిలో ఆరాధనలు జరిగించుట ఆచారము. ఆయన ప్రార్థన తరగతి యొకటి స్థాపించి, అందులో సభలో నేలాగు ప్రార్థించవలెనో కుటుంబ ప్రార్థనలెట్లో, అంతరంగ ప్రార్థనలేలాగో యా విధములను బోధించువారు ఒకరు ప్రార్థించిన వెనుక, అందలితప్పులు సవరించపబడుచుండెడివి.

## నానావిధ సేవ :-

మరియు ఫ్యాక్టరీ యజమానులైన సి.ఎస్. మించిన్ (C.S Minchin Esq) ఇంజనీయరుగారు, ఆర్. రీడ్ (R. Read Esq) దొరగారి కోరిక ప్రకారము ఫ్యాక్టరీలో పని చేయు పనివాంర్రను, ఆయన దేవాలయమున జేర్చి **"రక్షణ చరిత్ర"** పాఠము చేయించువారు. "ఒకసారి యాయన సువార్త పని విషయము బండిమీద నెక్కి స్థలాంతము వెళ్ళుచుండగా నదీ ప్రవాహము వల్ల సమస్తమును కోలుపోయి ప్రాణములు మాత్రము దక్కించుకొని వచ్చిరి.

1869 సంవత్సరము ప్రచురింపబడిన విశాఖ పట్టణము మిషన్ రిపోర్టు ప్రకార మచ్చుటి క్రైస్తవ సంఘస్థులు కొందరు చిట్టివలస ఫ్యాక్టరీలో పని చేయుచుండినటులను సంవత్సర మంతటా చిట్టివలసలో యుండినట్టున్ను, పురుషోత్తముగారు స్త్రీల తరగతి యొకటి స్థాపించి వారికి వారమున కొకసారి **యాత్రికుని ప్రయాణము** బోధించు వారనియు దెలియుచున్నది.

## సేవా పలితము :-

పురుషోత్తముచౌధరిగారి మూలమున జ్ఞానోదయము పొందిన రెండు మూడు కుటుంబములచట నుండెను. వారిలో బాసాని అప్పడు గారు అను ధనికుడు " నేను పురుషోత్తమ అయ్య వలన క్రైస్తవ మత జ్ఞానోదయము పొందిన వాడను" అని చెప్పి యుండిరి. ఆ గురు పాదముల యొద్ద కూర్చొని యొక ఛాయా పటము తీయించుకొనునంతటి గురుభక్తి అప్పడుగారి కుండెను.

" చిట్టివలసలో పురుషోత్తమయ్య బోధకులుగ నున్నప్పుడు చిట్టివలస గుడిలో ముందుగా స్నానము పొందిన వాడను నేను" అని బ్రహ్మజీ గారు 1879 సం॥ జనవరి 25 వ తేదిని భగవాన్ బెహరాగారికి, బండి జోగినాయుడుగారు అను విశ్వాసులకు వ్రాసిన యొక యుత్తరములో వివరించియున్నారు. సాలీలలో నుండి

వచ్చిన మాదాబత్తుల బ్రహ్మజీగారు పెరికీలలో నుండి వచ్చిన బాసాని అప్పడు గార్లు బహు కుటుంబీకులై పురుషోత్తముగారు బ్రతికియున్నంత కాల మాయనతో ఉత్తరప్రత్యుత్తరములు గలిగియుండిరి. నేటికిని వారి కుటుంబము వారాయన యెడ నభిమానువంతులై యున్నారు. వెనుక పురుషోత్తము చౌధరిగారి జ్ఞాపక భవన నిర్మాణమునకై వారిద్దరు గొంత తోడ్పడియుండిరి. పురుషోత్తముచౌధరిగారు చిట్టివలసలో నుండగా ఐజకు పుల్లరు గారితో కలసి విజయనగరము, గజపతినగరము, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురము మున్నగు ప్రదేశములకు వెళ్ళి సువార్త ప్రచారము జరిగించువారు.

1861 సంవత్సరాంతమున పురుషోత్తముచౌధరిగారు విశాఖపట్టణము నుండి పర్లాకిమిడి వైపు సువార్త ప్రచారార్థము వెళ్లి యుండినపుడు రేఖాని ముకుందరావు నాయుడుగారు మున్నగు పురాతన స్నేహితులనేకులనే కాక అచ్చుటికి నాలుగున్నర క్రోసుల దూరమందలి కొమ్మనాపల్లి గ్రామ మున్సబు బండి జోగినాయుడు గారిని, తమ స్వీయ సోదరులగు జగన్నాధ చౌధరిగారిని, వారి జ్యేష్ఠ పుత్రులగు అప్పలనరసింహ చౌధరిగారిని, అచ్చుటికి మొఖాసాదార్లను జూచి సువార్త బీజములు వెదజల్లి యుండిరి. అప్పల నరసింహ చౌధరిగారు దుర్గ పూజయందభిలాష గలిగి, ఆ దేవతపరమున కీర్తనలు చెప్పియుండినను , ఇప్పుడు పినతండ్రి(దాదా) పురుషోత్తము చౌధరిగారు పాపులను రక్షంప వచ్చిన యేసు ప్రభువు యొక్క ప్రేమపూర్వక సువార్తను బోధించి, అప్పటప్పటికి ఆయన కుత్తరములు వ్రాయుచుండ, అప్పల నరసింహ చౌధరిగారిలో నూతన మతోజ్వలనము కలిగి తమ పినతండ్రి గారిచ్చిన క్రైస్తవ మత పత్రికలు చదువుచు, పాపరాహిత్యుడైన యేసుప్రభువే తన పరిత్రాణకర్తయని గ్రహించి విశ్వసించి యుండిరి. దాదాపు 30 సం॥ పురుషోత్తము చౌధరిగారు తమ స్వీయబంధువులు తమ వలె యేసుప్రభువు నంగీకరింప వారికి శక్తి నియ్యవలెనని దేవుని ప్రార్థించుచు వచ్చిరి. ప్రార్థనా ప్రతిఫలము భక్తులు పొందకుందురా?

**కుటుంబ ఫలితములు :-**

1862 వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఒకనాడు పురుషోత్తముగారు తలంచని గడియను కాషాయ వస్త్రములు ధరించి, సువర్ణ కంకణము ముంజేతి నలంకరింప,

సుమారు 70 మైళ్ళు నడచి వచ్చినందున ఒకింత డస్సిన యెట్టిని విగ్రహమొకటి యాయన యింటి ముందర నిలువబడి "దాదా! దాదా!" యని పిలువ నాశ్చర్యముతో నా కంఠస్వరము విని అది తన యన్న కుమారుడైన అప్పల నరసింహ యని పోల్చి "నాయనా యింట నందరు క్షేమమా" యని కుశల ప్రశ్న వేసి, వారి సుక్షేమ వార్త నారసి, వృద్ధ సోదరిని బిలిచి బాబుకు కాళ్ళకు నీళ్ళిచ్చి, వంటకు భత్యమిమ్మనగా, "దాదా, భత్యము వద్దు, మీపాకమే భాగము వేసికొందమ"ని చెప్పగా పురుషోత్తముగారు అందులకు అనుమానించి యింట గందరగోళపడి వెళ్ళి పోవచ్చెనేమోయని మొదట తలంచినను, మరికొంత సంభాషణ నడచిన పైని లోగడ తాము ప్రార్థనాపూర్వకముగా విత్తిన సువార్త బీజము లాయనలో ఫలోన్ముఖత గాంచినవని గ్రహించి ప్రభు నామమునకు ధన్యవాదము లర్పించిరి. అప్పల నరసింహముగారు తమ దాదాగారివలె బూనిన కార్యము నుండి వెనుకంజ వేసి కాలయాపన సేయువారు కారు. ఆయన కొన్ని గ్రామములకు మిరాసీదారు, అయినను క్రీస్తు ప్రభువు యొక్క యతి శ్రేష్ఠత నిమిత్తము సర్వము చెత్తయని యెంచుకొని మహత్తర విశ్వాసముతో ఆ ప్రభువును సేవింప నిశ్చయించుకొనిరి. ఆ కాలమున బాప్టిస్టు సంఘములు ఉత్తర సర్కారులలో లేచి యుండలేదు. కావున లండన్ మిషన్ వారితో జేరుకొని క్రీస్తు నందలి తమ విశ్వాసము వ్యక్తపరుప అప్పలనరసింహ చౌధరిగారు నిశ్చయించుకొనగానే, విశాఖపట్టణము నుండి రెవ. జే. డబ్లియు. గార్డన్ దొరగారు చిట్టివలస వెళ్లి 1862 సం॥ ఫిబ్రవరి 11 తేదిని అనగా బ్రహ్మజీ గారు స్నానము పొందిన 15 దినములకు చిలకరింపు అను జలప్రోక్షణ బాప్తీస్మ సంస్కార మిచ్చిరి. కుమారుడు క్రైస్తవమత స్వీకారము చేసిన సంగతి ఉత్తరము ద్వారా జగన్నాధ చౌధరిగారికి దెలిసినంతట ఆయన విచారమేమని చెప్పనగును. విచారమునకు దోడు సనాతన ధర్మాచరణము విడచినను పరమ పవిత్రమని యెంచిన యజ్ఞోపవీతము తొలగించెనని, దాని కారకుడు తన తమ్ముడైన పురుషోత్తముడే యని యాయన యుగ్రసింహుడై యుండెను.

## జ్యేష్ఠ భ్రాత క్రోధనము :-

కొన్నాళ్ళయిన తరువాత పురుషోత్తముచౌధరిగారు, అప్పల నరసింహముగారిని వెంటబెట్టుకొని అన్నగారి తావునకు వెళ్ళెను. కుమారుని, తమ్ముని జూచుచుండగ

జగనాధముగారి యొక్క ప్రచండ క్రోధమేమని చెప్పనగును, గుండెలు దడదడ గొట్టుకొన, నొడలు పులకరింప, క్రీస్తుమత ద్వేష సహిత కోపాగ్ని కన్నుల నొలికింపుచు ముందుకువచ్చి, తమ్ముడు పురుషోత్తమునితో "ఒరే వంశోద్ధారకా! ఒరే వంశపావనా! తాజెద్ద కోతి వనమెల్ల జెరచినట్లు చేసినావురా! అని నింద్యవాక్యములు వచించి యాతని కాళ్ళ యెదుట సాష్టాంగబడెను. పురుషోత్తముగారు మోమున మందహాసము తాండవమాడుచుండ శాంతవచనములతో అన్న కోపాటోపవాక్యములకు సదుత్తరము లొసంగి బ్రశాంతుని జేసిరి. జగన్నాధముగారు కుమారుని జూచి " యేమిరా! అప్పల నరసింహా నన్నింత మోసము చేసి పోయినావేమి? యని విచారగ్రస్థులై ప్రశ్నించిరి. ఆ కుమారుడు మౌనముగా తలవాల్చి యుండెను. కొన్ని దినము లిద్దరచ్చట నుండిరి. గ్రామ మొఖాసాదారులగు సర్ధార్ ఫకీర్రాజు, సర్దార్ జోగిరాజు అచ్చటి రహస్య విశ్వాసులగు చల్ల అప్పయ్య నాయుడుగారు, భగవాన్ బెహరాగారు, పండిత బండి జోగినాయుడుగారు, గోపినాధ చౌధరిగారు మున్నగువారు అప్పల నరసింహగారు తమ గ్రామములో క్రైస్తవ మతమునకు ముందు దారితీసెనని సంతసించుచు, నొకింత బంధు జన భయముతో పురుషోత్తముచౌధరిగారి దర్శనము చేయుచు, క్రీస్తు పరతత్వ రహస్యము నేర్చుకొనిరి. ఆ కాలమున వేరు మిషనులు లేనందున లండన్ మిషన్ వారి కార్యక్షేత్రము బహుళవ్యాప్తి జెందియుండెను. వారి బోధకులు నెలల కొలది మత ప్రచారము సల్పుచు వచ్చిరి. పురుషోత్తము గారొక నెల పర్యంత మచ్చట నిలచి రహస్య విశ్వాసులను స్థిర పరచిన వెనుక, అప్పల నరసింహ భార్య శాంతిమయ చౌధురాణి భర్తతో వెళ్ళ ప్రయాణమయ్యెను. అప్పుడు జగన్నాధముగారును, తన భార్య రేఖామణి దేవి చౌధురాణియుగారును దుర్భర దు:ఖ భాజితులైరి. బందువులు కొంత తొందర చేసిరి. అయినను ఆమె వెళ్ళుట కిష్టపడి నందున నెవరేమియు జేయలేకపోయిరి. పురుషోత్తముచౌధరిగారు కుమారుని కోడలిని దోడ్కొని చిట్టివలస చేరినంతట శాంతిమయ చౌధురాణి యచ్చట యేసుప్రభువు సేవకురాలాయెను. అయితే హైందవులలో జన్మించిన వారి జ్యేష్ఠ కుమారి కన్యసుభద్రాదేవిని శిష్టాచార ప్రకారము ఈడేరకముందే మేనత్త భానుమతిదేవి, పండిత రామక్రిష్ణ కాళీమహంతి యొక్క కుమారుడు దీనబంధుకిచ్చి వివాహము చేసియుండినందున, నామెను తమతో దోడ్కొని వెళ్ళలేకపోయిరి. మరికొన్నాళ్ళయిన తరువాత అప్పల నరసింహ చౌధరిగారు భార్యా

సమేతుడై స్వస్థానము జేరి, తండ్రిగారి యనాదరమునకు బాత్రులైనను స్వతంత్రముగ పర్లాకిమిడి తాలూకా గ్రామములలో సంచారము చేయుచు, తమ దాదా పురుషోత్తముగారి వలెనే మత ప్రచారకులైరి.

పురుషోత్తము చౌధరిగారు తన యన్నగారికి అనేక విధములుగా క్రీస్తు పరతత్వ రహస్యములు బోధించుచు ఆ విషయములు ఉత్తరములలో వ్రాయుచు వచ్చెను.

**ఛలోక్తి లేఖ:-**

1864 సంవత్సరము నవంబరు 12 వ తేదిని బందరు ఉప్పెన వచ్చి మహోపద్రవము కలిగించిన వెనుక ఆ నెలలో మన పురుషోత్తముచౌధరిగారు అన్నగారైన జగన్నాధము గారికిట్లు, వ్రాసిరని మా తండ్రిగారు చెప్పియుండిరి.

“అన్నా! బంగాళా సముద్రము పొంగి బందరుని ముంచివేసెను. ప్రజలు పాణి(జల) సమాధి నొందిరి. మీ దేవతలు కూడా ఆ ప్రళయము తప్పించుకొనలేక పోయినవి! కఱ్ఱదేవతలు తేలిపోయెను! రాతిదేవతలు పాతాళమునకు బోయెను! మంటిదేవతలు కరగి యడుగంటెను. అవి తమ్మునుతామే రక్షించుకొనలేపోయినవి గదా! మిమ్ము నేలాగు రక్షింపగలవు? కావున కర్తవ్యము యోచించుకొనుడు.”

ఆ యుత్తరములోని సత్యములు జగన్నాధ చౌధరిగారు గ్రహించకపోలేదు. క్రమేణ ఆయన కొంతమట్టుకు మార్గమునకు వచ్చినను క్రైస్తవమత సత్యములను విశ్వసించుటకాయన ఛాందసాచార మొకయడ్డంకిగనుండెను.

చిట్టివలస, భీమునిపట్టణము, పోలిపల్లి, మున్నగు ప్రాంతములలో ఆ కాలమున పురుషోత్తముచౌధరిగారు ప్రార్థనా పూర్వకముగా వెదజల్లిన వాక్యబీజములు క్రమేణ యంకురించి, వారి ప్రేమ సేవతో సారవంత సస్యవంతమునైన యా క్షేత్రము నేడు నేత్రోత్సవము గొల్పుట స్తోత్ర పాత్ర విషయము.

పురుషోత్తముచౌధరిగారికి 67 సంవత్సరముల ప్రాయము వచ్చువరకు భద్రాచలము వరకు గూడ దూర సువార్త యాత్రలు చేయుట వలన నేమి, సంఘ సేవ, గ్రంథ రచనాదుల వలన నేమి కొంత దౌర్బల్యత హెచ్చెను. ఆయన జ్యేష్ఠ పుత్రుడైన బాబు డేవిడ్ చౌధరి కటకము జిల్లాలో పోలీసు ఇన్‌స్పెక్టరుగ మంచి వేతనము గాంచుచుండిరి. చిన్నల్లుడైన టైటస్ బర్డర్‌గారు ఇంజనీరింగ్ ఆఫీసులో నుద్యోగమున నుండిరి. వారందరు

వంగ రాష్ట్రమునకు తిరిగి రావలెనని కోరినందున పురుషోత్తముచౌధరిగారి “రక్తమాంసములావైపు ఆకర్షించినవి” అందుచేత ఆయన లండన్ మిషనరీ సొసైటీవారి యొద్ద యధేచ్ఛగా సెలవుగైకొని, తమ వృద్ధ సోదరిని దోడ్కొని 1870 వ సంవత్సరము డిశంబరు 3వతేదిని చిట్టివలస విడిచిపెట్టిరి. 27 సంవత్సరము లాయన సేవ నొనర్చినను లండన్ మిషన్ వారాయన కేవిధమైన యుపకారభృతి నిచ్చియుండలేదు. పురుషోత్తముగారు లండన్ మిషన్‌లో జేసియుండిన సేవను గూర్చి 1870 సంవత్సరపు మిషన్ రిపోర్టులో నిట్లు వ్రాసియున్నారు.

## లండన్ మిషన్ వారి యభివందనము :-

“ మా బోధకులైన పురుషోత్తము గారు చిట్టివలసలోను, చుట్టుపట్టల గ్రామములలోను, క్రైస్తవులకును, క్రైస్తవేతరులకును ప్రచారము చేయుటలో చాకచక్యతతో ప్రయాసపడిరి. ఆయన నోట సత్యసువార్త వినినవారివల్ల ఆయనకు చాల ప్రోత్సాహము కలిగెను. తమ కుటుంబ మధ్యమున తమ దినములు ముగించుటకు బోధకులగు పురుషోత్తము గారు వెడలిపోవుటచే చిట్టివలసలోని మా చిన్న క్రైస్తవ బృందము గొప్ప నష్టము గాంచినదని చెప్పవగచెదము. ఆయన యిప్పుడు క్రీస్తు సేవలో వృద్ధులైరి. ఒక నేత్ర దృష్టి క్షీణించుట చేతను, వేరు బలహీనతల చేతను ఆయన యిక మీదట ప్రచారకార్యము చేయుట కశక్తులైరి. కావున మిషన్‌తో వారి సంబంధము వీడెను. ఈ మిషన్ సంబంధమున ఆయన చాలా సంవత్సరములు నమ్మకముగాను, జయప్రదముగాను కార్యాచరణ మొనర్చిరి. అన్ని తరగతుల స్వదేశియులచే ఆయన యెంతయో ప్రేమింపబడి గౌరవింపబడిరి. ఆయన చాలా శక్తిసామర్థ్యములు గలవారు. సర్వేసర్వత్ర ఉపయోగమునన్న మా మంచి పత్రికలు, కీర్తనలు ఆయనచే రచింపబడెను. వారి నెరిగిన వారెల్లరు ఆయన నామమును, శీలతను దీర్ఘకాలము స్మరణయందిడికొనియెదరు. ఈయన తన సేవను (1870 సం॥) డిశంబరు 3 వ తేదిని విడిచిరి. వీరు సజీవులై యున్న యన్నినాళ్ళు ఇతరుల కాయన ప్రేమతో నొసగుచు వచ్చిన స్వాంతనము సహానుభూతి తాము పొందుచు, యంత్యమున **“భళా! నమ్మకమైన మంచిదాసుడా! నీ ప్రభువు ఆనందమున ప్రవేశింపుము” అను త్రాణపతి యొక్క అభినందన స్వాగత మొందుదురుగాక!”**

" At Chittivalasa and neighbouring villages our Catechist Purushottam has diligently laboured in preaching to Christians and heathens. He has met with considerable encouragement from the people who have heard the truth from his lips.We regret to say our little Christian community has suffered a great loss in the diparture of Catechist Purushottam to Cuttack to end his days in the bosom of his family. He has now grown old in the service of Christ, and in consequence other loss of the sight of one eye and other infirmities he is unable any long to exercise his function as catechist, so that his connection with the Mission has ceased; he has laboured faithfully and successfully in connection with this Mission for many years, and is much loved and respected by all classes of natives; he is a man of considerable ability;some of our best and most popular Telugu tracts and hymns were composed by him; and his name &character will long be remembered and apprciated by all who know him.

He left his sphere of labour on the 3rd December,1870. May he enjoy, till the end of his earthly course, all the consolation which he used so accceptably to administer to others, and at last be welcomed by the Saviour's plaudit, **"Well done thou good and faithful servant enter thou into the joy of thy Lord.***

* Report of the Vizagapatam Mission in connection with the L.M.S 1870.

పురుషోత్తమచౌధరిగారు చిట్టివలసలో నుండిన కాలముననే బహుశ 1866 సంవత్సరము వారి యన్నగారైన జగన్నాధ చౌధరి హైందవుడుగ నుండియే తమ మిరాసీ గ్రామమున మరణించిరి. ఆ మరుచటి సంవత్సరమాయన చిన్న కుమారుడగు గోపినాధు చౌధరిగారు, బండి జోగినాయుడుగారు అను విశ్వాసులిరువురు క్రైస్తవ మత దీక్షా స్వీకారమునకై చిట్టివలస వెళ్ళుటకు 25 మైళ్ళు దూరము సాగియుండ 12 గురు బంధువులు వెంటదరిమి ఆముదాలవలస యొద్ద వారిని బట్టి తీసికొని పోయి యుండిరి. కావున వారిని జూచి వారివిశ్వాసమును బలపరచుటకును తక్కిన బంధు బృందములను జూచుటకును పురుషోత్తముచౌధరిగారు పర్ణ సాగరపురమును దర్శించి యచ్చట గొన్నాళ్ళు గడిపెను. అక్కడవారు తమయన్నగారి చిన్న కుమారుడు గోపినాధు చౌధరిగారిని, కోడలు రత్నమయి అమ్మాల్ చౌధురాణిగారిని క్రీస్తు విశ్వాసమున బలపరచి, వారప్పటికి వెనుకంజవేయుచున్నందున కుమారుడు అప్పలనరసింహమును, కోడలిని వారికప్పటకి చిన్న బిడ్డయైయుండిన కుమారి శారాదేవిని, వారియింట పరిచారికగా నుండిన జంగం గంగమ్మను వెంటగొని పర్లాకిమిడి బరంపురముల మీదుగా కటకపురిజేరిరి, వీరి రెండవ యల్లుడు జొసయా బర్డరుగారు భార్యాసమేతులై కటకము వెళ్ళియుండిరి.

# 12. అధ్యాయము

ఆంధ్ర ప్రదేశము నుండి వంగ రాష్ట్రము నందలి కటకపురి జేరుట. రెవ. దాస్ అంతర్వేదితో పరిచయము; వారితో తిరిగి గంజాం జిల్లాలో చేసిన దీర్ఘ ప్రయాణము విఫలతలు. ప్రార్థనాఫలితము. పూరీలో ప్రచారము. గ్రంథలిఖితము. కాకినాడకు అల్లునిబంపుట. పుత్ర వియోగము. వివిధ సేవాపరత.

**"కొందరిని రక్షింపవలెనని అందరికి అన్ని విధములుగ నున్నాను"**

---♦--- ♦---♦---

## కటకపురి చేరుట:-

1870 సంవత్సరము క్రిస్మసు సమీపించు చుండగా రెండు వారముల దీర్ఘ ప్రయాణము చేసి, సామగ్రితో ఎడ్లబండ్లు కటకపురి "సుతాహాట్" లోని యొక గృహము ముందర నిలిచెను. ఆ దినము పురుషోత్తము చౌధరి బిడ్డల యానందమేమని చెప్పను. అయితే యొకటి దేశము మారగనే భాషయు మారెను. ఆ దినమచ్చట ఆయనను జుట్టు కొనినవారెల్ల మాతృభాషయైన ఉత్కళ భాషలో ఆయనతో మాట్లాడ మొదలుపెట్టిరి.

## రెవ.అంతర్వేదిగారి పరిచయము :-

వీరు ఆ పురమున జేరిన యొకటి రెండు రోజులలో ఏబదేండ్ల ప్రాయము గలిగి పొడవైన గడ్డమును, తెల్లని పాగాయును, యంగీయును, పైజామాయును ధరించిన యొక క్రీస్తు భక్తుడాయన ముందుర నిలిచి, వందనమాచరించెను. పురుషోత్తముగారు విరచిత కులాచార పరీక్ష చదివి హైందవ మత ఛాందసముల యందసహ్యతగలిగి క్రీస్తుమత ప్రాశస్త్యతను గ్రహించి 1848 వ సంవత్సర ప్రాంతమున విశాఖపట్టణములో క్రైస్తవ మత స్వీకారము చేసి "చిలకరింపు" పొందియుండి 1860 వ సం॥ రంగూన్‌లో సర్వాంగ స్నానము పొందిన దాస్ అంతరవేది గారాయనయే. ప్రాయమున వారు పురుషోత్తము చౌధరిగారి కన్న 19 సంవత్సరములు చిన్న వారై యుండిరి. ఈయన మెస్ రైటరుగా జేరియుండిన 41 వ దేశీయపటాలము 1868వ సంవత్సరము కటకపురి చేరినందున ఆయన రెండేడ్లకు ముందుగానే యచ్చటి క్రైస్తవులతో పరిచయము పొందియుండెను. ఆ సంవత్సరాంత దినమున రెవ. దాసు అంతర్వేదిఅయ్య,

రెవ.పురుషోత్తముచౌధరిగారి కుటుంబమంతటిని విందునకును నూతన సంవత్సర సందర్శన జాగరములకును ఆహ్వానించి యుండిరి. ఆ రాత్రి అంతర్వేదిగారి భక్తివిశ్వాసములాసభలో పురుషోత్తముచౌధరిగారు సరిగ గ్రహింప గలిగి ఆయన నిష్కపట, పవిత్ర క్రైస్తవ జీవితము నిమిత్తమాయనను ప్రేమించి, 32 మంది గల ఆంధ్ర పటాలమందలి క్రైస్తవ సంఘముతో సంబంధము కలిగి వారి సహవాస సౌఖ్య మనుభవింపజొచ్చిరి.

కటకపురిలో నుండగా, అప్పలనరసింహ చౌధరిగారును వారి భార్య శాంతమయి చౌధురాణిగారును, వారి పరిచారిక జంగం గంగమ్మగారును చిలకరింపు కన్న ముంపు సరియైన బాప్తిస్మమని తెలిసికొని 1871వ సంవత్సరము మహానదిలో రెవ.అంతర్వేదిచే బాప్తిస్మమెంది కొన్నాళ్ళలో తిరిగి స్వస్థానము చేరిరి. వారి సహవాసమున అప్పల నరసింహ సోదరుడు గోపినాథ చౌధరిగారును, ఉత్కళ పండితులగు భగవాన్ బెహరాయును తాము పురుషోత్తము చౌధరిగారి ద్వారాను అప్పల నరసింహగారిద్వారాను వినుచు వచ్చిన సువార్త సత్యములను దృఢముగా విశ్వసించి, తమకు స్నానదీక్షనియ్య రావలెననియు, ఆలాగు రాకుండిన యెడల పాపులను రక్షించుటకు యేసుక్రీస్తు ప్రభువు లోకమునకు రానట్టేయనియు ఆన బెట్టి పురుషోత్తము చౌధరిగారికి, ఆయన స్నేహితులయిన అంతర్వేదిగారికిని లేఖలు వ్రాసి పంపించిరి.

## ఇంకొక మిషనరీ యాత్ర :-

1872 సంవత్సరమున పురుషోత్తముచౌధరిగారి ప్రేరేపణచే అంతర్వేది దాసుగారు పటాలపు పెద్దలయొద్ద సెలవుగైకొని, చాలా బండ్లు కట్టించుకొని, క్రైస్తవ సిపాయీలు, హవల్దారులతో బయలు వెడలిరి. వారు 300 మైళ్ళు దూర భార ప్రయాణము సాగించి మార్గమున సువార్త ప్రచురించుచు బరంపురమున బ్రవేశింపగానే కీర్తనలతోను, వేడుకతోను, వీధులు ప్రతిధ్వనింప జేసిరి. ప్రజాసముహాముల కచ్చట మూడుదినములు సువార్త ప్రచురించిరి. రెవ. బెయిలీ దొరగారు వారి ప్రసంగములు వినబోవువారు. అక్కడ నుండి పర్లాకిమిడి మీదుగ ఆకులతంపర చేరిరి. స్నాన దీక్ష పొందుటకు మీద బేర్కొనబడిన వారితో బండి జోగినాయుడు, చల్లా అప్పలనాయుడు, లాలయ్య శతపథియును వారలు సిద్ధపడిరేకాని బంధుమిత్రాదుల గొప్ప పోరాటముచే వారెల్లరు

వెనుకంజవేసిరి. పురుషోత్తముచౌధరిగారిని వారి స్నేహితులుగాని, ఎంత మాత్రము నిరాశపడక, బలీయముగ సువార్త ప్రచారము చేసి, వారిని బలపరచి గుల్‌షనాబాద్ అను శ్రీకాకుళము, విజయనగరము, చిట్టివలస మీదుగా విశాఖపట్టణము వరకు ప్రయాణము సాగించి తిరిగి కటకపురి వెళ్ళిరి.

వారు వెళ్లుచుండగా మార్గమున గంజాంజిల్లా కలెక్టరు సి.జి. మాస్టర్ ఇస్కోయరు గారు వారి నాహ్వానించి వారి ఖర్చులకై నూరు రూప్యములిచ్చిరి. ఆ దినమున వారా పురమున సువార్త ప్రచారముచేసిరి. గొబ్బి సూర్యనారాయణ యను నాతడక్కడ మతస్వీకారము చేసెను. ఈ గొప్ప మిషనరీ ప్రయాణమున పురుషోత్తముచౌధరిగారు యిట్టి వృద్ధాప్యమున బహుశ యీ యారవసారిగ కటకపురి మార్గమున సంచారము చేసిరి. ఆయనగాని, ఆయన స్నేహితులుగాని 300 మైళ్ళు దూరమునున్న యీ నూతన విశ్వాసుల కొరకు ప్రార్థించుట మానక వారిని దమ యుత్తరముల ద్వారా ప్రేరేపించుచు వచ్చిరి. ఇట్లు వారీ ప్రయాణమున రెండు మాసములు గడిపిరి.

1872 సం॥ జూలై నెలకు సరియైన అంగీరస సంవత్సర జ్యేష్ఠ బహుళ 13 బుధవారము నాడు – " ఘోర సంగ్రామమా! కుంభీఘీంకారమా! తురంగహేషా! రణదుందుభీరవంబ! రంతేమిటబ్బా! మహావంశధారా తారంబులా రాత్రి ప్రతాపంబుసూపె" యనునటుల – గొప్ప జలప్రళయము వచ్చెను. అందొక నావపై (గంథ్రకర్త జనకులు) గోపినాధ చౌధరిగారు తక్కిన కొందరితో గొట్టుకొని పోవనై యుండగా " ఓ భగవంతా నన్నీయాపదనుండి రక్షించిన యెడల ఎవరేమన్నను భయపడక కటకపురి వెళ్ళి యేసుప్రభు నామమున బహిరంగ స్నానము స్వీకరించెదనని" దేవుని ప్రార్థించెను. అంత నొక పెద్ద గడ్డిమేటు దైవవశమున కొట్టుకొనివచ్చి, ఆ నావ బోల్తపడకుండ దానిని మెరకకు దాటించెను. అందుచే ఆయన దేవుని స్తుతించి తన వాగ్దాన ప్రకారము తన దాదాయైన పురుషోత్తముచౌధరిగారి యొద్దకు వెళ్ళి క్రైస్తవ మత స్వీకారము చేయ నిశ్చయించి యా సంగతి ఆయనకును, ఆంతర్వేది దాసు గారికిని వ్రాసిరి. వారుభయులు ఈయన కొరకును తక్కిన వారికొరకును దేవుని ప్రార్థించుచుండగా వీరికి ఆత్మీయ బలము కలిగెను.

## ఇద్దరు యాత్రికులు :-

1873 వ సంవత్సరము గోపినాధ చౌధరిగారును, పండిత భగవాన్‌బెహరాగారును, బయలువెడలి కటకపురి బోయి పురుషోత్తముచౌధరిగారి సమక్షమున ఆ సంవత్సరము జూలై నెల 1 వ తేదిని రెవ. దాస్ అంతర్వేదిగారి వలన మహానదిలో స్నాన దీక్ష గైకొని కొన్ని మాసములైన వెనుక స్వస్థానమునకు బోయిరి. పురుషోత్తముచౌధరి తాము 1833 వ సంవత్సరము క్రైస్తవులైన దినము నుండి చేయు ప్రార్థనాఫలితములలోనిది యానాడు సిద్ధించెను. ఆయన నలువదేడులిటుల విసుకక బంధువుల యాత్మ రక్షణకై ప్రార్థించి యుండుటలో నీ చరితము చదువువారలు విసుకక ప్రార్థంచవలెనని నేర్పుపొందవలెను. డాక్టరు తటవర్తి నారాయణస్వామిగారు నాయుడు అను భక్తుడు కటకపురిలో స్నానము పొందిన సమయమున గలిగిన తొందరలలో పురుషోత్తముగారు, అంతర్వేదిగారు, భక్తులు గలిసి పటాలపు ఆవరణలోని యొక గదిలో ఏకాంత ప్రార్థనలు చేయుచు, ఆ సమయమున గలిగిన యాపదలలో జయసిద్ధి గాంచిరి.

ఇప్పుడింకొకసారి పర్లాకిమిడి వైపు చూపు త్రిప్పుదము. వంశధారనదీ తీరమునకు బోవుదము. 1873 వ సం॥ అక్టోబరు నెలలో చౌధరి కుటుంబములును, భగవాన్ బెహరాగారును ఇంకొక క్రైస్తవురాలును మొత్తమున 5 గురు కలిసి బహుశ ఆనెల 28 వ తేదిని (అనగా కాకినాడకు వెళ్ళవలెనని డాక్టరు జాన్ మెక్లారిన్ గారికి అమెరికా తంతి వార్త వచ్చిన తరుణముననే) ఆకులతంపరలో నొక సంఘముగా జేరిరి. వారికి అప్పలనరసింహ చౌధరిగారు పాలకులుగ నుండుటకై కటకము నుండి లేఖ యందినది. అందుచేత ఆ నెలలో అచ్చుట కనేడియన్ మిషన్ మాతృసంఘస్థాపన జరిగినది. ఇది మన కవియొక్క ప్రయత్నపూర్వకముననే సుసాధ్యమైనది. పైనొక సంగతి వ్రాయమరచితి. గోపినాధ చౌధరిగారును, భగవాన్ బెహరా గారును స్వస్థానమునకు బయలుదేరినప్పుడు పురుషోత్తముచౌధరి, దాస్ అంతర్వేది మరికొందరు క్రైస్తవులు పూరీ (జగన్నాధము) వరకు వారిని సాగనంపిరి. ఆ దినమచ్చుటి మూసానదిలో రాగోలు జానికిరామయ్య గారు బాప్తిస్మ స్నాన దీక్ష పొందగా బహుజనము లావేడుక జూడజేరిరి. అప్పుడు పురుషోత్తముచౌధరిగారు ఉత్కళభాషలో నింకొక పర్యాయ మా నగరవాసులకు సువార్త ప్రకటించిరి. ఆయన లండన్ క్షేత్రము విడచిన వెనుక నిట్టి దీర్ఘమగు మిషనెరీ

ప్రయాణములు చేయుటకు వారి జ్యేష్ట కుమారుడు పోలీసు యినస్పెక్టరు బాబు డేవిడ్ చౌధరిగారును వారి యల్లుడు టైటసు బర్డరుగారును సహాయకులై యుండిరి.

## క్రైస్తవ నీతి ప్రకాశ ప్రచురణము - క్రీస్తుపరతత్వము :-

లోగడ 1851 వ సంవత్సరము పురుషోత్తముచౌధరిగారు విశాఖపట్టణములో రచించిన క్రైస్తవ నీతిప్రకాశమును, 1845లో వ్రాసిన శతకములను ఒక్క సంపుటముగా రెవ.దాస్ అంతర్వేదిగారు చెన్నపురి పంపి 1872 వ సంవత్సరము 1,000 ప్రతులచ్చు వేయించిరి. పురుషోత్తముగారు తమ స్నేహితులనేకులకా ప్రతులను బంపిరి. 1871 వం సంవత్సరము నవంబరు 12 వ తేదిని పురుషోత్తముచౌధరిగారు అప్పల నరసింహ చౌధరిగారికి బహుశ ఆయన కటకమును విడిచిన దినమున నొక స్వహస్త లిఖిత గ్రంథమిచ్చిరి అందు **"ఏకమేవాద్వితీయం"** మొదలగు హైందవ వేదాంత విషయములు వ్రాసి దాని చివర క్రైస్తవ వేదాంతసారం 157 పుటనుండి చేర్చియున్నారు. ఇదియే వారి **సత్య వేదసారసంగ్రహమను** క్రీస్తు పరతత్వమ. ఈ స్వహస్త లిఖిత గ్రంథమునుబట్టి క్రీస్తు పరతత్వము 1871వ సంవత్సరము వ్రాసియుందురని కనబడుచున్నది. యేసుక్రీస్తు ప్రభువు యొక్క దైవత్వ నిరూపణమంతయు బైబిలు దృష్టాంతములతో పద్యకావ్యమున నీ గ్రంథమున నిమిడ్చియున్నారు. దానినుండి యీ కింద్రి పద్యములు దృష్టాంతముగ జూడవచ్చును:-

మ॥ కృపయున్ సత్యము రెండునేకముగ ధాత్రిన్ మానవాకారమై
యుపమానోజ్వల దివ్యబోధలు ప్రియంబొప్పారబోధించి, పా
పపయో రాసి మునుంగుమర్త్యులను గావన్ జీవమర్పించి లే
చి పవిత్రోన్నత ముక్తి పీఠముననిల్చెన్ సచ్చిదానందుడై॥

**అమనస్క మౌనముద్ర**

సీ॥ తేజంబు లెగసి ని - స్తే జమై యొక మహా
తేజంబులోన ని - ద్రింపబోయె॥

జలములుప్పొంగి దు - ర్బలములై యొక మహా
బలములో జేరి సు - ప్తంబునొందె

జ్ఞానంబులెదిగి య - జ్ఞానమై యొకమహా
జ్ఞానంబులోగ్రుంకి - లీనమయ్యె॥

విషయంబులడరి ని - ర్విషయమై యొక మహా
విషయంబులో జేరి - విశ్రమించె॥

గీ॥ నట్టి చతుర్థా సంగ్రహం - బనవరత స
మాధి యానందమయము బ్రహ్మంబు నిర్మ
లత్మాయదె క్రీస్తు క్రీస్తులో - నైక్యసుఖము
గాంచు పరిశుద్ధజీవుడే - క్రైస్తవుండు॥

గీ॥ తనయుడై నట్టునంట - తండ్రి ధాత్రియందు
ఆత్మవై పుత్రనామాసి - యనెడు వాక్య
మదినిజంబేని క్రీస్తుదేవాత్మజుండు
దేవుడే క్రీస్తుడనగ సందియమికేల?

**"నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను"** అని పౌలను భక్తాగ్రేసరుడు చెప్పియున్నట్లు వృద్ధాప్య బలహీనదశలో గూడ కటకపురి ప్రాంతమున మరింత చాకచక్యతతో మన కవి కార్యకరణ మొనర్ప గలిగిరి.

**సత్యభజన :-**

41వ పటాలమునందలి క్రైస్తవ సంఘమువారి భజనకనుగుణ్యమైన **"సత్యభజన"** కందాలంకార గీతములతో ఆయన 1874 వ సంవత్సరము దాస్ అంతర్వేదిగారి

కోరికపైని పటాలపు క్రైస్తవ సంఘము కొరకు రచించి యిచ్చిరి. అందలి కీర్తనలలో **"సుఖమిచ్చెగద" "విశ్వాధిపతియేసు"** మున్నగు కీర్తనలు సర్వేసర్వత్ర యుపయోగమున నున్నవి. కటకపురిలో ఆయన వ్రాసిన కీర్తనలలో **"ఆహా యీ చెడ్డ హృదయమణచ దుష్కరము" " సర్వపాపవిముక్తి సాధు క్రైస్తవుల కీజగమందే కలిగియుండున్" "ఏల యీ ప్రాలుమాలిన బ్రతుకై వృధా - కాలంబు గడిపినావు" "దేవాదిదేవాత్మజా మమ్ము దీవించు ప్రభురాజా"** మున్నగు కీర్తనలు 1884 సంవత్సరము హితవాది పత్రికలో ముద్రింపబడుచు వచ్చెను.

## అల్లుని కాకినాడకు పంపించుట :-

1873 డిశంబరు నెలలో పురుషోత్తముచౌధరిగారి ద్వితీయ పుత్రిక శ్రీమతి మేరీసుందరి అనగా జొసయా బర్డరు గారి భార్య కటకపురిలో మృతి జెందిరి. జొసయా బర్డరుగారి జ్యేష్ఠ పుత్రుడు కలకత్తాలో ఉద్యోగిగా నుండి ఆయననయు మృతుడాయెను. జొసయా బర్డరు పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటులో నుద్యోగిగ నుండి ఉత్కళభాషలో క్రైస్తవారాధనలు జరిగించుచుండుటచే భక్తిగల యొక ఇంజనీయరు ఆయన నటులనే యా కార్యము కొనసాగనియ్యవలెననియు, తాను ధన సహాయము చేయించు చుండెదననియు ప్రోత్సాహపరచెను. ఇంతలో పురుషోత్తముచౌధరిగారికి అంతర్వేదిదాసుగారి ద్వారా యొక వార్త అందెను. 1874 సం॥ మార్చి 12 తేదిని కాకినాడలో మిషనెరీగా జేరిన రెవ. డాక్టరు జాన్ మెక్లారిన్ గారు సువార్త బోధకులను గోరుచుండిరి. 1865 వ సంవత్సరము అనగా లోగడ పురుషోత్తముచౌధరిగారు కాకినాడలో బోధించి వెళ్ళిన నాలుగేండ్ల వెనుక తామస్ గాబ్రియేల్‌గారు, అను నొక టెలిగ్రాఫిస్టు జొషయా బర్డురుగారును మిషన్ సహాయకులుగ బిలువనంపుడని తాను 1875 జనవరి 1 వతేదిని మృతి జెందినపుడు, మెక్లారిన్ దొరగారికి సలహా యిచ్చియుందురు. ఆ ప్రకారమాయన కటకపురికి వ్రాసినందున పురుషోత్తముచౌధరిగారు తమ యాశీర్వాదములతో జొషయా బర్డరుగారిని 1875వ సంవత్సర ప్రారంభ మాసములలో కాకినాడకు పంపించిరి. **"నీతిమంతునికి కలుగు ఆపదలనేకములు" (కీర్తన34:19)** అని దావీదు మహారాజు చెప్పియుండినటుల మన వృద్ధకవి కిప్పుడింకొక కష్టము సంప్రాప్తమాయెను. కుటుంబపోషణమునంతయు భరించుచుండిన తన జ్యేష్ఠ

పుత్రుడును, పోలీసు యినస్పెక్టరు నగు బాబు డేవిడ్ చౌధరిగారు, బాబు జాన్ చౌధరి (సీనియరు) యను కుమారుని, సుందరిచౌధరియను కుమార్తెను, ఎమేల్యచౌధరియను భార్యను విడిచి 1875 సం॥ డిశంబరు నెలలో ప్రభుసన్నిధి జేరిరి. అది పురుషోత్తముచౌధరిగారికి దుర్భర దు:ఖభాజక విషయమేయైనను ఆయనలో గల ధన్య నిరీక్షణచే తనను తానుపశమించు కొని, అప్పల నరసింహ చౌధరిగారికి క్రింది లేఖ వ్రాసిరి.

కటకము

6వ తేది, జనవరి 1876 సం॥

నా ప్రియ కుమారుడు  అప్పలనరసింహకు,

నాయనా! యింతకు ముందు అంతర్వేది అయ్యగారు మీకు వ్రాసిన యుత్తరముద్వారా దు:ఖ సమాచారము, అనగా నీ తమ్ముడైన దావీదు పరలోక ప్రాప్తుడైన సంగతి మీకందరికి తెలిసియున్నదని నమ్ముచున్నాము. ప్రభువుకు ఈలాగు చిత్తమైయున్నది కనుక మనము ఏమి చేయగలము? **"ఆయన హస్తములు అడ్డుకొనుటకును ఆయన చేసేది ఏమిటి అని అనేపాటివారు ఎవరు లేరనిన్ని " (దానియేలు 4:35) "యెహోవా యిచ్చెను యెహోవా తీసికొనియున్నాడు  యెహోవా యొక్క నామము స్తుతింపబడునుగాక"** యనిన్ని యోబు పలికెను. **"నా కొడుకా! నా కొడుకా"!** యని తన కుమారుడైన అబ్షలోము నిమిత్తము దావీదు రాజు ప్రలాపించిన దు:ఖించినప్పటకిన్ని, యింకొక చోట ఆయన **"పొయినదానిని తిరిగి రాచేయగలనా! నేను వానియొద్దికి వెళ్ళుదునుగాని నాయొద్దికి వాడు మరిరాడని చెప్పెను.**

కాబట్టి నా ప్రియకుమారుడవైన అప్పలనరసింహా ! నాయనా ! దేవుడు గాయపరచిన నా పాపిష్టి హృదయమునకు ఆయన తన దివ్య వాక్యములనే మహౌషధముతో ఓదార్చక పోయినట్టయితే భరించ శక్యముగాని మహా దు:ఖ భారము క్రింద నేను నలిగిపోయి యీ యుత్తరము నీకు వ్రాయలేక పోదును. అయితే దయా సముద్రుడైన మన తండ్రి, క్రీస్తుయి యున్న మన దేవుడు, తన మహా వాక్యములతో నన్ను ఓదార్చుచున్నాడు గనుక ఓదార్పు పొందుతూ ఆయన పాదముల యెదుట సాగిలపడియు యున్నాను. మరిన్ని దు:ఖ సముద్రములో మునిగిపోయిన మన యింటి వారందరు దరి జేరి

తెమ్మదేరుతూ యున్నారు. నీ తమ్ముడు సామి (సామ్యేల్ చౌధరి) కేంద్రపాడా వెళ్ళి ఎమిల్య (కోడలు) ను యావద్వస్తువులను తీసికొని యింటికి వచ్చినాడు. ఇప్పటి వరకు అంతా ఒక గూటిలో చేరి తెమ్మతేరుతూ యున్నాము. ఆ ప్రభువు యొక్క దివ్య నామము సర్వదా స్తుతియింపబడు గాక! ఇది గాక అఘటన ఘటనా సమర్థుడైన అనంత దమాళుడైన ప్రభువు దేవుడు యెషయా 41 వ్వరం 8, 10 వాక్యములలో చెప్పిన ప్రకారము తాను ఏర్పరచుకొనిన తన సేవకుడనైన నాకు తన నీతిగల కుడి హస్తము ఆశ్చర్యముగా ఈ సమయములో నా కొరకు బయలు పరచినాడు . ఏలాగంటె నీ తమ్ముడైన డేవిడ్ యొక్క శరీరము సమాధిలో పూడ్చిన మూడవదినము తరువాత ఇక్కడ ఉత్కళ సంఘము యొక్క అధ్యక్షుడైన ఫాదిరి మిల్లరు దొరగారుతమ యింటికి నన్ను పిలిపించి, కొంత ఓదార్చి ప్రభువుపని, అనగా నా పూర్వపు ప్రసంగ ఉద్యోగము నేను చేయుటకు నన్ను ప్రేరేపించి ఆ పని నాకు దయచేసినారు. అయితే గ్రామాదులలో తిరుగుటకుకాదు. గుడిలో ప్రసంగము చేయుటకున్ను, బజారులోకి అప్పటప్పటికి వెళ్ళి తెలుగు ఒరియా జనులకు సువార్త తెలుపుటకున్ను నియమించిరి. నేను వారిని అడుగనిది, కోరనిది తలంచనిది వారంతట వారే నన్ను పిలిచి యీ పనినిచ్చుట దేవుని ఆశ్చర్యమైన కృపా హస్తమేగాక వేరొకటికాదని తెలిసికొని, ఆయన నామమునకు స్తోత్రము చెల్లించి జన్యువరి ఆరంభము నుంచి యీ మహాసభలో చేర్చుకోబడినాను.

దావీదు అనే వృక్షమును ఖండించి వేసి ఒరియా మిషన్ సొసైటి అను మహావృక్షచ్ఛాయ నుండి నేను పోషింపబడుటకు ప్రభువు ఈ మార్గము తీసెను. ఆయన అద్భుతమైన యీ కృపకు నేను ఏమి స్తుతింతును! ఏపాటి కృతజ్ఞత చెల్లించగలుగుదును. ఓహో దావీదు రాజు వ్రాసినట్లు **"సాయంకాలమందు ఏడ్పు ఉండునన్న, ఉదయమందు సంతోషము కలుగుననిన్ని"** చెప్పిన వాక్యము ఈలాగు దృష్టాంత పరచినాడు. నాయనా! యిప్పటికి సంగతి మరి యేమి చెప్పుదును! పటాలము ఫిబ్రవరి ఆరంభముతో వెళ్ళవచ్చునని అంటున్నారు కాని యింకా ఆర్డరు రాలేదు. 15 తారీఖు కేదో హుకుము వచ్చునని అనుకొంటున్నారు (అంతర్వేది) గారితో నేనున్ను పర్లాఖిమిడి పర్యంతము వచ్చి, మిమ్ములనందరిని దర్శించుటకు ఆశ పరుగెత్తుచున్నది. కాని అనేక నిర్బంధములు అడ్డముగా నున్నందున రాగలనని తోచదు.

ఈ యుత్తరము చివరి వ్రాత 10 తారీకున సమాప్తి చేస్తున్నాను. వారపు మీటింగులు నేటి రాత్రిలో తీరును అయ్యగారు కుటుంబ సహితముగా క్షేమముగా నుండి నీకున్ను అందరికిన్ని ప్రియ వందనములు చెప్పుమనిరి. మన యింటివా రందరు మీకందరికీ ప్రేమ ముద్దులు చెప్పుమనిరి. మన ప్రియ సహోదరుడైన భగవాన్‌బెహరాకిగారిని ఆయన భార్యకున్ను ,గంగమ్మకున్ను, నా ప్రేమ వందనములు చెప్పుము. రాజులకు (జోగిరాజు, ఫకీర్రాజు, నీలకంఠరాజు, శ్యామఘనరాజుగార్లునకు) మా వినయ వందనములున్ను, జోగుల నాయుడుకు ప్రియ వందనములున్ను తెలియజేయుము. నీ తమ్ముడు సామి (సామ్యేల్ చౌధరి) రేపటి దినము తన పనికొరకు గుట్టణి వెళ్ళును, ఇప్పటికి అధికమేమి చెప్పుదును. ప్రభువు చిత్తమైతే త్వరలో ఇంకొక యుత్తరము నీకు వ్రాయగలను. శాంతి, గోపినాధు, అమ్మాళ్ వీరలకు మా యందరి ప్రేమ ముద్దులు చెప్పుము.

నేను నీ ప్రియమైన దాదా
పురుషోత్తము చౌధరి

క్రైస్తవునికి ఆత్మశాంతికిని కుటుంబ ప్రేమ జీవితమునకును క్రీస్తు ప్రాయశ్చిత్త రక్తమే యాధారమని పై లేఖవల్ల జదువరులు గ్రహింపగలరు. క్రైస్తవుడు మృతిజెందునపుడు గోపుచ్ఛము బట్టుకొని వైతరణి నదినిదాటడు. పురుషోత్తముచౌధరిగారి, పితామహులు, ప్రపితామహులు అంధత్వమున నటుల జేసియుండినను, వారి పుత్రులు, దౌహిత్రులు అట్టి బూటకములను విశ్వసింపక **పాపరాహిత్య అవతార మూర్తియగు యేసుప్రభురక్త ప్రోక్షణము ద్వారానే సర్వ పాపవిముక్తి లభించునను** విశ్వాసమున ఆనందించి నిత్యశాంతి గనుగొనిరి. "పునరపిజన్మం పునరపిమరణం" అను ఆంధ ప్రాయ విశ్వాసమునుండి వారు తొలగి యేసుప్రభువు ద్వారా ఆత్మలో గలిగిన నూతన పరివర్తనమే ముక్తి సాధక మార్గమని విశ్వసించి తరించిరి. తరించుచున్నారు **"క్రీస్తు నందు మృతులు ధన్యులు."**

ఈ కాలమున పురుషోత్తము చౌధరిగారి కనిష్ఠ పుత్రికయగు, టైటస్ బర్డర్ గారి, ధర్మపత్ని తండ్రి సంరక్షణకు సమీపమున నుండెను. వంగ ఉత్కళ హిందూస్థాని భాషల సంపర్క మామె కెక్కువగ నుండినను ఆమె శైశవమున విశాఖపట్టణములో ఆంగ్ల, ఆంధ్ర భాషలలో ఆరితేరి యుండినందున తండ్రిగారు ఇంగ్లాండులోని తమ స్నేహితులగు వార్‌డ్లా, టాలరు, మున్నగు మిషనెరీల కుటుంబములకు వ్రాయుచు వచ్చిన యుత్తరములు

ఆంగ్లభాషలో భాషాంతరము చేయుచు వారి ప్రత్యుత్తరములు తండ్రిగారికై భాషాంతరము చేయుచు నుండువారు. ఆమె యొక యాంగ్లేయ లేమవలె రూపమందే కాక ఆంగ్ల భాషోచ్ఛారణము నను రచనయందును నిపుణత గలిగి యుండెను. టైటసు బర్డరు గారును ఆంధ్ర, ఆంగ్ల, ఉత్కళాదిభాషల నెరిగి మామగారికి మంచి సహాయకులై యుండిరి.

**అంతర్వేది గారు విడిపోవుట :-**

రెవ. దాస్. అంతర్వేదిగారు తన పటాలములో 1876 సం॥ మార్చినెలలో కటకము విడిచి విజయనగరమునకు బోయెను. వారు కటకములో నుండినపుడు 155 మంది పటాలపు సంఘమున నాయా కాలములలో జేర్చుకొనబడినను, అక్కడ నిలిచిన 55 మంది గురిలో కొందరు కటకపురిలో నిల్చిపోయి స్థిరనివాసము లేర్పరచు కొనిరి. ఆ సంఘమునకును ఉత్కళ సంఘమునకును పురుషోత్తముచౌధరిగారు పాలకులై యుండి మత ప్రభోదనము బోధించు చుండిరి.

ఉత్కళ, ఆంధ్రబాప్టిస్టు సంఘములలో ఆయనద్వారా కొందరు స్నానదీక్షపొంది సంఘస్థులైరి. ఆ వృద్ధబోధకుడు వారికివినిపించిన ప్రసంగములుకొన్ని వారి స్వహస్త లిఖితముతో నున్నవి.

**ఇంకొక మిషనెరీ ప్రయాణము :-**

1876 సం॥ ఆక్టోబరు 23 తేదీని పురుషోత్తముచౌధరి కొందరు సహకారులతో మహనదిలో ది హెరాల్డ్ (The Herald)అను పేరుగల స్టీమర్ కటకపురికి 150 మైళ్ళు దూరమందున్న భద్రకోటి వరకు ప్రయాణము చేసిరి. 1876 – 77 సం॥ ఒరిస్సా మిషనెరీ రిపోర్టు మేరకు వారు "హైలెవల్ కెనాల్ " అను మహానది కాలువ లోనికి తిరిగి, బ్రాహ్మినీ నదిలో బడి, ఆ నది కిరుపార్శ్వ ్వములగల యనేక ఉత్కళ గ్రామములో ఉత్కళ భాషలో సువార్త ప్రచారముచేసి, భోల్పూరు చేరిన బసలో వాంతిభేది (కలరా) యారంభమైనందున పురుషోత్తముచౌధరిగారు వారి సహకారులను కటకపురికై వెనుకకు మళ్ళిరి.

పురుషోత్తముచౌధరి పాలకులుగ నుండిన ఉత్కళ బాప్టిస్టు సంఘమున 3000 మంది వరకు సంఘస్తులుండిరి. ఆ దేవాలయమును జాల పెద్దది. కటకపురిలో ఆయనచే స్నానముపొందియుండిన యొకవృద్ధబంధువురాలు నేటికిని బరంపురమున సజీవురాలైయున్నది.

## బంగాళీ భాషా జ్ఞానము :-

ఆ సంవత్సరము క్రిస్మస్ దినమున పురుషోత్తముచౌధరిగారికి వచ్చిన బహుమతులలో పెద్ద యక్షరముల బంగాళీ బైబిలోకటియై యుండెను. డెస్సాయను దొరగారాయనకు దాని బహూకరించిరి. 1884 సం॥ ఆగస్టు నెలలో బ్రచురింపబడిన హితవాది పత్రిక కాయన వ్రాయుచు బంగాళీ బైబిలంతయు దాము చదివి యుండినటుల సూచించి యుండిరి. వంగీయ వార్తా పత్రికలు కూడ ఆయన చదువువారు. నిజముగా బాంగ్లా భాషకును ఉత్కళ భాషకును లిపి, ఉచ్చారణ భేదము తప్ప ఆ రెండును సమాన సంస్కృత సమసోదరీభాషలే. విదేశములనుండి యాయనకు గొందరుస్నేహితులప్పుడప్పుడు ధనసహాయమొనర్చుచువచ్చిరి. ఆయన ప్రియశిష్యులుగనుండిన బాసాని అప్పుడుగారు చిట్టివలసనుండి ప్రతిక్రిస్మసుకాయనకు గురుకట్నము బంపుచువచ్చిరి.

## రెవ.జూవెట్ దొరగారి ప్రసంశ :-

పురుషోత్తముచౌధరిగారు 1836 సంవత్సరము అమెరికను బాప్టిస్టువారి మొదటి మిషనెరీయగు రెవ. సామ్యేల్ ఎస్. డే దొరగారికి శ్రీకాకుళములో ప్రథమ సహాయకులయినది మొదలు ఆ మిషన్‌వారితో నుత్తర ప్రత్యుత్తరములు గలిగియుండి వారికి చందాలు కూడ అప్పుడప్పుడు పంపుచు వచ్చినటుల 1876 సంవత్సరము డిసెంబరు 20 తేదీని రెవ. ఎల్. జువెట్ దొరగారు చెన్నపురిలోని రాయిపురము నుండి వ్రాసిన యొక యుత్తరము వల్ల దెలియచున్నది. అందువారు మోర్గన్ గారు, మోబిన్ దొరసానిగారు, ప్రయిస్ గారు మున్నగు పురుషోత్తము గారి పరిచయస్థుల పేళ్ళను రామాయపట్టణములో తుఫానుచే మిషన్‌వారి భవనములకు కలిగిన నష్ట విషయములను ఆ దినమే తాము నెల్లూరికి పోవుచున్న సంగతిని వివరించియున్నారు. బచ్చు రాఘవయ్యగారితోను, రెవ.మార్టిన్‌గారితోను, రెవ.బుల్లర్డ్ గారితోను తదితర అమెరికను బాప్టిస్టు మిషన్ వారితో పురుషోత్తము చౌధరిగారికి ఉత్తర ప్రత్యుత్తరములు చెలగినటుల వారి జ్ఞాపికలు సూచించుచున్నవి.

# 13 . అధ్యాయము

బరంపుర సంఘ పాలకత్వము. పర్లాకిమిడి చివరి ప్రయాణము; పూరీ (జగన్నాధము) లో ప్రభు సేవ. హెలెన్ నాట్ దొరసానిగారితో చివరియుత్తర ప్రత్యుత్తరములు; రెండు చివరి కీర్తనలు. పుత్రవియోగము. ఆనందలోక ప్రవేశము.

**"నా పరుగు తుదముట్టించియున్నాను. నా కొరకు నీతి కీరిట ముంచుబడి యున్నది" 2తిమొతి 4: 7-8**

---♦--- ♦---♦---

## బరంపురము ఉత్కళ బాప్టిస్టు సంఘ పాలకత్వము :-

1877 సంవత్సరము బరంపుర ఉత్కళ బాప్టిస్టు సంఘమున సుప్రసిద్ధులైన బాబు దానియేల్ మహాంతిగారు, లేబన్ మహంతిగారు, పీటరు మహంతిగారు, రూబెన్ మహంతి గారు మున్నగు ఉద్యోగీయులు విద్యావంతులగు మరికొందరు క్రైస్తవులు నుండిరి. పురుషోత్తము చౌధరిగారు కటకమునకు దాదాపు 120 మైళ్ళు దూరముననున్న ఆ పురమందలి యుత్కళ క్రైస్తవ సంఘ పాలకులుగ పంపబడిరి. ఇప్పుడు వారి వయస్సు 74సం॥ . ఆ సంఘస్థుల యెదుట ఆయన ఉత్కళ భాషలో వినిపించిన ప్రసంగములుగల వారి స్వహస్త లిఖిత పుస్తకమొకటి కటకములో లభించెను. అందు క్రింది వాక్యములపై ప్రసంగ సంక్షిప్తములు ఉత్కళభాషలో వ్రాయబడియున్నవి:- మత్తయి 10: 14, ఎఫెసి 3: 18 ,హెబ్రి 12: 1, 1వ కొరింథి 6: 19 - 20, యెషయా 35: 3-4, ప్రకటన 1: 17-18, యెషయా 55: 6, 1 కొరింథి 3 : 9, యోహాను 18 :30, 1 కొరింథి 15: 49, దానియేలు 9: 22-23. ఈ చివరి వాక్య ప్రసంగమున మూడీ దొరగారి దృష్టాంతమొకటి యుపయోగించిరి.

## గంజాంకు అంత్య దర్శనము:-

బరంపురమున నున్నపుడు పురుషోత్తము చౌధరిగారు యింకొక ప్రార్థనకు ప్రభువు ప్రత్యుత్తరమిచ్చెను. ఆయన తన చిన్నకోడలు గోపినాధ చౌధరిగారి భార్య శ్రీమతి రత్నఅమ్మాళ్ చౌధరాణియు, భగవాన్ బెహరా గారి సతి శ్రీమతి రత్నమయి బెహరాణియు, ఆయన కుమార్తై ముక్తాబెహరాను బాలికయు, ప్రభువు రాజ్యమున ప్రవేశింప

ప్రార్థించుచుండెను. ఇప్పుడు వారు బహిరంగముగ, ప్రభువు సంఘమున జేరుకొన నిశ్చయించినందున పర్ణసాగరపురమను ఆకులతంపర నుండి పురుషోత్తముచౌధరిగారిని రావలెనని ఆయనకొక యుత్తరము బరంపురమునకును అంతర్వేదిఅయ్య రావలెనని విజయనగరమునకొక యుత్తరమును పాస్టరు అప్పలనరసింహ చౌధరిగారు 1877 సం॥ మే నెలలో వ్రాసియుండిరి. 1876 వ సం॥ జూన్ నెల 28 వ తేదిని కనేడియన్ బాప్టిస్టు మిషన్ వారి పరమున మిషనెరీగ పంపబడిన రెవ.ఎఫ్. డబ్లియు. ఆర్మ్‌స్ట్రాంగ్‌గారును, దొరసానిగారిను ఆహ్వానమప్పుడే యందుకొని వారందరు 1877 సం॥ జూన్ నెల మొదటివారమున వంశధారా నదీ తీరమున శోభిల్లు పర్ణసాగరపురము చేరిరి. ఆ నెల 10 వ తేదిని పై నుదహరింపబడిన ముగ్గురు గోషా యువతులును బహు జనములు వీక్షించుచుండ దమ రక్షణకర్తయగు యేసు ప్రభుని నామమున బాప్తిస్మస్నానము పొందుటకు నదీ తీరమున నిల్చిరి. పురుషోత్తముగారు, తదితర క్రైస్తవులు, హిందువులు వీక్షించుచుండగా రెవ.అంతర్వేదిగారు వారికి స్నానమిచ్చి యా యెనమండుగురు సభ్యులు గల సంఘమును ఆర్మ్‌స్ట్రాంగ్ గారికి హస్తార్పణము చేసిరి. ఈ సావకాశము ననుసరించి 1877 సం॥ కనేడియన్ మిషన్ రిపోర్టులో ఆ దొరగారిట్లు వ్రాసియున్నారు.

"అమెరికను బాప్టిస్టు తెలుగు మిషన్‌వారి ప్రథమ మిషనెరీయగు రెవ. డే దొరగారి సహాయార్థమై యా మిషనులో లేవనెత్తబడిన ప్రథమ బోధకులును, వయోవృద్ధులునగు పురుషోత్తముగారు సమ్ముఖము వలన ఆ కాలమత్యంత మనోహరముగ నుండెను. ఆయన మిగుల వృద్ధులు అయినను క్రీస్తు సువార్త వ్యాపక సంబంధమయిన ప్రతి విషయమున గాఢానురాగులై యున్నారు". *

* The season was the more interesting through the persence of the aged Purushottam the first preacher who was raised up in the American Baptist Telugu Mission to assist their pioneer Missionary the Rev.S.S Day. He is very aged but still active and deeply interested in every thing connected with the spread of the Gospel of Christ"

(Rev. F.W.Armstrong in the Canadian Baptist Mission Report for 1877.)

పురుషోత్తముచౌధరిగారు చివరిసారిగా అప్పుడే పర్లాకిమిడి ప్రదేశమునకు వచ్చి తిరిగి బరంపురమునకు వెడలిపోయిరి.

**రెవ. పైక్ దొరగారి యభిప్రాయము:-**

బరంపురములో నీ పాలకుడు చేసియుండిన సేవను గురించి వారి సహకారులుగనుండిన రెవ.జే.జి పైక్ (Rev. J. G Pike)దొరగారు 1905 సం॥ మే నెల 22వ తేదిని పర్లాకిమిడిలో పురుషోత్తము స్మారక మందిర నిర్మాణ సమయమున రెవ.ఐ.సి. అర్చిబాల్డ్ గారి కిట్లు వ్రాసిరి.:

"పురుషోత్తముచౌధరిగారిని గురించి నా జ్ఞాపకము మేరకు ఆయన మిగుల యుత్సాహపూరితుడైన వృద్ధుడు. 1877, 1878 సం॥ నేను పనికి నూతనుడనై యున్నప్పుడు ఆయన నాకు జాల సహాయముచేసెను. నేను కటకములో మూడేండ్లు ఉంటిని, అంతట బరంపురములో ఖాళీ రాగా నన్ను పంపించిరి. పురుషోత్తముగారిని నాకు కుడిచేతిగా నుండుటకు పంపించిరి. ఆయన మంచి సమర్ధుడు,అయితే ఆయన యొక్క శ్రేష్ఠమైన క్రైస్తవ సౌశీల్యత నాకాశ్చర్యముగొల్పి నేనాయనను ప్రేమించితిని. ఆయనకు గల దయాదక్షిణ్యములచే నెల్లరాయనను ప్రేమించిరి. నేను సోదరుడైన హెబర్లెట్ గారితో సంబల్పూరు మిషనకు వెళ్లి పోవుటచే మన సోదరుని బోగట్టా అంతగా లేకపోయెను. అయితే నేమి ఆయన ఓపికతో బాధపడి తన యౌవనావస్థను తన సేవా పూర్వకముగా జేసినటులనే తన దౌర్బల్యతలో దైవనామసంస్తుతి జేయుట కొన్ని యేండ్ల వరకు నేనెరుగుదును. నేనాయననొక మహాదివ్య పురుషునిగ నెల్లప్పుడు గౌరవించితిని. ఆయన తన యాజమానుని మెప్పును తప్పకుండ వడసెను."*

* My memory of Purushottam is simply of a very delighful old man who helped me much in the years 1877 and 1878when I was comparatively new to the work. I had had three years at Cuttack and was then sent for to fill a gap at Berhampore, and Purushottam was sent as my right hand man. He was a man of good ability but it was his sterling Christian Character that won my admiration and love. He was so genial and kind that every one loved him. In 1879 I moved off to start with brother Heberlet to the Sambalpur Mission and I saw very little of our brother, Still I knew him for

some years as a patient sufferer, glorifying God in his weakness, as he had sought to do in his younger days by his service. I always regarded him as a very superior man and he has doutbless recieved his Lord's "Well done"

1879 సంవత్సరము ఆయన బరంపురము విడిచిన తదుపరి కటకపురి యందలి ఉత్కళ, ఆంధ్ర బాప్టిస్టు సంఘముల పాలకత్వము వహించి, సువార్త ప్రచారార్థము దూరభార ప్రయాణములు సాగించుచుండిరి.

## పూరిలో సువార్త సేవ:-

1881 సంవత్సరము అక్టోబరు 7 వ తేదిని 14 వ తేదిని, ఆయన తన చిన్న కుమార్తె శ్రీమతి మార్తాబర్డురుగారికి పూరీజగన్నాధము నుండి వ్రాసియుండిన ఉత్తరముల వల్ల నెల దినములాయన యా నగరమున గడిపి భోరున వర్షములు కురియుచుండినను, తన బస నీళ్ళమయమైపోయినను ఎట్లనో సహించి ప్రభుసేవనచ్చట జరిగించితిమనియు అప్పుడు వీచిన తుఫానునకు జాలరులు భయపడి ప్రళయకాలమెప్పుడు వచ్చునని యడుగువారనియు అనుదినము యాత్రాపరులగు ఆంధ్రులు కూడా సంతోషముతో ఆయన ప్రసంగములు వినుచు వచ్చిరనియు వివరించుచు కుటుంబారాధన మరువకూడదనియు, తమ కొరకు ప్రార్థంపవలెననియు నందు గోరియున్నారు. 14తేది యుత్తరములో నిట్లు వ్రాసియున్నారు:- "ఆయన (ప్రభువు) నాకు దయచేసిన వాటిలో తృప్తిగా నుండుటకు నేను ప్రభుని యొద్ద నేర్చుకొంటున్నాను గనుక మనశ్శాంతి దయచేసియున్నాడు. అందువల్ల నా యాత్మలో సుఖమున్ను, క్షేమమున్ను కలిగియున్నది. నా ప్రియబిడ్డా! యీ శరీరానికి ఒకప్పుడు సుఖమున్ను, ఒకప్పుడు దు:ఖమున్ను వచ్చుచుండినప్పటికిని మనశ్శాంతి మాత్రము ప్రభుని దయవల్ల కలిగితే సుఖములన్ని దు:ఖముల కొరకు మార్చబడినా అంత విచారముండదు. తండ్రి యేది యిచ్చినా యదియంతా మేలుకొరకే గాని కీడుకొకు గాదని మనశ్శాంతి గలవారు గ్రహించి సుఖముగానుండగలరు. ఆహా! అట్టి దివ్యమైన శాంతి నాకున్ను , నీకున్ను ఇంటివారందరికిన్ని దేవుడు తన పరిశుద్ధాత్మ ద్వారా ననుగ్రహించునుగాక! ఆ మహాప్రభుని పాదములకు బహుసాష్టాంగ ప్రణామములున్ను

అధికమధికముగా స్తోత్రములున్ను చెల్లించుదముగాక" ఈ యభిప్రాయములనే యాయన **"మనసానందము పొందుటకన్నను మరియే భాగ్యము గలదన్నా"** యను మధుర గీతమున నుదహరించియున్నారు.

### ప్రసంగాంశములు:-

1879 సంవత్సరము నవంబరు 16వ తేదిని **"భూమి యొక్క యావత్తు సరిహద్దులారా, నాతట్టు చూడుడు, అప్పుడు మీరు రక్షింపబడుదురు; ఏమన నేనే దేవుడను; ఇంకొకడులేడు"** (యెషయా 45:22), అను వాక్యముపైని, 1880 సం॥ జూన్ 12 వ తేదిని హెబ్రి 13:8 బట్టియును, ఆ డిసెంబరు 31వ తేదిని ఆదికాండము 47:48-49 బట్టియు, 1879 సం॥ అక్టోబరు 26వ తేదిని యోహాను 17:3 బట్టియు, 1879 సం॥ నవంబరు 2వ తేదిని రోమా 8:34 బట్టియు, 1881 సం॥ జనవరి 9వ తేదిని 1వ పేతురు 4:8 నిబట్టియు, 1881 సం॥ డిశంబరు 31 వ తేది 103వ కీర్తన చదివి బైబిలు లోని మంచి రాతలను గురించియు, 1881 సం॥ జనవరి 29వ తేదిని ఇర్మియా 17:5 బట్టియు, ఫిబ్రవరి 6వ తేదిని రోమా 10:9 ని బట్టియు కటకపురి సంఘమున చేసిన ప్రసంగముల పట్టికలు లభించినవి. **"ఇదిగో యీ మనుష్యుడు"** యోహాను 19:6 అను వాక్యమును గురించియు ప్రభువు వారి రెండవ రాకను గురించియు, ఆయన చేసిన ప్రసంగములు సంక్షిప్తము వ్రాయబడియున్నది.

(1851 సం॥ ఏప్రిల్ 13వ తేదిని విశాఖపట్టణములో 1వ తిమోతి 1:15 మీదను, 1863 స॥ ఫిబ్రవరి 25వ తేదిని బుధవారము నాడు చిట్టివలసలో మత్తయి 22:4 వాక్యమును బట్టియు జేసిన ప్రసంగములును వారి స్వహస్త లిఖితములై యున్నవి). శ్రావమైన కంఠస్వరముతో గానము చేసి యనుభవవేద్యముగ జేయువారి ప్రసంగమలు విని 1880 వ సం॥ సెప్టెంబరు 12 వ తేది యాదివారమున కటకపురి యాంధ్రులలో నరసమ్మ, సీతయ్యయను దంపతులును, గురయ్య, అతని భార్య పేరమ్మ, సైమన్ అను 6గురు రెవ.పురుషోత్తముచౌధరిగారి చేత బాప్తిస్మస్నానము పొందిరి. ఆ సంవత్సరము నవంబరు 7వ తేదిని 5 గురు ఉత్కళులు స్నానదీక్ష పొందిరి.

1880 వ సంవత్సరము నుండి యప్పుడప్పుడు పురుషోత్తము చౌధరిగారికి దౌర్భల్యము హెచ్చుచుండెను. నేత్ర దృష్టియు క్షీణింపజొచ్చెను. ఆ దినములలో నాయన

యొక మేగ్నిఫయర్ అను భూతయద్దము చేతంబట్టుకొని యక్షరములు పోల్చి గ్రంథమును చదువుకొనువారు.

ఆదివారమునాడాయన దేవాలయములో ప్రసంగింపవలసి వచ్చినప్పుడు ఒక సవారిలో ఆయనను దీసికొని పోవువారు. జేమ్సు చిన్నయ్య గారను సోదరుడు లేక వేరొకరు చేయిపట్టి నడిపించి, ఆయనను వేదిక యొద్ద నిలువబెట్టగా దివ్యోపదేశ మిచ్చువారు. కటకపురి ఒరిస్సా బాప్టిస్టు దేవాలయము మిగుల విశాలమైనది. ఆ కాలమున రెండు వేలమంది వరకు సభ్యులు చేరగా పురుషోత్తముచౌధరిగారు అమృతధారా పాతముబోలు మృదుమధుర శైలిని వారందరు వినునంతటి గంభీర స్వరముతో ప్రసంగింపగలవారని వారి నెరిగిన వృద్ధులు, చెప్పుదురు. ఆయన రచించిన కీర్తనలు పద్యములును జేమ్సు చిన్నయ్యగారు ఎత్తి వ్రాయుచు వచ్చిరి.

తమ్మును క్రీస్తు మార్గమునకు నడితపించి యుండిన హెలెన్ నాట్ దొరసానిగారిని, విశాఖపట్టణ వాస్తవ్యులగు రెవ. పులిపాక జగన్నాధము గారు చూచినటులవిని, 1880 సం॥ ఫిబ్రవరి 5వ తేదిని పురుషోత్తముగారు, జగన్నాధముగారి కొక యుత్తరము వ్రాసి, నాట్ దొరసానిగారి పై విలాసము కావలెనని కోరిరి. దాని నందుకొని నంతట 1880 మార్చి 4వ తేదిని పురుషోత్తముచౌధరిగారు తన 77వ యేట హెలెన్‌నాట్ దొరసానిగారికొక లేఖ వ్రాసిరి. అందలి కొన్ని భాగములు క్రింద బొందు పరచెదము:-

నాట్ దొరసానిగారికి వ్రాసిన లేఖ — కటకము, 1880, మార్చి 4వ తేది

మహారాజశ్రీ నాట్ దొరసానిగారికి:-

ఘనమైన నా తల్లీ!

తమరిదివరకు సజీవులైయున్నారని నాకు వినబడి మిక్కిలి సంతోషముతో ప్రభువుకు స్తోత్రము చేసినాను. రెండు వారముల క్రిందట విశాఖపట్టణము నుంచి పాదిరి జగన్నాధముగారు నాకొక యుత్తరము వ్రాసిరి. హే దొరగారున్ను, వారున్ను బెంగుళూరులో మిమ్మును చూచినట్టున్ను నన్ను గురించి మీరు వారిని తెలిసికొనినట్టును మీరు బ్రతికియున్నారనియు నాకు దెలియ చేయుమని ఆయనతో మీరు చెప్పినారనిన్ని

యందు తెలిపిరి. ఆహా! నా తల్లీ ! మీరు సజీవులై యున్నారా! బహుకాలము క్రిందట మీరు చనిపోతిరని యెవరో కబురు పుట్టించిరి. ఆ మాట నేను విని విచారపడితిని.

ఈ నా కన్నులకు మీరు ప్రస్తుతము కనిపించకయుండినా యిదుగో నా చేతులతో వ్రాసుకొనిన యుత్తరము తమ సన్నిధికి వస్తూవున్నది. ఈ యుత్తరము తమరు చూచినప్పుడు మీయాత్మ ప్రయాసము వల్ల కనిన మీ కుమారుడనైన నేనున్ను బ్రతికియున్నానని మీరు సంతోషించవచ్చును.

ఆహా! నా తల్లియైన మీరు 1833 సంవత్సరము శ్రీకాకుళము బలగమేడలో నా నిమిత్తము పొందిన శ్రమలున్ను, నా కొరకు చేసిన ప్రార్థనలున్ను, నేను క్రీస్తు మార్గములో స్థిరుడనై యుండేటందుకు మీరు చేసిన ప్రయత్నములున్ను, ఉపాయములున్ను, ఉపకారములున్ను అవి యావత్తు నా కంటియెదుట ఇప్పుడున్నట్టుగా కనిపించుచున్నవి. ఆ కాలమందు విశాఖపట్టణమందుండిన మేజరు బ్రేట్ దొరగారి యొద్దికి నన్ను పంపించినప్పుడు ఒక గట్టితోలు సంచిలో ఉత్తరములుంచి దయచేస్తిరి. ఆ తోలు సంచి నేటి వరకును నా యొద్దనున్నది. దానిని జాగ్రత్తగా ఉంచినాను. దానిని నేను చూచినప్పుడెల్లా మిమ్మును తలంచుకుంటాను. నాపిల్లలకున్ను దానిచూపించి మీపేరు చెప్పుకుంటాను నేనిప్పుడు తండ్రి దయవల్ల...... యధాశక్తి ప్రకారము పని చేస్తూన్నాను. నాకున్ను పెద్దకాలమైనది. అయినప్పటికిని కొంచెముబలము దేవుడు దయచేసియున్నారు కనుక ఆయన సేవలో ఉన్నాను.

దయగల అమ్మా! మీరు బెంగుళూరులో ఏలాగున్నారు? మీ కుమార్తెయును ఆమె బిడ్డలును ఎక్కడనున్నారు? మీ యల్లుడు రిచ్చర్డ్‌సన్ దొరగారెక్కడ? వినేటందుకు నాకెంత యో కోరిక గనుక దయచేసి కొన్ని పంక్తులు నాకు వ్రాయించవలయునని ప్రార్థించెదను... నా నిమిత్తము ప్రభువు సన్నిధిని మీ ప్రార్థనలో జ్ఞాపకమునకు తేవలయునని వేడుకొనుచున్నాను. మీ యాశీర్వాదముగల యొక చిన్న యుత్తరము కొరకు నిరీక్షించెదను. దివ్యచిత్తమునకు తేవలయును,

నేను తమ దీన సేవకుడనైన

పురుషోత్తముచౌధరి

నాట్‌దొరసానిగారి ప్రత్యుత్తరము :-

ఈ యుత్తరమునకు పురుషోత్తము చౌధరిగారి యాత్మీయ జననియైన హెలెన్ నాట్ దొరసానిగారు తమ 90 వ యేట పంపించిన యుత్తరములోని కొన్ని భాగముల భాషాంతరము క్రింది నిచ్చుచున్నాము.

3, రోజ్‌లేన్, రిచ్‌మండుటౌన్,

ఏప్రిల్ 1880 బెంగుళూరు,

నా మంచి స్నేహితులైన పురుషోత్తముగారూ!

కటకము నుండి మీరు వ్రాసిన దయగల క్రైస్తవ లేఖ సకాలమున నాకందినది. దానికై నేనెంతయో సంతసించితిని. ముఖ్యముగ మిగుల అపాత్రురాలనైన నాయడ మీరు వ్యక్తపరచిన క్రైస్తవ ప్రేమ కొరకు వందనములు. మీ యుత్తరము కొంచెము అవగాహనము చేసుకొన్నాను కాని తగిన వారొకరు భాషాంతరము చేయువరకు కనిపెట్టవలసి వచ్చినది. ఈ సారి పెద్ద వుత్తరం వ్రాయను; నా కుటుంబమును గురించి చెప్పెదను. కర్నల్ రిచర్డ్ సన్ కాలము చేసిరి. ఆయన భార్యయైన నా కుమార్తె యింగ్లాండులో నున్నది. నా కుమారులందరు చనిపోయిరి. నేను మిమ్మును చూడగోరుచున్నాను కాని కటకము ఇక్కడికి ఎంతో దూరము. ఏదో మంచి విషయమై దేవుడు నా యాయువు పొడిగించెను. నేను నా గడచిన జీవితవిషయము తలంచిన అంత మంచి ప్రభువును నేనెట్లు చూచినానోయను మనోఖేదము, హృదయ విచారము తప్ప మరేమిన్నిలేదు. నా మంచి క్రైస్తవ స్నేహితుడా! ఇకను మనకేమి యున్నది. ఆ ప్రియుని హస్తములపై చేరబడడమేకదా! ఆయన మన యవసానకాలమున మనలను విడువడు, నా యాత్మకును నా రక్షకునికిని మధ్యను అంధకారము లేక అంతా తేటగానుండేటట్లు మీరు ప్రార్థంచెదరని నమ్మెదను.

శాంతికి నా ప్రేమలు తెలుపుడు.... శ్రీకాకుళములో నుండే నా పురాతన స్నేహితుల విషయము తెల్పెదరా? కల్పప్పీదొరసానిగారెట్లు చనిపోయినారు? మీరును, నేనును ఎడబాసిన వెనుక నేను రెండు సార్లు ఇంగ్లాండు వెళ్ళివచ్చినాను. తొందరగా వ్రాయుచున్నందున క్షమించండి. అయితే నేనిప్పుడు వ్రాయకపోతే యింకొక సారి

వ్రాయుటకు ఉండనేమో. యేసుప్రభువుపై ఆనుకొని సమాధానముతో నేను మరణించులాగున ప్రార్థించండి. చాలా క్రైస్తవ ప్రేమతో వ్రాయు

*మీ స్నేహితురాలు

హెలెన్‌నాట్

* హెలెన్‌నాట్ దొరసానిగారు 1892 వ సంవత్సరము ఆగస్టు 13వ తేదీన తమ 102 వ యేట బెంగుళూరులో మృతిజెందిరి.

పురుషోత్తముచౌధరిగారిని ప్రభువుపాద సన్నిధికి నడిపించిన యీ భక్తురాలి వంటివారు ఈ కాలమునను హిందూదేశమందలి యుద్యోగీయులలో లేచుట యావశ్యకము ఈమె బంధువర్గమును కనుగొనుట కనేక ప్రయత్నములు చేసియున్నాము.

1882 సం॥ పురుషోత్తముగారు జరాభారముచే గొంతదుర్బలులైరి. వారికి నేత్రావరోధనము హెచ్చుజొచ్చెను. కవులకుండవలసిన పరిశుభ్రతను వీరుమిగుల పాటించువారు. కావున వారిపడక తిన్నగానున్నదోలేదో చేతులతో సవరించుకొనువారు.

1882 సం॥ డిశంబరు నెలలో నొక మధ్య రాత్రి వేళ మన వృద్ధకవి తమ చిన్న కుమార్తెయైన మార్తాబర్దరును పిలిచి "అమ్మా కాగితము పెన్సలు పట్టుకొనిరా? ఒక కీర్తన చెపుతాను వ్రాయుమని" మిగుల హీన స్వరముతో జెప్పగా – "బప్పా" చెప్పండి వ్రాసెదను అని యామెయు సిద్ధపడెను. అంతట సర్వేసర్వత్ర మనోహరముగా ఆ బాల వృద్ధముచే నామోదింప బడుచున్న క్రింది కీర్తన ఆసున దఫదఫాలు ముక్కముక్కలుగా విరామములతో తండ్రియైన పురుషోత్తము చౌధరిగారు చెప్పుచుండగా ఆ కుమార్తె దానిని ఒంటిగంట రాత్రికి ముగించినట్లామె చెప్పెను. ఎట్లనగా బలహీనతగల హీనస్వరముతో "సకలేంద్రియములారా! చాలా మీ పనితీరె – యిక మీరు నాజోలి విడువవేళయ్యెన్" అని చెప్పిన తరువాత, "కొంచము కనిపెట్టు, ఆలోచించి చెప్పెదనని" వ్యాధి బాధితుడగు జనకుడనెను. కొంచెము సేపయిన తరువాత "అమ్మా వ్రాయుమని" చెప్పి **"చకిత మృగశాబకముబోలిక"** మున్నుగాగల అను పల్లవి ఆయన పూర్తి చేసెను.

## భక్తుని వృద్ధాప్యగీతము.

### (చాయ : ఉన్న పాటున వచ్చు)

రా – సావేరి తా – ఆట

సకలేంద్రియములారా – చాల మీ పని దీరె – నిక నన్ను వీడిచిపోవుటకు వేళయ్యెన్ = చకిత మృగ శాబకము పోలిక – నకట మీ చేజిక్కితిని మీ – రిక దొలంగుడు యేసు నా ర – క్షకుడు వచ్చెను నన్ను – గావను ॥సకలేంద్రియములారా॥

1. పంచేంద్రియములారా – బల ముడిగె మీ కిపుడు – వంచన సేయ మీ – వశముగా దికను = మించి మీ రెదిరింపలేరు ద – లంచి చూడుడు దేవ కృపలో – నుంచి నను గదలింప మీకది – కొంచెమగు పని కాదు సుండి ॥సకలేంద్రియములారా॥

2. శ్రవణేంద్రియమ నీదు – శక్తి తగ్గుచు వచ్చె – వివిధ వార్తలు దవిలి – విను చుంటి వెంతో = చెవుడు నీకిపు డనుసరించెను – చేవ తఱిగెను జరిగి పొమ్మిక – సవినయంబుగ యేసు క్రీస్తు ని – శబ్ద మాలిచెదను సుఖ మది ॥సకలేంద్రియములారా॥

3. కనులార మీ వెల్గు – క్రమముగ క్షీణించె – మును జూచు చూడ్కిలో – ముసుకయ్యెనికను = ఘనముగల దేవుని కుమారుడు – తన కృపాసన మిపుడు జూపను – మనసులోపలి కన్ను విప్పెడి – దినము లివె చనుదెంచె జూడుడు ॥సకలేంద్రియములారా॥

4. రసవేంద్రియమ నీ నీ – రసకాల మిదె వచ్చె – విసుకని మాటలను వెద జల్లినావు = పస దరిగి ముది వైతి విపుడో – రసనమా యిక దీరె నీ పని – వెసను నే నిపు డేసుకరుణా – రసము గ్రోలుచు బ్రొద్దు బుచ్చెద ॥సకలేంద్రియములారా॥

5. తను వాద్యంతము మూయ – దగిన త్వగింద్రియమా – నిను సోకునట్టి వ – న్నియు గ్రహించితివి = మునుపుగల నీ జిగిబిగియు నణ – గెనుగదా వ్రేలాడెదిత్తులు – చనుము నీ వెంద్రైన నే నే – సుని స్వరూపము దాల్పబోయెద ॥సకలేం॥

6. ఘ్రాణేంద్రియమ నీవు - కడు వాసనల దగిలి - ప్రాణానిలము చేత - బ్రబలితి వికను = నాణెమైనవి విడును దుర్గం - ధముల బాల్బడ బోదు విక నా - త్రాణపతి యగు క్రీస్తుచేతను - బ్రాణ మర్పింతును సుఖింతును

॥సకలేంద్రియములారా॥

7. కడు దవ్వు పయనంబు - నడిచి వచ్చితి నింక - నిడుపు లేదా త్రోవ -నికటమై వచ్చెన్ = నడుమ నడుమ నడ్డుపడియెడ - నిడుమ లన్నియు గడిచిపోయెను - జడుతు నా మృతి నదికి నా నా - వికుడు వచ్చెను నన్ను గావను

॥సకలేంద్రియములారా॥

8. వెనుక దీరిన మార్గ - మున కంటె ముందుండి - కనుపించు నా త్రోవ - కఠినమై యుండు = ఘన తరంగ ధ్వనులతో భీ - కర మరణ నది పొలు చున్నది - క్షణము మాత్రమె దాని పని యా - వెనుక నావలి యెద్దు జేరెద

॥సకలేంద్రి॥

9. ఈ సంసారంబునం - దేమి సౌఖ్యం గలదు - ఆశ మాత్రమే గాని - యది చిరము గాదు = యేసు క్రీస్తుడు తండ్రి దేవుడు - భాసురంబగు నిర్మలాత్మయు - దాసుడగు పురుషోత్తముని గృప - జేసి నిత్య నివాస మిత్తురు

॥సకలేంద్రియములారా॥

## కీర్తనలవిషయమైన ఉత్తరప్రత్యురములు :-

ఈ కీర్తన 1883 సం॥ జనవరి నెల హితవాది పత్రికలో అచ్చు పడినది. కీర్తన వ్రాయబడిన వెనుక జేమ్సు చిన్నయ్య గారను సోదరుడు దానిని తాజా వ్రాసి పై పత్రికకు బంపెను. పురుషోత్తముగారిట్లు సిద్ధపడియున్నను దేవుడాయనప్రయాణ మింకను బొడిగించెను. అమెరికన్ బాప్టిస్టు మిషన్‌వారు ఆంధ్రక్రైస్తవ కీర్తనలు ప్రచురించియుండిన సందర్భమున 1876 సం॥ జూలై 6 తేదిని నెల్లూరులో నుండిన రెవ. ఇ. బుల్లార్డు దొరగారికి పురుషోత్తముచౌధరిగారు తాను వ్రాసిన కీర్తన లేవియో తెల్పియుండినటుల ఆయన పంపించిన యుత్తరముల పట్టికలో నున్నది. పురుషోత్తమ చౌధరిగారు వ్రాసిన కీర్తనలన్ని యేవేవియో తమకు తెల్పవలెనని 1888 సం॥ రెవ. డబ్లియు.డబ్లియు స్టీవెన్సనుగారు వ్రాయగా తాము వ్రాసిన దాదాపు 80 కీర్తన

లెవ్వియో వారికి దెల్పి, తమ కీర్తనలలో మార్పు చేయవలదని కోరిరి. ఆ సందర్భమున స్టీవెన్‌సన్ దొరగారు "తెలుగు కీర్తనలు" అను శీర్షికతో చెన్నపురి "క్రిస్టియన్ లిటరేచర్ సొసైటి" వారు ప్రచురించిన గ్రంథమునకు ముందుమాట వ్రాయుచు " Mr. Purushottam whose name will long be as a household word among Telugu speaking Christians has helped materially" (ఆంధ్రక్రైస్తవుల ఎవరి పేరు జిరకాలము గృహనామముగ నుండి పోవునో ఆ పురుషోత్తము చౌధరిగారు ముఖ్య సహాయ మొనర్చిరి యని వ్రాసియున్నారు. **ఆ పుస్తకము పురుషోత్తముగారి మరణానంతరము కొన్ని మార్పులతో వెలువడుట కుటుంబము వారికి విషాదము గొల్పెను.)**

ఈ వృద్ధాప్యదశలో పురుషోత్తముగారి మనుమడొకడు ప్రభుత్వ కార్యమున నుండి యేదియో తప్పుచేసెను. తానీ విషయము శిక్ష వచ్చినను తప్పు వారి యెద్ద ఒప్పుకొనిరావలెనని యాయనకు నేర్పించిరి. అతిథి సత్కారమున ఆయన వెనుక బడువారుకారు. ఆయన అప్పుడప్పుడు ప్రభుకార్యార్ధము కొందరికి ధనసహాయము పంపుచు వచ్చిరి. 1881 సం॥ డిశంబరు 20 వ తేది మంగళవారము (నరసాపురమందలి) బౌడన్ దొరగారికి 15 రూప్యములు పంపించినటుల జాబితాలో నున్నది.

ఆయన స్నేహితులలో 1835వ సంవత్సరమునుండి ఆయనతో సువార్త సేవచేసియుండిన రెవ. జే. డబ్లియు. గార్డన్‌దొరగారు 1872 ఏప్రిల్ 24 తేదిన కూనూరునుండియు, 1887సం॥ ఆగస్టు 18వ తేదిని చెన్నపురినుండియు వ్రాసిన యుత్తరములవలనను రెవ. ఏ. వి. టింపెనీదొరగారు 1883సం॥ జూన్ 19 తేదిని కాకినాడనుండి వ్రాసిన యుత్తరమువల్లను, 1888 సం॥ డిసెంబరు 24 తేదిని రెవ. ఐ. సిఆర్చిబాల్డుదొరగారు వ్రాసిన యుత్తరమువల్లను, రెవ. పి. జగన్నాధముగారు విదేశీయులైన కొందరు మిషనెరీలు, రెవ. డి. అంతర్వేదిగారు మున్నగువారు వ్రాయుచువచ్చిన యుత్తరములవల్లను ఆయావిషయములపైని యాయనతో బలువురకు ఉత్తరప్రత్యుత్తరములు కలిగియుండినటుల జూచెదము.

**పత్రికల పునర్ముద్రణము :-**

1884 సం॥ జనవరి 15 వ తేదిని కనేడియన్ బాప్టిస్టు మిషనెరీ కాన్ఫరెన్సువారు పురుషోత్తముగారు వ్రాసిన **ముక్తిమార్గ ప్రదర్శనము, కులాచార పరీక్ష,** పునర్ముద్రణము గావించుటకై తీర్మానించి రెవ. జే.ఆర్. హచ్చిన్‌సన్ గారి ద్వారా కోరగా పురుషోత్తముగారు కులాచారపరీక్ష కొద్దిగా సవరించి యా రెంటిని ముద్రింప సెలవొసగిరి. అవి యటులనే ప్రచురింపబడెను.

1888 సం॥ సెప్టెంబరు నెల మొదటి వారమున పురుషోత్తముచౌధరిగారి పెద్దల్లుడైన బాబు ఘనశ్యామనాయక్ (Babu Ghonoshsyam Naik) గారు కాలవశులైరి. ఆ రాత్రియే యా సంగతి పురుషోత్తము చౌధరిగారికి దెల్పిన యెడల వృద్ధాప్యమున ఆ విచార భారముచే వారు క్రుంగిపోవుదు రేమోయని తెలుపక, యుదయమున దెల్పిరి. ఆయన కటకపురి సుతాహాట్ నుండి పేటన్‌సై అను వీధిలో దమ వైధవ్య మొందిన కుమార్తె శాంతికుమారిని జూడ బోగా ఆమె భర్త మృతదేహము వద్ద గూర్చొని యేడ్చుచుండుట జూచి "మూర్ఖపు పిల్లా! దేవుడు తన యొద్దగల దివ్య సుఖమను భవించుటకు నీ భర్తను తీసికొన్నందున సంతసించుటకు బదులుగా ఏడ్చుచున్నావా? అట్లువలదు, ఘనశ్యామబాబు ప్రభువు సన్నిధిని జేరెనని సంతసించుమని" యామె నోదార్చిరని యమె మనుమడు బాబు మహేంద్రనాయక్ గారు చెప్పియుండిరి. 1889 సం॥ అక్టోబరు 23 వ తేదిని పురుషోత్తముచౌధరిగారి ద్వితీయ పుత్రులును ప్రభుత్వ వైద్యశాలలో నుద్యోగీయులుగ నుండిన బాబు సామ్యేల్ చౌధరి (Babu Samuel Choudhuri)గారు మృతిజెందిరి. అత్తరి పురుషోత్తముచౌధరిగారి కంటినుండి యొక్కచుక్క నీరైనను రాలేదనియు, అప్పుడు ఒంగోలులో నున్న డెస్సామిసమ్మ గారాయనను ఓదార్చ వెళ్ళగా నీ క్రింది యుదహరణ ఆయన యామెకు జెప్పినటులను ఆ మిశమ్మగారి ద్వారా వింటిమి. ఏదన ఇద్దరు మనుష్యులు సముద్రస్నానమునకు వెళ్ళిరి. ఒకడు కెరటములు వచ్చుచుండగా వానికి తిన్నగా నిలిచినందున వాడు వెలికిల వెనుకకు పడెను. ఇంకొకడు కెరటములు రాగా వంగిపోయినందున వాని మీదుగా అవి ప్రవహించిపోయెను. కావున సుఖదు:ఖ స్థితిగతుల ప్రవాహము ముందర మనమును

వినమ్రులము కావలెను. పురుషోత్తముచౌధరిగారి యొక్క యుదాహరణ ఆమె కచ్చెరువు గొల్పెను. ఇట్టి వృద్ధాప్య కాలమున ఆయన కీర్తనలవల్లను, పత్రికలవల్లను మేలు పొంది వానిని ఆమోదించిన విశాఖపట్టణమందలి యప్పటి క్రైస్తవ మండలి వారాయనకు గొంచము అభినందన పారితోషికము పంపించిరి.

ఆయనకు తరుచుగా గలుగుచుండు దైవదర్శనముల నాయన తన బిడ్డలకు దెలియజేయు చుండెను. వారు వాని మూలమున అపూర్వ పరలోక రాజ్య రహస్యములను గ్రహించుచుండువారు. ఇట్టి సందర్భములలో మనకీ చరిత్ర లభించు నొక దైవకృత కార్యము జరిగినది. 1888 సం॥ ప్రాంతమున బెంగుళూరులో లండన్‌మిషన్ మిషనరీగా నుండిన రెవ. ఎడ్వర్డ్ పి. రైస్‌గారు పురుషోత్తముగారి విరచిత క్రైస్తవ నీతి ప్రకాశమందలి పద్యముల విషయము బళ్ళారి క్రైస్తవుల ద్వారా విని ఆయన చరిత్ర ప్రచురింపదలచి కటకపురికి ఉత్తరములు వ్రాసిరి. ఆయన కుమారులైన మార్తాబర్దరు గారి బలవంతము చేత తమకు జ్ఞాపకమున్న విషయములన్నిటిని పురుషోత్తముగారు చెప్పుచురాగా జేమ్సు చిన్నయ్యగారు వానిని జ్ఞాపిక రూపమున వ్రాసి యొక ప్రతి రెవ. రైస్ గారికి పంపించిరి. ఆలాగు జరిగియుండనియెడల నీ చరిత్రమందలి యనేక విషయములు తారీకులతో ఇదమిద్ధమనిచెప్ప సాహసింప వీలుండి యుండకపోవును. ఇది పురుషోత్తముచౌధరిగారు యొనర్చిన యింకొక యమూల్య సేవ. ఈ విషయమును గూర్చి రెవ. ఎడ్వర్డు. పి. రైస్‌గారు బి.ఎ, యీ గ్రంథకర్త కొక పర్యాయము వ్రాసియుండిరి.

జరాభారము, నేత్రావరోధముగల యొక క్రీస్తుభక్తుని అనుసంధాన సుఖమెటులనుండునో యనుభవవేద్యులే గ్రహింపగలరు. లాంగ్ ఫెల్లోయను ఆంగ్లకవి వ్రాసిన జీవనగీతమును పురుషోత్తముగారి విరచితమైన నిమ్నలిఖిత(క్రింద వ్రాయబడిన) పరమగీతమును భావసౌష్టవమున, ఆత్మీయ మాధుర్యమున, భావినిరీక్షణమున నెటుల హృద్యమో పాఠకులు గమనించెదరుగాక! **"సకలేంద్రియములారా – చాలా మీపనితీరె"** యను కీర్తన వ్రాసిన పరిస్థితులలోనే క్రింది కీర్తనయు పురుషోత్తముతచౌధరిగారు ఆసున జెప్పుచుండ వారి కుమారైచే వ్రాయబడెను.

## ప్రాణప్రయాన అంత్యగీతము

రా – యదుకుల కాంభోజి తా – ఆది

పైనమై యున్నా నయ్యా నీ – పాదాంబుజముల సన్నిధికి – ప్రభు యేసు నాతో నుండవే నీవు = దీనుడ భవ దా – దీనుడ నను గృప – తో నడిపించు మె – దుటనదె సింహ – ధ్వానముతో మృతి వచ్చుచున్నది – దాని భయోత్పా –తము దొలగింపవె ॥పైనమై॥

1. సరణిలో నే బోవునపుడు –శ్రమ లెన్నెన్నో చనుదెంచి నా – పరుగు కడ్డముగా నిలుచునేమో = మరణపు ముళ్లను – విరుచుటకును ద – ద్దురవస్థలు వెస – దొలగించచుటకును – గరుణానిధి నా – సరస నుండుమీ – శరణాగతునకు – మరి దిక్కెవ్వరు ॥పైనమై॥

2. దేవా నీ దక్షిణ హస్తముతో – దీనులను బట్టెద వెరవకుడను – నీ వాగ్ధత్తమున కిది సమయంబు = ఆ వచనము నా – జీవాధారము – దైవము తల్లియు దండ్రియు దాతవు – నీవే సర్వము – నిను నమ్మితి నా – త్రోవ ప్రయాణము – తుదముట్టించుము ॥పైనమై॥

3. పొందుగా నీ భక్తియందు – డెంద మానందించు నపుడు – సందియము లెన్నెన్నో చనుదెంచి – తొందర నిడు నా – త్రోవను తద్గా – ఢాంధత మిశ్రమ – లణగించుటకై –సుందరమగు రవి – చందంబున – నా ముందట నడువవే – ముదమున బ్రభువా ॥పైనమై॥

4. కాలం బయ్యెను రారమ్మనుచు – నీలమేఘాకృతితో వచ్చి – కాలదండము జిరజిర ద్రిప్పుచు = చాల భయానక – లీలన్ మృత్యువు – మ్రోల న్నిలిచిన వేళను దాలిమి – దూలి చనుంగా – బోలు భవత్కరు – ణాలింగన సుఖ – మత్తణి నొసగవె ॥పైనమై॥

5. నీ దివ్య రూపధ్యానంబు – నిర్మలాత్మాంతర సౌఖ్యంబు – నా దేవుని ప్రేమామృతసారంబు = నీ దాసుని కవి – నిరత మొసంగుచు – నా దారిని గల – సేదలు దీర్చను – నాదియు మధ్యము – నంతములేని పు – నాదులుగల నీ – సౌధము జేర్పవె ॥పైనమై॥

6. ఎండమావుల కీడైనట్టి – యీహ సౌఖ్యములు త్వరగా బోవు నీ – నిందు దరుగని నిత్యానందంబు = దండిగ నీయం – దుండిన వారి క – ఖండామృత సౌ – ఖ్యము లిచ్చేదవట – తండ్రీ పురుషోత్తము దాసుని నీ – వుండిన చోటనె – యుంచుము చాలును ॥పైనమై॥

ఈ కీర్తన 1884 వ సం॥ సెప్టెంబరు నెల "హితవాది" లో ప్రచురింపబడినది. ఇదియే వారు చెప్పిన ప్రాణప్రయాయణ గీతము. ఇది మొదలు తరుచుగా తమ శాశ్వతానందధామము జేరుటకు పురుషోత్తముచౌధరిగారు దినమొక యేడుగా భావించి వేచియుండెను. నిజముగా పౌలు వలె ఆయన **"మంచి పోరాటము పోరాడితిని; విశ్వాసము కాపాడు కొంటిని; నా పరుగు కడముట్టించితిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించువారి కందరికిని అనుగ్రహించును." (2 తిమోతి 4: 7–8)**

చ. "కలిగెగదా మదాత్మకృత కల్మషదౌత పవిత్రరక్తమున్
గలిగెగదా భవత్కరుణ కారణజీవన మంతరాత్మలో
గలిగెగదా త్వదంఘ్రియుగ కౌశలభక్తికి శక్తియుక్తులున్
గలిగెగదా సదామదిసుఖంబఖిలంబును యేసునాయకా!"

అని పురుషోత్తముచౌధరిగారు నితాంతశాంతియుత ఆనందకందళిత హృదయారవిందులై మోక్షప్రవేశమునకై ప్రతిక్షణము ప్రతీక్షించుచుండ, 1890వ సం॥ ఆగష్టు నెల 23 వ తేది రాత్రి ఒంటిగంట కాయన తన 87వ యేట నిహలోక ప్రయాణము ముగించి మూసిన నేత్రద్వయమును పరిశుద్ధ ప్రభాభాసురమై శాశ్వతానందదాయకమైన పరలోక ప్రవేశ ద్వారమున విప్పగా జయజయ ధ్వనులతో దేవదూతలు భక్త బృందముతో గూడ ఆయనను ఆ దేదీప్యమానపురమునకు నడిపించుచు పురుషోత్తముచౌధరిగారి విరచితమైయున్న కీర్తన నీ క్రిందిరీతి, పాడిరని మనమూహింపవచ్చును.

## పరమపుర వర్ణనము

### (చాయ : నీకన్న యిక వేరె)

రా - మారుమ తా - త్రిపుట

పరిశుద్ధి పరిశుద్ధి - పరిశుద్ధి యని విన - బడు పుర మదిగో - పద పదరే ప్రియులారా = పరమేశ్వరుని చేత - బరిపాలనము గల్గి - చిరమై భాసురమై సు - స్థిరమై సుందరమైన ॥పరిశుద్ధి॥

1. రవితోను కుముదబాం - ధవుతోను మఱి దీప - చ్ఛవితోను దాని కవ - సరమింతలేదు = ఆవిరతమున గ్రీస్తు - డందుండు ప్రభతో సం - స్తవమై వైభవమై యు - త్సవమై వెల్గుచు నుండు ॥పరిశుద్ధి॥

2. గొౕదయైన మఱియే యా - పదయైన దగయైన - మొదలే లేకుండు నప్పురవాసులందు = మృదు జీవోదకము ల - ర్మిలి నిరంతర మిచ్చు - గుదురుగ నెదురుగ - గూర్చుండి యువరాజు ॥పరిశుద్ధి॥

3. ప్రభు కృపాసనములో పలినుండి ప్రవహించి - శుభమైన నదియుండి సుఖమిచ్చు నచట = నుభయ తీరములందు - నుండు వృక్షములు సౌ - రభదీప్తి శుభములై - రక్షా ఫలము లిచ్చు ॥పరిశుద్ధి॥

4. జననంబు మరణంబు - సంసార సుఖబాధ - లనుభవించుట గల్గ - దా పురమునందు = మును నీతి కొఱ కాప - దను బొందు తనవారి - కనునీళ్లన్నియు దుడుచు - మన దేవు డందుండి ॥పరిశుద్ధి॥

5. వెలకంద రానిని - శ్చలమైన ఘన జీవ - విలసత్కిరీటము - ల్గలవప్పురమున = బిలిచి నప్పుడె విభుని - పెండ్లి విందున కేగు - కుల బంధువులకు ని - చ్చల నిచ్చు దేవుండు ॥పరిశుద్ధి॥

మరియు

కం॥ ఇలనీకిచ్చిన కార్యం
బులననిన యొనర్చి శత్రు - వుల రణమందున్
గెలిచితినిగ నతులిత సుఖ
ములు, మౌళియు వడయరమ్ము - మోక్షపురమునన్

అని యా దూతగణంబు లాయనను ముక్తినాధుడగు యేసుప్రభువు ముందుట నిలువబెట్టగా నా ప్రభువు **"భళా! విశ్వాస పాత్రుడవైన దాసా!** యని యా యనను జేర బిలిచి నిత్య విశ్రాంతిని జేర్చుకొనెను.

పురుషోత్తముచౌధరి గారిట్లు తన 87 వ యేట పరలోక ప్రాప్తులు కాగా ఆయన భౌతికకాయమును కటకపురి క్రైస్తవుల ప్రేత స్థలమున 2000 మంది జనము వరకు వెళ్ళి ఖననము చేసిరి. అత్తరి రెవరెండ్ సేంసాహుబాబుగారు ఉత్కళభాషలో అంత్యక్రియలు జరిగించిరి.

## మిషనెరీల సాక్ష్యము :-

ఆ సందర్భమును గురించి కటకపురి మిషనెరీలగు రెవ. విల్లియం మిల్లరుగారును, రెవ.టి బెయిలీ దొరగారును 1890 వ సంవత్సరము ఒరిస్సా బాప్టిస్టు మిషన్ రిపోర్టులో నీ క్రింది విధమున వ్రాసియున్నారు.

Rev. W.Miller writes : "I had much Christian intercourse with Bro. Purushottam in his declining years and last illness; his end was eminently peaceful. Three times I was summoned when it was supposed he was dying, but he revived for a while.On my last visit he remarked prayfully, I sometimes think the Lord has forgotten me; He seems so long in coming. His death was that of the rightious, and his memory is fragrant and precious to all who knew him."

రెవ. డబ్లియు. మిల్లరుదొరగారు పురుషోత్తముచౌధరిగారి యంత్యమును గూర్చి వ్రాసినదేమన "సోదరులగు పురుషోత్తమకవి క్షీణ సంవత్సరములలో అవసానకాల

వ్యాధిలోను వారితోనే నెక్కువ క్రైస్తవ సహవాసము కలిగియుంటిని. వారి యంత్యదశ అత్యంత శాంతవంతమైనది. ఆయన కాలము చేయుచున్నారని తలంచినప్పుడు ముమ్మారు నాకు పిలుపు వచ్చెను. అయితే తిరిగి కొద్దితడవు ఆయన తెమ్మదేరెను. నేను చివరిసారి వెళ్ళినప్పుడాయన " ప్రభువు నన్ను మరిచి పోయినాడేమో యని నేను కొన్నిసార్లు తలంచుచున్నాను. ఆయన రాకుండా యెంత ఆలస్యము చేయుచున్నాడో చూడండి'' యని ఛలోక్తి నాతో ననిరి. ఆయన మరణము నీతిమంతుల మరణమువంటిది. ఆయన నెరిగిన వారెల్లరకు ఆయన స్మారకము సౌరభసమమును అమూల్యమునైనది.

Rev. T. Baily wirtes :- "In the death of Purushottam Choudhuri, a notable member of the native Chirstian community has passed away.......... There is a small Telugu congregation in Cuttack to which our brother ministerd with great acceptance as long as strength permitted, but he is known to us principally for his labours in Oriya, and in this language also he was a persuasive preacher, though the sweetness and pathos of his prayers is more especially dwelt upon by those who were accustomed to hear him....." Our brother was light in complexion with fine features and figure, peaceable in disposition and very courtious in manners, one of natures true gentleman."

*రెవ.టి బెయిలీ దొరగారు వ్రాసియున్న దేమన "పురుషోత్తముచౌధరిగారి వియోగముతో దేశీయ క్రైస్తవ సంఘమున నొక సుప్రసిద్ధ సభ్యుడు గతించిపోయెను. కటకములో నొక చిన్న ఆంధ్ర క్రైస్తవ సంఘమున్నది. మన సోదరుడు మహాదరముతో బలమున్నంత వరకు దాని సేవ నొనర్చెను. అయితే యాయన ప్రాముఖ్యముగా ఒరియా భాషలో చేసిన సేవను మే మెరుగుదుము. ఈ భాషలో గూడ నీయన మనోరంజక బోధకుడై యుండెను. ఆయన ప్రార్థనల యొక్క మాధుర్యత దైన్యత వానిని వినువారు ముఖ్యముగ నెన్నువారు...... మన సోదరుడు కాంతివంతమైన దేహచ్ఛాయ గలిగిన స్ఫురద్రూపి, శాంతవంతుడు, ప్రకృతి జన్యమాన్యుడు."

*Orissa Mission Report for 1890.

# 14. అధ్యాయము

పురుషోత్తముచౌధరిగారి నూరేండ్ల సేవా ఫలితము; జ్ఞాపకమందిర నిర్మాణము; ఆయన సంఘకీర్తనలు, శతకములు పత్రికలు మున్నగువాని వ్యాప్తి; అముద్రిత గ్రంథములు అభిప్రాయములు, శతవత్సరజ్ఞాపిక.

**"అతడు మృతినొందియు........ మాట్లాడుచున్నాడు" హెబ్రి 11: 4.**

---♦--- ♦---♦---

## సింహావలోకనము :-

మనమిప్పుడు గత శతవత్సరముల సింహావలోకనము చేయుదుము. ఈ ప్రదేశమున మిషనెరీలేని కాలమున పురుషోత్తము చౌధరిగారికి 1825వ సం॥ 9వ నెంబరు పత్రికవల్లనే ఆయన యేసు ప్రభువువారి రక్షణమార్గము విషయము తెలిసికొనగలిగెనుగదా! దానిని బహుశ సిరంపురమున విల్లియం కేరీదొరగారు ఆ కాలమున వ్రాయించి, యచ్చటనే యచ్చువేయించి, యుందురు. నేటికిని దాని దాచియున్నాము. పురుషోత్తముచౌధరిగారు సువార్త వినిపింపబడిన ప్రతిప్రదేశమున కటకము, పూరీలనుండి బళ్ళారి వరకు నేడనేక సంఘములు ఉన్నవి. ఆయన వలన సువార్త విని ప్రభువు నెరిగిన కుటుంబములేమి ఆయన వ్రాసిన కీర్తనలు, పత్రికలు పద్యకావ్యములు చదివి మేలుపొందిన వారేమి యసంఖ్యాకులు కలరు.

ధూమగూడెము ప్రాంతమున పురుషోత్తముగారు **రక్షణ చరిత్రము** నొకయింటి చూరులో నుండుట కనుగొని, దానిని నిత్యము చదివి, ధ్యానించి యొక హిందువుడు భక్తిగల క్రైస్తవుడాయెనని ఆ యూరినుండి యొకరు వ్రాసియుండిరి.

ఒక గ్రద్ద తన గూటిలోనికి ఎత్తుకొనపోయిన **రక్షణ చరిత్రము**గోదావరిజిల్లాలో నొక వర్తకుని యింటియెదుట పడగా నతడు దాని దీసికొని చదువుకొనుచు పూర్వమొకప్పుడు రాజమహేంద్రవరమునకు బోయి, యచ్చటి క్రైస్తవుల మూలమున దాని భావములు గ్రహించి మంచి క్రైస్తవుడాయెనని "సత్యదూత" పత్రికకొకప్పుడొకరు వ్రాసిరి. గుంటూరుజిల్లా యద్దనపుడి గ్రామములో శ్రీయుత పోదా రంగయ్యగారను కమ్మ భూస్వామి **క్రైస్తవ నీతిప్రకాశము** చదివినంతట క్రీస్తు నంగీకరింప సాహసముగలిగి

యిప్పుడు సువార్త ప్రచారకులుగ నున్నారని యాయన నొక సభలో దెల్పిరి. నేటికిని ఆయన లిఖిత పూర్వకమైన సేవ ఫలించుచు అనేకుల కెటుల ఆత్మానందదాయకమై యున్నదియో ఇక మీదట వచ్చు అభిప్రాయావళిలో దెల్లమగును.

ఇప్పుడు దేవుని నిమిత్తము మహత్కార్యములు తలపెట్టి దేవుని యొద్దనుండి మహద్వరమును పొందినవిధము ఈ పురుషోత్తమగారు, అంతర్వేదిదాసుల జ్ఞాపక భవనపక్షమున నెటుల నెరవేరెనో పాఠకులు గ్రహింపగలరు.

**జ్ఞాపకమందిర చరిత్ర:-**

1901 వ సం॥ నేను పురుషోత్తముగారి చరిత్ర ప్రచురించి, మరుసటి సంవత్సరము కటకపురి బోయి అంతర్వేదిదాసుగారి చరిత్రాంశములను సంపాదించిన వెనుక వారిద్దరి పటములు ప్రతిసంఘములో నుంచిన బాగుండునని మొదట రెవ.ఐ.సి ఆర్చిబాల్డ్ ఎం.ఎ గారికి రెవ. ఆర్. శాన్ఫర్డు ఎం.ఏ; డి.డి గారికి, మరికొందరికి వ్రాసి వారి యామోదము వడసితిని. కాని క్రొక్కారు మెరుంగు తెరంగున 1903 వ సంవత్సరము మే నెలలో వారిద్దరి పేరనొక జ్ఞాపక భవనము కట్టుట మరింత సమంజసముగ నుండునను ఒక తలంపు పుట్టినది. అప్పుడు నేనొక యర్జీ వ్రాసి శ్రీ బొబ్బలి మహారాజా గారి కార్యదర్శియు, నా యొద్ద ఆంధ్రభాష గరచుచుండి నట్టియు ఎఫ్. డబ్లియు. డిట్మస్ దొరగారి చేవ్రాలందుగైకొని ఆ నెల 7 తేదిని విజయనగరము చేరి, రెవ. ఆర్. శాన్ఫర్డు ఎం.ఏ డి.డి దొరగారికి నా యుద్ధేశము తెలిపి, వారియామోదము వడసితిని. ఆ నెల 12వ తేదీని పర్లాకిమిడిలో ఎస్. జేకబు గారి యింట విందారగించుచుండ నాపంక్తిలోనున్న డాక్టరు పి. దేవదత్తము గారితో జ్ఞాపక భవనమువిషయము చెప్పగా వారత్యంత సంతోషభరితులై తమ వంతు నూరు రూప్యములు వాగ్దానమిడిరి. కొందరు నిరుత్సాపరచిరి. అయినను నేను ప్రార్థనయే జయమిచ్చునని సర్వభారము పరమపితయగు దేవుని పై వేసి యా సంవత్సరము జూన్ 16 వ తేదిని శ్రీకాకుళములో జరిగిన మిషనెరీ కాన్ఫరెన్సువారికి నా యభిప్రాయము రెవ.డబ్లియు. వి.హిగ్గిన్సు బి.ఏ. డి. డి దొరగారి ద్వారా తెలియ బరచితిని. వారు తమ యామోదభావమును జూలై 21 వ తేదిన యుత్తరము ద్వారా నాకు దెలిజేయుచు అది స్వదేశోద్యమముగ నుండ వలెనని ప్రేరేపించిరి. నా చేత పైకము లేకుండినను కొన్ని నివేదనా పత్రములు

చెన్నపురిలో అచ్చువేయించితిని. ఆ బంగీ వచ్చి యుండెను. బొబ్బిలి మిషన్ బాలికా పాఠశాలా ప్రధానోపాధ్యాయులగు తేజోమూర్తుల వేంకటేశముగారు పాఠశాలలో మాటయని నన్ను వసారాలోనికి బిలిచి, మీరుద్యమించిన భవన నిర్మాణమునకు దీనినుపయోగింపుడని నా చేత మూడు రూప్యములను బెట్టిరి.

వెంటనే నేను అచ్చువేయించిన నివేదనా పత్రములను బంగీనివిడిపించి, మిగిలిన కొన్ని యణాలతో స్టాంపులు కొని నివేదనములను కొన్ని చోట్లకు బంపించితిని. మొట్టమొదట పురుషోత్తముచౌధరిగారి శిష్యవర్గమునందలి మాదాబత్తుల బ్రహ్మాజీగారు, బాసాని అప్పడు గారు మున్నగు వారు రు 35, 10 లు నా పేర బంపిరి. బాపట్ల క్రైస్తవ సంఘమువారును తోడ్పడిరి. ఈ విధముగ నేను దాదాపు మూడువందల రూప్యముల విరాళములు చేర్చగలిగితిని. 1904 సం॥ జనువరి నెలలో పర్లాకిమిడిలో జరిగిన క్రైస్తవ మహాసభలో రెవ. పి. డేవిడ్ గారి ద్వారా ఒక నిర్ధారణ తీసికొని వచ్చితిని. అంతర్వేదిదాసుగారు, పురుషోత్తముగారు వ్రాసిన కులాచార పరీక్ష చదివి ప్రధమములో ప్రభువును తెలిసికొని యుండినందునను, పర్లాకిమిడి ప్రదేశములో ఆయన పురుషోత్తముచౌధరితో సంచారముసల్పి కొందరికి స్నానమిచ్చి యుండినందునను సంఘస్థాపన గావించి యుండినందునను కట్టబోవు జ్ఞాపకభవనమునకు వారి పేరుకూడ జేర్చుట సమంజమని వారిద్దరి పేరిట నా జ్ఞాపకభవనముండుటకు ఎల్లరు సమ్మతించిరి. రెవ.ఐ.సి. ఆర్చిబాల్డు ఎం.ఏ గారికిని రెవ. పురుషోత్తముచౌధరికగారికిని వారికీర్తనల విషయము ఉత్తరప్రత్యురముల సంబంధము, అభిమానమునుండుట చేత వారు నాయకులుగాగల యొక కమిటి నిర్ణయించి అందు నేను ప్రచ్ఛనుడనైన సభ్యునిగా మాత్రముంటిని. అయినను నేనప్పుడు జవసత్వములుగలిగి యుండినందున నీ జ్ఞాపకభవన నిర్మాణమ నిమిత్తము ఆర్చిబాల్డు దొరగారికేమి, యితర అభిమాన వర్గమునకేమి వందలకొలది యుత్తరములు వ్రాయవలసివచ్చెను.

కమిటిలో నుండిన వారలు దూరదూరము వ్యాపించియుండరి. ఒరిస్సా మిషన్ వారును, అమెరికన్ బాప్టిస్టుమిషన్ వారును లండన్‌మిషన్ వారును, తదితర మిషన్‌ల వారును పురుషోత్తముచౌధరిగారి కీర్తనల ద్వారా వారిని బాగుగ నెరిగినవారు కావున ధారాళవిరాళములలొసంగుచువచ్చిరి. చాలా సంఘములును కూడ సహాయ మొనర్చెను.

శ్రీకాకుళవాస్తవ్యులైన రెవరెండు ఐ.సి. ఆర్చిబాల్డ్ దొరగారు విసువు విరామము లేకుండా రాత్రిదివసములు చాలా మందితో నుత్తరప్రత్యుత్తరములు సల్పి చాలా నివేదనములు పంపుచూవచ్చిరి. వారి యప్పటి సహాయకులలలో బి. సుబ్బారాయుడుగారు, రెవ.పి.జగన్నాయకులుగారు, డి. అమృతలాల్‌గారు. రెవ.డి.వి జగన్నాథరావు గారు వ్రాతకోతలలో వారికి జాల సహాయకారులుగ నుండిరి.

పురుషోత్తముచౌధరిగారి జన్మప్రదేశమగు పర్లాకిమిడి శ్రీరాజాగారి కళాశాల పడమటి యావరణ గోడ ననుసరించియున్న యొక తోటను కనేడియను మిషనువారు కొనియుండిరి. స్మారకమందిరమచ్చట గట్టిన యెడల ఆ నివేశనము నిచ్చెదమని రెవ. ఎచ్. వై. కోరే దొర గారు ఎం,ఏ చెప్పినందున ఆ పురముననే మందిరనిర్మాణము చేయుట సమంజసముగ నుండునని మెమోరియల్ హాలు కమిటీవారికి దోచెను. ఇందులో దైవ నిర్ణయముండినటుల అంతర్వేదిదాసుగారు, పురుషోత్తముగారు ఒకరికొకరు వ్రాసికొనియుండిన యుత్తరములు ద్వారా ఆశ్చర్యముగ బయలుపడెను. 1879 సం॥ నవంబరు13 వ తేదీని రంగూనుండి అంతర్వేదిదాసు కటకపురియందలి పురుషోత్తముచౌధరి కొక యుత్తరము వ్రాయుచు, అందు తానుండిన 41 వ స్వదేశ పటాలము పగులగొట్టిన యెడల తాము పర్లాకిమిడిలో స్థావర మేర్పచుకొని సువార్త భేరీ మ్రోగజేయ నపేక్షయుండినటుల దెల్పియున్నారు. ఈ యుత్తరము 1902 సం॥ మే నెలలో నేను కటకపురి వెళ్ళగా పురుషోత్తముగారి పెట్టెలలో లభించెను. దీనికి పురుషోత్తముచౌధరిగారు 1879 డిశంబరు 12 తేదిని ప్రత్యుత్తరమిచ్చుచు ఆలాగే పర్లాకిమిడి మిత్రుడు అంతర్వేదిగారు వచ్చునపుడు తానును వారితో నేకీభవించి యా ప్రదేశమున శుభవర్తమానవ్యాప్తి జేయ గుతూహలము తమకు గలదని వ్రాసియుండిరి. 1905 సం॥ జూలై నెల 17 వ తేదిని నేను నెల్లూరువెళ్ళి రెవ. అంతర్వేది దాసుగారి మనుమలైన ఆర్. పరంజ్యోతిగారి పుస్తక భాండాగారమున వెదకుచుండగా, పురుషోత్తముచౌధరిగారు అంతర్వేది దాసుగారుకు వ్రాసిన ప్రత్యుత్తరము దొరికెను. వీరి వాంఛితముల నెరిగియుండిన పరాత్పరుడే యీ యపూర్వ సంఘటనము యొక్క అపూర్వ జ్ఞానమును మెమోరియలు హాలు కమిటీవారి కొసగినందున ఈ యుత్తరములందలి యభిప్రాయము లెరుగకయే వారలు పర్లాకిమిడిలోనే జ్ఞాపకమందిరము నిర్మింప నిశ్చయించిరి.

**శంఖుస్థాపనము :-**

1905 వ సంవత్సరము ఆగష్టు 4 తేదిని పర్లాకిమిడి మిషన్ బంగళాలో ఆయా సంఘముల ప్రతినిధులు చేరియుండ పి. వీరాచార్యులుగారు కాలక్షేప ఫక్కిని పురుషోత్తము గారి జీవితచరిత్రమును జెప్పుచు ఆయన 1833 వ సంవత్సరము లో వ్రాసిన **"మా యేసుక్రీస్తుని మరుగు గల్గెనురా"** యను కీర్తన పాడుచు భావము వివరించి ఆలాగే అంతర్వేదిగారి చరిత్రము డాక్టరు పి.దేవదత్తము గారిచే వినిపింపబడెను. పై రెండుత్తరములు ఈ గ్రంథకర్త చదువగా, ఆ భక్తులు పర్లాకిమిడిలో బని చేయగోరి చేసియుండిన ప్రార్థనలకు ప్రత్యుత్తరముగా ఈ స్థలనిర్దేశముకూడ జరిగినదని సభాసదులాశ్చర్య మగ్నమానసులైరి. ఆ సభానంతరము అంతర్వేదిగారి సంఘపక్షమున డాక్టరు పోలదాస్ దేవదత్తముగారును, కటకపురినుండి వచ్చియుండిన పురుషోత్తముగారి మనుమలగు బాబూ డానియేల్ చౌధరిగారును (సీనియర్) బహుజనములముందర దైవారాధనానంతరము శంఖుస్థాపన గావించిరి అత్తరి జ్ఞాపక భవన నిర్మాణోద్యమ ప్రారంభకులగు నీ గ్రంథకర్తయు కమిటి అధ్యక్షులగు లేటు రెవ. ఐ.సి ఆర్చిబాల్డ్ దొరగారును స్థానిక మిషనెరీలును, రెవ.జార్జి చర్చిలు దొరగారును పార్వతీపురము దరి బెల్గాము జమిందారులును వారియుపాధ్యాయులగు ఇ.కనకాచలం ఎం.ఏ గారును డా॥గిడుగు రామమూర్తి పంతులు బి.ఏ గారును ఆ మహోత్సవ దర్శనాగతులలో నుండిరి.

**చందాదారులు :-**

ఈ జ్ఞాపక మందిరము ఇంగ్లీషులోని T అక్షరము తిరుగవేసినట్టులుండి మధ్యగదిపొడవు 48 అడుగులు, వెడల్పు 23న్నర అడుగులును ప్రక్క రెక్కగదులొక్కొక్కటి 23న్నర × 18 అడుగులును ఉండును. ప్రవేశద్వారపు దర్వాజా (ఆర్చి) 18 అడుగుల వెడల్పు గలది. ఇనుప దూలములమీద వర్తులాకారమున (ఆర్చివలె) భవన మంతటికి నాదువేయబడినది ఈ మందిరపు గోడలుమాత్రము లేచి పై కప్పునకు ధనము చాలకుండినపుడు నేను యొకనాడు బొబ్బిలిపురి నుండి పర్లాకిమిడిలో జేరి ఆ గోడల మధ్యమున నిల్చి నెహెమ్యావలె బోరున నేడ్చి, దాని పరిసమాప్తికై ధనసహాయము నిమిత్తము ప్రభువును నివేదించాను. ఆ ప్రకారము చేసిన ప్రార్థనకు వచ్చిన ప్రత్యుత్తరములవల్ల నీ జ్ఞాపక మందిరము పరిసమాప్తి నొందెను. దాని గోపురము

రెవ.బి. సుబ్బారాయుడు గారిపై విచారణత్వమున నిర్మింపబడెను. మందిరమునకైన ధనసంపాదనమునకును, ఈ భక్తవరులిద్దరి చరిత్రాంశ సంపాదనమునకును కటకపురికి ఒకవైపును, నెల్లూరికి ఇంకొక వైపును నేను ప్రయాణములు చేయవలసివచ్చెను. సికందరాబాదులో లేటు సుబేదారు జి. సామ్యేలుగారు చాలా ప్రయాసముతో రు. 400 ల వరకు సంపాదించిరి. మా కుటుంబమువారు కొంత సహాయము చేసిరి. పురుషోత్తముచౌధరిగారి తైలఛాయా (ఆయిల్ పెయింటింగు) పటము ఇ. ఆగస్టయిన్ అను క్రైస్తవుడు చెన్నపురిలో చిత్రింపగా, నందు మూడవ వంతు వ్యయము ఆయన శిష్యులయిన బాసాని అప్పడుగారు భరించిరి; కొంత బాబు సీనియర్ జాన్ చౌధరీగారు కటకమునుండి పంపించిరి.నెల్లూరులోని టెన్‌కేట్ మిశమ్మగారు 50 రూప్యములు వాగ్ధానమిడి బహుశ నేరుగా రెవ. ఆర్చిబాల్డ్ దొరగారికే పంపియుండిరి. పూర్వము అంతర్వేదిగారి సంఘమునకు జెందిన డాక్టరు పి. దేవదత్తముగారు, యం. సుదర్శనముగారు నూరేసి రూప్యములు లిచ్చిరి. రావుసాహెబ్ డాక్టరు. టి. నారాయణస్వామినాయుడుగారు, డాక్టరు ఎం.రాజారావుదాసుగారు, డాక్టరు పేరింబంగారు (తిరునేల్వేలి), దివాన్ బహద్దర్ విల్లియం వేంకటరామయ్యగారు బి.ఏ.బి.ఏల్ (జిల్లాజడ్జీ), జేమ్సు ఎం. భక్తుల్‌గారు బి.ఏ, ఎల్.టి లాలా గోకులదాస్ గారు బి.ఏ, రెవ. ఎం. ప్రకాశంగారు, ఇమాంది జాన్‌గారు, రెవ. మెక్ఫార్లిన్‌గారు (లండన్‌మిషన్), మరికొందరు చందాలు జమ చేయుటలో మంచి సహాయముచేసిరి.కనేడియన్‌మిషన్ సొసైటీలు రు 500 లకు పైగా సహాయ మొనర్చెను. ఒరిస్సా మిషన్‌వారు కొంచము సహాయము చేసిరి. పది రూప్యములకు పై మొత్తమిచ్చిన మిషనెరీలలో రెవ.ఆర్.ఇ.స్మీత్, బి.ఏ, బి.టి.ఏచ్. (కేప్టన్). ఎం. రాబిన్‌సన్ దొరసాని, డాక్టరు హ్యాలెట్ మిశమ్మ, రెవ.ఐ.సి ఆర్చిబాల్డ్ ఎం.ఏ, ఎం ఇ, ఆర్చిబాల్డ్ దొరసాని ఎం.ఏ, పెక్ మిశమ్మ, ఎం.ఇ.హారిసన్ మిశమ్మ, రెవ.ఆర్.ఇ. గల్లిసన్ ఎం.ఏ.డి.డి గార్లున్నారు. రెవ.ఎచ్.వై కోరే దొరగారు ఎం ఏ 150రూప్యములిచ్చిరి.పర్లాకిమిడి బాప్టిస్టు సంఘమువారన్ని సంఘములకన్న నెక్కువ అనగా రు183 లిచ్చిరి. బొబ్బిలి, పాలకొండ, విజయనగరము, భీమునిపట్టణము, శ్రీకాకుళము, టెక్కలి, ఆకులతంపర, పిఠాపురము, సామర్లకోట, పెద్దాపురము, ఎలమంచిలి, కాకినాడ, ఉయ్యూరు, రామచంద్రపురము, మున్నగు సంఘముల వారును విరాళము పంపించిరి.

ఇచ్ఛాపురము వాస్తవ్యులు మహమ్మద్ ఫజిల్ గారు రు 25 లిచ్చిరి. మహమ్మదీయులలో నీరొక్కరే యీ సహాయమొనర్చిరి. కలకత్తాలో గార్డుగానున్న డేవిడ్.స్మిత్‌గారి సతీమణి మంచి సహాయము పంపిరి. చందాలిచ్చిన వారి పట్టిక యొకటి పర్లాకిమిడి వాస్తవ్యులు రెవ.ఎస్. సి. ఫ్రీమన్ బి.ఏ గారి యొద్ద నున్నది. గ్రంథ విస్తర భీతిచే దాని నిందు బొందుపరుపలేదు. ఈ విధమున ప్రార్థనతో నారంభించిన యీ సత్కార్యమునకు భక్తవరుల సహాయముతో జేరిన రాబడి *రు 4,177 ల వ్యయముతో మన పెద్దలగు పురుషోత్తముచౌధరిగారి యొక్కయు, వారి స్నేహితులగు దాసు అంతర్వేదిగారి యొక్కయు జ్ఞాపక భవనము దీపించెను. దీని నిర్మాణకార్యమున రెవ. జే.ఏ గ్లెండనింగు దొరగారును, సుక్రియా బెహరాగారును, పురుషోత్తముచౌధరిగారి కుటుంబమువారును, వారి స్నేహితులును తోడ్పడుచు వచ్చిరి.

* See "The Enterpriser"

## జ్ఞాపక భవన ప్రతిష్ఠ:-

ఈ భవనమున ఆ భక్త వరుల ఛాయాపటములుంచబడెను. అందు అంతర్వేది దాసుగారి పటము చెన్నపురిలో మెస్సర్సు రఘుపతి వెంకయ్య బ్రదర్సు వారిచే చిత్రిపంబడెను. 1908 వ సం॥ ఆగష్టు నెల 16 వ తేది పై జ్ఞాపక భవన ప్రతిష్ఠ దినముగా నేర్పరుపబడగా 11 గురు మిషనెరీలును, ఆయా సంఘముల ప్రతినిధులును వచ్చియుండిరి. దూరస్థలమగు సికిందరాబాదు నుండి సుబేదార్ జి. సామ్యేలుగారు, సామర్లకోట సెమినరీనుండి రెవ. ఎన్ ఆబ్రహాముగారును, రామచంద్రపురమునుండి రెవ. డాక్టరు. జే.ఆర్. స్టిల్వెల్ దొరగారును, నూరేసి రూప్యములు చందాలిచ్చిన డాక్టరు పి. దేవదత్తము, సబ్ మాజిస్ట్రేట్ ఎం. సుదర్శనంగార్లును, వారి కుటుంబములును హవల్దార్ ఎం. సత్తెన్న గారును, దాసు అంతర్వేదిగారి సంఘముల పక్షమున వచ్చియుండిరి. పురుషోత్తముచౌధరిగారి మనుమలు మనుమరాండ్రు అత్తరి సమామేశమైరి. దైవకృపచే నేనును రెవ.అర్చిబాల్డ్‌దొరగారును అత్తరి నుంటిమి.

## సంకల్ప సిద్ధి :-

1908 సం॥ ఆగస్టు 15 వ తేదీని శనివారము నాడును, ఆదివారమునాడును రెవ. బి. సుబ్బారాయుడు, రెవ.ఎన్. అబ్రాహాము గారును, ఎం. సుదర్శనంగారును దైవారాధనమున పాల్గొనిరి. రెవ.ఐ.సి ఆర్చిబాల్డ్ దొరగారిచ్చిన లెక్కలంగీకరింపబడి, మరి నాలుగు వందల రూప్యముల వరకు చందాలేచెను. 16 తేదిని రెవ.జాన్ రూపర్డు స్టిల్వెల్ డి.డి గారు భవనమున కుపక్రమణోత్సవము గావించుచు ప్రకటన 3:12 పై దివ్య ప్రసంగము చేసిరి. రెవ.ఎచ్. వై. కోరే దొరగారు ప్రతిష్ఠా ప్రార్థనము గావించిరి. ఆ మధ్యాహ్నము రెవ.కోరే దొరగారు ఎం.ఏ ప్రతిష్ఠాభిప్రాయములను గూర్చి ఆంధ్రమునను, రెవ. ఆర్చిబాల్డ్ దొరగారు "రక్షణ" యను నంశముపై ఆంగ్లభాషను ప్రసగించిరి.

17 వ తేది యుదయము డాక్టరు పి. దేవదత్తముగారి యాజమాన్యమున ఎం. సుదర్శనంగారు, రెవ.ఎన్ అబ్రహాము గారు అంతర్వేదిగారి చరిత్రమును, సుబేదార్ జి. సామ్యేల్ గారి యాజమాన్యమున ఆయనయు, రెవ.పి. డేవిడ్ గారును పురుషోత్తముగారి చరిత్రాంశములును, హవల్దార్ ఎం, సత్తెన్నగారు అంతర్వేది గారి చరిత్రాంశములను వివరించిరి. ఆ సాయంకాలము పురజనులు చేరియుండ రెవ. స్టిల్వెల్ దొరగారు మత సిద్ధాంతములను అంశము పై ఆంగ్లభాషను దివ్య ప్రసంగము చేసిరి. ఆ భక్తులిద్దరి యెడల గల ప్రేమచే నిట్లీ జ్ఞాపక భవనము మూర్తీభవించెను.

ఈ జ్ఞాపక భవన మిప్పుడు పర్లాకిమిడి బాప్టిస్టు సంఘము వారి యధీనమున నుంచబడియున్నది. అందువారు దైవారాధనలు జరిగించెదరు. కొన్ని వత్సరములయిన వెనుక ప్రస్తుతము పర్లాకిమిడి మూనిసిపలు మేనేజరుగనున్న కే. సన్నయ్యనాయుడు గారు ఈ భక్తవరులిద్దరి నామమొక చలువరాతి పై జెక్కించి దానిని మందిర వేదిక మీద భాగమున స్థాపింపజేసిరి. ఆ మందిరమున అభిమాను లెవరైనను వారి జననమరణముల తారీకులు గల రెండు తామ్ర లేక చంద్రకాంత శిలాఫలకములు క్రింది విధిని నిలుపవచ్చును.

| In memory of | In memory of |
| --- | --- |
| Rev. Purushottam chowdhuri | Rev D. Anthravedy of |
| the Immortal christian Poet | 41st.N.R.Baptist Churches |
| Born 5th Sep 1803 at | organizer of Churches |
| Madanapuram, Ganjam, | Born 1822 at Chittoor |
| Died 24th Aug, 1890 in | Died 9 th Dec 1881 at |
| cuttack . Rev,3:12 | Quillon. Rev.3:12 |

ఈ మందిరము రాతి కట్టడము ఉత్తరభాగము పొడిగించుకొన వీలున్నది. గోపురము మార్చి కట్టవలెను. అందుకొక మంచిగంట యావశ్యకము. దానికైన విరాళములు పర్లాకిమిడి లోని బాప్టిస్టు మిషనెరీకి బంపుచుండవలెను. ఈ జ్ఞాపక భవన నిర్మాణ సందర్భమున సుప్రసిద్ధ కవి కుటుంబమునకు జెందిన మండపాక పార్వతీశ్వరశాస్త్రీ బి.ఎ గారు అభినందన పద్యములు వ్రాసి పంపిరి.

మానవులను ఆయన సేవకై రక్షించి హెచ్చించు దైవ నిర్ణయములు వింతయినవి గదా! **విలియం కేరిగారు** శిరంపురములో అచ్చు వేయించిన లండన్‌మిషన్ సొసైటీవారి పత్రికలను, బైబిలు సొసైటీవారి బైబిలును ఆనాడు కేప్టేన్ నాట్ సతీమణియగు హెలెన్‌నాట్ దొరసానిగారి మూలకమునను పురుషోత్తముచౌధరిగారికి చేరి ఆయన రక్షింపబడుట ఆయన వ్రాసిన **కులాచార పరీక్ష** మూలమునను నొక అంతర్వేదిగారు వెలిగింపబడుట, ఆ ఆంతర్వేది గారి మూలకమునను కొక తామస్ గాబ్రియేల్ గారును, ఒక మాతంగి ఆది నారాయణగారు, ఒక డాక్టర్ నారాయణస్వామిగారు మున్నగు వారు లేచి సంఘములు స్థాపించుట, వారి మూలకమున కనేడియన్ మిషనెరీలు రాగలుగుట, యిదంతయు సంకల్పసిద్ధుడు, సర్వజ్ఞుడునగు యెహోవాదేవుని మహాకృపా నిర్ణయము కాక మరియేమియగును? ఈ అనుబంధము ఈ విధమున చరిత్రమున నంటియే యుండి ఆచంద్రార్కము ప్రభువు వచ్చు వరకునిల్చి యుండునని చరిత్ర ప్రీతిగలవారలు తెలిసికొనగలరు.

పురుషోత్తముచౌధరిగారు ఆయా కాలములో వ్రాసియుండిన కీర్తనల చారిత్రము ఆయా సందర్భములలో దెల్పియున్నాము. ఆయా స్థితిగతులలో ఆయన తన చిత్తమును దైవ చిత్తముతో సంలగ్నపరచుకొనినప్పుడు తమ దైన్యానుభవము ప్రకాశింప చేసికొనుటకు వాటిని వ్రాసికొనిరి. బంగాళీ, ఒరియాభాషలలో కవిత్వమునకు అంత్యనియమమే ప్రాధాన్యమనియు, ఆంధ్రభాషా కవిత్వము ఛందో బద్ధమైనది గనుక దానినే కృషి చేయవలెననియు పురుషోత్తముగారి యుద్దేశమై యుండినటుల వారి కుమారై మార్తా బర్డరు నాకు దెల్పిరి. ఆయన యుపయోగించిన పెద్ద యక్షరముల బంగాళీ బైబిలు కటకపురిలో నున్నది. ఆయన ఉత్కళ లిఖిత ప్రసంగములు మా యొద్దగలవు. ఉత్కళ భాషలోని కీర్తనవరుస నాయన **"ప్రేమసాగరుడు – ప్రేమస్వరూపుడు ప్రేమతో వచ్చె నీ భూమికి – యేసునామము గలిగె నా స్వామికి"** మొదలుగా గల రీతిని వ్రాసియుండిరి, అది 1883 వ సంవత్సరము జూలై నెల హితవాది పత్రికలో అచ్చుపడెను. బహుశ విశాఖపట్టణములోనుండిన యొక ధనికుడైన స్నేహితునికి బుద్ధిచెప్పుకు కాయన **"పోయెగ పోయెగ – కాలము వెళ్ళి పోయెగ"** అను కీర్తన వ్రాసియుండినటుల గనబడును.

**అభిప్రాయావళి :–**

పురుషోత్తముచౌధరిగారి కీర్తనల విషయము పద్యగద్యాదుల విషయమైన యభిప్రాయము లిందు గొన్ని పొందుబరుచుచున్నాము. కటకపురి యందుండిన లేటు రెవ. టి. బెయిలీ (Rev. T.Baily) గారిట్లు తమ రిపోర్టులో వ్రాసిరి.

" My late revered, the Rev.W.R.Stevenson M.A of Nottingham in a letter to me dated February 23rd, 1888 remarks " I was surprised to learn from the Rev. Dr. Lyman Jewett, one of the American Baptist Missonaries in the Telugu country, that Purushottam Choudhuri of the Orissa Mission, is the author of thirtyeight of the choicest Telugu hymns now in use and his name appears on the title page of Dawson's Telugu hymn book as having assisted Mr. Dawson in the preperation of that book."*

* Orissa Baptist Mission Report for the year 1890 P.39

“ఒక క్రొత్త తెలుగు కీర్తనల పుస్తక సంపాదకమున గుత్తి నివాసులగు రెవ. డబ్లియు డబ్లియు స్టీవెన్‌సన్ గారు కొన్ని కీర్తనల పట్టికలు నాకంపించి వాని రచించిన వారి నామములు పురుషోత్తమకవి యొద్దనుండి తెలియగోరగా అందు చాల కీర్తనలు తమవని వాని క్రింది మన సోదరుడు తమ పేరు చేర్చగలిగినారు. ఈ సేవకై వారు నూతన ముద్రణ ప్రతి యొకటి తమకు బంపింప గోరిరి. అది కొన్ని దినముల కందుననగా ఆయన నెమ్మదితో గతించిరి.

రెవ. ఎడ్వర్డ్ పి. రైస్ యిట్లు వ్రాసియున్నారు :- తమ తమ మత బోధకంటే సాహిత్య లిఖితములవల్ల ఆయన యెక్కువ జ్ఞాపకములో నుండి వాని ద్వారా **“ఆయన మృతులైనను మాట్లాడుచునే యుందురు.”**

1890 వ సం॥ ఒరిస్సా బాప్టిస్టుమిషన్ రిపోర్టు 10 వ పుటలో నిట్లు వ్రాసియున్నారు. “ The hymns were written more especially for his own pleasure and not for publication. and a glance at the titles shows that the peerless perfection and infinite love of Christ were the themes on which he most delighted to dwell” డాక్టరు. లిమెన్ జువెట్ (Dr. lyman Jewett.) దొరగారు తాము సమకూర్చిన ఆంధ్ర క్రైస్తవ సంఘ సంకీర్తనమునకై పురుషోత్తముచౌధరి పంపించిన కీర్తనలు “ప్రస్తుత వినియోగమున నున్న వానిలో నెన్నికయైన తెలుగు కీర్తనలు” (Choicest Telugu hymns now in use”) అని వ్రాసియున్నారు. డాక్టరు జే. ఏ . కర్టిస్ దొరగారిట్లు వ్రాయు చున్నారు “........ No hymns are so frequently sung in our meetings, and none contribute more to spirituality than those which bear the name Purushottam.” పురుషోత్తము పేరుగల కీర్తనలకన్న మరియే కీర్తనలైనను మా సభలో తరుచుగా పాడరు వానికన్న మరియేమియు ఆత్మీయ భావవ్యక్తిత్వము గలవికావు.”

వయోవృద్ధులు జ్ఞానవృద్ధులు, పరమభాగవతోత్తములునగు రెవ. కేనన్ ధన్నవాడ ఆనంతంగారు(బి.ఎ) 2-11-1933 లో బెంగుళూరు నుండి యిట్లు వ్రాసియుండిరి:- “.... పురుషోత్తమకవిని నేనెన్నడు చూచియుండలేదు గాని నేను ‘హితవాది’ యను మాసపత్రిక ప్రచురింపసాగిన దినములలో అనగా అరువది యేండ్ల క్రిందట ఆయన

నాకా సందర్భమున నొకటి రెండు లేఖలు వ్రాసి నన్ను ఆ యుద్యమము నందు హెచ్చరించిరి. అప్పుడప్పుడు పద్యములను కీర్తనలను పత్రికలలో బ్రచురింపబంపిరి. నేను వివాహము చేసుకున్న సంగతి విని కటకమునుండి యొక పట్టుచీర నా భార్యకు బంపిరి. వారీ శరీరము చాలించి బహు సంవత్సరములయినను ఆయన పేరు, ఆయన ఆంధ్ర క్రైస్తవులకు చేసిన మహోపకారము నేటికిని స్మరింపబడుచున్నది. ఆయన చెప్పిన కీర్తనలు ఆంధ్రక్రైస్తవ సంఘములన్నిటను పాడుచున్నారు. ఇతర కీర్తనలు వందలాది దరిమిలా నెవరెవరో రచించినను, పురుషోత్తముగారు కీర్తనలకు భక్తి రసమందుగాని మృదుమధుర రచనయందుగాని సరియయినవి రచించిన వారిప్పటికి వెలుబడలేదు. వారు రచించిన రక్షణ చరిత్రను నా చిన్న తనమునందు నాకు సంస్కృతాంధ్రములు నేర్పిన నా గురువుకిచ్చి, ఆయన అభిప్రాయము కోరగా ఆయన దానిని బొమ్మన పోతరాజు రచించిన ఆంధ్ర భాగవతమును బోల్చి ద్రాక్షపాక శైలి గలదయి యున్నదని చెప్పిరి. రమారమి తొంబది యేండ్లక్రిందట ఆయన రచించిన యేసునాయక శతకము, యేసుక్రీస్తు ప్రభో శతకము, పంచచామర పన్నములు, క్రైస్తవ నీతి ప్రకాశము అను నీ పర్యకావ్యములు చదివినవారు ఆ భక్తుడు తన ప్రియ రక్షకుని పాదపద్మముల సన్నిధిని వదలక యెట్లు తన యాత్మీయ జీవనము జీవించెనో గ్రహింపగలరు. ముఖ్యముగా తన పాపస్థితిని పూర్తిగా గ్రహించి యెంతగా విలపించెనో తనకు పాపక్షమ దొరుకువరకాదివ్య రక్షకుని నిలువవేసి “నన్నాశీర్వదించినగాని నిన్ను పోనియ్యనని యాకోబు పోరాడినట్టును, “అడుగుదాటి గదలనియ్యను, అభయమియ్యక నిన్ను విడువను”అని రామదాసు గారు పోరాడినట్టును ఈ భక్తుడు పోరాడి గెల్చెననో యీ శతకములలో గనిపెట్టగలరు. నేను బాలుడనైయున్న కాలమున నా బంధువులలో గొందరు దాశరధీశతకము, రామతారక శతకము మొదలగు శతకములను నిద్రలేవగానే మొదటి నుంచి చివరి వరకు పఠించగా వినుచుంటిని; అదేవిధముగా మన ఆంధ్రక్రైస్తవులు స్త్రీ, పురుషులు చిన్నలు పెద్దలు ఏల యీ యేసు భగవానుని నామ సంకీర్తన చేయరో తెలియకున్నది. నా మట్టుకు నేను అనుదినము ఈ పద్యములు తప్పక పఠించుచుందును వీటి సహాయమున నా యాత్మలో నా రక్షకుని సాన్నిధ్యసుఖమును, అందువలన గలుగు కృపారసములను పొందుచున్నాను. అదే విధముగా ఆంధ్రక్రైస్తవులైన నా సోదరులను ప్రభువుతో సహవాస భాగ్యము

ననుభవింపవలెనని కోరి నా యనుభవమును దెలిపితిని. మన క్రైస్తవ బాలురు బాలికలు పాఠశాలలో ఈ శతకములను పాఠ్యపుస్తకములుగా నేర్చుకొనిన భక్తియందేగాక, భాషాపరిజ్ఞానమునందు నభివృద్ధి నొందుదురనుటకు ఏ మాత్రము సందియములేదు. ఎందరో విద్యార్థులు ఆంగ్లేయ భాషయందు విశేష పరిచయముగలవారు తమ స్వభాషలో పద్యములు చదివి అర్థము చేసికొనలేని వారెందరో యున్నారు. ఇది శోచనీయమైన సంగతికాదా? ఈ విషయములను క్రైస్తవ పాఠశాలల అధికారు నాలోచింతురని విన్నవించుచున్నాను.

ఈ శతకములో పద్యములెంత భక్తిరసవంతములైనవో చూపులకు నాలుగైదు పద్యముల నిచట నెత్తి వ్రాయుచున్నాను.

శా॥ నాకన్నన్ గడుపాపకర్ముఁడొకడైనన్‌లేడు భూమండలిన్।
నీకన్నన్ బ్రియరక్షకుండెచటన న్వేషించినన్ లేడికన్।
నాకున్ నీకుజోడుగూడెగద నన్నుం బ్రోవుమిట్లైన ము।
ల్లోకంబుల్ నినుమెచ్చు నీబిరుదునిల్చున్ యేసుక్రీస్తుప్రభో।

ఉ॥ అన్నము దేవవాక్యము ప్రి - యాంబరమా ప్రభుయేసు పుణ్యమున్।
చెన్నగుభూషణంబులు వి - శేషదయా ప్రియశాంత శీలతన్।
ఎన్నగరాని సంపదల - కెక్కుడుసంపద నెమ్మనంబునీ।
కన్నులుగాన లేవుగద - క్రైస్తవ ముఖ్యుని యాత్మ సౌఖ్యముల్।

ఉ॥ ముచ్చటలూరనీ చరిత - మున్ వినగోరెదు వీనులాత్మలో।
నచ్చున వేసినట్లు భవదంఘ్రులు జూచెదుకన్ను దోయి, ని।
ష్పచ్చరదోసముల్ జిదుము - పావననామము బల్కు జిహ్వనా,
కిచ్చి కృతార్థు జేసిదయ - నేలనెయెప్పుడు యేసునాయకా।

మ॥ నన్ను బోపోమ్మనలేవటంటివె భవన్నామకృపాసత్య, వ।
ర్త నలేమాయెను వాదురాదెయిక నోర్వంజాలనా పాపమెం
చిన నీ వాగ్దయ లెంతు నేను నను బ్రోచే రక్తసిక్తా శ్రితా।
వనపాదంబులు జూపకన్విడువ దేవా యేసుక్రీస్తుప్రభో।

శా॥ మోక్షాతర్వర సౌధమంటప సభాముఖ్యండ వౌ నీవునా,
పక్షంబై కరమెత్తి యార్తుడగు నిప్పాపాత్ము రక్షింతు, నా
దక్షత్వ బిదియంచు బల్కిన భవత్సభ్యుల్ నివారింతు రే।
యాక్షేపింతు రే? యెందుకీ తడవులయ్యా యేసుక్రీస్తుప్రభో॥

ఈ శతకములోని పద్యములు చదువరుల కర్ధమగునట్లు చేయుటకై నేనీ సంవత్సరమున (1933) వానికి అర్థములు వ్రాసి యీ పురుషోత్తమకవి శతవత్సర స్మరణసూచకముగా సమర్పించుకొనుచున్నాడను, దానిని సి.ఎల్.ఎస్ వారు నూతనముగా శతకములతో గలిపి ప్రచురించియున్నారు."

(Sd.) ధన్నవాడ అనంతం

Mr. A.F Thyaga Raju M.A. of King's College, London writes :-
"Almost the only Telugu hymns I love are those written by Chaudhuri Purushottam. For beauty of language, depth of thought and true expression of the heights of Christian experience they are unsurpassed. The Poet always impressed me as one who realised that the deepest longings of the human heart are not satisfied by Hinduism. They find satisfaction only in Jesus Christ"

(Sd)A.F Thayga Raju

Bombay Sep.25,1933

లండన్‌లో కింగ్సు కళాశాలలో విద్యార్థిగనున్న ఎ. ఎఫ్. త్యాగరాజు ఎం.ఎ గారిట్లు వ్రాసియున్నారు. " నేను ప్రేమించు తెలుగు కీర్తనలు దాదాపు చౌధరి పురుషోత్తముగారివి మాత్రమే. భాషాసౌష్టవముననేమి, అర్థగాంభీర్యముననేమి, ఉన్నత క్రైస్తవానుభవ నిజవ్యక్తీకరణముననేమి యవియసమానమైనవి మానవుని లోతైన యాశయములు హైందవమతముచే తృప్తిపరుపబడవని కనుగొనినటుల నీ కవి నాకు బొడగట్టెను. అవి యేసుక్రీస్తువారిలో మాత్రము సంతృప్తిగొనును."

(Sd) ఏ.ఎఫ్. త్యాగరాజు,

బొంబాయి, సెప్టెంబరు 25,1933

విజయనగర వాస్తవ్యులును, ఇండియా యింపీరియలు బ్యాంకులో నుద్యోగియులునగు శ్రీమాన్ కే.జి. పాల్ మాహాశయో గారిట్లు వ్రాసియున్నారు:-

సీ॥ తేనెలొల్కెడు తేట తెల్లమౌ కవితచే
ప్రభుసువార్తను వ్యాప్తి బరగ జేసి।

అసమానమగుభక్తి రసముట్టిపడునట్టి
సత్కీర్తనల దేవు సన్నుతించి।

శతకాధి రూపసంస్తుత పుష్పరాజిచే
సర్వేశ్వరునకు నంజలులొనర్చి।

సద్గుణగణ సుప్రశస్త హారాళిచే
ప్రభుపాదపీఠి నలంకరించి।

గీ॥ అఖిల సంస్మరణీయుడై నట్టివాని
కవితచే సంస్మరించుచు గాంచుకతన
నీదు చరితంబు సంస్మరణీయమయ్యె
ధన్యుడవు నీవు పురుషోత్తమకవీంద్ర।

గీ॥ పలుకులెల్లను ప్రభుభక్తి పరత యందు
వర్తనంబెల్ల జనకు సువార్త యందు
జీవితంబెల్ల క్రైస్తవ సేవయందు
గడిపితిని పురుషోత్తమ కవిలలామ।

గీ॥ ఏసు వార్తను దెలిపి దానేసుకీర్తి
వలన లోగల యరలను దరిమిజనుల
శ్రీకరుండైన యాజగ దేశ జనకు
దరిని జేర్చిన చౌధరిదరమె పొగడ।

(Sd) కే.జి పాల్

8-11-33

శ్రీశ్రీశ్రీ జయపురసంస్థానధీశులగు మహారాజా విక్రమాదేవవర్మగారు క్రైస్తవనీతిప్రకాశము అక్కడక్కడచదివి క్రిందియభిప్రాయముబంపించిరి:–

Fort. Jeypore,

5th October 1933.

Dear Sir,

"His Highness received a copy of your grandfather's Poetic work sent by you. He looked into the book here and there and found that it is in easy flowing style. He wishes wide publication to it amonst the Christian community"

Yours sincerely,
(Sd) C.L Narasimham
Private Secretary.

ప్రియ ఆర్యవర్యా!

మీరు పంపించిన మీ పితామహుని పద్యకావ్య మొకటి శ్రీమహారాజావారందుకొని యక్కడక్కడ జూచి అది సులభప్రవాహ శైలిలో నున్నట్టు గనుగొనిరి. శ్రీవారు, క్రైస్తవ జనాంగములలో దానిని విశేషముగ వ్యాపింప జేయగోరుచున్నారు.

సి.ఎల్. నరసింహం
అంతరంగిక కార్యదర్శి.

మెక్లారిన్ స్కూల్ ఆంధ్రపండితులు మ॥ రా॥ వేంకటలక్ష్మీ నరసింహారావుగారిటుల వ్రాసిరి:–

మ॥ "మృదుశైలిన్ ఘనభక్తి భావమమరన్ – మేలైనజాతీయపుంబదముల్
గూర్చుచు యేసునాయకనుతిన్ – బద్యంబులన్నూటినిన్ – పొదవంజేసిన
చౌధరీకులజునాం – భ్రోర్వీసుపుతోత్తమున్ సదయాత్ముం
బురుషోత్తమున్ మదినమ – స్కారంబుగా వించెదన్.

మెక్లారిన్ హైస్కూల్ హెడ్మాస్టరు ఏ.టి పామరు బి.ఎ.ఎల్.టి గారిట్లు వ్రాసిరి:–

" Chowdhury Purushottam"s Telugu Christian hymns have charmed me from my childhood. My father's favourite hymn "ఎంతోశృంగారమైనది" and my mother's favourite book " రక్షణ చరిత్ర" bring back to my mind exceedingly pleasant memories and the great poet's name has been a household word in our home as it is in the homes for many a Telugu chirstian family. Purushottam's hymns are so superior in style. diction and thought, that they can be easily distinguished from all other Telugu hymns. In his hymns he has made use of all the music and the rhythm that Telugu language can produce. One often wonders what the fate of the Telugu christian hymnology would have been but for this genius of a poet Purushotttam. Almost all the Telugu Hindu tunes they are familiar to every Andhrite have been used by Purushottam in his compositions. Purushottam's christian experience and spirit - filled enthusiasm enlivens and uplifts many a drooping heart. Till God gives another man like Purushottam to the Andhra Christian Church, Purushottam's name will reign supreme".

cocanada

Jan 8 - 1934. (Sd) A.T Palmer.

1933 సంవత్సరము నవంబరు నెలలో ముద్రితమయిన "ది బాప్టిస్టు మిషనెరీ రివ్యూ" (The Baptist Missionary Review) పత్రికలో దత్పత్రికాధిపతులును సీనియరు మిషనెరీలునగు రెవ. జే. ఏ. కర్టిస్, డి.డి. గారిట్లు వ్రాయుచున్నారు :–

"The Major Part of our Telugu Singing is still done with the lyrics composed by Chowdhury Purushottam. From his baptism hymn, dated 1833, full of the joy of pardoned sin, till his two

wellknown hymns of farewell to life, dated 1885, for fifty two years he was the sweet singer of the Telugu Israel. His Poems and hymns are cast in all the familiar Telugu Poetical forms and they have a devotional and literary quality and a rhythm that has commended them to the taste of successive generiations of Chrisians. Though written in the very early days of congregational singing, most of the hymns continue to be favorites in congregations of all communions. New and attractive tunes are found again and again for the old favourites; the excellent writing of our newer Poets displaces them very slowly. Mr. John Choudhury, Founder and Secretary of the Mission to the Aristocracy of India a grandson of the poet - evangelist and himself a Telugu Poet, announces through our news columns this month the centenary celebrations of Purushotam's baptism in 1833. It is planned to produce a memorial volume and in other ways to make the incalculable influence of these lyrics during the hundred years some of them have been sung. One good way of celebrating would be to revise in our schools the teaching of these substanitial old pieces and revive in our workers the practice of using their searching truths in evangelistic work"

**కాకినాడ జీవామృత పాఠశాల ప్రధానాధ్యాపాయులగు రెవ.సి.ఎచ్ భానుమూర్తి గారిట్లు వ్రాయుచున్నారు :-**

ఆంధ్ర క్రైస్తవ కవి సార్వభౌముడనదగు పురుషోత్తముచౌధరి గారుని యాంధ్ర దేశమున నెరుంగని క్రైస్తవులుండరు, వీరి రసవంతమైన కీర్తనలు, భక్త్యోపదేశములగు పద్యకావ్యములు నూరేండ్లనుండి యీ ప్రాంతములలో మహా గొప్ప సేవచేయుచున్నవి. ఇట్టి కవి నేటికిని ఆంధ్ర క్రైస్తవులలో కానరాడు. ఒక వేళ నెచ్చటనైన నున్నను, వీరివలె క్రైస్తవ జీవనసారామృతమును తమ కవిత్వమందు కనపర్చినవారు కానరారు. సులలితమై,

శ్రావ్యానందకరమై, అర్థగాంభీర్యముతో గూడిన వీరి కవిత్వము నొకసారి రుచి చూచిన వారెన్నటికి విడువరు. దేశీయమతాంశముల కనుగుణ్యముగా క్రీస్తును లోకమునకు ప్రకటించుటలో వీరి గ్రంథము లగ్రగణ్యములు, అసమానములు. పద్యరచనకు బమ్మెర పోతనతోను, కీర్తనరచనకు త్యాగరాజుతోను వీరిని తేలికగా సమపర్చవచ్చును. ఈ భక్తవరుని కవిత్వమే వీరి స్వీయచరిత్రము. విద్యావంతులకు క్రైస్తవ సువార్తను చెప్పుటకు సందేహించెడి వారి చేతిలో చౌధరి గారి పుస్తకములున్న యెడల నవియే వారికి బదులుగా మాట్లాడగలవు. పండితులు మొదలు పామరుల వరకు అన్ని తరగతుల వారికి వీరి గ్రంథములు సరిపోవును. శైలి ద్రాక్షపాకమగుటచే తేలికగా నర్థమగును. అయినను భావములు లోతైనవై యెట్టి యనుభవశాలికైనను సహాయకరములగును క్రీస్తు యొక్క యిహపరతత్వములను సులభశైలిని వివరించి, యెట్టి వేదాంతుని హృదయమునైనను వశపర్చుకొనువిధమును ఈయన రచించెను. దేవుని యొక్క సుగుణ నిర్గుణ లక్షణములను గ్రహింపగోరువారికి వీరి **"సత్యవేదసార సంగ్రహము"** నకు మించిన సాధనము లేదు. హృదయాంతర్గతమైన సందేహములణంచి నిరీక్షణ తేజస్సునిచ్చుటకు వీరి **"క్రైస్తవ నీతి ప్రకాశము"** మద్వితీయమైనది. ఇట్టి కవివరుని రచిత గ్రంథములకు దగిన ప్రోత్సాహమిచ్చి అవి అందరుకును తేలికగా లభ్యమగు రీతిని ముద్రించి అమ్మించు సాధనముల కల్పించుట ఆంధ్ర క్రైస్తవుల విధి.

చెట్టి భానుమూర్తి

26-12-1934

ఈ కవి విరచితమైన **క్రైస్తవ నీతి ప్రకాశమును** గూర్చి డోర్నకల్ బిషప్ గారయిన రెవరెండ్ వి.యస్. అజర్యగారు ఎల్. ఎల్. డి 1933 వ సంIIసి.ఎల్. ఎస్. వారిచే బ్రచురింపబడిన పైగ్రంథముయొక్క తొలి పలుకున నిట్లు వ్రాసియున్నారు:-

"క్రిష్టియన్ లిటరేచర్ సొసైటీవారు ప్రచురము చేసిన **"క్రైస్తవ నీతి ప్రకాశము"** అను ఈ గంథ్రము చౌధరి పురుషోత్తముగారు రమారమి తొంబది సంవత్సరముల క్రిందట మొదట రచించిరి. క్రైస్తవులును, క్రైస్తవేతరులును ఆ పుస్తకము యొక్క శైలి, విషయాదుల శ్రేష్ఠత్వమును కొనియాడుచున్నారు. గ్రంథరచన ద్వారా ఆంధ్ర సభా సేవకు తోడ్పడిన రెవ. కానన్ అనంతముగారు ఆ టీకను పూర్తిచేయుటకు

తమంతటతామే పూనుకొనిరి. వృద్ధాప్యబలహీనతవలనను, నేత్రదృష్టి మందగించుట వలనను కొంత కష్టముగనుండినను ఆ పద్యములయందలి ప్రీతిచేత వారు వ్రాసిన టీకను నాకిచ్చి మరియొక ముద్రణమునందు దీనికలిపి ముద్రించుమని అడిగిరి.

ఇండియన్ లిటరేచర్ ఫండ్ నుండి కొంత సహాయము దొరుకుటచే మరియొక ముద్రణమున కవకాశమేర్పడగా వానిలో కానన్ అనంతముగారు వ్రాసిన టీకాను కలుపుటకు వీలుకలిగెను. కానన్ అనంతముగారు చెప్పినట్లు తెలుగు క్రైస్తవ గ్రంథరాజమనదగిన యీ పుస్తకము క్రైస్తవులకు అనుదిన సహవాసియై, వారి ఆత్మీయ జీవమభివృద్ధిజేయుటకు సాధనమైయుండవలెనని నేను ప్రార్థించుచున్నాను."

పురుషోత్తముచౌధరి కవి పద్యకావ్యములలో **క్రైస్తవనీతి ప్రకాశము, రక్షణ చరిత్ర, సత్యవేదసార సంగ్రహము, నిస్తారరత్నాకరము, విగ్రహనిర్మాణము, సత్యభజన,** యనునవి వేన వేలు ప్రతులు పూర్వము విశాఖపట్టణము లండను మిషన్ వారిచేతను, చెన్నపురియందలి క్రిష్టియన్ లిటరేచరు సొసైటీ వారిచేతను వ్యాప్తి చేయబడెను.

ఇవి యెవరికైనను ముద్రణార్థము కవిగారేకాని, కుటుంబమువారేకాని యిచ్చివేయలేదు. ఇటీవల వానిలో గొన్ని ముద్రాది దోషములు కానవచ్చుటచే కటకపురియందలి చౌధరీ కుటుంబము వారాగ్రంథముల యొక్కయు, అముద్రిత గ్రంథములయొక్కయు ప్రకటన కాకినాడలో రవి పత్రికా సంపాదకులుగనుండిన నీ గ్రంథకర్త పరము చేసిరి. శతవార్షిక గౌరవార్థసూచకముగా గుంటూరునందలి లూథరన్ మిషన్ వారు **"విగ్రహనిర్మాణము"** 5000 ప్రతులు వితరణార్థము ప్రచురించిరి. క్రీస్తు పరతత్వమను **"సత్యవేదసార సంగ్రహము"** కుటుంబమువారు 1934 లో 1000 ప్రతులు ప్రచురించిరి. **సత్యభజన, నిస్తారరత్నాకరము** తిరిగి ప్రచురింప జూచుచున్నారు. **రక్షణ చరిత్ర, క్రైస్తవనీతిప్రకాశములలో** ముద్రణాదోషము లసంఖ్యాకములుగ నున్నందున వానినిగూడ సవరింపనైయున్నారు.

**అముద్రిత గ్రంథములు :-**

పురుషోత్తముగారు బైబిలు సంబంధాంశ సూచిక (Concordance) యొకటి అక్షరక్రమముగా ఆంధ్రమున సిద్ధపరచిరి. అదియును వారు రచించిన **దైవిక శాంతిమార్గము, ఆంధ్రప్రసంగములు** (1851 నుండి) **ఉత్కళ ప్రసంగములు**

(1877) ప్రచురింపబడియుండలేదు. వీరు వ్రాసిన పత్రికలలో గూడ **మనసే మూలము** (1868), **మశూచి విషూచి సంకట భ్రాంతి నివృత్తి** (1862), **జగన్నాథపరీక్ష** (1845), **బ్రహ్మజ్ఞానము** (1856) **అంధకార నాశనము** (1861) మున్నగు పత్రికలు పునర్ముద్రణము కావలసియున్నది.

వీరి **కులాచార పరీక్ష** నూరేండ్లనుండి కులపిశాచముతో బోరాడుచు జయముగాంచుచున్నది. అనంతరము వ్రాసిన **ముక్తిమార్గ ప్రదర్శనమున** పురాణపురుషుల జీవితములు పద్యములతో వ్రాయబడి యేసుక్రీస్తు ప్రభువు వారి పాపరాహిత్య జీవితసంక్షిప్తము గూడ గనబరచబడినది. ఆ పత్రికవల్ల ననేకులు సత్యాసత్య విచక్షణాజ్ఞానము గలవారైరి. వీరి **రక్షణచరిత్ర** యను యేసునాథ కథాసుధారస ప్రవాహము యక్షగాన రీతిని వ్రాయబడియున్నది. మత్తయి మార్కు లూకాది సువార్తలవలె దీనిని "పురుషోత్తముచౌధరి కవి లిఖిత సువార్త" యనవచ్చును. ఇందు క్రీస్తువారి పర్వతప్రదత్త ప్రసంగము దండక రూపమున వ్రాయబడి యున్నది. స్థాలీపులాక న్యాయమున వారి కార్యములనుండి శైలిజూప క్రింది పద్యమలు పొందు పరుచుచున్నాము:-

సీ॥ ఆనృత వాదులు రోషు । లన్యాయశీలురు
బరదూషకులు సురా । పానరతులు।
బరధన పరదార । పరవంచకులు దుష్ట
కపట నిందోత్కట । కలితమతులు
పాషండచిత్తులు । బహుజన ద్వేషులు
నిర్ధయాపరులు దు । ర్నీతియుతులు।
లుబ్ధజీవులు మోహ । లోలురు విశ్వాస
ఘాతకుల్ కుటిలహుం । కారపరులు

గీ॥ విగ్రహారాధకులు సాధునిగ్రహులు పి।
శాచ ధాకినీ ప్రేత దు । శ్చరిత భూరి।
భూత సేవాతురులు హీన । పుణ్యులగుచు
బెరిగియున్నారు నరులిట్లు । ధరణి మీద

సీ॥ కలనైన సత్యంబు । బలుక నొల్లనివారు
మాయటక్కులసొమ్ము । దీయువారు
బీదలదండిప । బిడుగుపాటగువారు
వంచంబులను పేరు । పెంచువారు ।
కనుసన్నజారల । గదిసి పిల్చెడువారు ।
పొరుగింటిసతి బట్ట । బరచువారు।
తల్లిసెల్లెలు వావి । తప్పి వర్తిలువారు
విధనలతో బొందు । వెదకువారు।

గీ॥ కన్నములు వేయు సమయముల్ । గనెడువారు
తెరవులనుబోయి తలగొట్టు । దిరుగువారు
తల్లిదండ్రుల గెంటుచు । దరుమువారు
నన్నితట్లను భువినుండి । రధికముగను॥

శా॥ ప్రాణధారము నిత్యజీవన పవిత్రక్షీరపూరంబు ని।
ర్వాణానంద రసైకగీతము కృపార్వాభ్రఘోషంబు క
ల్యాణోత్క ృష్టము క్రీస్తుయేసుగుణసల్లాపప్రసంగంబు నౌ
త్రాణోపాయమువచ్చె ధారుణి మర్త ్యశ్రేణిరక్షార్థమై॥

నిస్తార రత్నాకరము నుండి

కం॥ ఇటువంటి భయంకర సం
కటమగుఉ ప్రభుకోపదినము । ఘణఘణ ఉ
త్కటముగ వచ్చుచున్నది
కటకట యింకేదిదిక్కు । కలుషాత్ములకున్॥

గీ॥ ఈ విధంబున దనజీవ । మిచ్చిలోక
రక్షకుడు పాపినరుల దు । ర్వారబాధ
లనుభవించె నిజాంగమం । దద్భుతముగ
నిట్టి ప్రభువందు నమ్మిక । ల్వెట్టరయ్య॥

కం॥ హితుడై సమస్తజన స
మ్మతుడై మృతినుంచి మూడవదినంబున జీ
వితుడై క్రమ్మర లేచియు
నతులంబగు మోక్షనగరి కరిగి వసించెన్॥

ద్విపద.

వినరయ్య నరులారా । వివరింతు మీకు ।
మనసులో విశ్వాస । మార్గముగనుడీ ।
యేసుని సుచరిత్ర । మిది పవిత్రంబు ।
దోసకారులపొందు । దొలగించుమందు ।
ఆరీతిప్రభువు పా। పాత్ములకొరకు
దారుణంబైన బా । ధల దానుబడియె ।
మనుజులు తనకు జీ । మలపోల్కెనుండ
దనువువారలభంగి । ధరియించి పిదప ।
ప్రాణదానమొనర్చె । పాపులకొరకు ।
గాన యీ చోద్యంబు । గనవినమెందు।
ఈకృపాప్రమదంబు । లెవరిలోగలవు?

ప్రాకృతజనులలో । పల జూడగలమె?
తనబంధపోషణా । ర్థము ప్రాణమిచ్చు ।
జనుడొక్కడైననె । చ్చట లేడు, లేడు ।
మనుజకీటముల దు । రాత్ములగావ ।
తనప్రాణమర్పించె । దయగలప్రభువు ।
నిరతమాజ్ఞాభంగ । నీచాళికొరకు ।
నరమేధమనెడు జ । న్నము తానెయయ్యె ।
పాపులు సేయు పా । పములను మోపు ।
నాపరేశడు క్రీస్తు । నౌదలబెట్టె ।
నందు శాసన ధర్మ । మధికతనొప్పె ।
ముందటిన్యాయంబు । సదమలదయలు ।
సత్యధర్మన్యాయ । సదమలదయలు।
అత్యంతమైత్రితో । నైక్యతనొందె ।
పరమధర్మమయుండు । పరమేశ్వరుండు ।
వరదయాళుడటంచు । వర్ణింపబడియె ।
గొనబైన క్రీస్తుని । గుణవిచిత్రములు ।
మనుజమాత్రులు దెల్ప । మహిజాలగలరె?
ఓయన్నలార మీ । రూహించి మదిని ।
మాయసంసార భ్ర । మలను వేవిడరే ।
జాతివోవునటంచు । జనుల నిందలకు ।
భీతి మీమతులందు । బెట్టకుడయ్య ।
మసిబొగ్గుకోసమై । మాణిక్యరాశి ।
పోసగవీడుట వెట్టి । బుద్ధియుగాదె ।
పరకాలమున జాతి । భ్రమలేమి లేవు ।
మరిసారమగు జాతి । మహిమకు గ్రీస్తు ।
జీవులందరిని సృ । ష్టించిన కర్త ।

దేవుడొక్కడె వాని । దివ్యాజ్ఞలన్ని ।
పరిపాలనము సేయ । బరగిన నరులు ।
వరదైవసంతతి । వారింకమరియు ।
బలుదురాచార ప్ర । వర్తకులెల్ల ।
నలపిశాచికులస్థు । లనబడువారు ।
నరకమోక్షములలో । ననుజేరుకొనిన ।
యిరుజాతులేగాని । యిక జాతిలేదు ।
కాన మీరిలజాతి । గర్వముల్ విడిచి ।
పూనికతో గ్రీస్తు । బోధగనుండి ।

**క్రైస్తవ నీతి ప్రకాశము నుండి**

1. ఉ॥ దేవునికంటే వేరయిన దివ్యసుఖంబును లేదు క్రీస్తులో
జీవముకంటే వేరె యొక క్షేమము నెందును లేదు నిర్మలా
త్మావిలసద్ద యారసము ద్రావుటకంటెను వేరె తృప్తియిం
కేవలనైనలేదు మరి యేమిడు మోక్షము క్రైస్తవోత్తమా ॥

2. జన్మముదాల్చు ఖేచర ర । సాచర వారి చరాది జీవులం
దున్మను జోద్భవంబు కడు । దొడ్డదితన్నర కోటిలో పున
ర్జన్మము ధీవినూత్నకృత । జన్మముగల్గిన వారి జన్మమే
జన్మముగాక దుర్జనుల । జన్మము లేటికి క్రైస్తవోత్తమా?

సత్యభజన నుండి.

(1874)

(ఇవి యక్షరమూలికా కందాలంకారములు)

ఛందస్సులు శాస్త్రంబులు
గందరగోళములు మనుజ । కల్పనవి యె
ల్లందరమ బడియె ప్రభు నీ
సుందరవాక్యములు మాకు । సుఖమిచ్చెగదా!

## కీర్తన

**రా మోహన** **తా - ఆట**

సుఖ మిచ్చెగద మాకు - ప్రభుయేసువా నీ - సురుచిరమగు వాక్కు = నిఖిల కల్మష వనమునకు దవ - శిఖి శిఖలవలె గాల్చు నీదగు - ముఖవికాసిత వాక్యములు - బహు - సుఖము లొసగు తవాశ్రితాళికి ॥సుఖ మిచ్చె॥

1. జగతిలోపల మెండుగ - నుండిన వివిధ -మగు శాస్త్రములు జూడగ = మిగుల గందరగోళమై మరి - యొకటి కొకటి విరుద్ధముగ మ - ర్త్యగణ కల్పిత మగుచు నున్నవి - తగని ద్రోచితిమి వాటిని ॥సుఖ మిచ్చె॥

2. నీ వాక్యముల భావము - నమ్మిన పాపి - జీవుల కది జీవము = కేవలంబగు ధర్మశాస్త్రము దేవు డిచ్చిన దొకటి బైబిలు - ఈ వసుధ గల సర్వ పాపుల బ్రోవ వచ్చిన నిన్ను జూపెను ॥సుఖ మిచ్చె॥

కం॥ భవభయ సాగరతరణీ
సవినయ నిజభక్తహృదయ । సదనవిహారీ
సువిశేష సదాచారీ
ప్రవిమల సుగుణప్రకాశి । పాపవినాశీ ॥

## కీర్తన

రా - బేగడా                    తా - ఆట

పాపవినాశీ - సద్భక్తహృత్ - పద్మనివాసీ = ఆపన్న జనరక్ష - ణాపేసు కటాక్ష - తాపత్రయోర్మిర - కూపారఘన తరణీ ॥పాప వినాశీ॥

1. మరియాతనూజ - మరియ స్త్రీ చి - కురపాదపూజ - ఆశ్రితలోక - వరకల్పభూజ - నిత్యానంద - పరిపూర్ణ తేజ = నిరుపమనిర్వ్యక్ర - నిరవద్య కల్యాణ - పరిశుద్ధ గుణజాల - కరుణాలవాలహె ॥పాపవినాశీ॥

కం॥ పదునెనిమిది నూరులు డె।
బ్బదినాల్గవయేట గటక । పట్టణముననీ
మృదుకందాలంకారము
లుదయించెను సాధుక్రైస్తవోత్తములలరన్॥

అని చివర వ్రాయబడియున్నది.

### రక్షణవిషయమై ఉద్బోధనము :-

కీర్తన (1866)

రా - యదుకుల కాంభోజి                    తా - ఆది.

వినరే యో నరులారా - వీనుల కింపు మీర - మనల రక్షింప క్రీస్తు - మనుజావతారు డయ్యె - వినరే = అనుదినమును దే -వుని తనయుని పద -వనజంబులు మన -మున నిడికొనుచును ॥వినరే యో॥

1. నరరూపు బూని ఘోర - నరకుల రారమ్మని - దురితము బాపు దొడ్డ -దొరయౌ మరియా వరపుత్రుడు = కర మరు దగు క -ల్వరి గిరి దరి కరి - గి రయంబున ప్రభు - కరుణను గనరే ॥వినరే యో॥

2. ఆనందమైన మోక్ష - మందరి కియ్య దీక్ష - బూని తనమేని సిలువ - మ్రాను నణచి మృతి బొందెను = దీన దయా పరు - డైన మహాత్ముడు - జానుగ - యాగము సలిపిన తెరంగిది ॥వినరే యో॥

3. పొందు గోరిన వారి – విందా పరమోపకారి – యెంద రెందరి బరమా –నందపద మొందగ జేసెను = అందమునన్ దన – బొంది సురక్తము – జిందెను భక్తుల – డెందము గుందగ ॥వినరే యో॥

4. ఇల మాయావాదుల మాని – యితడే సద్గురు డని – తలపోసి చూచి మతి ని – శ్చల భక్తిని గొలిచిన వారికి =నిల జనులకు గలు – ముల నలరెడు ధని – కుల కందని సుఖ – ములు మరి యొసగును ॥వినరే యో॥

5. దురితము లణప వచ్చి –మరణ మై తిరిగి లేచి – నిరత మోక్షానంద సుం –దర మందిరమున కరుదుగ జనె = బిరబిర మన మం – దర మా కరుణా – శరనిధి చరణమె – శరణని పోదుము ॥వినరే యో॥

**విగ్రహ నిర్మాణము నుండి**

బైబిలులోని యెషయా 44 అధ్యాయము ననుసరించి రచించిన పంచచామర గీతము

ఇదేమి వెట్టి యేమి వెట్టి – యీ నరాళికయ్యయో॥

1. నరుండు గొడ్డలిన్ కరంబునన్ ధరించిపోయి యా ।
యరణ్యమందు చెట్టుగొట్టి, యట్టి మ్రాను నింటికిన్ ।
బిరాల నీడ్చి తెచ్చి నూలు వేసి కొల్చి దానికిన్ –
స్వరూపమంచి వేల్పు జేయవడ్ల వాని బిల్చునో ॥ఇదేమి వెట్టి ॥

2. మదించి వడ్లవాడు కూలిమాటముందు తేటగా।
విధింతువేని మాను చెక్కి వేల్పు జేతునన్నచో ।
బదిర్వదంచు వీడు వాడు పల్కి గుద్దులాడుచున్।
తుదన్కుదిర్చి సంచకర్వుతోటి యప్పగించునో ॥ఇదేమి వెట్టి ॥

3. భుజాబలంబుతోడ బాడ్తెబూని వడ్లవాడు దా।
నిజూచి పుచ్చులేదటంచు నిశ్చయించి మాను భూ।
ప్రజల్ భళీ యనంతదాని పట్టి ముక్క చెక్కి వే।
ల్పు జేతునంచు బొమ్మజేయు బుద్ధిలేనివారికై ॥ఇదేమి వెట్టి ॥

4. తుదల్ మొదళ్ళు గొట్టి వానితోటి యన్నశాఖముల్ ।
ముదంబు తోడ వంటజేసి ముందుగా భుజించి।
వెన్నదాని చెక్కపేళ్ళు శీతకాలమందు కుంపటిన్ ।
కుదిర్చి యగ్ని కాగె వీని గూర్చు బొమ్మకాదకో ॥ఇదేమి వెఱ్ఱి ॥

5. అలాటి కొయ్యబొమ్మ కక్షులాననంబు జక్కగా ।
నలంకరించి రంగువేయుమయ్య ముచ్చివాడ నీ।
వెలాగు జేతునో సుమీ యదేల నీకు నేర్ప నీ।
తలంపు మెచ్చునట్టి కూలిదానికిచ్చెదందురో ॥ఇదేమి వెఱ్ఱి ॥

6. జగంబులోన దేనితోటి సాటిసేయరాదు గు।
డ్ల గూబ మోమువంటి మోము డంబమితియే మరే।
మి గానరాదు వేపమొద్దు మెచ్చి మెచ్చి దీనికిన్।
జగత్తునాధుడంచు జెప్పజాల సిగ్గుకాదకో ॥ఇదేమి వెఱ్ఱి ॥

7. రథోత్సవంబువచ్చె రండురండటంచు యాజకుల్।
ప్రధానులైనవారు వెర్రివట్టి మూగిబొమ్మవే।
రథంబుమీది కీడ్చి దాని త్రాళ్ళతోట్టి గట్టుచున్।
వృధాశ్రమన్ భ్రమింతు రిట్లు విత్తగర్వకాంక్షచే ॥ఇదేమి వెఱ్ఱి ॥

**పాట :-**

చూడురా ! యివిచూడురా! భ్రమవీడురా ! యిక వీడురా !

1. అల్లదేమిటి చూడురా - యొక - నల్లమొగ మందున్నది।
కల్లగాదు నిజంబురా యది - కర్ర ముక్కై యున్నది ॥చూడురా॥

2. ముక్కచెక్కుట వెఱ్ఱిరా - యది మార్కొనంగా జాలదు త్రొక్క
యొలిచిన మ్రాను దానికి - మ్రొక్కితే ఫలమేమిటి ॥చూడురా॥

3. కన్నులున్నవిగాని లోకుల - గాంచు తీరికలేదురా దున్న మేలుర
దానికన్నను - త్రోవగని యదిపోవురా ॥చూడురా॥

4. నోరుచెక్కెను దాని నికయే - నూరుగొట్టిన పల్కదు
వేరుదొలచిన మొద్దు దానికి - పేరు ఎంతో పెద్దరా ॥చూడురా॥

5. చెవులు లేవుర దానిలో నొక - చిన్నెయైనను గానము శవము
పోలిక నున్నదచ్చుట - సారమేమియు లేదురా ॥చూడురా॥

6. జెబ్బలున్నవి దానికిక నరి - చేతు లేమైపోయనో
అబ్బురపు పని బొమ్మరా శిశు - వాడుకొనుటకు తగదిది ॥చూడురా॥

7. బాపనయ్యలు గూడిరి జీ - వ(ప్రతిష్ఠలు చేసిరి
వేపకఱ్ఱ నిబద్ధిరా యొక - వ్రేలెడైన యెదుగదు ॥చూడురా॥

8. వింతమంత్రము లుచ్చరింతురు - వెట్టి(ప్రాణము రాదయో
యెంతంజేసిరో యంతకంటే - యేక్కువెప్పుడు కాదురా ॥చూడురా॥

9. కొయ్యకిడు (బ్రాణంబు - తాదన - యయ్య చచ్చిన గాల్చును
చెయ్యడేమిర యిట్టి యోచన - సిగ్గుమాలి యికెవ్వడు ॥చూడురా॥

## నిజదైవ వర్ణనము

సీ॥ ఎవ్వడు తన జేన నిమిడించి కొలుచు నీ
యాకాశమండలం బద్భుతముగ
నెవ్వడీ పుడమి మన్నెల్లను తన కుంచ
మునకు లోబడజేయు ఘనబలమున
నెవ్వడీ మహిత మహీధరంబుల బట్టి
తన తరాజున నుంచి యొనరదూచు
నెవ్వడీ జలధులం దిముడు నీరములన్ని
తన చేతి వుడిసెలో నునిచికొలుచు

గీ॥ వసుధగల సర్వజీవాళి విసుకకన్న
సన్నముగ జూచి త్రాసులో సరగ నునుచు
నెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహోవా దిక్కు నా కనుదినంబు (1)

సీ॥ ఎవ్వనిచేతిలో నీ విశ్వమంతము
నాటల పూబంతి యట్టులుండు
నెవ్వనికాంతియం దీ సూర్యచంద్రులు
మెఱుగుడు పురుగుల ట్లెఱుగబడుదు
రెవ్వని యొడిగట్ట నీ తారలన్నియు
మల్లెమొగ్గలరీతి గిల్లబడును
ఎవ్వని కనుదృష్టి కీ భూమి గోళంబు
సరసావగింజతో సాటిపడును

గీ॥ ఎవని మిాగాళ్ళబంటిరా వీ యగాధ
వార్ధినీరము లటువంటి వరబలాఢ్యు
డెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు (2)

సీ॥ పరమండలము వసుంధరమండలముబట్టి
బంతులట్లాడించు ప్రబలుడెవడు?
పగటెండ ఱేయెండ బాన్పులట్లుగ జట్ట
బెట్టి వేరొకచోట బెట్టునెవడు?
సర్వజీవాధార సంచారపవనంబు
లొక ముష్టిలో బట్టు నొడయుడెవడు?
హిమతపోవర్ష కాలముల మూలలనుంచి
యెత్తి యుద్యోగంబు లిచ్చు నెవుడు?

గీ॥ తనకుదానె సమాన సౌందర్య సర్వ
శక్తి విజ్ఞాన సత్కృపా శాంతమూర్తి
యెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు. (3)

సీ॥ పరమదూతల మోక్షపుర మదెవ్వనికంట
పరిశుద్ధముగ జూడ గౌరత దోచు
సత్యప్రియాధిక సంతోషముల మీద
నెవని సింహాసనం బెలమినుండు
సకల జీవుల భక్ష్యసామగ్రులెల్ల నె
వ్వని చేతి దానంబు లనుదినంబు
సకలార్థ శబ్ధ వాచకములన్ని యుగూడి
యెవని పేర్కొని యాడ నెరుగలేవు

గీ॥ ఎవ్వరే కాలమున కంటి కింపుతోడ
జూడ గోరిన తన రూపు జూపకుండు
నెవడో యాతడు నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు॥ (4)

సీ॥ అఖిల లోకముల వృత్తాంత మాద్యంతంబ
దెవ్వని పటమునం దిమిడియుండు
సకలాంతరాత్మల సాక్షియై యెవడు కా
రణ కార్యభావనల్ గణన సేయు
జీవ నిర్జీవ సైన్యావళిలో జిన్న
పురువైన తృణమైన మరువడెవడు
తగ భవిష్యద్భూత తత్కాలములు నేలు
చౌక రీతిగర నీతి నుండు నెవడు

గీ॥ తం్రడి తనయుండు విమలాత్మ తానెయగుచు
నాణెముగ దీన భక్త బృందముల బ్రోచు
నెవడో యాతడె నా తం్రడి యిష్టుడైన
ఘనుడగు యెహోవ దిక్కు నా కనుదినంబు॥ (5)

షరా:– పై పద్యములలో చివరి పాదము "ఘనుడు కరుణాబ్ధి దిక్కు నాకనుదినంబు" అని కొందరు మార్చి చదువు కొనుచున్నారు.

పురుషోత్తముచౌధరి గారు క్రైస్తవ మతస్వీకారము చేయుట, ప్రచారకార్య మారంభించుట మున్నగు వాని తారీకులను బట్టి 1933 సంవత్సరమునుండి శతవత్సరోత్సవము జరిగింపవలెనని కాకినాడ, ఆకివీడు, విజయనగరములలో జరిగిన క్రైస్తవ నవ్యగీతామహాసభలలో తీర్మానింపబడెను. ఆయన గాయకులును, రచకులునై యుండుటచే వారిస్మరణార్ధ మొక గీతభవనము భీమునిపట్టణములో సంస్థాపించుట సమంజసమని యొక సభలో తీర్మానించియున్నారు.

పురుషోత్తముచౌధరి గారి జీవిత చరిత్ర దాదాపు 34 సం॥ క్రిందట వ్రాయుబడినను నవీనులాయన చారిత్రమును దెలియగోరుట చేత చాలాకాలము నుండి సంపాదించుచు వచ్చిన పరికరసమీకరణము చేసికొని యీ స్మారక ముద్రణమునకు దొణంగడమైనది.

1933 సం॥ రాంత దినములలో నేను నరసారావుపేట వాస్తవ్యులగు రెవ.ఎం.ఎల్ డోల్బీరు ఎం.ఎ గారిచే నాహ్వానింప బడి యెద్దనపూడి యను గ్రామమునకు బోయి యచ్చట దాదాపు వేయిమంది జనములకు పురుషోత్తముచౌధరిగారి జీవితచరిత్ర చెప్పి ఆయన ఛాయా పటములను బంచిపెట్టిరి. కాకినాడ జగన్నాయకపురములోని సి. ఇ. బాలికాబాలుర శతవత్సరోత్సవ ప్రారంభమున తమ సభలలోవారి చరిత్రము విని యుత్సహించిరి. గుంటూరు మిషన్ దేవాలయములోను, ఒంగోలు ఏ.బి మిషన్ కన్వెన్షన్‌లోను పురుషోత్తముగారి గూర్చి క్లుప్తముగ చెప్పియుండిరి. మెదకులోని క్రైస్తవ సంఘము లీ చరిత్రమును కాలక్షేపరూపమున జేప్పించి శతవత్సరోత్సవము గావించుచుండిరి. 1833 వ సంవత్సరము పురుషోత్తముగారు క్రైస్తవ మత స్వీకారము చేసినందున చరిత్రలో సూచింపబడినట్లాయా మిషనులతో నాయన చేరి కార్యకలాప

మారంభించి యుండుటం జేసివారు తమతమ వీళ్ళను బట్టి యా యుత్సవము జరిగించుచుండిరి. పురుషోత్తముచౌధరిగారి జీవిత చారిత్రమున ఆయన గ్రంథసముదాయమును కీర్తనలును గలిపి యొక సంపుటముండుటయొక్క సమంజసతను గొందరు సూచించిరి. ఆంధ్రక్రైస్తవ సంఘములన్నియు నొకవారము ప్రత్యేకించి యొక చందా నెత్తి నంతట నిట్టి యుద్గ్రంధ ప్రచారమునకు వీలుండును.

ఈ కవి యందభిమానముగల ప్రతి మిషనువారును లేక సంఘములును తమతమ స్థానములలో శతవార్షికోత్సవ సూచకముగ నేదియో యొక స్మారకము నిల్పుకొనవచ్చును.

కాకినాడ నగరమందలి క్రైస్తవ సంఘములు 1934 సం॥ డిశంబరు 16 తేదిని కాకినాడ బాప్టిస్టు దేవాలయములో ఏ.టి. పామరు బి.ఏఎల్.టి.గారి యాజమాన్యమున సమావేశమై, కవియొక్క పెద్ద ఛాయాపటమునిలిపి యాయన జీవిత చరిత్రము ఈ గ్రంథకర్త ద్వారావినిరి. ఆనాడు కొందరు మిషనెరీలును, దివాన్ బహద్దురు సర్.డాక్టరు ఆర్. వేంకటరత్నమునాయుడుగారు, కే.టి.ఎం.ఏ.ఎల్.టి.డి.లిట్.ఎల్.డి గారు శ్రీయుత దుగ్గిరాల ప్రకాశరావుపంతులు బి.ఏ గారు, శ్రీయుత పెద్దాడ రామస్వామి ఎం.ఎ. గారు మున్నగు అభిమానవర్గమను ఈస్మారక గ్రంథవిషయ మెత్తబడిన వెండిచందాలో దమకానుకలు చేర్చియుండిరి. వక్తలు సభాధ్యక్షుడు శ్రేష్ఠోపన్యాసములనిచ్చి యితర సంఘముల కాదర్శప్రాయులైరి. ఆనాడు కవివిరచిత **క్రీస్తు పరతత్త్వము** కొన్ని ప్రతులు వితరణ గావింపబడెను. గుంటూరునందలి "ఎ.ఇ.ఎల్.సి వారి వాఙ్మయోపసభ" వారు కవివిరచిత **విగ్రహనిర్మాణము** 5000 ప్రతులు ప్రచురింపగా నందారువందలు శతవార్షికోత్సవ సూచకముగా మేముపంచి పెట్టుచుంటిమి. ఆంధ్రక్రిష్టియన్ కౌన్సిలు వారీ కవిపేర తగిన శతవార్షిక కేంద్రస్థానమున నిలుపయత్నించిన వలయుసహాయము వడయగలరు. దైవనామమహిమ నిమిత్తము మహద్విషయములు పూనువారికి సహాయసంపద చేకూరకమానదు. పురుషోత్తముచౌధరి గారు పరలోకప్రాప్తులైనను, ప్రతిదినము ముఖ్యముగా ప్రతియాదివారము ఆయన కీర్తనల నాయాగృహములలోను సంఘములలోను గానము చేయునప్పుడును, పద్యగద్యములవల్లను ఆయన ప్రతివారి స్మరణయందుండి, కొందరిలో దైవసంస్తుతి, కొందరిలో పాపభీతి, కొందరిలో పాపపశ్చాత్తాపము, కొందరిలో ఆత్మానందము, కొందరిలో కృతాజ్ఞత, కొందరిలో

శాంతి, కొందరిలో మోక్షాపేక్ష, కొందరిలో శాశ్వతనిరీక్షణ గొల్పుచు, వారిని దైవసన్నిధానవర్తులుగ జేయుచు, ప్రతిష్ఠంబిత జీవితములను వినమ్రతకు మార్చుచు, నీ జనాంగనమునకు ప్రపితా మహులో యనునట్టి గౌరవపాత్రులై యుండుటలోని విశేషము "భవన్తినమ్రాస్తరవైఫలోద్గమ" యనునటుల నాయన నిరాడంబర జీవితము ఘటించియుండుటయు "స్థాణావీ నిపుణన్యాయమున" క్రీస్తు ప్రభువునందు స్థిర విశ్వాసియై యుండుటయు, ప్రేమతో దైవమానవ సేవ నొనర్చియుండుటయు, కాలము సద్వినియోగపరచి, తన దివ్యానుభవసుఖములననుభవవేద్యులు గ్రహింపగలుగునటుల వానిని లిఖించి యుండుటయునని యెల్లరికి దెల్లంబు.

చ॥ అనుభవవేద్యమైన హృద - యభ్రమరంబులచేత గ్రీస్తుయేసుని

చరణారవిందములు –జుట్టి తధియమరందమాధురీ ఘనరపమానియాని

సుఖ – కౌశలగానమొనర్చు క్రైస్తవుల్ మనములలోన సంతసిల్ల – మత్క

వితార్థమెరుంగ జేసెదన్ ॥

అని యాయన తన క్రైస్తవనీతి ప్రకాశమునకసూచించి యెల్లరు దమకు దేవదత్తమైన వరముల నితరులకై వినియోగింపవలెనను నాదర్శమిడియున్నారు. పురుషోత్తముచౌధరికవి పూర్వకాలపు దళసరి కాగితముల పైని తాము హైందవ మత సాంప్రదాయ సిద్ధులై యుండినపుడు అభ్యాసముననుండిన వేదాంతపురాణాది గ్రంథసారస్వములనేకాక, గాయత్రీ జపము, ఆపోశనము, ఉత్తరాపోశనము, త్రికాలసంధ్యలు, దేవతార్చన నమకం, దేవతార్చన చమకం,జట, ఘన మున్నగు వేదభాగములు వ్రాసికొనియున్నారు. వానిని వల్లెవేయు అభ్యాసమాయనకు హైందవ మతమున నలవడెను. ఆయన జట నిట్లు వల్లించుచుండిరి :–

## ----- జటాపాఠము -------

"నోరీ రుషో రీరిషో నోరీరిష:। రీరిషో మా మారీరిషో రీరిషమా । మాపరాప రామా మాపరా। పరాదాదా: పరాపరా దా:। దాయితి దా: యె।। సపత్నానో నస్సపత్నా:। సనత్నా అపాస్న పత్నాస్సపత్నా। పతతే అపా అపాపతతే। తేభవంతు భవంతుతే తేభవంతు। భవంతి ద్రాగ్నిభ్యామిం ద్రాగ్నిభ్యాం। భవన్తు భవన్తింతింద్రాగ్ని భ్యాం ఇంద్రాగ్నిభ్యామవావేం। ఇంద్రాగ్నిభ్యా ఇంద్రాగ్నిభ్యా మవ ఇంద్రాగ్నిభ్యా మింద్రాగ్ని భ్యాం। వా బాధా మహేబాధా మహేవాప బాధామహే। బాధామహేతా కుస్తాన్ । బాధామహే బాధామహేతాన్ । తానితితాన్ । వసవోరుద్రా రుద్రావసవో వసవోరుద్రా: । రుద్రా విత్యా రుద్రా రుద్రాదిత్యా । ఆధిత్యా ఉపరిశ్మృశన్ వామో: ముపరిశ్మృశ ఉపరిశ్మృశన్వా। మోగ్రముగ్రం మామోగ్రం । ఉగ్రంచేత్తారం చేత్తారముగ్రముగ్రం చేత్తారముగ్రం । చేత్తార మధి రాజ మధిరాజ మధిరాజ మక్రన్ । అర్వఅర్వాంచ మింద్ర మర్వాంచ మర్వాంచమింద్రం । ఇంద్రమమృతో అమృతోమింద్ర మింద్ర మమృత: అముతో అవామహె అనామహ అముతో అముతో అవావహే। అవామహే యోయో అవామహ హమహేయ: యోగోజిత్ । ద్గోజిత్ । ద్గోజిత్ యోయోగోజిత్ । గోజిద్ధర గోజిద్ధన జిద్ధన ద్గోజిద్గోజత్ । ధనజిత స్వజిద్య: యూ ఋతియు: । ఇమంనోనమిరుమంన:నో యజ్ఞం జ్ఞంనోనో యజ్ఞం । యజ్ఞంయిహవే ఇహవేయజ్ఞం యజ్ఞంఇహోవే । విహవే విహవే జుషశ్వ జుషశ్వ విహవె విహవే జుషశ్వ । జహస్వ స్యాస్యజషస్వ జషస్వాస్వాస్య: । అస్యకుర్మ: కూర్మోఅస్యాఅస్యకుర్మి: కుర్మోహరితో వారిప:। కుర్మ: కుర్మోహరివ । హరివో మేదినం మేదిన కున్ హరివో హరివో మేదినం మ్మేదినం త్వాత్వ । మేదినం త్వాతే తిత్వా ।।

ఇట్టి విపుల జ్ఞానసంస్థితమైన మేథాసంపత్తిచే పురుషోత్తముగారు మతాంతరులైన వెనుక యేసుక్రీస్తువను ఉత్తమోత్తమాంశ ప్రశంస మనోహరముగ జేయగలిగిరి.

'స్థాలీపులాకన్యాయమున' నీ పౌరాణికుని, వేదవర్యుని, కవివరుని పద్యగీతాది రచనలనిచట వివరించితిమి. మానవుడు తన పరమజనకుడైన భగవానుని గ్రహించుట కెంతయోవాంఛాతురుడైనను పతితుడైనందున "యదుహృదయమ శుద్ధం, తస్యసర్వవిరుద్ధం" అను న్యాయమున వాని వ్యాపారములన్నియు భగవదృష్టికి

వక్రమములేయగును. 'స్వయమశుద్ధ:పరన్కథంసాధయతి' యనునటుల తాము పరిశుద్ధులై యుండి యితరులకు బోధింపగల వారెవరు? అట్టిమానవులకు దైవచిత్తము వ్యక్తమగుట యెట్లు? చౌధరి పురుషోత్తమయోగి అష్టాంగయోగములు సాధించి భగవదాన్వేషణము చేయుగోరినను యెగశ్చిత్తవృత్తినిరోధ:'' యనునటుల ఆ మానవచిత్తము దైవచిత్తమునరికట్టు రహస్యమొకప్పుడు గ్రహింపనేరకపోయిరి. మానవుడు తాను పాపినను ఎరుక గలిగినప్పుడు ఆత్మరక్షణార్థము నేకావస్థలుబడుచున్నాడు. పూర్వులు కొందరు 'యజ్ఞేవా అవతి' (అనగా యజ్ఞమే రక్షించును) అని చెప్పిరి. మానవులలో నిష్పాపులు లేనందున 'అహం యజ్ఞోస్మి' యని భగవంతుడే మనకై యజ్ఞము కావలెననికూడ ఆర్యులు తలంచి "ప్రజాపతిర్దేవేభ్యఆత్మానాం యజ్ఞంకృత్వాప్రాయశ్చత్" అనగా ప్రజాపతియైన భగవంతుడు తానే మానవాకారుడైవచ్చి, పాపోపశయనమహాయాగమగునని వేదములలో జెప్పియుండిరి. అట్టి మహాయజ్ఞం పాపరాహిత్య అవాతారమూర్తియైన యేసుక్రీస్తు ప్రభువువారే గావించిరని పురుషోత్తముచౌధరిగారు గ్రహించినంతట తానెంత గొప్పపాపియో క్రీస్తు సువార్తద్వారా ఎరుగగలిగిరి. "పరిత్రాణాయ సాధూనాం, వినాశాచయదుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే'' యును గీతావాక్యము పురుషోత్తముగారెరుగపోలేదు. సాధువులను కాక

దుష్కృత్యములొనర్చవచ్చిన వారిని పరిత్రాణము గావించు యేసుక్రీస్తుప్రభువు నిజముగా తన రక్షకుడని యాయన గ్రహించెను. పురుషోత్తముగారు శ్రీకృష్ణస్తవము లొకప్పుడు వ్రాసియుండినను గుణచర్యలలో పాపలోలురైన వారెవరైనను యేసుక్రీస్తుప్రభువుతో సరిసమానులు కానేరరని శాస్త్రపఠనమువలననే యాయన గ్రహింప గలిగిరి. గ్రహించినంతట సత్యాసత్య విచక్షణమున స్థిరులై యుక్తమైనది జరిగించిరి.

ఈ చరిత్రమును జదువువారు పురుషోత్తముచౌధరి గారి వలెనే సర్వమును పరిశీలించినంతట యుక్తమైనదెద్ధియో దాని నవలంబింప దృఢనిశ్చయము సంకల్పించుకొని ముదంజవేసి చనవలెననియే గ్రంథకర్త యభీష్టము.

# కృతాజ్ఞతా ప్రశంస

పురుషోత్తమ చౌధరికవి

శతవత్సరోత్సవ సంబంధమైనది.

(బాబు డానియల్ చౌధరిగారు, ఆకులతంపర).

క. ధరచౌధరి వంశంబున
మురువుగ నాపితృజనకు - పురుషోత్తమునిన్
నెరినీసేవకు శతవ
త్సరముల క్రిందటను - శిల్వ - దరి జేర్చితివే।

సీ. కనుక నీకూరిమి - కై కృతజ్ఞత బూని
నతులొనర్చెద దేవ - నతిముదమున
నలనాడు జక్కయ - యనుధనవంతుని
బిలచినరీతి నా - పితరులకును
కులగర్వ వృక్షశా - ఖలపైన గూర్చుండ
పురుషోత్తమాడిగ్గి - త్వరగ రార
క్రందుగ నీవంశ - మం దుదయించి నీ
బందుల నాసేవ - యందు నిల్పి.

గీ. ఆంధ్రవంగోత్కళాది రా - జ్యంబులందు
శిలువ శుభవార్త జాటను - బలము నిడుదు
నంచు నాహ్వాన మొనరించి - నందువలన
బ్రతికియున్నాము నీదాస - బృందమిటను

సీ. నూరేడు లామెన - నూనమౌనీ కృపల్
మావంశజులపైని - మానకుండ
జూపించుచున్న యో - మాపరమేశ్వర
నిను గొనియాడ దీ - నుని తరంబె
ఓప లేనటువంటి - యాపదలందున
నద్భుతమౌ సహా - యముల జేసి
స్రష్టవు ద్రష్టవు - సర్వంబు నీవని
యెరుగ జేసిన నీదు - కరుణనెరిగి.పై

గీ. సురు చిరానంద వైభవ - గరిమమేము
నిన్ను నమ్ముచు చున్నాము - నియతివిడవ
యేసువిభుపుణ్య బలిచేత - భాసురముగ
సర్వేశ్రేయముల్ మాకగు - నుర్వియందు.

సీ. కావుననే నీదు - సేవజేయుచు బ్రతికి
యున్నాము భూమిపై - కన్నతండ్రి
యిటుపైని మాకాల - మెటులుండినను గాని
పాయము నీపద - భక్తి మేము
గతకాలమందలి మితిలేని కృపలకై
శిరము వంచుచు నీ సు - చరణములకు
పురుషోత్త మప్పల - నరసింహ, గోపినా
నాథుల రక్షకానాదు - దోసిలొగ్గి

గీ. మ్రొక్కుచున్నాడ పురుషోత్తమునికుమార
తనయుడను నీసుభక్తుల - దాసుడనయి
యొక్కడను గాను నావారు - పెక్కుమంది
నిన్ను నుతియించుచున్నారు - కన్నతండ్రి.

కం.	ఇప్పటికిని మేమును మా
యప్పకు బిడ్డలు కళి మ - హాంతులవారున్
గొప్పదగు నీదు ప్రేమను
చెప్పుచు నున్నాము దేవ - యేహెూవా!

## క్రైస్తవ కవిపితామహు
## అభివందనము

సీ. వంగమాత సుభాష - వదలి నీపితృ లీ
యాంధ్ర వాణిని జేరి - యలరినారు
తరచి చూచితి వహో - ధన్యాంధ్ర భాషను
అమరకోశము లెస్స - నెమరు వేసి
కవితా కుమారి నిన్ - గనుసన్నలను జేర
జీర, బి యుడవయి - చెలగినావు
కరుణబొందుచు యశ: - కాంత ప్రేమను నీవు
నేటికి లీనమై - నిలిచినావు

గీ.	సాధుసజ్జన వంద్యయో - చౌధరి ఘన
వంశనామంబు నీయందె - వన్నెదేరె!
ధాత్రి నీకీర్తి యాచంద్ర - తారకంబె!
మాన్యగుణసాంద్ర - పురుషోత్తమ సు కవింద్ర!

గీ.	విధివశంబున రక్షణ - విధిని నేర్చి
క్రీస్తు మతసూత్రముల నీతి - రీతినేర్చి
కటకపురి స్నానదీక్షను - గైకొని యిట
తెలుగు దేశాన శుభవార్త - తెలియజేయ।

సీ.	క్రైస్తవు డితడని - కర్కశహృదయులై
బంధుబృందంబులు - పరిభవింప
పృగృహవాసంబు - సరిగాదని నుడివి
భ్రాత్రుండు కినుకడు - బంతగింప

దాయాదులెల్లను - తన్నడ్డు పరుప నీ
యర్థాంగి నినుజేర - నాలసింప

సేహితబృందము బాహాటముగ ననా
దరభావమును జూపి - పరిహసింప

గీ. దైన్యతను నీవు పొందక - ధైర్యమతని
జాటితివి గాదె శుభవార్త - జయము పొంది
ఉత్కళాంధ్రదేశంబుల - నొక్కగురిని
చౌధరీవంశ సాగర - చంద్రమగుచు॥

సీ. శ్రీయేసునాధ సం - సేవితానందమో
పురుషోత్తమా మోద - గరిమ ప్రణుతి

ఆది క్రైస్తవ మతవ్యాపకా దీపికా
పురుషోత్తమా మోద - గరిమ ప్రణుతి

పరిశుద్ధ క్రైస్తవ - భవ్యబోద్ధా - కవి
వర పురుషోత్తమా - గరిమ ప్రణుతి

గీ. ప్రతిథ భక్తి సౌరభభాగ్య - ప్రణుతి నీకు
భక్తవత్సల సేవితా - ప్రణుతి నీకు
మాన్య కవిరాజ గణ్యయో - పుణ్యకీర్తి
ధన్యవాదము లివి మహి - తామహుండ!

ఇట్లు

కవియొక్క మునిమనుమడు,

ఆల్బర్ట్ పురుషోత్తం చౌధరీ

వేదాంత విద్యార్థి

జగన్నాయకపురము

కాకినాడ, 1933

# 15 అధ్యాయము

(యిది జాన్‌చౌధరిగారు 1902 సం॥ లో ప్రచురించిన

"పురుషోత్తచౌధరిగారి జీవిత చరిత్ర నుండి సంగ్రహహించబడినది.)

## IN MEMORIUM

## PURUSHOTTAM'S CENTENARY

## BY MALLEAL SOLOMON GEORGE

## DORNAKAL

Jubilee chimes! There lies the laurell'd head,
A youth to fortune and ot fame well - known

The singer of undying songs is dead;
I wish his souls doth deckth' eterenal throne,

Lo! times may change, the skies look strange the birds.
Depart, the winds they drift, the grove decays

Empires dissolve, may die all lowing herds-
The poet lies; his strains ne'er pass away.

The pen is oft the cause of Nation's fame
Here is our bard of race divine.

Purushottam in nature as in name. "Thou art
A David for th new Psalms to impart

His hymns and songs for two and fifty years
Did he sing sweet in literary grace

In kirk, in public street and wanted spheres;
Thus he usurped great Thyagaraja's place.

From Nature's shrine he took the muses live,
His music sweet all castes and creeds did greet;
A like the linnet sang the verse alive;
Since laid his talents at His blessed feet.
Rapt tho'he from us Milton greets
Him, Shakespeare bids him welcome home, Lord
Tennyson salutes him, praises Keats;
And god - like spirits hail the guest restored.

**పురుషోత్తముగారి జీవితములోని కొన్ని యెన్నికయిన విషయములు :-**

**"దేవుడెవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగ దీర్చెను. ఎవరిని నీతిమంతులుగ దీర్చెనో వారిని మహిమపరచెను. రోమా 8 :30.**

పురుషోత్తముచౌధరిగారు "పండు తమలపాకువంటి దేహచ్ఛాయ" గలిగి, శరీరదార్ఢ్యమును తగుపాటి పొడవునుగల విగ్రహమని చెప్పెదరు. నన్నాయనను గురుతుపట్టి యుండలేదు. ఆయన సాధారణముగా ధవళవస్త్రములు ధరించు దయా, ప్రేమా, సహనాది, సద్గుణభూషితుడు.

ప్రతీది వెంటనే చేయువారు. రేపు అనుమాట ఆయనకు ఇష్టములేనిది. వృద్ధాప్యమున ఆయన కందిన యుత్తరములకు జవాబు వ్రాయించునప్పుడు కవరు పై "జవాబియ్యబడినది" యని కుమార్తైచేత వ్రాయించువారు. నూరేండ్లకు పూర్వమాయన వ్రాసికొనిన వేద, పురాణ వేదాంతాది భాగముల వ్రాతప్రతులు నేటికిని గలవు. 1869 సం॥ చిట్టివలసలో నుండగా నెవరెవరి కేయే యుత్తరములు వ్రాసియుండిరో యా పట్టిక దొరికినది. ఆయనకు 1825, 1833 సంవత్సరములలో దొరికిన క్రైస్తవమత పత్రికలును గలవు.

మూడు నెలలకొకసారి వేతనమందునపుడు దానిని ఆయా బాపతుల క్రింది విభాగించి ఋణగ్రస్థులు కాకుండ జూచుకొనువారు.

ఆయన బంగాళీ, ఒరియా, ఆంధ్రభాషలలో బైబిలు చదువు వాడుక గలిగియుండిరి. నేత్రదృష్టి క్షీణించినంతట వైధవ్యము నొందిన తమ కుమార్తై మార్తాబర్డరుగారు కాని, జేమ్సు చిన్నయ్యగారు కాని వారికి బైబిలుచదివి వినిపించువారు.

ఆయన యేకాంతప్రార్థనకై దూరస్థలములలోనో, తన గదిలోనో యుండునప్పుడాయన తనకు ఒకటియైన కీర్తనలు మిక్కిలి మక్కువతో బాడువారట. అందు ముఖ్యముగా స్వీయరచితమైన **"ఒక్కసారిజూపుమో ఓ యేసునాథా - మ్రొక్కిసేవించెద"** అను కీర్తన పాడునపుడా వృద్ధభక్తుడు తనచేతులు జోడించికొని శిరఃకంపము చేయుచు ఆ ప్రభువును పట్టుకొనునటులనే యాయన కంత సన్నిధావర్తులై పోయినటుల గనబడువారని కటకపురిలో మాబంధువులు చెప్పిరి. ఆయన పరిశ్రుభమైన యభ్యాసములు గలిగియుండిరి.

పురుషోత్తముగారు తమ పద్యములలోగాని కీర్తనలలో గాని మార్పులు చేయవద్దని ప్రచురింపగోరిరి. ఆ సంగతి 1903 సంవత్సరము అక్టోబరు నెల బాప్టిస్టుమిషనెరీ రివ్యూ పత్రికకు దెల్పియుంటిమి. నేనాంధ్రదేశమున నుండుటచేత 1902 సంవత్సరము ఆయన గ్రంథ సముదాయమంతయు కటకపురిలోని మా కుటుంబము వారు నా చేతుల కప్పగించి పై విషయమున నేను శ్రద్ధ వహింపవలెనని కోరిరి. ఆయన మృతులైన వెనుక కుటుంబమువారు సెలవు లేకుండా ఆయన కీర్తనలలోని కొన్ని పదము లెవరో మార్చి వేసినందున 1896 సం॥ జనువరి 2 వ తేదిని ప్రచురింపబడిన The Christian Patriot అను పత్రికకు రావుసాహెబ్ డా॥రెవ॥టి. నారాయణస్వామినాయుడు గారిట్లు వ్రాసియుండిరి.

"He changed the best words and phrases and clauses of some of our grandest hymns composed by very eminent poets like Mr. Choudhuri Purushottam. I humbly ask him to let me know the authority for his proceedure. I don't think he would attempt to mutilate Shakespeare or Milton as he has done with our poets"

పురుషోత్తమకవి విరచిత గ్రంథములు - హిందుమత మునసున్నప్పుడు:- నీలాచలవిలాసమను పద్యకావ్య ప్రభంధము, రామశతకము, కృష్ణలీలలు, కొన్ని కీర్తనలు (1820).

క్రైస్తవమత స్వీకారము చేసినంతటి వ్రాసినవి:-

## కావ్యములు

**యేసునాయక శతకము (1845), యేసుక్రీస్తు ప్రభు శతకము (1845), పంచచామరపన్నములు (1845), రక్షణ చరిత్ర (1846), నిస్తార రత్నాకరము (1846), విగ్రహనిర్మాణము (1846), క్రైస్తవనీతి ప్రకాశము (1851), సత్యవేదసార సంగ్రహము అను క్రీస్తుపరతత్వము (1871), సత్యభజన (1874).**

## పత్రికలు

కులాచారపరీక్ష (1833), ముక్తిమార్గప్రదర్శనము (1846), మశూచి విషూచి సంకటభ్రాంతినివృత్తి (1862), మనసే మూలము?(1863), అంధకార నాశనము, బ్రహ్మజ్ఞానము, జగన్నాథపరీక్ష మొదలైనవి.

పూర్వము తాళపత్రముల మీద గంటము (లేఖనము) తో వ్రాయుట పురుషోత్తముగారికి అభ్యాసమైయుండుట చేత కాబోలు వారిదస్తురి ముక్తాఫలములవలె మిగుల కుదిరికగా నుండుటచేత నొకరు దానినిట్లు వర్ణించిరి.

కం. "ముక్కంటి కంఠమాలో!
వెక్కసముగ వేచికాచ - వెన్నెలజాలో!!
చొక్కంపు రత్నమాలో !!!
చక్కని పురుషోత్తమవ్రాలు - సరిముత్యాలో!!!!

పురుషోత్తముచౌధరిగారి బిడ్డలెల్లరు పరలోకగతులైరి. వారి కుమాళ్ళ యొక్కయు, ప్రథమకుమారి, మూడవ కుమారి యొక్కయు, వారి కుమాళ్ళు కుమార్తెల యొక్కయు మనుమలు, దౌహిత్రులు కొందరు వంగ, ఉత్కళ, ఆంధ్రదేశములలో చెదరియున్నారు. దయామయుడగు భగవంతుడు ఈ మా పితామహుని ద్వారా తన దివ్య రక్షణను మా కుటుంబమున కనుగ్రహించినందున ఆయన ఘననామమునకు నిరంతర ధన్యవాదములు.

చ॥ సురుచిరగీతముల్ మృదులసూక్తుల నిండిన పద్యకావ్యముల్।
పరగగవ్రాసి క్రీస్తు సభ - వారికి నర్పణసేసి చాలవ।
త్సరములు యేసువాక్కమిల - జాటి యశోధనమందియున్న చౌ।
ధరి పురుషోత్తమాఖ్యు చరితంబిదె వ్రాసితి భక్తకోటికై

# అనుబంధము

– జేమ్స్ జయశీల్ చౌధరి

కవి పురుషోత్తము చౌధరిగారు బాప్తిస్మము తీసుకున్న ప్రాతిపదికగా (6–10–1833) 1933 సం॥ ఆయన శతాబ్ధి ఉత్సవము జరిగినాయి. ఈ విషయములు కవి జీవిత చరిత్ర 14,15 అధ్యాయములలో చూడగలరు.

కవి జన్మదినప్రాదిపతికగా 2003–2004 సం॥లలో ద్విశత జయంతోత్సములు తెలుగునాట జరిపినారు. ఆయా పాంతములలో జరిగిన కార్యక్రమ వివరములు నాకు తెలిసినంతవరకు ఈ అనుబంధములో పొందుపరుస్తున్నాను. ఆలాగుననే కవి యొక్క రచనలు, కీర్తనలతో ప్రభావితులైన కొందరు పద్య రూపములో వారి అభిమానమును చాటుకొనిరి. ఆ పద్యములు కూడా పొందుపరుస్తున్నాను.

చివరిగా రెవ. బి.డి.పి రావుగారు (రాజమండ్రి), కవి విరచితమై "యెహెూవా మా తండ్రిగాడా" అనే కీర్తనను ఇంగ్లీషు భాషలోనికి అనువదించారు. దీనిని కూడా ఇందులో పొందుపరుస్తున్నాను.

## శ్రీకాకుళం

శ్రీకాకుళం జల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం వారు శ్రీ డి.ఎల్.బి.ఎల్. కుమార్ గారి అధ్వైర్యములో శ్రీకాకుళపట్టణములో2003సం॥ అక్టోబరు 11,12 తేదిలలో కవి పురుష్తోముచౌధరి ద్విశత జయంతి ఉత్సవములు ఘనంగా జరిపారు.

11.10.2003 తేదీ ఉదయుము కవి రచించిన కీర్తనల పోటీలు డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగాయి. సాయంత్రము కవి యొక్క జీవిత చరిత్ర విశ్లేషణ జరిగింది, శ్రీ జాలాది రాజారావు ( ప్రముఖ సినీ రచయిత ) గారు ప్రత్యేక

ఆహ్వానితులుగా,శ్రీమతి పైడిసెట్టి జయంతి, మునిసిపల్ చైర్‌పెర్సన్, గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

12.10.2003, ఆదివారము, ప్రత్యేక ఆహ్వానితులు బి.డి.పి.రావు (రాజమండ్రి)

శ్రీ జేమ్స్ జయశీల్ చౌదరి(నల్గొండ) మున్నగు వారు పట్టణములో నున్న చర్చి ఆరాధనలలో పాల్గొన్నారు. ఆరాధనలలో ముఖ్యాంశము కవి పురుషోత్తము చౌధరి గారి సేవ , కీర్తనలు, జీవిత చరిత్ర. సాయంత్రము (ఎన్.టి.ఆర్.మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఘనంగా సభ జరిపారు. కవి విరచిత కీర్తనల సంగీత విభావరి అన్ని సంఘముల యూత్ కలసి జరిపారు, జిల్లా లోని అన్ని సంఘముల పాష్టర్లు , బోధకులు, శ్రీకాకుళపట్టణ ప్రజలు సంగీత విభావరిని ఆస్వాదించారు. , ప్రత్యేక ఆహ్వానితులు రెవ, బి.డి.పి. రావు గారు, శ్రీజేమ్స్ జయశీలు చౌధరిగారు, కవి యొక్క రచనలు, సాహిత్యము గురించి, జీవిత చరిత్ర గురించి మాట్లాడారు, రెవ గోడే సామ్యేలు గారు కవి పురుషోత్తముచౌధరిగారి రచనలు,సాహిత్యము,జీవితము గూర్చి చక్కని విశ్లేషణతో ప్రసంగించారు, తర్వాత జిల్లాలోని పాష్టర్లందరినీ సన్మానించారు.

## విజయనగరము

2003 సం॥ సెప్టెంబరు 5,6,7,వ తేదీలలో జిల్లా ఉత్సవ కమిటీ అధ్వైర్యములో కవి పురుషోత్తము చౌధరి ద్విశత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీయుతులు వై.రాబర్ట్‌సన్, జి.ప్రసాద్, వి.మాసిలామణి, టి.శాంత కుమార్, రెవ, పి.థియోఫిలస్, పాష్టరు అలజంగి రవికుమార్‌గార్ల పర్యవేక్షణలో కీర్తనల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానము గావించారు, డా॥ ఎస్.టి.జ్ఞానానంద కవి, కాకినాడ, శ్రీ ప్రత్తిపాటి దేవసహాయము, గుంటూరు, డా॥ డి.వి.డానియెల్, విజయవాడ, గార్లకి సన్మానము జరిపారు, శ్రీ ఎ.ఆర్.స్టీవెన్‌సన్, హైదరాబాద్ వారు చక్కని సంగీత విభావరి జరిపారు.

కవి ద్విశత జయంతి సందర్భంగా ప్రత్యేక సంచిక విడుదల చేశారు.

2009 సం॥ సిమ్స్ బాప్టిష్టు చర్చివారు కవి పురుషోత్తము చౌధరి కీర్తనలే ప్రధానముగా ఆలపించే కార్యక్రమాన్ని జరిగించారు. డా॥ రావెల జోసెఫ్ గారు (హైదరాబాద్), రెవ. బి.డి.పి రావుగారు (రాజమండ్రి), మైనారిటీస్ కార్పోరేషన్ శ్రీ ఎం.డి.సుధీర్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు, శ్రీ జె.జె.చౌధరి, సంఘమిత్ర

ఆర్.ఎస్.జాన్ గార్ల పర్య వేక్షణలో కార్యక్రమము జరిగింది, చర్చి క్వయర్ వారు,రెవ.బి.డి.పి రావు గారు  కొన్ని కీర్తనలు పాడగా, శ్రీ వరలక్ష్మి త్యాగరాజు సంగీత, నృత్యకళానికేతన్ విజయనగరం ఉపాధ్యాయులు, విద్యార్ధులు కర్ణాటక సంగీత కచేరి బాణిలో ఆంధ్రక్రైస్తవ కీర్తనలు ఆలపించారు.

## తగరపువలస

చిట్టివలసలో కవి పురుషోత్తముచౌధరిగారు 1862 సం॥ నుండి 1870సం॥ వరకు పాష్టరుగా పని చేశారు. ఆయన పని చేసిన లండన్ మిషనరీ సోసైటీ చర్చి వారి అధ్వైర్యములలో ది.19.9.2003 నాడు తగరపువలస జూట్ లేబరు వెల్ఫేరు సెంటర్‌లో ద్విశత జయంతి ఉత్సవాలు జరిపారు, ముఖ్య అధితులుగా శ్రీ జె.జె. చౌధరి, డా॥ డి.డి. చౌధిరి (కవి ఐదవ తరపు మనవులు), వాక్యోప దేశికులుగా రెవ. ఎమ్.పాల్ అగస్టీను (హైదరాబాద్ బి.ఇ.ఎమ్. కార్యదర్శి) బ్రదర్ ఎ.జెన్నీ క్రిష్టోఫర్ , ఖమ్మం గారు పాల్గొన్నారు, శ్రీ రత్నయ్య (రిటైర్డ్ తాశీల్‌దారు) గారు కవి జీవితచరిత్ర తెలియ జేయగా, శ్రీ జె.జె.చౌధిరిగారు 'వాగ్గేయకారునిగా కవి పురుషోత్తము చౌధరి గారు' అన్న  అంశము పై మాట్లాడారు.

ఈ కార్యక్రమము డా॥ డి.జె.మోహన్ కుమార్(అధ్యక్షులు, క్రిష్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్, చిట్టివలస) గారి పర్యవేక్షణలో జరిగింది.

## పర్లాఖిమిడి (అంతర్వేది)

బాబు జాన్ చౌధరి గారి కీలక నేత్రుత్వములో 'అంతర్ వేది- పురుషోత్తము మెమోరియల్ హాల్ నిర్మాణము జరిగి, 1908 సం॥లో ఆలయ ప్రతిష్ట జరిగింది. ఈ భవంతి శిధిలావస్తకు చేరు కొనగా, దాన్ని పడగొట్టి దాని పైనే కొత్త భవంతి నిర్మించ బడింది. కొత్త భవంతి నిర్మాణములో పాష్టరు పురుషోత్తము చౌధరి (కవి మునిమనవుడు)గారి పెద్ద కుమార్డు  డా॥ ఎస్.ఎస్.చౌధరి,దౌహిత్రులు డా॥ రవి మోహన్, డా॥ ప్రదీప్ కుమార్ గార్లు కీలక పాత్ర వహించారు.

ఈ క్రొత్త భవనము తే 5.09.2003 నాడు పున:ప్రతిష్ట జరిగింది, ముఖ్య అతిధిగా రెవ డా॥ డి.వి.డానియెల్ (మాజీ డైరెక్టరు, సువార్తవాణి విజయవాడ) గారు, గౌరవ అధితులుగా రెవ జి.బాబు రావు హైదరాబాద్ , శ్రీ డేవిడ్ కె.శర్మ

వైజాగ్, డా॥ పి.రవిమోహన్,వైజాగ్ గార్లు పాల్గొన్నారు, కార్యక్రమము డా॥పి.ప్రదీప్ కుమార్ (అధ్యక్షులు, చర్చి కమిటీ) అధ్యక్షతన జరిగింది, కవి పురుషోత్తముచౌధరి, రెవ. దాస్ అంతర్వేదిగార్ల జీవిత విశేషాలు సభలో తెలియజేస్తూ కవి కీర్తనలు గానము చేశారు. చర్చి కమిటీ ట్రెజరర్ శ్రీమతి శాంతాబాయ్ చౌధరి గారు క్రొత్త భవన నిర్మాణము ఏవిధంగా జరిగిందో తెలియజేశారు.

## విశాఖ పట్టణం

శతజయంతి, ద్విశతజయంతి ఉత్సవాలు, జన్మదినానికి ముందుగా కాని వెనుకగా గాని సంవత్సరముపాటు జరుపుతారు

**స్థలము:- కళాభారతి, పిఠాపురము కాలని : విశాఖ**

**తేది :- 27-06-2003.**

వై.ఎమ్.సి.ఎ విశాఖపట్నం వారు కవి పురుషోత్తము చౌధరిగారి ద్విశత జయంతి ఉత్సవము ఘనంగా ప్రారంభించారు. డా॥ ఎన్. జయకుమార్‌రావు గారు, శ్రీ రోలండ్ విలియమ్స్‌గారు, శ్రీ జి. మాత్యూపీటరుగారు, కార్యక్రమము చక్కగా నడిపారు. డా॥ డి.వి. డానియేల్ గారు క్లుప్తసందేశమిచ్చారు. డా॥ నిట్టల సుధారత్నాంజలి గారు పురుషోత్తముచౌధరిగారి రచనలపై చేసిన పరిశోధనకై ఆమెకు, రెవ.డా॥ బి.డి.పి.రావుగారు తెలుగు క్రైస్తవ కీర్తనలు సుమారుగా 16000 కీర్తనలు సేకరించినందున వారిని సన్మానించారు. కీ॥శే॥ఆర్.ఆర్. సుందర్‌రావుగారి “తెలుగులో క్రైస్తవ సాహిత్యం” అనే పరిశోధనాత్మక గ్రంధము కొరకై వారికి మరణాంతర బిరుదు ప్రధానము చేయగా వారి జ్యేష్ఠ కుమారుడు ప్రొఫెసర్ ఆర్.డి. సంపత్ కుమారుగారు అందుకున్నారు.

శ్రీమతి ఎమ్. శశిరాణిగారు **“యెహోవా మా తండ్రిగాడ” “దేవుడిచ్చిన దివ్య శాస్త్రమిదేను మనకో యన్నలారా”** అనే కీర్తనలు శాస్త్రీయంగా కర్ణాటక సంగీత బాణీలో ఆలాపించారు. శ్రీ కె.ఎస్. చంద్రశేఖర్ గారు కవి రచించిన కీర్తనలను శ్రావ్యంగా ఆలాపించారు.

26-06-2003 తేదిని జరిపిన “పురుషోత్తముచౌధరి” గారి కీర్తనల పోటిలో విజేతలకు బహుమతి ప్రదానము గావించారు.

**స్థలము:- గురజాడ కళాక్షేత్రము**

**తేది :- 2003 సెప్టెంబరు 5,6,7**

ద్విశతజయంతోత్సవములు వై.యం.సి.ఎ వారి అద్వర్యములో జరిపారు. 5వ తేదిన శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరిగారు సంకలనము చేసిన "ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు పురుషోత్తము చౌధురి రచనలు - సంపుటి1" ఆవిష్కరింపబడి ప్రధమ కాపీ కవి 5వ తరము మనవడు శ్రీ జాన్ న్యూటన్ చౌధరి (రిటైర్డ్ డిప్యూటి డైరెక్టర్, ఏనిమల్ హస్‌బెండరీ డిపార్టుమెంట్, ఒరిస్సా గవర్నమెంట్) గారికి బహూకరించబడినది. అటు తర్వాత రెవ.బి.డి.పి. రావుగారు(రాజమండ్రి) కవి వ్రాసిన కీర్తనలు, వాటి గొప్పతనము గురించి వివరించారు. శ్రీ జె.జె. చౌధరి గారు కవి రచనలు గురించి వివరించారు. క్రీస్తుభారతి, హైదరాబాద్ వారు కవి కీర్తనలకు అనుగుణంగా నృత్యప్రదర్శన చేశారు. డా॥ ఎమ్.ఎస్ శాంతవర్ధన్‌గారు(గుంటూరు) వారు వాక్యోపదేశము చేశారు. వై.ఎమ్.సి.ఎ విశాఖపట్నం వారు సెప్టెంబర్ 5వ తేదీన ప్రీచర్స్ డే గా జరుపుకొంటున్నారు.

**స్థలము:- కళాభారతి, పిఠాపురము కాలని, విశాఖ**

**తేది :- 2003 అక్టోబరు 6.**

చౌధరి వంశీయులు ద్విశత జయంతోత్సవములు జరిపినారు. (1833 అక్టోబరు 6వ తేదిన పురుషోత్తముచౌధరిగారు కటకములో బాప్తిస్మము తీసుకున్నారు.) రెవ.డా॥డి.వి డానియేల్ (మాజీ డైరెక్టర్, సువార్తవాణి) వాక్యోపదేశము చేయగా, రెవ. బి.డి.పి రావుగారు కవి యొక్క కీర్తనల విశ్లేషణ చేశారు. శ్రీ పి. జగన్నాధముగారు (పాలకొండ) కవి యొక్క రచనలపై సాహిత్య సమీక్ష చేశారు. శ్రీ పాడేటి కమలాకర్ (హైదరాబాద్) గారు తమ వాద్య బృందముతో కవిగారి కీర్తనలు ఆలాపించి అలరించారు.

# హైదరాబాద్

రెవ. డాక్టర్ రావెల జోసెఫ్, ప్రెసిడెంట్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ చర్చి గ్రోత్ అండ్ లీడర్ షిప్ (ఐ ఐ జి ఎల్)హైదరాబాద్, ఆధ్వైర్యములో కవి పురుషోత్తము చౌధరి ద్విశత జయంతి ఉత్సవములు ఘనంగా ప్రారంభమయినాయి. రెవ.ఆర్.జయపాల్, బ్రదర్ వి.కె. హెన్రి గార్ల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగినాయి.

తేది 31-08-2003 నాడు సెంటినరీ బాప్టిస్టు చర్చి, సికిందరాబాద్‌లో కవి విరచిత కీర్తనల పోటీ జరిగింది. విజేతలకు 05-09-2003 నాడు బహుమతులు ఇవ్వబడినవి.

తేది 03-09-2003 నాడు ఎ.సి.టి.సి, గాంధీనగర్, హైదరాబాద్‌లో కవి సాహిత్యముపై వేదాంత చర్చ జరిపినారు. ఎసిటిసి ప్రొఫెసర్లు, పాస్టర్లు పాల్గొన్నారు.

తేది 04-09-2003 నాడు లూథరన్ చర్చి (రవీంద్ర భారతి వద్ద) హైదరాబాద్‌లో కవి జీవితము, సాహిత్యముపై వివిధ ప్రాంతముల నుండి వచ్చిన కవి అభిమానులు కవితలు చదివి వినిపించారు. ఎ.పి.సి..సి సెక్రటరీ ఆలివర్ గారు, శ్రీ ఎండ్లూరి సుధాకర్ గారు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పై మూడు సందర్భాలలో శ్రీ జేమ్స్ జె. చౌధరిగారు హాజరైనారు.

తేది 05-09-2003 నాడు హరిహరకళాభవన్ సికిందరాబాద్‌లో కవి 200 జన్మదిన వేడుకలు జరిగినాయి. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత కవి డా॥ సి. నారాయణరెడ్డి గారు, జంటనగరాల పాస్టర్లు, బిషప్‌లు, క్రైస్తవ ప్రముఖులు సభను అలరించారు.కవి విరచిన కీర్తనలు ప్రముఖ క్రైస్తవ గాయనీ, గాయకులు, 31-08-2003 నాటి విజేతలు, బ్రదర్ వి.కె. హెన్రీగారి సంగీత దర్శకత్వములో గానము చేసి సభను అలరించారు.శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరిగారు సంకలనము చేసిన “ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు పురుషోత్తము చౌధరి రచనలు సంపుటి - 1” ని సభలో ఆవిష్కరించారు. కవి విరచిత కీర్తనల క్యాసెట్ విడుదల చేశారు. డా॥ రావెల జోసెఫ్ గారు, డా॥ జి.సామ్యేల్ (నారాయణగూడ బాప్టిస్టు చర్చి) గారు, మరికొందరు క్రైస్తవ ప్రొఫెసర్లు, ప్రముఖులు ఉపన్యసించారు. సభ చాలా ఘనంగా జరిగినది.

తేది 22-08-2004 నాడు ఆంధ్రప్రదేశ్ క్రిష్టియన్ ఫోరమ్‌వారు, శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరిగారు సంకలనము చేసిన "ఆంధ్రక్రైస్తవ కవి సార్వభౌముడు పురుషోత్తము చౌధరి సాహితీ సౌరభాలు" (సంపుటి-2) ను డా॥ దాస్‌బాబుగారు, డా॥ రావెల జోసెఫ్‌గారు, పరిచయము చేయగా మోస్ట్ రెవరెండు డా॥ మారంపూడి జోజిగారు ఆవిష్కరించినారు. ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా మంత్రి గౌరవనీయులు నాయని నరసింహారెడ్డిగారు, శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరి, శ్రీ గిడుగు రామమూర్తి, శ్రీ మహమ్మద్ గౌస్ గార్లను శాలువలు కప్పి సన్మానించినారు. శ్రీ పాడేటి కమలాకర్ గారి బృందము కవి విరచిత కీర్తనలను ఆలాపించి సభను అలరించారు. సభకు విచ్చేసిన ప్రముఖులు - శ్రీ స్వర్ణజిత్ సేన్ ఐ.పి.యస్, శ్రీ స్టాన్లీబాబు ఐ.ఆర్.టి.ఎస్, పాస్టర్ నల్ల తామస్, రెవ.బి.డి.పి రావుగారు మున్నగు వారు వేదిక నలంకరించారు. బిషప్ తారానాథ్‌సాగర్ (మెథడిస్ట్ చర్చి) గారు, సందేశమిచ్చారు. డా॥ దాస్‌బాబు, శ్రీ విజయ శిఖామణి, డా॥ ఎన్.జె.ప్రభాకర్ గార్లు కార్యక్రమమును ఘనంగా జరిపించారు.

తేది 05-09-2004 నాడు ఐ.ఐ.జి.ఎల్ వారి ఆధ్వైర్యములో డా॥ రావెల జోసెఫ్, రెవ. రావెల జయపాల్ గార్ల పర్యవేక్షణలో ద్విశత జయంతి ముగింపు సభ ఘనంగా జరిగినది. ముఖ్య అథితి శ్రీ గోపినాథ్ రెడ్డి ఐ.పి.ఎస్.గారు "పురుషోత్తము చౌధరి గారిపై ఇంటర్‌నెట్‌లో వెబ్‌సైట్ ఆవిష్కరించారు. సభను జంటనగరాలలో నున్న ప్రముఖ పాస్టర్లు, ఎ.సి.టి.సి ప్రొఫెసర్లు, రెవ. బి.డి.పి రావుగారు రాజమండ్రి, శ్రీ జేమ్స్ జయశీల్ చౌధరిగారు అలరించారు. బ్రదర్ వి.కె హెన్రీ గారి సంగీత దర్శకత్వములో ప్రముఖ గాయనీ గాయకులు కవి గారి కీర్తనలు పాడి సభను అలరించారు.

## మదనపల్లి

తేది 05-09-2003 .జె.సి.ఎమ్ చర్చి, మదనపల్లి వారి ఆధ్వైర్యములో స్థానిక కమ్యూనిటీ హాలు నందు కవి పురుషోత్తము చౌధరి ద్విశత వేడుకలు ఘనంగా జరిపారు. చెన్నై, బిట్రగుంటల నుండి వచ్చిన గాయనీ, గాయకులు, పాస్టర్ జయరాజుగారు, స్థానిక చర్చెస్ యూత్‌వారు, కవి కీర్తనలు గానం చేసి సభాసదులను అలరించారు. స్దానికంగా పనిచేస్తున్న తెలుగు - హిందీ పండిట్, కవి సొలొమాన్‌రాజ్, విజయవాడ, కవి హెన్రీ మదనపల్లి, వారు కవి కీర్తనలు విశ్లేసించి వివరించారు. కవి కీర్తనలకు అనుగుణంగా పిల్లలు నాట్యము చేశారు. శ్రీ జాన్ భాస్కర్‌గారు, శ్రీ బెంజమిన్‌గారు కార్యక్రమమును పర్యవేక్షించినారు.

## బళ్ళారి

శ్రీమతి డి.రాధగారు, బళ్ళారి సి.ఎస్.ఐ చర్చి వారి సహకారముతో కవి పురుషోత్తము చౌధరిగారి ద్విశత జయంతి ఉత్సవములు ఘనంగా జరిపినారు. శ్రీమతి రాధగారు, పాస్టర్ జయరాజుగారు, స్థానిక గాయనీ, గాయకులు కీర్తనలు ఆలాపించి సభను అలరించారు. బళ్ళారిలో పురుషోత్తము చౌధరిగారు 1834 సం॥ లో ఒనరించిన సేవను స్మరించుకున్నారు.

అనంతపురములో పాస్టర్ జయరాజుగారు, ఫీబా రేడియో వారి ఆధ్వైర్యములో, కర్నూలులో లేటు కె.జోసెఫ్ గారి

ఆధ్వైర్యములో, విజయవాడలో శ్రీ శివాజి (స్పందన)గారి ఆద్వర్యములో, పలమనేరులో పాస్టర్ డి.సి మోహన్‌రాజ్ గారి ఆధ్వైర్యములో, హూబ్లిలో రెవ.సుధాకర్, రెవ.ఫ్రడక్ ఆధ్వైర్యములో కవి పురుషోత్తము చౌధరిగారి ద్విశత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగినాయి.

**జోహారు । జోహారు ॥ ఓపుణ్య పురుషోత్తమ చౌధరీ॥**

***ద్విశత జయంతోత్సవ శతకోటి జోహార్ల గేయ పుష్పాంజలి***

**రచన : రెవ డి.సి.గిడియన్, జి.టిహెచ్.,**

బాప్టిష్టు చర్చి, లంకెలపాళెము,

పరవాడ, విఖాఖపట్నం, 531021

జోహారు, జోహారు ఓపుణ్య పురుషోత్తమ చౌధరీ!
జోహారు నీకు.... ద్విశత జయంతి సంబరాన!
జోహార్లు జేకొనుము.... అంబరాన ఓ దివ్యతేజా!
జోహారు లర్పింతు.... ఓ నిత్య సత్య చరితా!

పురుషులందు........ పుణ్య పురుషడవీవు
పురుషోత్తమా ...... నీ నామ మందే
పురుషార్థము ......... సమ్మిళితంబాయె
పునీతమాయె నీదు జన్మ .........ధర స్థిర స్థాయిన్

జగతి నీ జననీ జనకుల్ .....సుభద్రా కూర్మనాధ
జన్మస్థాన తెంబూరు ..... దరి మదనాపురి
జన్మతహ గౌధ బ్రాహ్మన ....... పంశోన్నత ద్వి
జన్మ దీక్షన్ బడసి.... హైంద వేదాంతి వైతివీవు

బాల్యమందే ........ భక్తి బావాల బొంది
బుద్ధి విజ్ఞాన హైంద... వేద పురాణ పుక్కిట బట్టి
భువన ఖాయ వయసు .....మెండాయె వృద్ధి
భగవద్భయ భక్తి శ్రద్ధ ..... నెనరున గ్రాహ్యంబై

దేవాన్వేష శరవేఘ ....... జి జ్ఞాసాయుతంబై
ధరన్ శతకోటి దేవ ......... దేవతా నామ స్మరణ జేసి
దినమునకొక్క .......... దేవుళ్ళు పుట్టుచున్నటి యీ
ధరిత్రిన్ బూర్ణయాధ్యాత్మిక ..... బహు చింతా గ్రాహియై

భారతావనిలో ... తొలి ముద్రితా విరచిత
బాప్టిష్టు మిషనరీ ...... విలియం కేరి త్రయం ప్ర
బోధిత కరపత్ర ...... సందేశ హృది స్పందించ
భావోద్రేక పూర్ణుడై ..... సత్య దేవాన్వేషారంబమాయె
విలియం డాసన్ ..హెలెన్నాట్ సతి మేజర్ బ్రెట్
వాక్య ప్రభోదములు ........ క్రిస్తుసువార్తా శక్తి నొంది
విశాఖలో తొలి యనువాద ........ క్రొత్త నిబంధన చేబూని
విశ్వాస బేవితారంబ ....... నీ వినూత్న జన్మ

జననీ జనక ... జన్మస్థాన మిడచి
జీవితార్ధాంగి ..... బంధు వర్గాలన్ విడచి
జనకుల కట్టు బాట్లు ..... కూకటిన ద్రెంచి
జగద్రక్ష క్రీస్తు సువార్తా ..... భారవాహకంబై

యెంతో సుందరమైనవీ ...... సువార్తా సుందర నీపాదాలు
యెంతో యందంబాయె ... ధరగిరులపై
యాసేతు బెంగాలు మొదలు... మద్రాసుకు నీపాదయాత్ర
యేసు రక్షణ వార్త ........ జాటు జనవెడలె

నీపాదాలు పారాడిన ... పురములన్నీ
నాడు నిను దూషించి ...... రేమోగాని
నుడు ప్రతి పురమున ... పల్లె పల్లెలందు
నిజమిది వేనవేలు... క్రీస్తు ఆలయాలు వెలసిల్లె జూడ

ఆంధ్ర ఒరియా బెంగాలు ... తమిళ ప్రాంతాల నీసేవ
అందుగల నిందు లేదను... సందేహమేవలదు
అన్ని ప్రాంతాల నీ సుమధుర... సందేశ గీతాలు
అనంతానంద గాన .... ప్రతి గానాల పెన్నిధి

అక్షర సత్యసాహిత .... ముద్రితా విరచితాలు
అన్ని కులాల కూలంకష... కులాచార పరీక్ష నీతి ప్రకాశం
అంధ కార నాశన, ముక్తి మార్గ ప్రదర్శనం... రక్షణ చరిత్ర
అందు జగన్నాధ పరీక్ష ... సత్య వేదసార సంగ్రహం ప్రాముఖ్యం

మరువలేము నీదు... మాధుర్య గీతోపదేశాలు
మన్నాను బోలు రుచి ... నీ పాటల సందేశాలు
మణిమాణిక్యాలు .... వేల వేలు సాహిత్య సంపుటాలు
మీందు మిక్కిలి వాగ్గేయ ... ప్రచార ప్రభోద సంగీత కర్త

యేమని నిను పొగడ .... మాటల్ చాలవు
యదలో పాటల పల్లవుల్లా .... రాగతాళ సమ్మేళన సంపత్తి
యవని నీ కీర్తి చిర జీవనం ... నీ కీర్తన జ్ఞాపక చిహ్నాలు
యేసు జగద్వియాగమన... నీవు నిజ కీర్తి శేషుడవు.
యేసు ప్రభో, నాయకయన్.... ద్విశత గేయ సంపుటాలు
యేసు జగతి నేతెంచు ... ద్వితీయాగమన కాలాన
యాదృశ్చిక నీదు ...... ద్విశత జయంతోత్సవాలు
యేయాశ్చర్యం నీతిమంతుడా .... నీదు జ్ఞాపకాశీ ర్వాదాలు

ద్విశత వసంతాల ... తే జో మూర్తి
దివ్య సౌందర్య సారూప్య ... వాగ్గేయ పురుషోత్తమా!
ద్విశతాధిక మాడెందాల... వందనామూర్తి
దేశ విదేశాల నీకీర్తి .... ప్రతి చోట ప్రజ్వరిల్లు

# కొండంతలో గోరంత

దేవుని సృష్టిలో

గాలి వీచును... పూవులు పూయును

నింగిలోని తారకలు వర్ణాలు శోభిల్లును

దిక్కు దిక్కులా ...దివ్య గీతములు

ఎవరు వీటికి వారసులు?

ప్రమోద వీణలు కమాచి పాడగా

సెలయేళ్ళు లేళ్ళను లాలిస్తూ...

జల జల పారు ఆ నీటి సవ్వడులు ఎన్నటికి మారవు కదా

సృష్టిలోని తియ్యదనం ఎంత శాశ్వితమో

ఈ భువిలో వెలసిన మహా తపస్య కవితా జ్వలనసింహుడైన **'చౌధరి'** గారి

రచనలు అంతే శాశ్వితం

" నిగర్వి రచనా, దురంధరుడు, విశ్వవిఖ్యాత, స్నేహశీలి

పురుషులలో ఉత్తముడైన "పురుషోత్తమ చౌధరి" అందుకో మా నిండు హృదయ

నీరాజనాలు

కాలం మారినా, యుగాలు గడచినా, తరతరాలు ముగిసినా మరువలేము

నీవు ఈలోకానికి అందించిన మణిపూసలాంటి **"ఆంధ్ర క్రైస్తవ కీర్తనలను"**

పుట్టిన శిశువు దగ్గరనుండి మూడు కాళ్ళ ముదుసలి వరకు నీ పాట పాడని

వారు ఎవరైనా యుందురా? ఏ క్షణమైనా సరే, ఏగడియైనా సరే కూని రాగాలు

తీస్తూ స్మరించెదము నిన్ను ఓ దివ్యమూర్తి..

రక్షకుడైన యేసును నీలో మలచుకొని, తలచుకొని అందించినావు ఈ లోకానికి

అతి మాధుర్యమైన మహాజ్వల ప్రేమపూరితమైన కళాఖండాలైనా నీ 'స్వరచనా

గీతాలు'

ఏ పాట పాడినా ఏ గీతాన్ని తాకినా, స్మరించినా..

అందులో మూర్తీభవించేది "యేసు ప్రేమ"

ఏ రీతిచూసినా నీ హృదయం నుండి పొర్లిపారేది

ఆ కల్వరి 'సిలువ ప్రేమే'

బాధలలో ఉన్నవారికి అదరణ నిచ్చును నీ మధుర గీతాలు
అన్యులకు దారిచూపును నీకలము నుండి ఉద్భవించిన 'అణియుత్యాలు'
మంగళ కార్యమునుండి.... యేసు రాకడ వరకు
ఎన్నో, ఎన్నెన్నో సదర్భానుచిత సురాగాలతో
రచనా శైలితో మమ్మాశ్చర్య చకితులు చేశావు
విరభూసిన మల్లె, నింగిలోని నెలవంక
ఏ సందేశం తెల్పునో నాకైతే తెలియదు కానీ..
నీ రచనా అమృత బిందువులు.. మధురామృతాన్ని
గ్రోలిన అనుభవాన్ని మాకిస్తున్నాయి.
నీ కలమునుండి జాలువారిన నవరత్న కజక మణులు లాంటి
రచనా శైలితో పరలోక వైభవమును మాకళ్ళముందు ఉంచితివి
ఏమని పొగడగలము నిన్ను 'కవులలో ఇంద్రుడవైన కవీంద్రా'
ఏమని వర్ణింతుము మనుషులలో ఉత్తముడైన ... 'పురుషోత్తమా'
నిను గురించి వర్ణించుటకు నీ కవితా లోకమును సంగ్రహించుటకు
**'నేనేపాటి వాడను'**
ఓటికుండ వంటివాడను.. మట్టి పాత్రవంటివాడను
స్మరించుకోని ఈ క్షణాన నీ తీపి గురుతును... మధుర స్మృతులు...
ఆజన్మాంతం వివరించినా సరిపోదేమో ఏమి తెలియని నేను.. 'కొండంతలో గోరంత'లా
నా కవితా దీపికను అర్పిస్తూ .. నీ కలానికి అంకితం చేస్తూ....

**కె. ప్రసాద్**
Supervisor COREED Intemational
Kavali, Nellore Dt.

## తెలుగు క్రైస్తవ కవిసార్వ భౌముడు రెవ, పురుషోత్తమ చౌధరి
## (1803-2003)
### ద్వి శత జయంతి - మహోత్సవ సందర్భమున సమర్పించిన
# పద్య నీరాజనములు

పదునెనిమిది వందల మూ
డుదయము - ఒక శుభమగు -మహోన్నత తిథిలో
పదపడి సెప్టెంబరు నెల
ముదముగ ఐదవ దినమున -పుట్టెధరిత్రిన్

వంగ రాష్ట్రములోన - విప్రవంశమందు
చౌధరి పురుషోత్తమ కవి - చక్రవర్తి
పెరిగి కార్యార్థమై - బరంపురము జేరె.
తనకు దానె సాటి యనంగ- ధర్మ మేమొ

పరలోకాధిపు దేసురాజని- భువిన్। బాప్తిస్మమున్ పొంది,స
త్వరమే, క్రైస్తవ భక్తి గీతములు - భావస్ఫూర్తితో వ్రాసి, యీ
ధర కందించి - సగౌరవంబుగను వేదాంతాది సాహిత్య మం
దు- రహిన్ గాంచి జయంబు గంటివి । కవీంద్రూ పూరుషోత్తం । సుధీ.

పర్లాకిమిడి నృపవరుల సంస్థాన -మం
దాస్థాన కవులుగా - అలరినాడు
మృదు వచ: కౌశల సదయుడై - ప్రభుయేసు
ప్రవచనములు బోధ - పరచినాడు
క్రైస్తవుల తెలుగు కవి సార్వభౌముడై
రసరమ్య గీతముల్ - వ్రాసినాడు

క్రైస్తవ నీతి ప్రకాశము - శ్రీ సత్య
వేద సారము వ్రాసి - వెలిగినాడు
నూట యెనుబది మూడు - నీ పాట లెపుడు
హర్షమున క్రైస్తవులు - ప్రార్థనాలయమున
ప్రభుని కీర్తించి తనివిదీర - పాడుచుండ
సంతసము జెందుచుంటివా? స్వర్గపురిన

ఉన్నత మౌ పదంబునకు యోగ్యతబెంచి - గమించినావు, అ
భ్యున్నత కీర్తి కాంతులను పొంది యనంతము నింపినావు, స
ర్వోన్నతుడైన క్రీస్తు నిజరూపము లోకము జాటినట్టి,లో
కోన్నత ! స్వర్గధామ ! సుగుణోత్తమ! చౌధరి పూరుషోత్తమా!

రామ శతకము రచియించి రాణకెక్కి
క్రిష్ట లీలలు వ్రాసి - సత్కీర్తిగాంచె
అతని భక్తి సాహిత్యాల నరయ తరమె।
ఆ - మహోన్నతామణికి - జోహారు లివియె.

**రచన**
**మల్లపరపు వెంకటరావు. ఎం.ఏ (లిట్) బి.ఎడ్,**
ఉత్తమోపాధ్యాయ పురస్కారగ్రహీత,
చీమకుర్తి - ప్రకాశం - జిల్లా.

సమర్పణ
రావెల జోసఫ్ గారు;
ఆంధ్రక్రిష్టియన్ థియోలాజికల్ కాలేజి
గాంధీనగర్ - హైదరాబాద్.

వేదిక :- లూథరన్ చర్చి - లకిడీకాపుల్
తేది :- 04-09-2003

## చౌధరి పురుషోత్తముగారి ద్వితీయ శతజయంతికి స్తుతులు

కం॥ పురషోత్తము చౌధరి చరితం
కరమర్దుగా కొంత తెలుపకోరితి నిచటన్
కరుణామయు సేవజేసియు పరమునకేగినట్టి కాలమువరకున్
జనకుడు కూర్మనాధుడు జననియు సుభద్రదేవికిల జన్మించెన్

సీ॥ అష్టాంగ యోగముల్ నవని తెలిసినవాడు
వేదపండితునిగా ధరవాసికెక్కె
అష్టదశపురాణములు అరయంగ పఠియించి
అష్టావదానిగ ఆంధ్రరాష్ట్రమునందు చాటిచెప్పిన ధరమేటికాడు
కవిపండితుడై కలముబట్టియు కళలొలికించిన గొప్పకావ్యదిట్ట

గీ॥ ఇట్టిమాన్యుని వర్ణించి నిలను వశమా!
అట్టిహాసంబుకలిగిన అందగాడు
పొట్టబుట్టెను చౌధరి కుటుంబమందు
పట్టుబట్టియు వదలని కార్యశీలి

కం॥ నవ యేడుల రాధమణితో
సవినయముగ పెండ్లిజరిగె సంతోషమునన్
నయమును జరుగక ముందే
కనుమూసిరి తల్లితండ్రులు కాలముదీరి

కం॥ ఆదాయమిసుమంత లేక
బాధలతో కృంగిపోయె బాలికసతితో
కాదని బంధువులు ద్రోయగ
చేదోడును లేక తిరిగెనేమిచేయను లేక

కం॥ చదివెను క్రైస్తవపత్రిక
చదివెను దానిలోని సంగతులెల్లన్
చదివెను సర్వము యేసని
మదినమ్మెను యేసుప్రభుని మహిమలోజేర

కం॥ పాపినని, తెలిసికొనియు
పాపంబులు ఒప్పుకొనియు ప్రభుచెంతనుజేరె
పాపుల రక్షకుడేసని ప్రజలకు ధారపోసి ప్రాణంబిడెను
ఘనముగ పేరు గాంచియు
కనుమూసెను ధరను కీర్తిశే శంబిడియున్

బళ్ళారి,ఒరిస్సా,మద్రాసు
ఎల్లరు లేకుండ తిరిగి యేసును చాటెన్
ఇల్లును, ఒళ్ళునుగానక పల్లెలు పట్టణములు తిరిగి
ప్రకటించెను ప్రభువున్

వ్రాసెను కులాచారపరీక్ష
వ్రాసెను సత్యవేదసంగ్రాహంబున్
వ్రాసెను నీతిప్రకాశిక వ్రాసెను క్రైస్తవ సంకీర్తనలెన్నో

పదినెనిమిది వందలమూడు
ఐదవ సెప్టెంబరందు అవతరించెన్ దరలో
పదినెనిమిదివందల తొంబై
ఇరువది మూడు ఆగష్టునందు విడిచెను పుడమి

ద్వితీయశతజయంతి పురుషోత్తముని
మతిమంతులు జరుపుకొనిన మహిమయు
స్థితిమతిలందు ప్రభువు
సతతముగా గాచి సంరక్షణజేసెన్.

రెవ.డా॥ డి.యన్. పురుషోత్తం
5-9-2003.
వ్యవస్థాపకుడు
ఎంప్లాయిస్ ప్రేయర్ ఫెలోషిప్

## ప్రఖ్యాత ఆంద్ర క్రైస్తవ సంగీతకవిసార్వభౌముడు
## పురుషోత్తమ చౌధరి ద్విశత జయంతి మహోత్సవంలో...
## ‘వచన మాల’

పంచగౌడ బ్రాహ్మణుడు - చౌధరి బిరుదాంకితుడు
పండిత పురుషోత్తముడు - ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడు.
పూర్వికుల పాండిత్య వారసుడై- అద్వితీయు డయ్యాడు
వుడమిపై పడ్డ నాడే, జన్మస్థలం ఇడలు పులకరింప జేసాడు.
అందుకే పురషోత్తముడు, కవి సార్వభౌముడయ్యాడు

పాండిత్యంలో చతుర్వేదముల పారాయణంలో చిచ్చరపిడుగైయ్యాడు
పర్లాకిమిడి, ప్రజాపాలకుల పరగణాల్లో ప్రజా గుండెల్లో తిష్టవేసాడు
పురస్కారాల సందుకున్నాడు, కవీశ్వరుడై కొనియాడ బడ్డాడు
పారమార్ధిక అన్వేషకుడై,శ్రామికుడై, ప్రయాసపడ్డాడు
అందుకే పురుషోత్తముడు, కవిసార్వభౌము డయ్యాడు

ప్రలోభాల వుడమిని, పందెపు రంగమన్నాడు, పరుగెడుతున్నాడు
పట్టు తప్పి పడిపోతున్నాడు, పట్టువదలని విక్రమార్కుడౌతున్నాడు
పుట్ట గొడుగులా విస్తరిస్తున్న, భక్తి మార్గాల పై దృష్టి సారించాడు
పాపికి, మోక్ష ప్రాప్తి పట్టు కొమ్మలపై, పట్టు సాధించాలన్నాడు
అందుకే పురుషోత్తముడు, కవిసార్వభౌము డయ్యాడు

పరిపూర్ణసిద్ధికై, ప్రభుయేసు చేపట్టుబడి ప్రతిమలకు మ్రొక్కనన్నాడు
పరిశుద్ధాత్మునిలో, పుణ్యస్నానాన్నొందాడు పున్నమి చంద్రుడయ్యాడు
ప్రభుయేసు ప్రియ కుమారుడై, రక్షణ పాత్ర పొందాడు
పరిచర్యకై అభిషేకమొందాడు, ఆత్మల రక్షణకై అంకితమయ్యాడు
అందుకే పరుషోత్తముడు, కవిసార్వభౌము డయ్యాడు

పట్టణాల్లో పల్లెల్లో, పాదయాత్రతో ముందుకురికాడు
ప్రజాపాలకులు, జమిందారులు, విద్యావంతులు, సామాన్యులదరిచేరాడు
పాలకన్న జుంటి తేనియధారలకన్న- మిన్నయైన యేసుప్రేమ గ్రోలండన్నాడు
ప్రసంగిలా పసిడి పంట సువార్తలో పండించి, పంచిపెట్టాడు దేవదూతయ్యాడు
అందుకే పురుషోత్తముడు, కవిసార్వభౌముడయ్యాడు.

పదాలను సరిగమ పదనిస స్వరాల్లో - కీర్తనలు చేసాడు
ప్రశాంత హృదయుడై, సందర్భ సహితంగా పాడి పాడించాడు
ప్రవాహంలా ప్రవహింప జేసాడు, పారమార్థిక విలువల్లో భక్తకోటిని పరవశింప చేసాడు అన్ని ఆరాధనల్లో సంకీర్తనలు స్వరసంగమమై, వాయిద్యాల మధ్య ప్రతిధ్వనింప చేసాడు
అందుకే పురుషోత్తముడు- కవిసార్వ భౌముడుయ్యాడు
పదపదంలో, పురుషోత్తముని భక్తి భావాలు, అందల మెక్కించాడు
ప్రత్యక్షంగా కనిపించకున్నా ఉనికి చాటుకుంటున్నాడు
అన్ని సంఘాల సాహితీ ప్రియులకు, ప్రియుడై, చిరస్మరణీయు డయ్యాడు
ఫలించు వృక్షమై - మధుర ఫలము లందించిన ఘనుడు, పురుషోత్తముడు
అందుకే పురుషోత్తముడు - కవిసార్వ భౌముడుయ్యాడు.

పంచేంద్రియాలు పని తీరి పడకేయగా, పరమపురికి పిలుపుకై ఎదురు చూస్తున్నాడు,

పెదవులు సహకరించ కున్నా ప్రభువులో ప్రతిభ వురికొల్పగా

కాకితరుము తున్న కోయిలై, పలికిన పదాలు స్వరాలై పాటలయ్యాయి,

ప్రభువు పిలుపునొందాక, భూస్థాపనలో, తనపాటలే

పాడించుకున్న సాటిలేని, కవిసార్వభౌముడు, పురుషోత్తముడు

అందుకే పురుషోత్తముడు- కవిసార్వ భౌముడయ్యాడు

చిరస్మరనీయునికి

ద్విశత జయంతి సందర్భంలో

సాహితీ ప్రియుడు

సంఘసేమకుడు

**రెవ!! కుమార్ ధామస్ సిరిపురపు**

ఇంటి నెం. 50-44-9, గాంధినగర్, (నక్కవానిపాలెం)

విశాఖపట్నం- 530013.

**యాత్రికుడనైన నేను నా బసలో పాటలు పాడుటకు నీ కట్టడలు హేతువులాయెను. కీర్తనలు : 119:54**

ఆంధ్రక్రైస్తవ భక్త కవి కోకిలము వాగ్గేయ సంకీర్తనాచార్యుడు స్వర్గీయ రెవరెండు పురుషోత్తము చౌధరి ద్విశత జయంతి కృతజ్ఞత మహోత్సవముల శుభసందర్భమున భక్తితో సమర్పించు ద్వాదశ పద్య రత్నమాల.

సమర్పించువారు,

**రెవరెండ్. బోండ్ల సైమన్ ఎం.ఏ (లిట్) బిడి.**

**దక్షిణ యిండియా సంఘము, డోర్నకల్ అధ్యక్షమండలం,**

**సెంట్ మేరీస్ దేవాలయం.**

**ఖమ్మం. 05-09-2003**

ఆంధ్రక్రైస్తవ లోకము అనవరతము
అమృతము జల్లు కీర్తనల్ ఆలపిస్తు
భక్తి రస సుధాధారలన్ బరగ జుర్ర
గలుగు కీర్తనల్ వ్రాసిన కీర్తియాది

ఆంధ్రక్రైస్తవ కవిభక్త అర్చకుండ
ఆది దేవుని ఆరాధ్య ఆచార్యుండ
రాగతాళము వేదముల్ రంగరించి
వ్రాసిపాడిన కీర్తనల్ వాసికెక్కె

వీరు సద్గురు ప్రభు భక్త వినయమతుడు
వీరు సువార్తన్ చేబూని విశ్వమందు
పాద యాత్రలు చేయుచు ప్రభుని చాటె
పురుష ఉత్తముచౌధరి పుణ్యతముడు

ఎన్నో కీర్తనల్ పద్యముల్ అన్న యేసు
నామ సంకీర్తనము జేయ నడుము కట్టి
అన్న యేసుని పదములనర్పినిచ్చి
సన్నుతింపగ మనకిడి మిన్ను జేరె.

వీరు సంగీత సామ్రాజ్య వీరవరులు
వీరు వేదాంత కోవిదవింత జ్ఞాని
ఎన్నో కీర్తనల్ కీర్తించి యెలమియందు
జీవితేశుని జేరితా జీవమొంద

బాంగ్ల ఓఢ్రము సంస్కృత భాషలందు
బరగ పాండిత్య పఠిమల భాగ్యమబ్బ
తెలుగు సంస్కృత భాషల తెలుగు జూపి
తెలుగు దనమును చవిచూపె తేనె లొలుక
బ్రాహ్మనత్వము జూపని భాగ్యశాలి
క్రైస్తవత్వము జూపిన కర్మయోగి
మరుగు పడనట్టి యేసుని మాట మరచి
పడియు లేచిన భక్తుడే పాస్టరతడు

రాధరాణమ్మ భార్యగా రంకెలేయ
రంగుమీరగ యెహెూవా రమ్యవరుస
గాన రూపమున్ చూపించి ఘనత గూర్చి
యెహెూవ నా తండ్రి యేసనన్ యేలయజూపె

పురుషో ఉత్తమ చౌధరి పుడమివిడగ
మల్లెల దావీదను మల్లెమనకు పుట్టె
కాకతాళీయమే యిది కాలమహిమ
కారణజన్మగల వారిన్ గర్తపంపు

పురుష ఉత్తమ చౌధరిన్ పుడమి కంపి
పరమ కీర్తనల్ బాడంగ బ్రజ్ఞనిచ్చి
పాడితరియించి తాత్వకుల్ పరము జేర
ప్రణతులర్పింతు మేయక పరమతండ్రి

యేసునాధుని మరుగున యేలనుంచె
నంచుగానము మొదలిడె కొంచెమనక
కీర్తనలు పాడి తుదిక్షణ కీర్తనంబు
సకల యింద్రియములతోడ సంభోదించె

ద్విశత జయంతి యుత్సవ దివసమందు
వేదపండిత కవిగురు వేద్యులెల్ల
మొగమొప్పగ నుతులివ్వ మోక్ష విభుడు
దివిజ వరులతో గొలువంగ ధన్యతిదును.

**రెవరెండ్.బోండ్ల సైమన్ ఎం.ఏ (లిట్) బిడి.**
దక్షిణ యిండియా సంఘము, డోర్నకల్ అధ్యక్షమండలం,
సెంట్ మేరీస్ దేవాలయం.
ఖమ్మం. 05-09-2003

# POET PURUSHOTTAM CHOWDHARI BI-CENTENARY (5th Sept.1803 - 23 Aug.1890)

**"Yehovaa maa thandri gaada" (A.C.H.435)**
**TUNE:A mighty Fortress is our God**
**(Old German Melody)**

1. Is not Je-ho-vah our Pa-rent
And Je-su our dear Bro-ther?
The Holy-Ghost is re-vea-ling
Mys-te-riou-sly re-la-ting.
our home in Bue-lah Land
Arch-an-gels are our friends
Long-ing to re-ceive us
These pains we glad-ly bear
For one day sure we'll me-et there!

2. A-br-aham and Da-vid the Great;
And saints of the old co-ve-nant.
Then Peter and all a-pos-tles;
Suc-cee-ding pro-phets, mar-tyrs.
As we will ga-ther there,
What glo-ry un-fore-seen?
Je-sus ran-som for us
And has us, for-given
Joy-ful When peo-ple blame us !

3. Our names are in the Book of Life;
Sealed with the blood of Je-sus.
Who else dare e-rase there our names:
Nor could see pro-mised trophies?
Such bliss is con-vin-cing
Our place in Pa-ra-dise
The Lord's re-wards a-wait
Why care we earth-ly deeds?
They dare not rob our joy there! .. A-MEN.


***.... Trans. by: Rev. B.D.P.Rao.***
E-mail:rao_bdp@yahoo.com
Camp: Hydedrabad. 4th Sep.2003



పురుషోత్తము ఛౌదరి
40వ పడిలో



పురుషోత్తము ఛౌదరి
80వ పడిలో



పురుషోత్తము ఛౌదరి గారి
సంతకం



హెలెన్‌నాట్ దొరసాని గారి
సంతకం




రెవ. దాసు అంతర్వేది
కవి వృద్ధ్యాపంలో సహచర
సువార్తికుడు



బళ్ళారిలో మిషనరీ
రెవ. జాన్ హేండ్స్



రాధారాణీ చౌధురాణికి
బాప్తిస్మము ఇచ్చిన
రెవ. ఆమోస్ సట్టన్



రెవ. శ్యామ్యూల్ ఎస్.డే
శ్రీకాకుళంలో కవి,
సహచర సువార్తికుడు



రెవ. ఐ.సి.ఆర్చిబాల్డ్
దాస్ అంతర్వేది – పురుషోత్తమ్
మెమోరియల్ హాల్ స్మారక
మందిర నిర్మాణములో కీలక
పాత్ర వహించారు.



రాజా మంత్రిప్రగధ
భుజంగరావు బహదూర్



రెవ. జొసయా బర్డర్
కవిగారి రెండవ అల్లుడు




బాబు. జాన్‌చౌధరి
యవ్వనంలో



బాబు. జాన్‌చౌధరి
వృద్ధ్యాపంలో

పురుషోత్తము చౌధరి గారి జీవితచరిత్ర యొక్క గ్రంథకర్త



దాస్ అంతర్వేది
పురుషోత్తము
మెమోరియల్ హాల్,
పర్లాఖిమిడి (పాతది)



దాస్ అంతర్వేది
పురుషోత్తము
మెమోరియల్ హాల్,
పర్లాఖిమిడి (కొత్తది)



పురుషోత్తము చౌధురి
బాప్తీస్మము తీసుకొన్న
గంగామందిర్



వార్డ్లా దొరగారు
(విశాఖపట్నంలో
కవియొక్క సహచరి సువార్తికుడు)



**మాదాబత్తుల బ్రహ్మాజీ**

చిట్టివలసలో కవిగారిచే

బాప్తీస్మము తీసుకొన్న వ్యక్తి



**జె.డబ్ల్యూ. గోర్డాన్**

కవియొక్క సహచర

సువార్తికులు



**కవి వృద్ధాప్యంలో నివశించిన ఇల్లు**

**సుతాహాట్, కటక్**